[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

**UNIVERSITY OF HYDERABAD**
**LIBRARY**
HYDERABAD (A. P.)

Cl. No. 294.5922 T S64S    Acc No. 7503

DATE DUE

DURATION OF LOAN - Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

4, మల్లికేశ్వరగుడిసందు, లింగిశెట్టివీథి,

మన్నడి, జి. టి. మదరాసు.

1935

[వె. రు. 4-0-0.

All Rights Reserved.]

CHECKED June, 85

CHECKED
1992

T
294.5922
S 64

UNIVERSITY OF HYDERABAD.
Acc. No. 7503
Date 29 MAR 86
RY

# విషయసూచిక.


| | పుట. |
|---|---|
| ఇష్టదేవతాస్తుత్యాదికము | 1 |
| ప్రతిజ్ఞ | 4 |
| కవివంశాభివర్ణనము | 6 |
| ముప్పప్రభువర్ణనము | 8 |
| వైరాగ్యప్రకరణము. | 15 |
| ముముక్షుప్రకరణము. | 25 |
| ఉత్పత్తిప్రకరణము. | 35 |
| ఆకాశజోపాఖ్యానము | 37 |
| లీలోపాఖ్యానము | 42 |
| కర్కటీకోపాఖ్యానము | 56 |
| కృత్రిమేంద్రోపాఖ్యానము | 66 |
| బ్రహ్మోపదేశము | 69 |
| లవణోపాఖ్యానము | 73 |
| అజ్ఞానభూమికోపాఖ్యానము | 81 |
| జ్ఞానభూమికోపాఖ్యానము | 83 |
| స్థితిప్రకరణము. | 87 |
| శుక్రోపాఖ్యానము | 88 |
| దామవ్యాలకటోపాఖ్యానము | 94 |
| కచునిగాథ | 110 |
| ఉపశమప్రకరణము. | 112 |
| జనకోపాఖ్యానము | 113 |
| పుణ్యపావనోపాఖ్యానము | 117 |
| బల్యుపాఖ్యానము | 122 |
| ప్రహ్లాదోపాఖ్యానము | 127 |

| | పుట. |
|---|---|
| గాధ్యుపాఖ్యానము | 132 |
| ఉద్దాలకోపాఖ్యానము | 138 |
| సురఘూపాఖ్యానము | 148 |
| భాసవిలాసోపాఖ్యానము | 151 |
| వీతహవ్యోపాఖ్యానము | 156 |
| ఆకాశగత్యభావోపాఖ్యానము | 167 |
| నిర్వాణప్రకరణము. | 172 |
| భుసుండోపాఖ్యానము | 174 |
| దేవపూజోపాఖ్యానము | 180 |
| బిల్వోపాఖ్యానము | 185 |
| శిలోపాఖ్యానము | 186 |
| అర్జునోపాఖ్యానము | 187 |
| శతరుద్రోపాఖ్యానము | 188 |
| వేతాలోపాఖ్యానము | 192 |
| భగీరథోపాఖ్యానము | 194 |
| శిఖిధ్వజోపాఖ్యానము | 186 |
| కిరాటోపాఖ్యానము | 200 |
| చింతామణ్యుపాఖ్యానము | 202 |
| గజోపాఖ్యానము | 204 |
| కచోపాఖ్యానము | 216 |
| మిథ్యాపురుషోపాఖ్యానము | 217 |
| భృంగీశోపాఖ్యానము | 219 |
| ఇక్ష్వాకూపాఖ్యానము | 221 |
| వ్యాధోపాఖ్యానము | 226 |
| యోగభూమికోపాఖ్యానము | 227 |

# సవరణ.

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| ౪ | ౧౮ | దనువుఁ | దనుపుఁ |
| ౧౩ | ౧౬ | దర్మమూర్తి | ధర్మమూర్తి |
| ౧౬ | ౧౭ | నారటపఱుక్ | నారటపఱుపక్ |
| ౨౦ | ౧౩ | మదిమియు | ముదిమియు |
| ౨౨ | ౧౫ | సరసభసముగ | సరభసముగ |
| ౨౪ | ౯ | దతన్మనంబు | దన్మనంబు |
| ౨౫ | ౮ | రామచద్రుఁడ | రామచంద్రుఁడ |
| ౩౨ | ౧౫ | నీనాలిగంటి | నీనాలిగింటి |
| ౩౩ | ౮ | పరస్వరవృద్ధి | పరస్పరవృద్ధి |
| ౪౬ | ౧౬ | యుందయిచితివి | యుదయించితివి |
| ౫౩ | ౨౨ | యర్బసదంఖ్యల | యర్బసదంఖ్యలు |
| ౫౯ | ౧౨ | సంధావము సేసి | సంధానము సేసి |
| ,, | ౧౮ | సెప్పఁజాలిన పట్టిమాటలు | సెప్పఁజాలని నట్టిమాటలు |
| ౮౨ | ౧౬ | బని జాగ్రత్తనఁగ | బవిజాగ్రత్తనఁగ |
| ౯౦ | ౧౭ | దద్విలాసం | దద్విలాసం |
| ,, | ౨౦ | భూతకోటిక | భూతకోటికి |
| ,, | ౨౪ | నావిథ | నావిధ |
| ౯౨ | ౧౧ | నీవు నుజ్ఞాన | నీవు సుజ్ఞాన |
| ౯౪ | ౨౨ | యూజలభవుని | యూజలజభవుని |
| ౧౦౯ | ౨౦ | నీతుఁడును | నీతఁడును |
| ౧౧౨ | ౧౮ | ధవళవిపులకీర్తి | ధవళవిపులకీర్తీ |
| ౧౧౬ | ౮ | బ్రతునకై | బ్రతుకునకై |
| ౧౧౭ | ౧౧ | దినసాథుఁడు | దిననాథుఁడు |
| ౧౧౮ | ౨౦ | వాససలను | వాసనలను |
| ౧౧౯ | ౧౧ | వివిధజన్మ | వివిధజన్మ |
| ౧౨౮ | ౧౧ | నిరోగ్మహాండును | నిరోగ్మహుండును |

శ్రీ

# వాసిష్ఠ రామాయణము.

## ప్రథమాశ్వాసము.

శ్రీమద్దివ్యమునీన్ద్రచిత్తనిలయం సీతామనోనాయకం
వల్మీకోద్భవవాక్పయోధిశశినం స్మేరాననం చిన్మయమ్
నిత్యం నీరదనీలకాయ మమలం నిర్వాణసంధాయినం
శాన్తం నిత్య మనామయం శివకరం శ్రీరామచన్ద్రం భజే.

అహోబలగిరీశాయ నిత్యాయ నిగమాత్మనే
శ్రీశాయ శాన్తరూపాయ నృసింహవపుషే నమః.

### ఇష్టదేవతాస్తుత్యాదికము.

ఉ. శ్రీకరలీలఁ బ్రాణుల సృజింపఁ దలంచి విధాత తాన యై,
చేకొని వానిఁ బ్రోచునెడ శ్రీవిభుఁ డై, యవి సంహరింప భీ
మాకృతిఁ దాల్చి, ముప్వురకు నవ్వల నొక్కటియై, వెలుంగు సు
శ్లోకుఁ బురాణుఁ బుణ్యపురుషున్ బరమాత్ముని భక్తిఁ గొల్చెదన్. ౧.

ఉ. శ్రీ యన విష్ణుపేరురముఁ జెన్ను వహించి యలంకరించి, దా
క్షాయణి నాఁగ శంభుమెయి సామున నెక్కొని, వాణి నాఁగ నా
తోయజగర్భున్నెమ్మొగము దూఁకొని యేలెడునాదిశక్తి సు
శ్రీయుఁ జిరాయువున్ సరససిద్ధకవిత్వము మాకు నీవుతన్. ౨.

క. వారణముఖు మృదుమోదక
పారణపారీణు సిద్ధ పన్నగ ముఖభు

క్ష్వారణ సేవితుఁ బాపని
వారణు విఘ్నాంబుజాతవారణుఁ దలఁతున్. ౩.

గీ. ఉదయవేళ విరించి యై యొప్పఁదాల్చి,
పట్టపగ లెల్ల రుద్రుఁ డై ప్రజ్వరిల్లి,
మాపు హరిమూర్తి యైన తామరలమునుఁగు
భూరి తేజంబు మా కిచ్చి బ్రోచుఁ గాత. ౪.

గీ. వ్యాస వాల్మీకి శుక కాళిదాస బాణ
హర్షణాదుల నాద్యుల నాత్మ నిలిపి,
సకలభాషారసజ్ఞుల సముల నన్న
యార్య తిక్కకవీంద్రుల నభినుతింతు ౫.

క. అద్వైతతత్త్వమతుల జ
గద్విదితవిశాలయశుల గతకలుషుల రా
గద్వేషలోభరహితుల
విద్వత్సింహముల వేదవిదుల భజింతున్. ౬.

చ. కవిసిన నోరవోయి, యొరుకబ్బపుదొంతులసత్పదార్థముల్
గదుకుచు, నెట్టివారిఁ బొడగన్నను గుఱ్ఱని, స్నేహసౌఖ్యముల్
మదికి నసహ్యమై, శునకమార్గమునం జరియించుచున్న దు
ష్పదకవు లెల్ల మత్కవితఁ దప్పులు వట్టక వింద్రు గావుతన్. ౭.

క. తిరువేంకటనాయకపద
సరసిజమధుకరుల నఖిలసమయజ్ఞుల మం
త్రరహస్యవిదుల నఘుసం
హరులను మద్గురుల ఘనుల నార్యులఁ గొల్తున్.— ౮.

క. మదిఁ బ్రహ్లాదార్జున నా
రద సనక సనంద శుక పరాశర రుక్మాం
గద భీష్మ శౌన కాదుల

సదయాత్ముల భాగవతుల సతతము దలఁతుఁ. ౯.

వ. అని పరబ్రహ్మోపాసనంబును, నిష్టదేవతాభివందనంబును, సుకవివిద్వజ్జనప్రార్థనంబును, కుకవిజనవాగ్బంధనంబును, గురుచరణస్మరణంబును, బరమభాగవతసంకీర్తనంబునుం జేసి, కృతకృత్యుండ నై, తొల్లి హరిభక్తిరసావేశంబున గతిపయాక్షరాభ్యాసచాపలంబునం జేసి,విష్ణువిభవాభిరామకథాప్రభూతంబులం బద్మపురాణోత్తరఖండంబును భాగవతదశమస్కంధంబును దెనుంగున రచియించి, యప్పుణ్యపురాణంబులకుఁ గృతిపతిగా నేపుణ్యుం బ్రార్థింతునో యని విచారించి, గజగంధవారణ గండగోపాల చలమర్తిగండ రాయగజకేసరి దొంతిమన్నె విభాళాది నానాబిరుదవిఖ్యాతులం బ్రసిద్ధుం డగు రామగిరిపట్టణాధీశ్వరుండైన కుమారముప్పభూపాలుని మాన్యమంత్రివరధురంధరుండును, నమ్మహారాజ దిగంతవ్యాప్త కీర్తిలతాలవాలుండును,ధర్మచారిత్రుండును,నీతిచాతుర్య వివేక విశేషగుణాలంకారుండును, నఖిలదిగ్భరితకీర్తివిశాలుండును,వాణసవంశాబ్ధిసుధాకర కాశ్యపగోత్ర పవిత్రాబ్బనార్యతనూభవుండునునగు కొండనామాత్యుండు, నాకు నతిస్నేహబాంధవుండును, నపూర్వవచనరచనాబంధురకావ్యరసాభిజ్ఞుండును,నర్థిజనపారిజాతుండును, గావున,నమ్మంత్రి యుగంధరుం గృతిపతిం గావించి, వెండియుం గవిత్వతత్త్వరచనాకౌతుకంబునం జిత్తంబు జొత్తిల్ల నొక్క కృతిం జెప్పంబూనితి. అందేని నిఖలభూతాంతర్యామియు, నిగమార్థగోచరుండును, నిత్యసత్యజ్ఞానానందశుద్ధాంతరంగుండును, నిశ్చలానందయోగీంద్రహృదయుండును, నిఃశ్రేయసానందఫలప్రదాయకుండును, నిర్మలచిదాభాసుండును, నిరాకారుండును, నిర్గుణబ్రహ్మంబును, నగు నారాయణుం డొక్కరుండు దక్క నన్యంబు లే దనియును, బ్రహ్మాది చేతను లతని తేజఃకణంబు లనియును, దేహం బనిత్యంబు దేహి నిత్యుం డనియును, జీవుండు చిత్తం

బనియును, చిత్తంబునందె జగత్తులు విస్తరిల్లు ననియును, దత్సంకల్పంబ బంధంబు తన్నిరసనంబ మోక్షం బనియును, చిత్తశాంతియ జీవన్ముక్తి యనియును, ఇక్కవిధంబు లుపన్యసించునట్టి వాసిష్ఠగ్రంథప్రబంధం బాంధ్రభాష నఖిలలోకోపకారార్థంబు గా రచియించెద. ౧౦.

## ప్రతిజ్ఞ.

క. ఇది తత్త్వరహస్యార్థము
పదసంగతిఁ దెనుఁగు పలుపఁ బ్రాజ్ఞులకును బె
ట్టిద మగుఁ; దత్పరవాసన
విదితంబుగఁ గవులు మెచ్చ విరచింతుఁ దగన్. ౧౧.

క. విజ్ఞానులు మును సెప్పిన
సంజ్ఞాభ్యాసములు కొంత జాడలు దోఁపన్
విజ్ఞాపనంబు సేసెదఁ
బ్రాజ్ఞులు తార్కికులు తప్పుపట్టకుఁడు దయన్. ౧౨.

క. కలఁ కిది నీరస మని వే
సర కల్లన వినుఁడు, తుద రసాయన మగుఁ, దాఁ
జెఱకుఁ దుదనుండి నమలిన
తెఱఁగున, మది కింపుఁ దనువుఁ దీపున్ జూపున్. ౧౩.

క. మృదుమధురం రచనగావ్యము
గదియించినయట్లు తత్త్వగాఢార్థము చె
ప్పుదుఁ, బుణ్యుఁ దేనె గొను తు
మ్మెద మ్రాఁకులు దొల్చునేపున్ మెఱసినభంగిన్. ౧౪.

క. ఇది యల్పగ్రంథం బని
మదిఁ దలఁపకుఁ డఖిలశాస్త్రమతములు దీనన్
విదితం బగు నద్దములో
మదదంతావళము దోఁచు మాడ్కిని తెలియన్. ౧౫.

## నరసింహదేవునకుం గృతి నిచ్చుట.

వ. అని సకలజనసమ్మతంబుగా నుపక్రమించి, యనన్యసామాన్యయగునిక్కవితావధూమణికిఁ బురుషుండు పురాణపురుషుండు గావుతమని, యఖిలలోకాధీశ్వరుండును, నతులకళ్యాణగుణగణాలంకారుండును, ననవరతలక్ష్మీసమేతుండు, నాదిమధ్యాంతరహితుండును, నభిమతఫలప్రదాయకుండును, నగు నహోబలశ్రీనృసింహదేవునకు నిచ్చెదనని తలంచి, యఖిలవేదవేదాంతవాగ్గోచరుం డగు నద్దేవున కతితుచ్ఛంబులగు మద్వాక్యంబు లర్పింతు ననుటయు మహాద్రోహం బగునో యని శంకించి యప్పరమేశ్వరుం డాశ్రితసులభుం డగుటయు, మత్కవిత్వంబు తదీయవరప్రసాదలబ్ధం బగుటయు, భావించి, మనంబున నిట్లని వితర్కించితి.

క. వనరాశిజలము గొని యా
వనరాశికి నర్ఘ్యమిచ్చు వడువున, హరి యి
చ్చినవాక్యములనె యతనికి
ననయము గృతి సెప్పి సుకృతి నగుదు ధరిత్రిన్. ౧౭.

క. గురుఁడును దల్లియుఁ దండ్రియుఁ
బురుషుఁడు విద్యయును దైవమును దాతయు నాఁ
బొరి నేఁడుగడయు దా నై
హరి నను రక్షించుఁ గాత ననవరతంబున్. ౧౮.

క తనవేరిటివాఁ డనియును
దనదాసులదాసుఁ డనియుఁ దన కీకవితా
వనితామణి నిచ్చినవాఁ
డనియును రక్షించుఁ గాత హరి నన్ను దయన్. ౧౯.

వ. అదియునుం గాక. ౨౦.

క. కృతి బోధామృతరస మఁట,
కృతికథ శ్రీరామచంద్రకీర్తన మఁట, త

త్కృతినాయకుండు లక్ష్మీ
పతి యఁట, నా కింతకంటె భాగ్యము గలదే! ౧౧.

వ. అని పరమానందకందళిత హృదయానందుండ నై యేతత్కవితాల
తాలవాలం బగుమదీయవంశం బభివర్ణించెద. ౧౨.

కవివంశాభివర్ణనము.

ఉ. ఆజలజాక్షునాభిజలజాత్మజుమానసపుత్త్రుఁ డై భర
ద్వాజుఁడు ధాత్రిఁ బెంపెసఁగెఁ; దన్మునిగోత్రజులందు నిత్యవి
భ్రాజితపుణ్యమూర్తి యగుబ్రహ్మనమంత్రికిఁ బుట్టెఁ దీవ్రరు
క్తేజుఁడు గుండనార్యుఁడు సుధీజన భూజన కీర్తనీయుఁ డై. ౧౩.

వ. ఇట్లుదయించి. ౧౪.

క. గుండన ప్రాభవమున భ
గుం డన శ్రుతిశాస్త్రపారగుం డన నయమా
గుం డన వితరణనయనాభా
గుం డన వర్ణనకు నెక్కెఁ గోవిదసభలన్. ౧౫.

క. అంబుజభవనిభుఁ డాప
స్తంబాగ్రణి యైనగుండసచివునకును గో
మ్మాంబకుఁ బుట్టెను బుత్త్రయు
గం బొగి నల్లాడవిభుఁడు గంగన యనఁగన్. ౧౬.

వ. అందు. ౧౭.

క. అల్లాడమంత్రి రిపుచయ
మల్లాడఁ బ్రతాపలీల నధికుం డై సం
ఫుల్లసితకీర్తిమల్లీ
వల్లి వెల్లితదిగంతవారణుఁ డయ్యెన్. ౧౮.

సీ. అతఁడు తిక్కన సోమయాజుల *పౌత్త్రుఁ డై
కొమరారు గుంటూరుకొమ్మవిభుని

* పా. పుత్త్రుఁడై.

పుత్త్రిఁ జిట్టాంబిక బుధలోకకల్పక
వల్లి వివాహ మై వైభవమున,
భూసార మగుకోటభూమిఁ గృష్ణానదీ
దక్షిణతటమున ధన్యలీల
నలరు రావెల యనునగ్రహారము తన
కేకభోగ్యంబుగా నేలు చుండి,

గీ. యందుఁ గోవెల గట్టి, గోవిందు నెన్న
గోపికానాథుని ప్రతిష్ఠఁ గోరి చేసి
యఖిలవిభవంబులందును నతిశయిల్లె
మనుజమందారుఁ డల్లాడమంత్రివిభుఁడు. ౨౯.

క. అయ్యావతీ రమణులకును
నయ్యలమంత్రీంద్రుఁ డుదితుఁ డై ధారుణిలో
నెయ్యెడ నర్థార్థులు మా
యయ్య యనుచుఁ బొగడ నెగడె నౌదార్యమునన్. ౩౦.

వ. అమ్మంత్రిచంద్రు గుణవిశేషంబు లెట్టి వనిన. ౩౧.

చ. తిరుగనిమందరాచలము త్రిమ్మటఁ బొందనిభానుఁ డుగ్రుఁ జేఁ
గరఁగని కాముఁ డమ్ము మొనఁ గ్రాఁగనివారిధి యన్యకాంతవి
క్కరుగనినిర్జరేంద్రుఁ డెడ రైనను బొంకని ధర్మసూతి నాఁ
బరఁగె ధరిత్రి నర్థిజనభానుజుఁ డయ్యలమంత్రి పెంపునన్. ౩౨.

సీ. ఆత్రేయగోత్రపవిత్ర పేరయమంత్రి
పుత్త్రి సింగాంబికఁ బుణ్యసాధ్వి
వెలయ వివాహ మై, వేఁగిదేశంబులో
నేపారు రాజమహేంద్రపురికి
నధిపతి తొయ్యేటి యనపోతభూపాలు
మంత్రి యై ప్రాజ్యసంపదలఁ బొదలి,

యొప్పార గౌతమియుత్తరతటమున
మహనీయ మగు పెద్దమనికియందు

గీ. స్థిరతరారామతతులు సుక్షేత్రములును
బెక్కు లార్జించి సితకీర్తిఁ బెంపు మిగిలి
యఖిలజగదన్నదాత నా నవనిఁ బరఁగె
మధురగుణధుర్యుఁ డయ్యలమంత్రివరుఁడు. 33

చ. ఒనరఁగ నవ్వధూవరు లహోబలదేవునిఁ గొల్చి తద్వరం
బున నొగి సింగనార్యుని సమోఘగుణాఢ్యు ననంతుని న్మహీం
జనుతు నోబయాంకు బుధసన్నుతిపాత్రుని నారయాహ్వయుం
గని నరసింహనామములు గారవ మారఁగఁ బెట్టి రందఱన్. 3౪.

క. వారలలో నగ్రజుఁడను
వారిజదళనయనచరణవారిజసేవా
సారమతి నతులవాక్య
శ్రీరచనాచతురమతిని సింగాహ్వయుఁడన్. 3౫.

క. కూనయముప్పనృపాలక
సూను శ్రీ తెనుఁగునృపతి సుదతీ మల్లాం
బా నందనుఁ డగు ముప్పయ
భూనాథుని సుకవివరుఁడ బుధసన్నుతుఁడన్. 3౬.

ముప్పప్రభువర్ణనము.

వ. మఱియు రాజకంఠీరవం బగు నాకుమారముప్పభూపాలుని ప్రాభవ
పరాక్రమంబు లెట్టి వనిన. 3౭

సీ. సంపెంగవిరులతో జాజులుం గురువేరు
కొమరార నునునేసకొప్పు వెట్టి,
మృగమదకర్పూరమిళిత మౌపన్నీరు
తనుపార మేనఁ జందన మలంది,

యుదయభానుప్రభ నుల్లసం బాడెడు
మణిభూషణస్ఫూర్తిఁ మాఱు మలసి,
పర పైనవెన్నెలనురువుల పోలికఁ
దనరారు ధవళవస్త్రములు గట్టి,

గీ. మానినీకరచామర మరుతచలిత
కుంతలుం డయి తగ నిండుకొలువునందుఁ
దనువుఁ గీర్తియుఁ గల పుష్పధన్వుఁ డనఁగఁ
జూడ నొప్పారు ముప్పయక్షోణివిభుఁడు. ౩౮.

మ. అనిలో రాయగజేంద్రసింహ మగుముప్పాధీశు చే భగ్నులై
చని, స్వప్నంబున నవ్విభుండు వెలయన్ శంకించినన్ మోస మౌ,
నని చింతించి, నఖాంకురాంకుశవినోదాసక్తి నిద్రింప నీ
క నివారింతురు రాజకుంజరములన్ గాంతామణుల్ కానలన్. ౩౯.

గీ. ఆమహీవిభుచేత రామాద్రిసీమఁ
బెక్కువృత్తులు గ్రామముల్ వెలయఁ గాంచి
యతనియాశ్రితులం దెల్ల నధికుఁ డనఁగఁ
జతురుఁ డన ధన్యుఁ డన సడిసన్నవాఁడ. ౪౦.

వ. అట్లు గావున. ౪౧.

శా. ఆయుశ్శ్రీశుభమోక్షదున్ హరిఁ బ్రబంధాధీశుఁ గావించి, దు
ర్మాయాదూరము నిర్వికారము సదామాంగల్యయుక్తంబు నా
మ్నాయాంతార్థవివేకసారము మనోమత్తేభసింహంబు సం
శ్రేయోమార్గము నైన బోధమయ వాసిష్ఠంబు నేఁ జెప్పెదన్.

వ. అదియును వాల్మీకిమునిప్రణీతంబును, వసిష్ఠవిశిష్టవాగ్విలాసభాసు
రంబును,రామచంద్రకథాప్రధానంబునుం గావున, వాసిష్ఠరామాయ
ణం బనంబడు. ఇప్పురాణవాక్యరత్నోపహారంబులు పురుషోత్తమున
కిచ్చుట యదియు నొక్కయారాధనవిశేషం బగుటం జేసి— ౪౩.

## షష్ఠ్యంతములు.

క. అక్షయలక్ష్మీలలితక
టాక్షేక్షణలక్ష్యజలచరాంబుజరేఖా
లక్షణదక్షిణహస్తున
కక్షుభితాత్మునకు దేవతారాధ్యునకున్. ౪౪

క. అంబుజలోచనునకుఁ బీ
తాంబరునకు నంబరానిలానలధరణీ
శంబరరవిచంద్రాత్మున
కంబుధికన్యాముఖాంబుజాంబరమణికిన్. ౪౫

క. ఫాలాక్షజనితదహన
జ్వాలాలీలావరుద్ధశాత్రవసేనా
జాలునకు సటాపటలో
త్తాలునకుఁ గరాళకఠినదంష్ట్రాలునకున్. ౪౬

క. పంచాశుగధరగురునకుఁ
బంచాయుధకలితలలితబాహాఢ్యునకున్
బంచాననవినుతునకుఁ బ్ర
పంచవిదూరునకు మనుజపంచాస్యునకున్. ౪౭

క. రాకాశశాంకశంఖసు
ధాకాశసురేంద్రదంతిదంతతుహినహీ
రాకాశవాహినీబిస
నీకాశరమావకాశనిభగాత్రునకున్. ౪౮.

క. శ్రీయువతీస్తనపరిరం
భాయతవక్షఃస్థలునకు నతులితవిజయో
పాయునకు శ్రీయహోబల
నాయకున కుదారవీరనరకేసరికిన్. ౪౯.

క. నీకుఁ బ్రబంధరత్నము
నాకల్పోన్నతిగ నిచ్చి యపవర్గపద
శ్రీకర్తుఁడ నై వెలసెదఁ
జేకొను మహాభలగిరీంద్ర శ్రీనరసింహా. ౫౦.

వ. నిత్యపరంపరామంగళాభివృద్ధిగా నారచింపం బూనిన వాసిష్ఠరామాయణంబునకుం గథా ప్రారంభం బెట్టి దనిన. ౫౧.

వ. వైరాగ్యంబు, ముముక్షుత, ఉత్పత్తి, స్థిత, ఉపశమనంబు, నిర్వాణంబు, అని జ్ఞానోపదేశంబు ఆఱు ప్రకరణంబు లై యొప్పు అందు బాలలీలోత్సుకుండగు రామచంద్రుండు ప్రసంగరూపంబున నుపన్యసించిన వైరాగ్యప్రకరణంబు తొలుత నెఱింగించెద. ౫౨.

క. అతులతపస్స్వాధ్యాయ
వ్రతశీలుఁడు బోధనిధి భరద్వాజుఁడు వి
శ్రుతకీర్తి యొక్కనాఁ డే
కతమున వాల్మీకిమౌనిఁ గని సంప్రీతిన్. ౫౩.

క. పాదప్రణామపూజల
సాదరమున గురునిఁ దనిపి సాంజలియై య
వ్వేదమయు మొగము గనుఁగొని
మోదిలి మృదుమధురవాక్యముల నిట్లనియెన్. ౫౪.

గీ. అనఘమానస మీ దయ నఖిలవేద
శాస్త్రపారంగతుఁడ నైతి; జనులజన్మ
కలిత సంసార దురితసంకటము దొఱఁగి
యవ్యయానంద మగుమార్గ మానతిమ్ము. ౫౫.

వ అనిన విని ప్రియశిష్యుం డగుభరద్వాజునకు వాల్మీకి యి ట్లనియె.

క. విను వత్స లెస్స యడిగితి,
విన యోగ్యుఁడ వీవు నీకు విస్పష్టముగా

ఘనమోహతమము దూరం
బునఁ దొలఁగఁగఁ ద్రోచుమార్గమును వినిపింతున్. ౪౭.

గీ. అకట భవపాశ బద్ధుండ నైననాకు
వెడలఁ బ్రా పెద్దియో యని వెఱచుచున్న
యార్తుఁ డధికారి యగుఁ గాని యజ్ఞుఁ డైనఁ
దజ్జ్ఞుఁ డైనను నీనీతిఁ దగఁ డొరుండు. ౪౮.

గీ. కానఁబడు లేక విరియు నాకాశవర్ణ
భాతి నీజాగరభ్రాంతి భ్రమలఁ బెట్టు ;
నదియుఁ బలుమాఱు దలఁచినయంతకంటె
నట్టితలఁపులు దలఁపనియదియ లెస్స. ౪౯.

గీ. కానఁబడ్డవి మిథ్యలు గాఁగఁ దెలియు
జ్ఞానమునఁ జేసి దృశ్యమార్జనము సేయఁ,
జిత్తగేహంబు విమల మై చెలఁగి నిత్య
మైననిర్వాణపదవృత్తి యంద మొందు. ౫౦.

వ. అట్లు గాక కేవల శాస్త్రగతంబులం బడి పొరలు సంసారులకుం గల్ప
శతంబుల నైనను మోక్షంబు పొందనేరదు. అందు మోక్షం బెట్టి
దనిన, నఖిల వాసనాపరిక్షయం బని సెప్పంబడు. అవ్వాసనలు మలి
నయు శుద్ధయు నన రెండు దెఱంగు లై యుండు. అందు మలినవాసన
యజ్ఞానతమోవృత్తియు నహంకారయుక్తంబును జన్మకారిణియు
నగు. మఱియును శుద్ధవాసన వేఁచినబీజంబుంబోలెఁ బునర్జన్మాంకురంబుఁ
బొడమనీక దేహధారణంబు ధరియింపంబడి తజ్జ్ఞ యగు. అందు శుద్ధ
వాసనాయుక్తులు జీవన్ముక్తుఁ లనంబడుదురు. అందు.— ౫౧.

క. జీవన్ముక్తుఁడు రాఘవుఁ
డీవసుధాతలమునందు ; నేపఱడ విను మ
ద్దేవుచరితంబు జరనుం

జావును మాన్పఁగ నోపు సౌజన్యనిధీ. ౬౨.

వ. అనిన విని భరద్వాజుం డక్కథాక్రమంబు వివరించి చెప్పు మనుటయు వాల్మీకి యి ట్లనియె ౬3.

సీ. నారాయణునినాభినలినోదరంబునఁ
  బరమేష్ఠి పొడమెఁ, దద్బ్రహ్మవలన
ఘనుఁడు మరీచి నాఁ గలిగె, నమ్మౌనికిఁ
  గశ్యపుఁ డుదయించి కనియె సూర్యు,
నాసూర్యునకు మను వౌరసుఁ డై యుద్భ
  విల్లి యేలెను ధాత్రి, నల్లమనువు
పడసె నిక్ష్వాకునిఁ బరఁగఁ దత్పతివంశ
  కర్త యై రఘు వుర్విఁ గీర్తి కెక్కె,
గీ. నతని కజుఁడు పుత్త్రుఁ డై నేల పాలించె,
నతనివలన నిందుమతి యనంగఁ
దనరుభాగ్యవతికి దానచింతామణి
దమణమూర్తి పుట్టె దశరథుండు. ౬౪.

వ. అమ్మహాభాగుండు తనకు నయోధ్యానగరంబు నిజరాజధానిగా నఖిల సముద్రముద్రితధరావలయంబు నఱువదివేలేండ్లు పాలించి సంతతి లేమికి నత్యంతచింతాక్రాంతుం డై పుత్త్ర కామేష్టి సేయింప యజ్ఞ పురుషుం డగువిష్ణునివరంబునం గోసలరాజపుత్త్రి యగు కౌసల్య యనుపతివ్రతాతిలకంబునకు నొక్కపుణ్యదివసంబునందు — ౬౫.

ఉ. శ్రీమహితాభిరాముఁడు విశిష్టజనస్తవనీయసద్గుణ
స్తోముఁడు భక్తలోకముఖతోయరుహాయతషండచండరు
గ్ధాముఁడు జానకీనయనకైరవసోముఁడు ఘోరసంగరో
ద్దాముఁడు కౌస్తుభాఖ్యమణిధాముఁడు రాముఁడు పుట్టెఁ బుత్త్రుఁ డై.

వ. తదనంతరంబ కేకయ రాజపుత్త్రి యగుకైకకు భరతుండును సుమి

త్రుకు లక్ష్మణశత్రుఘ్నులును జన్మించిరి.అక్కుమారులకుం గ్రమంబున జాతకర్మచౌలోపనయనంబులు సేయింప వారలు దినదినప్రవర్ధమాను లై గురుమందిరంబునందు.— ౬౭.

క. వేదములు తదంగంబులు
వేదాంతప్రముఖనిఖిలవిద్యలును ధను
ర్వేదము నేర్చిరి. రాముఁడు
వేదమయుఁడు గురుగృహంబు వెలువడి భక్తిన్. ౬౮.

గీ. స్నాతకవ్రతనియమితాచరణవృత్తిఁ
బుణ్యతీర్థంబు లాడుచుఁ బుణ్యమునులఁ
బుణ్యదేశంబులను జూచి భూరియశుఁడు
ప్రీతి నేతెంచె మరలి సాకేతపురికి. ౬౯.

క. తుదిఁ గొన్ని నెలలు గోఱఁ తగు
పదియాఱవయేఁట నిండుప్రాయంబున ను
న్మదవృత్తిఁ దొలఁగి డస్సెను
హృదయము సంసారభీతి నెంతయుఁ గలఁగన్. ౭౦.

క. మునిజనవృత్తులు గనుఁగొని
మనమున రాజ్యాభిలాష మఱచి యజస్రం
బును వంత నొంది రాముఁడు
దినదినమును గుందఁ దొడఁగె తేజం బెడలన్. ౭౧.

వ. అయ్యవసరంబున నొక్కనాఁడు. ౭౨.

క. గోత్రపవిత్రుఁడు గాధిసు
పుత్త్రుఁడు హతకలుషుఁ డఖిల బుధజననుతచా
రిత్రుఁడు ఘనుండు విశ్వా
మిత్త్రుం డఘవిపినపవనమిత్త్రుఁడు భక్తిన్. ౭౩.

క. తన చేయు క్రతువు నిచ్చలు

దనుజులు చెఱుపంగ విసికి తద్రక్షణాకై
ఘను రామచంద్రు నచటికిఁ
గొనిపోయెద నని యయోధ్యకుఁ జనుదెంచెఁ. ౨౪.

వ. ఇవ్విధంబున ననేకమునిగణపరివృతుం డై చనుదెంచిన కౌశికునకు దశరథేశ్వరుం డెదురు సని నమస్కరించి తోడ్కొని వచ్చి యాసనార్ఘ్యపాద్యాదివిధులం బూజించి కుశలం బడిగిన యనంతరంబ, రామచంద్రదర్శనలాలసుం డై యభ్యంతరమందిరంబున కరుగ నక్కుమారుండును బ్రత్యుత్థానంబు చేసి ప్రణమిల్లి పూజించి కుశలం బడిగిన యనంతరంబ, సుఖాసీనుం డై యమ్మునిపుంగవుండు రాఘవుం గరుణార్ద్రదృష్టిం జూచి యంగంబు నివురుచు ని ట్లనియె. ౨౫.

## వైరాగ్యప్రకరణము.

సీ. తంత్రిరాజ్యస్థుఁ డై ధరణిఁ బాలింపంగ
యువరాజ వై భోగయోగ్య మైన
యౌవనంబున సౌఖ్య మనుభవించుచు నుండ
కిట్టిమనోవ్యథ యేల కలిగె ?
నెలుకలు ద్రవ్వినయింటిచందంబున
దిగజాఱి నీమేను మిగుల డస్సె.
నీదుఃఖములు నీకు నేయర్థమునఁ బుట్టె ?
నిట్టివిరక్తి నీ కేల వచ్చెఁ ?
గీ. గెలనివారు నవ్వఁ గలఁగి మ్రాన్పడి యున్న
నిన్నుఁ జూచి వగ జనించె నాకు.
వినుము దెవులు లేనివేదనఁ బొరలుచు
నున్నరూపు సెప్ప వోయి వత్స. ౨౬

చ. అన విని రామచంద్రుఁడు కృతాంజలి యై తల వంచి భక్తి న
మ్మునికి నమస్కరించి, వగ మో మెగయింపఁగ లేక, బాష్పముల్

గనుఁగవ నుబ్బి జాఱ, మెయి కంపము నొందఁగ, మాట తొట్రుపా
టెనయఁగఁ బేరెలుంగదర, ని ట్లని పల్కె భయాతురాకృతిన్.

గీ. పుట్టు రూపంబు లెల్లను బొలియుకొఱక,
పొలియు నెల్లను గ్రమ్మఱఁ బుట్టుకొఱక,
కాని యొందును నిలుకడ గాన లేని
యిట్టి సంసారమున సుఖ మెద్ది? సెపుడు. ౭౮.

గీ. అస్థిరంబగు సర్వంబు నని యెఱుఁగ
రాజ్యసుఖములకె ట్లనురక్తి పొడము ?
'ఏమి భోగంబు నా కిది యేమి వచ్చె ?
నకట యెవ్వండ నే న' ని యాత్మఁ దలఁతు. ౭౯.

గీ. ఇట్టిదుఃఖంబు నా కింక నెట్లు దొలఁగు?
ననుభయంబున దుర్వ్యథఁ దనరుచుందు,
జరఠతరుకోటరోజ్జ్వలజ్జ్వలనుభంగిఁ
బెరసి చింతానలము లోన దరికొనంగ. ౮౦.

క. పెనురాలు నీటఁ గ్రుంకిన
యనువున దుర్వ్యథలు నన్ను నారటపఱుచుఁ
ఘనశోక మొదవి బంధులు
విని వగచెద రనుచు నేద్వ వెఱతు మునీంద్రా. ౮౧.

క. ఏవిధమునఁ దలపోసిన
నావిధమున నాకు నరుచి యగు సంసారం
బే నెట్టులఁ దరియింపుదు ?
నేవెరవున విశ్రమింతు నిద్ధ చరిత్రా? ౮౨.

గీ. విత్త, మాయు, వహంకృతి, చిత్త, మాశ,
తనువు, బాల్యంబు, యౌవనంబును, సుదతులు,
వార్ధకము, కాల మనునిట్టివ స్తువితతి

నేవి మే లని భోగింతుఁ బావనాత్మ? ౮౩.

వ. అవి యెయ్యవి యం టేని. ౮౪.

గీ. సొరిదిఁ జింతాసమూహంబు చుట్టియున్న
ధనము దుఃఖంబె గాని సంతసము నీదు,
సంప్రసూతకళత్రసంశ్రయగృహములు
దీను లగువారి కాపద దెచ్చునట్లు. ౮౫.

క. మద కారణంబు లోభా
స్పద మవివేకంబుత్రోవ భయచింతలకుం
గుదు రఘరాశి మహోగ్రా
పదలకు నాశ్రయము ధనము పరమమునీంద్రా ౮౬.

క. పరనింద పడనిధనికుఁడు,
సొరిదిం దనుఁ బొగడుకొనని శూరుఁడుఁ, బ్రజలం
సరిగాఁ జూచిన ప్రభువును,
బురుషోత్తమ యెందు దులభులు తలపోయం. ౮౭

ఉ. చిత్తసమాకులీకరణశీలమనోరమ దైన్యసాధ్య ని
స్పత్త మహాభుజంగకులసంశ్రయగర్తసమృద్ధవల్లి దు
ర్వృత్తగృహాంతవాసిని నవీనవిలాసిని లక్ష్మి; యిట్టిసం
పత్తి సమస్తదోషభవబంధభయప్రద గాక సౌఖ్యమే. ౮౮.

వ. మఱియు నాయు వెట్టి దం టేని. ౮౯.

గీ. ఆయు వస్థిరంబు నతిపేలవము పల్ల
వాగ్రసలిలబిందువట్ల తలఁప:
నుండి యుండి దేహ మూరక పడఁ ద్రోచి
వేదు రెత్తినట్లు విడిచిపోవు. ౯౦.

క. విషయాశీవిషభీషణ
విషజజరితాత్ము లాత్మవిద్యావినయ

ద్వేషు లగువారల బ్రతుకులు
విషమంబులు చవుట నిడినవిత్తులు దలంపన్. ౯౧

గీ. పొందవలసినయర్థంబు పొంద నేర్చి
దుష్కృతులు సేసి క్రమ్మఱ దుఃఖపడక
యచలనిర్వాణసుఖవృత్తి నందునట్టి
వారిబ్రతుకులు బ్రతుకులు వసుధమీఁద. ౯౨

క. జననంబు నొంది వెండియు
జననము లేకుండ మెలఁగుజనుజననంబే
జననంబు గాక, ముదిమిని
బనుపశు వెనుగార్దభంబు బ్రతుకును బ్రతుకే? ౯౩.

వ. మఱియు నహంకారం బెట్టి దనిన. ౯౪.

క. అనఘా మోహమువలనన
పనిలేకయ పుట్టి పెరిఁగి పగతుం డై పైఁ
జను మిథ్యాహంకారముఁ
గనుఁగొన మదిలోన వగపు గదిరెడు నార్యా. ౯౫.

గీ. విను మహంకార మెందాఁక వృద్ధిఁబొందు
నకట యందాక తృష్ణయు నతిశయిల్లు,
మేఘబృందంబు సాంద్రమై మింటఁ దోఁపఁ
బొరి విజృంభించుకుటజమంజరియుఁ బోలె ౯౬.

వ. మఱియుఁ జిత్తం బెట్టి దనిన. ౯౭

గీ. దోషజుష్టమైనదుర్జనచిత్తం బ
నార్య మార్యసేవ కలిమిఁ గొనక
పవనచలితపింఛలవముచందంబునఁ
జాచలించు చుండు సన్మునీంద్ర. ౯౮

క. దూరము పనిగలగతిఁ జను,

నూరక యిల్లిల్లు సొచ్చు, నొగిఁ జీ యనఁగాఁ
గూరదు సిగ్గున, సుజనులఁ
జేరదు, చిత్తంబు, గ్రామసింహము వోలెన్. ౯౯.

గీ. ఎట్టిచోట నయిన నించుక మేలును
బొందలేదు నిధులఁ బొందెనేని,
బెరసి మానసంబు, పరితృప్తి నొందదు,
జలము నించునట్టిసజ్జభంగి. ౧౦౦.

గీ. పరఁగ భూమినుండి పాతాళమునఁ గ్రుంకు,
నచటనుండి ధాత్రి కరుగుదెంచుఁ,
గ్రూరరజ్జుకలితకూపకాష్ఠముభంగిఁ
దెరలి మనసు సాలఁ దిరుగుచుండు. ౧౦౧.

క. కనకాద్రి నెత్త వచ్చును,
వనరాసులు గ్రోలవచ్చు, వనశిఖిఁ గడిగాఁ
గొనవచ్చుఁ, గాని యేగతి
మనము నిరోధింపరాదు మహితవివేకా. ౧౦౨.

వ. మఱి తృష్ణ యెట్టి దంటేని. ౧౦౩.

క. హృదయాంధకార మొదవఁగ
విదితంబై తృష్ణ పొడము, విను, దోషములన్
గుదురగుచుండును, శర్వరి
యుదయింపఁగ గూబకదుపు లొగి వచ్చుగతిన్. ౧౦౪.

గీ. అధికసంసారదోషంబులందు నెల్ల
నధికదోషంబు తృష్ణయే యండ్రు మునులు,
వెలయ నంతఃపురములోనివిభుని నైన
బహుళసంకటములపాలుపఱుచుఁ గాన. ౧౦౫.

గీ ఆయసాగ్నికంటె నసిధారకంటెను

బిడుగుకంటెఁ జాల బెడిద మగుచుఁ
దృష్ణ పేర్చి మిగులఁ దీవ్ర మై సతతంబు
హృదయముల వసించి యేర్చు ననఘ ౧౦౬.

క. మేరుసమానుని నైనను
సారోత్తము నైనఁ దృష్ణ సోఁకినయేని౯
జీరికిఁ గైకొన రెవ్వరు.
నారయ నది దొలఁగనతఁడె యధికుం డెందు౯. ౧౦౭.

వ. మఱియు శరీరం బెట్టి దనిన?

చ. గురుతరశల్యసంగతము గుర్వగుమాంసవిలేపనంబు పె
న్నరముల ప్రోక చర్మపరిణద్ధము శోణితమజ్జపూయమం
దిరము వికారధర్మి యగుదేహము రోగనిధానగేహ మౌఁ;
బురుషవరేణ్య యీచెనఁటిబొందుల కేమిసుఖంబు సెప్పుమా. ౧౦౮.

గీ. ముదిమికాల మైన మదిమియుఁ బొడసూపు,
మరణకాల మైన మరణ మొదవు,
పేదవాని కైన పృథివీపతికి నైన
సమమ దేహములకు సహజ మిదియ. ౧౦౯.

గీ. ఘనతటిల్లతికలు గంధర్వనగరంబు
లభ్రపంక్తు లట్ల యస్థిరంబు
లై విశీర్ణశీల లగుశరీరంబుల
విశ్వసించువారు వెడఁగు లనఘ. ౧౧౦.

సీ. ఆశాసమావృతి, యతిశక్తిహీనత,
జాడ్యంబు, దైన్యంబు, చపలతయును,
మాటాడ నేరమి, మాటపొం దెఱుఁగమి,
యిది పాము త్రా డని యెఱుక లేమి,
మూత్రపురీషసంప్లుతగాత్రుఁ డై యుంట,

తన్నుఁ దా నెఱుఁగక తన్నుకొనుట,
కదలి యిట్టట్టు పోఁ గాళ్లు రా కుండుట,
గురుజనశిక్షలఁ గుతిలపడుట,

గీ యివియు మొదలు గాఁగ నెన్నఁ బెక్కగునట్టి
బాధ లనుభవించు బాల్యవృత్తి
పరమమునివరేణ్య ప్రత్యక్షనరకంబు,
దీన నేమి సుఖము తెలుపవయ్య. ౧౧౧.

క. తల్లియుఁ దండ్రియు నితరులుఁ
బల్లిదులై తోడ నాడుపడుచులు నడువన్
దల్లడపడుశైశవ మిది
చెల్లంబో దురితదుఃఖశీలము గాదే. ౧౧౨.

వ. మఱియు యౌవనం బెట్టి దనిన. ౧౧౩.

క. బాలత్వ మెడలి, తరుణిమ
కాలూఁదఁగఁ, జిత్తభవవికారంబులు మైఁ
గీలుకొని త్రుళ్లఁ జేయఁగఁ,
పాలసుఁ డై దురితవితతిపా ల్పడి పోవున్. ౧౧౪.

గీ. యౌవనంబునందు నవికారి యై తన్నుఁ
బరులు మే లనంగ బ్రతికెనేని,
యతఁడు పుణ్యపురుషుఁ డతఁ డుత్తమోత్తముఁ
డతఁడు వంద్యమానుఁ డఖిలమునకు. ౧౧౫.

క. వినయము బుధసంశ్రయ మై
ఘనగుణమణిచయము సానుకంపాస్పద మై
తనరెడుపుణ్యాత్ములయౌ
వన మతిదుర్లభము గగనవనమును బోలెన్. ౧౧౬.

వ. మఱియు స్త్రీ లెట్టివా రంటేని. ౧౧౭.

సీ. అస్థికీకస సిరాయతమాంస పుత్త్రిక
లంగనాజనలలితాంగకములు,
కీలాల మూత్ర సంక్లిష్టదుస్సహములు
తరళలోచనలనితంబకములు,
చర్మసంవృతమహాదుర్మాంసపిండంబు
లువిదలపీనపయోధరములు,
కలిత లాలా శ్లేష్మ ఘనకరండంబులు
కొమ్మలమోవులు, కుటిలబాష్ప

గీ. మయము గానుండునతివలనయనజాల,
మిన్నియును జెప్ప నేటికి నింతులందు
నెచటఁ గను పెట్టి చూచిన హేయకరము
గాక యెచ్చోట సుఖము సుశ్లోక చెపుమ. ౧౧౮.

క. మరుఁ డను మేటికిరాతుఁడు
సరసభసముగ ముగ్ధమతుల జనవిహగములన్
దొరసి పడ నడఁప నొగ్గిన
యురులు సుమీ సంయమీంద్ర యువిదలు దలఁపన్. ౧౧౯.

క. సతులె యిహలోకసుఖదలు
సతు లెడలిన సౌఖ్య మేమి ? సతి విడువ జగ
త్త్రితయము విడుచుటె. జగముల
సతి విడిచినయతఁడ సుఖసమృద్ధిం దరయన్. ౧౨౦.

వ. మఱియు వార్ధకం బెట్టి దనిన. ౧౨౧.

గీ. బాల్యవృత్తి నెగడి పర్యాప్తి గా నీక
యౌవనంబు గ్రోలు, నంత నదియు
వర్ధిలంగ నల్ల వార్ధకం బది గ్రోలుఁ,
గంటె యొండొరువుల క్రౌర్య మిదియ. ౧౨౨.

క. నరునిశరీరమున జరా
తరుణి ప్రవేశించి ప్రజ్ఞ దరలించుఁ జుమీ
పరకాంత గృహముఁ జేకొని
దురటిలునిల్లాలి వెడలఁ దోఁచిన భంగిన్. ౧౨3.

సీ. పుత్త్రదారాదులు మిత్త్రులుఁ దనుఁ వెట్టిఁ
జేసి నవ్వఁగ మదిఁ జివికి చివికి,
కుడువ వేడుక పుట్టి గడియు నోటికిఁ బోని
వేదన వెడవెడ వెచ్చివెచ్చి,
యంగకంబులజవం బడఁగంగఁ దనివోని
భోగేచ్ఛ వాడమఁగఁ జొక్కి-పొక్కి,
తనుతంతువులు రోగ మనుమూషకము చేరి
కొఱుకంగ లా వేది క్రుస్సిక్రుస్సి,
గీ. కడఁగి మేన బూదిఁ దుడిచినవిధమున
ముణిఁగి నరసియున్న ముదుకశిరముఁ
గోరి బూదిచఱచుకూష్మాండఫలభాతి
వెదకి కాలుఁ డనుభవింప కున్నె. ౧౨౪.

గీ. మరణ మనునృపాలుఁ డరుదేర ముందఱ
రమణఁ బలిత చామరములు వీవ
దొరసి రోగదోషదుఃఖసేనలు వేగ
నరుగుదెంచు చుండు ననఘచరిత. ౧౨౫.

వ. మఱియుఁ గాలం బెట్టి దనిన.

గీ. ఎలమి సంసారమున సుఖ మింత లేదు;
ఎట్టకేలకు నది జనియించెనేని,
కాలుఁ డెడ సొచ్చి తా నది గ్రోలు చుండుఁ,
దఱిమి తంతుల నెలుకలు గొఱుకునట్లు. ౧౨౬

క. విశ్వాత్మం డైన కాలుఁడు
విశ్వముఁ గబళించు మాయ విలసింపంగ, నీ
నశ్వరసంసారంబు ము
నీశ్వర మముఁబోఁటిజనుల కేటికిఁ జెపుమా. ౧౨౭.

గీ. ఇంద్రియములె శత్రు లింద్రియంబులకును;
సత్యమున నశించు సత్యనియతి.
యాత్మ నాత్మ యణఁచు నతిఘోర మగు కాల
మహిమఁ దతన్మనంబు మనముఁ జెలుచు. ౧౨౮.

ఉ. దిక్కులు కొండలుం జుణుఁగు, దేశము లెల్ల నదృశ్యమై చెదుర్;
జుక్కలు డుల్లు, నంబుధులు శోషిలు, విష్ణువిరించిరుద్రులున్
దక్కక గ్రాఁగిపోదురు, బుధస్తుత కాలుఁడు వేచి మ్రింగఁగా;
నక్కట మర్త్యు లెల్ల మనునాసలు సేయుట మోస మౌఁగదే.౧౨౯.

క. అనఘుఁ డవాచ్యుఁ డదర్శనుఁ
డనుపముఁ డశ్రాంతుఁ డభవుఁ డజ్ఞాతుఁడు నాఁ
జను విభ్రమకాలుఁడు భూ
జనము విడంబించు చుండు సన్మునివర్యా. ౧౩౦.

గీ. సభ్యు లైనవారిసంగతి నహములు
పుచ్చు కిటను నటను బోయి రాత్రు
లింటి కరిగి విశ్రమించుసంసారుల
కెట్లు నిద్ర వచ్చు నిద్ధచరిత ? ౧౩౧.

సీ. బ్రహ్మాయోగీంద్ర యీభవరోగములు నాకు
నేవెంట నెడఁబాయు ? నెద్ది సార ?
మేమార్గమునఁ జేసి యీదుష్టసంసార
దుఃఖంబు వెడలు ? సత్పురుషు లొందు
గతి నాకుఁ గలుగుమార్గము విస్తరించి మీ

రెఱిఁగినభంగి నా కెఱుఁగఁ జెప్పఁ ;
డెఱిఁగింప కుంటిర యేని మజ్జనభోజ
నాదులఁ దొఱఁగి మీ యడుగులొద్ద
గీ. మేను దొఱఁగువాఁడ ; మీయాన ; యని పల్కి
నిబిడబాష్పకలిత నేత్రుఁ డగుచుఁ,
జిత్రరూపభంగిఁ జేరి యూరక యుండె
సత్యధనుఁడు రామచంద్రుఁ డనఘ. ౧౩౨.

వ. అని యివ్విధంబున వైరాగ్యప్రకరణంబు తద్రసగర్భితంబు లగువాక్యంబుల నుపన్యసించిన రామచంద్రుం గనుంగొని మునిజనం బనేకవిధంబులఁ బ్రస్తుతింప విశ్వామిత్త్రుండు సంతుష్టాంతరంగుం డై యిట్లనియె. ౧౩౩.

## ముముక్షుప్రకరణము.

క. మనువంశతిలక, సర్వం
బును జెప్పితి వీవ, సూక్ష్మబుద్ధిని నీయం
తన దెలిసినాఁడ, వింక నే
వినిపించెడి యర్థ మెద్ది విజ్ఞాననిధీ ? ౧౩౪.

వ. ఈ యర్థంబున కొక్క యితిహాసంబు గలదు. తత్కథాకర్ణనంబున నీకును జిత్తసంశయనివృత్తి యగు. దత్తావధానుండ వై వినుమని కౌశికుం డి ట్లనియె. ౧౩౫.

గీ. అనఘ, నీయట్ల శుకయోగి యాత్మబోధ
తాన తనసూక్ష్మబుద్ధి నంతయును దెలిసి,
బుద్ధివిశ్రాంతికై శంక వొడమి, తండ్రి
పాలి కేతెంచి ప్రణమిల్లి పలికె నిట్లు. ౧౩౬.

క. ఈమలినపు సంసారం
బేమిట నుదయించె ? నెంత ? యెవ్వని ? కిది యుం

కేమిగతి నెన్నఁ డణఁగును ?
ధీమన్నుత తెలియ నాన తీవే నాకున్. ౧౩౭.

వ. అనిన వేదవ్యాసుండు పుత్త్రున కి ట్లనియె. ౧౩౮.

క తనబుద్ధివికల్పనమున
జనియించు జగంబు ; దానిసంక్షయమున నా
శన మొందును సంసారం ;
బని తుదిఁ గను మిదియె నిశ్చితార్థము పుత్త్రా. ౧౩౯.

క. అని యిట్లు తండ్రి సెప్పిన
వినుతోక్తులు వినియు శుకుఁడు విద్యానిధి నె
మ్మనమున బహూకరింపమిఁ,
గని వేదవ్యాసుఁ డతనిఁ గని యి ట్లనియెన్. ౧౪౦.

క. ఏ నింతకు మిక్కిలి విన ;
భూనుత నీ వడుగువాక్యముల కుత్తరముల్
ధీనిధి మిథిలానాథుఁడు
భానునిభుఁడు జనకభూమిపాలుఁడు సెప్పున్. ౧౪౧.

వ అతండు నీచిత్తసంశయంబుఁ బాప సమర్థుం డచ్చటికిం జని యడుగు మనిన, శుకుండును జనకానుమతంబున మిథిలానగరంబునకుఁ జని, మహామునిగణ పరివృతుం డైన జనకుం గాంచిన, నమ్మహాత్ముండు ప్రత్యుత్థానంబు సేసి యమ్మహానుభావుం బూజించి యాగమనప్రయోజనం బడిగిన, శుకుండు దన తండ్రి నడిగిన యట్ల యడిగిన విని జనకుండు పెద్దయుం బ్రొద్దు విచారించి యి ట్లనియె. ౧౪౨.

క. అనఘు, చిత్పురుషుఁ డొక్కఁడె ;
విను మన్యము లేదు ; తత్త్వవిధ మి ట్టి దగున్ ;
దన సంకల్పమె బంధము
తనసంకల్పక్షయంబ తగ ముక్తి యగున్. ౧౪౩.

క. ఇది తత్త్వనిశ్చితార్థము ;
విదితం బిది తప్ప లేదు వేఱొక్కటి నీ
మది దృశ్య ముడిగినాఁడవు.
పదిలంబుగ, నిదియ పట్టి భ్రాంతిఁ దొఱఁగుమీ. ౧౪౪.

క. అని తత్త్వనిశ్చయము తన
జనకుఁడు మును చెప్పినట్లు జనకుఁడు సెప్పన్,
విని మానసవిశ్రాంతియుఁ
దనరఁగ, శుకయోగివరుఁడు తత్పతి కనియెన్. ౧౪౫.

క. నా తెలివియు నిట్టిద మును,
మాతండ్రియుఁ జెప్పుశాస్త్రమత మిదియే, నీ
చేతం దెలియఁగ వింటిని,
జేతోవిశ్రాంతిఁ గంటిఁ జిత్సౌఖ్యనిధీ. ౧౪౬.

క. అని శుకుఁడు నిశ్చితార్థము
గని బహుకాలంబు నిర్వికల్పసమాధిం
దనరియు నిర్వాణతఁ బొం
దెను దా నిఃస్నేహయుక్తి దీపము పోలెన్. ౧౪౭.

వ. అని చెప్పి విశ్వామిత్త్రుండు రామచంద్రున కి ట్లనియె. ౧౪౮.

గీ. శుకుఁడు తెలిసినట్ల సకలంబు నీవును
దెలిసినాఁడ; వాత్మ మలినమార్జ
నమ్ము వొంది నీవు నన్ను వేఁడినమాట
కుత్తరంబు నిదియె చిత్తగింపు. ౧౪౯.

వ. జ్ఞాతృజ్ఞేయం బైనచిత్తం బతిసమగ్రం బగుభోగబృందానుభవంబు లే కునికియ లక్షణం బగువస్తువు జగం బగు, బంధంబు భోగవాసన చేత దృఢం బగు, నవ్వాసన శాంతం బైన నబ్బంధంబు తనుత్వంబు నొందు. అని సెప్పి విశ్వామిత్త్రుండు వసిష్ఠమహామునిం గనుంగొని, యిమ్మహా

త్మునకు బుద్ధివిశ్రాంతి యగువాక్యంబు లుపదేశింతురు గాకని పలుకుటయు, నమ్మహాముని తొల్లి కౌశికునకుం దనకు నైన వైరం బుపశాంతి పొందెదమనట్లు కమలగర్భుండు సెప్పినవాక్యంబులు రామచంద్రునకుం జెప్పం దలంచి యి ట్లనియె. ౧౫౧.

సీ. అనఘ, సంసారంబునందు సర్వంబును
పౌరుషంబునఁ బొందఁ బడెడి ; నందు
విను పౌరుషము రెండువిధము లై యుండు, న
శాస్త్రంబు శాస్త్రానుసారి యనఁగ
నందు నశాస్త్రంబు నర్థసంప్రాప్తి కా
శాస్త్రీయ మగుపౌరుషంబు దలఁపఁ
బరమార్థమున కగుఁ; బోరిఁ బూర్వవాసనా
ప్రాప్తమైన యశాస్త్రపౌరుషంబు

గీ. పర్వినప్పుడు శాస్త్రీయపౌరుషంబు
చేత నది యడ్డపెట్టుచుఁ జిత్తశాంతి
నిగిడి సతతంబు వలిగింపు నెమ్మితోడఁ
బ్రకటసౌజన్యగుణభద్ర రామభద్ర. ౧౫౧.

గీ. పూని యనభిజ్ఞచి త్తుఁడ వైననీవు
తగిలి యెందాక సుజ్ఞానతత్త్వుఁ డగుదు
మరగి యందాఁక గురుశాస్త్రమతము లెఱిఁగి
యాచరింపుము నిచ్చలు నతులపుణ్య. ౧౫౨.

వ. అని చెప్పి, 'సంసారదుఃఖనివారణంబును ధీసమాశ్వాసనంబునుం గాఁ బరమేష్ఠి తొల్లి నా కుపదేశించినవాక్యంబులు తేటపడ నెఱింగించెద నాకర్ణింపు' మనిన, విని రామచంద్రుండు 'పరమేష్ఠి యేమి కారణంబున నేమి యుపదేశించె? నది మీచేత నెట్లుపొందంబడియె ? నత్తెఱంగానతిండ' నిన వసిష్ఠుం డి ట్లనియె. ౧౫౩.

క. అమల మనంతవిలాసం
బమృతము సర్వగము సచ్చిదాకాశ మనా
శము పరిపూర్ణం బగు తే
జము గల ; దది వెలుఁగు సర్వసంశ్రయ మగుచున్. ౧౫౪.

క. అది కదలియుఁ గదలనిదెస
నుదయించెను విష్ణుఁ, డతనియుదరంబునఁ బెం
పొదవిన కనకాంబుజమున
విదితంబుగ బ్రహ్మ పుట్టె విశ్వజనకుఁ డై. ౧౫౫.

వ. అద్దేవుండు సకలభూతంబులం దత్కర్మానుసారంబుగం బుట్టించుటయు, నీభారతవర్షజాతు లగు వారలు దుర్వ్యసనాక్రాంత స్వాంతులును నల్పాయువులును నై దుఃఖించుచున్న, వారలం గనుంగొని దుఃఖు లగుపుత్త్రులం జూచి శోకించుజనకుండునుంబోలెఁ గరుణించి, యేకాగ్రచిత్తుం డై కొండొకసేపు చింతించి, జపదానతపస్తీర్థంబు లత్యంత దుఃఖనివారకంబు గా వని సకలదుఃఖనిర్హరణం బై పరమానందంబు నొందించునట్టి నిర్మలజ్ఞానోపదేశంబుఁ జేయం దలంచి, పరమేష్ఠి తన మనంబువలన నన్నుఁ బుట్టించి నాకు సంసారవ్యాధిభేషజం బగుపరమజ్ఞానంబు బహుప్రకారంబుల నుపదేశించి యి ట్లనియె. ౧౫౬.

గీ. కడఁగి యేతత్క్రియాకర్మకాండసరణిఁ
గర్మకాముల కెఱిఁగింపు, కడు విరక్తు
లైనవారికి నాత్మవిజ్ఞానమార్గ
మర్థి బోధింపు, పుత్త్ర నీ వనుదినంబు. ౧౫౭.

వ. అని యాజ్ఞాపించిన యక్కమలసంభవుచేత నియుక్తుండ నై యాయా భూతపరంపరయందు విహరించుచుండుదు. ౧౫౮.

గీ. ఊరకుండుదుఁ, గర్తవ్య మొకటి లేదు,
శాంతమతిఁ జేసి నిజమానసంబు గెలిచి

సుప్తుఁ డగువానిబుద్ధివిస్ఫురణభంగిఁ
జేసియును జేయకుండుదుఁ జేయుపనులు. ౧౫౯.

క. గురువాక్యము శాస్త్రార్థముఁ
బొరిపొరిఁ జిత్తానుభవముఁ బొందించి నిరం
తరమును నైక్యాలోకన
పరుఁ డగునభ్యాసి పొందుఁ బరతత్త్వంబున్. ౧౬౦.

గీ. అల్పసంస్కృతమానసు లైనవారి
కైన మది మోక్షమున్ మెడలించునట్టిశాస్త్ర
మిదియ తప్పంగ మఱి యన్య మెద్ది గలదు?
వినుము తత్పరబుద్ధివై మనుజనాథ. ౧౬౧.

క. ధనమును గాయక్లేశముఁ
దనమిత్త్రులు తీర్థదేవతాసేవలు నెం
దును దత్త్వము నొందింపవు,
మనము నిరోధింపకున్న, మనుకులతిలకా. ౧౬౨.

క. విను మోక్షద్వారపదం
బునకు శమంబును విచారమును సంతోషం
బును సాధుసంగమంబును
నను నాలుగు ద్వారపాలకాభిదము లగున్. ౧౬౩.

వ. అవి యెయ్యవి యంటేని. ౧౬౪

గీ. దోషములు దుష్క్రియాదులు దుస్సహంబు
లైనదుఃఖంబు లెల్లను నాక్షణంబ
శాంతి మది నూనుమాత్రన సమసి పోవు,
నరుణుఁ డుదయింపఁ జీఁకటి యణఁగునట్లు. ౧౬౫.

క. వినునెడఁ గనుఁగొనునెడ మూ
కొనునెడ ముట్టునెడఁ జవులు గొనునెడ మేల్గి

డును వచ్చినపుడు మోదం
బును ఖేదము లేనియుత్తముఁడు శాంతుఁ డగున్. ౧౬౬.

గీ. పాలుచువేడుకఁ బెండ్లికిఁ బోవునపుడు
నుగ్రులై చంపఁ గొనిపోవు చున్నయెడల
చిత్త మెంతయుఁ జల్లనై శీతకరుని
చందమున నున్నయాతండు శాంతుఁ డండ్రు. ౧౬౭

గీ. తాపసులయందు శాస్త్రవిత్తములయందు
యాజకులయందు నృపులందు నతిబలాఢ్యు
లందు శమయుక్తుఁ డగువాఁడ యధికుఁ డెందు;
నని యెఱుంగుము మనమున మనుకులేశా. ౧౬౮.

గీ. వినుము శాస్త్రావబోధచే విస్తరిల్లి
పూతమును నిర్మలము నైనబుద్ధిఁ జేసి
కారణ మెఱింగి యాత్మవిచార మాత్మఁ
దవిలి సేయుచు నునికి కర్తవ్య మనఘ. ౧౬౯.

గీ. అంధకారంబునందును నణఁగి పోదు,
దీపతేజంబునందును దిరిగి రాదు,
ఎట్టిమఱు వైనఁ గన్పించు నెదురులేక
చారుతర మైనయట్టి విచారదృష్టి. ౧౭౦.

క. 'ఏ నెవ్వఁడ ? సంసారా
ఖ్యానం బీదోష మెట్లు గలిగెనొ?' యనుచుం
దా నిజయుక్తిం దెలియుట
పూని విచారంబు సీకె పో రఘువీరా. ౧౭౧.

క. సంతోషము సుఖతర మగు,
సంతోషము నిత్యమోక్షసంప్రాప్తి యగున్,
సంతుష్టుం డొందును వి

శ్రాంతస్వాంతుండు రామ సౌజన్యనిధీ! ౧౭౨.

గీ. వఱల నప్రాప్తములయెడ వాంఛ యెడలి
ప్రాప్తములయెడ సమతమైఁ బట్టుకొల్పి
పూని సుఖదుఃఖములు మదిఁ గానఁబడని
యతఁడు సంతుష్టుఁ డనఁబడు నఖిలమునను. ౧౭౩.

గీ. సర్వమానవులకు సంసారతారణ
కారణంబు పుణ్యకారణంబు
నై వెలుఁగుచుండు నఖిలసంస్తుత్యమై
సాధుసంగమంబు జనవరేణ్య ! ౧౭౪.

గీ. విమలమతులు సములు వీతగర్వగ్రంథు
లాత్మవిదులు సాధులైనజనులు
సేవ్యులెందు వారి సేవించుటయ భవ
జలధి యుత్తరింపఁ గలుగు వెరవు. ౧౭౫.

వ. ఇట్లు సేవింపంబడు భవభేదనోపాయంబులను నీనాలిగంటి నభ్యసిం
చినవారలు మోహపారావారోత్తీర్ణులు. అని చెప్పి వసిష్ఠుండు
మఱియు నిట్లనియె. ౧౭౬.

గీ. యుక్తియుక్తమైనసూక్తులు బాలుండు
చెప్పె నేని వినుము చిత్తగించి,
యన్యమైనవచన మది బ్రహ్మ చెప్పినఁ
దృణము పోలె విడువు ధీరహృదయ. ౧౭౭.

వ. అని చెప్పి మఱియు నిట్లనియె. ౧౭౮.

సీ. బ్రహ్మోపదేశంబు స్పష్టంబుగా నీకు
దృష్టాంతమొప్పఁగాఁ దేటగాఁగ
నింతయుఁ జెప్పితి నిది యుపదేశ సా
మగ్ర్యంబుగాఁ జిత్తమందు నెఱుఁగు

మట్లు నిరాకార మైనబ్రహ్మమునందు
సాకారదృష్టాంత మైనయట్టి
యపవిత్రములు ప్రమోహాంతరంబులు నగు
మూర్ఖవాదంబుల మొగిఁ గుతర్క

గీ. కత్వ మొందక చిత్తంబు కలఁగఁబడక
శమదమాదులచేత సుజ్ఞాన మొదవ,
నవి పరస్పరవృద్ధి యై యబ్జములును
సరసియును గూడి వర్ధిల్లు చంద మొందు. ౧౭౯.

గీ. యశము నాయువుఁ బుణ్యంబు నర్థ మిచ్చు,
నఖిలపురుషార్థ మగు, నిది యర్థి వినిన,
బుద్ధినైర్మల్య మొందించు, బోధ వొడమి
తత్పదంబునఁ బొందెడు ధర్మచరిత ౧౮౦.

వ. అని యిట్లు ముముక్షుప్రకరణంబు వసిష్ఠుండు రామచంద్రున కెఱిఁ
గించె ననిన విని సంతుష్టాంతరంగుం డై భరద్వాజుం డటమీఁది
వృత్తాంతం బేమి సెప్పె నెఱింగింపుఁ డని యడిగిన. ౧౮౧.

ఉ. ధన్యచరిత్ర ఫుల్లసితతామరసాయతనేత్ర లోకస
మ్మాన్య రమాకళత్ర మణిమండనమండితగాత్ర దైత్యరా
జన్యలతాలవిత్ర భవసాగరతారణయానపాత్ర సౌ
జన్యమనీషిమిత్ర రిపుసంచయశోషణ భృత్యపోషణా. ౧౮౨.

క. శశిశకలసదృశ బిసనిభ
దశనాంకుర నఖరముఖ విదారిత విద్వి
ట్కశితాశనవక్షస్స్థల
శశిధర ఫాలాక్ష భక్తజనిహర్యక్షా. ౧౮౩.

### మాలిని.

పటుజలధరభాసా స్ఫార ఘోరాట్టహాసా
కుటిలజటిలకేశా కోటిసూర్యప్రకాశా
త్రుటితదురితపాశా దుష్టదైత్యప్రణాశా
నిటలతటసనేత్రా నిత్యలక్ష్మీకళత్రా. ౧౮౪.

### గద్య.

ఇది శ్రీనరసింహవరప్రసాదలబ్ధకవితావిలాస భారద్వాజసగోత్ర పవిత్రాయ్యలామాత్యపుత్త్ర సరసగుణధుర్య సింగనార్య ప్రణీతంబైన జ్ఞానవాసిష్ఠరామాయణంబునందు వైరాగ్యప్రకరణంబును ముముక్షుప్రకరణంబును నన్నది ప్రథమాశ్వాసము.

# వాసిష్ఠరామాయణము.

## ద్వితీయాశ్వాసము.

క. శ్రీమదహోబలపట్టణ
ధామ మహోద్దామచక్ర దారితదనుజ
స్తోమ భవభీమ భక్త
క్షేమంకర విదళితాంహ శ్రీనరసింహా. ౧.

ఉత్పత్తిప్రకరణము.

వ. దేవా సకలతత్త్వార్థవివేకి యగువాల్మీకి భరద్వాజున కిట్లనియె. అట్లు ముముక్షుప్రకరణం బెఱింగించి వసిష్ఠుండు రామచంద్రుం గనుంగొని—సకలజగ దుత్పత్తి స్థితి లయ కారణంబు మనం బని చెప్పంబడు, నీయర్థంబున కొక్క నిదర్శనంబు గల దాకర్ణింపుము ; అని యిట్లనియె. ౨.

సీ. పరఁగ నుత్పత్తిప్రకరణం బెఱింగింతు ;
నాకాశజంబు లీలాఖ్యకంబు
తనరు కర్కటియు నై తర్వాతఁ గృత్రిమేం
ద్రము చిత్తజాఖ్యానకమును శాంబ
రంబును మఱి లవణంబును సప్తభూ
ములు నన నితిహాసములును గలుగు.
నందు నాకాశజాఖ్యానంబు మొదలనే
బోధ్యరూపము సూక్ష్మముగ వచించి
గీ. పిదప విస్పష్ట మొనరింతు నదియుఁ దెలియ ;
వినుము ప్రతిపత్తిఁ గును భూతి వేదనంబు

దనరు నపరోక్షచైతన్య మనఁగ నివియు
జీవునకు నామకములు రాజీవనయన. ౩.

వ. సంవిత్స్వరూపం బగు జీవుండు పదార్థజ్ఞానోదయంబున నహంకార ముక్తుం డై పురుషుం డనంబడు ; నతండు సంకల్పవికల్పాది భావ జనితం బగు విపరీతజ్ఞానంబున నుదకంబ ఫేనతరంగ బుద్బుదాకారం బగునట్లు తాన జగద్రూపం బై వెలుంగుచుండుఁ ; దత్ప్రపంచంబ బంధంబును దన్నిరసనంబ ముక్తియు ననంబడు; నట్లు గావున తద్దృశ్యనిరసనమార్గం బెఱింగించెద నాకర్ణింపుము. ౪.

గీ. కానఁబడుచున్న యట్టిజగంబు లెల్ల
విలయకాలంబు నప్పుడు విరిసిపోవు,
వినుము నిద్రించి తెప్పిలువేళలందుఁ
దొడరి కల లేమియును లేక యడఁగినట్లు. ౫.

సీ. తత్కాలమున మహాతమము తేజంబును
బొడమక యొక్కట నడఁగు ; నందు
నవ్యక్త మచల మనాఖ్య మవర్ణ మై
చిన్మాత్ర మొకటియ చిక్కియుండు ;
నాచిత్తునకుఁ బరమాత్మ పరబ్రహ్మ
సత్యంబు నా బుధసమితిచేత
వ్యవహారసిద్ధి కై వివిధనామంబులు
గల్పింపఁబడియె. నిక్కముగ నతఁడు
గీ. నన్యుఁడును బోలె జీవాత్ముఁ డై వెలుంగు ;
నతఁడు కలనాకలత్వంబు నగ్గలించి
విను మనంబునఁ బొల్చు ; నమ్మనము పేర్చి
తాన సంకల్పజాల మై తనరు ననఘ. ౬.

వ. ఆ సంకల్పంబున నింద్రజాలంబునంబోలె జగత్తు జనియించు. అంబుధి

వలనం దరంగంబులును గాంచనంబువలనం గటకమకుటాదిభూషణం
బులును జనియించుచుండునంబున శాశ్వతం బగుపరమాత్మయందు నశ్వ
రం బగుసృష్టి పృథగ్భావంబున వర్తిల్లు. ఇట్టిద యని యుత్పత్తిప్రకా
రం బెఱుంగు మని చెప్పి వసిష్ఠుండు మఱియు ని ట్లనియె. ౭.

ఆకాశజోపాఖ్యానము.

క. విను రాఘవ యాకాశజుఁ
డను పేరిటివిప్రవర్యుఁ డాత్మవిదుఁడు స
జ్జనహితుఁడు ధర్మశీలుఁడు
ఘనుఁ డాయుష్మంతుఁ డొకఁడు గలఁ డీధాత్రిన్. ౮.

గీ. అతని తేజంబు దుస్సహ మై వెలుంగ,
మృత్యు వతికోపమున వాని మ్రింగ వచ్చి
తనకు నొకభంగి నగపడ కునికిఁ జూచి
కినుక వొడమినమది వితర్కించె నిట్లు. ౯.

గీ. కాలపాశంబు గయికొని క్రమముతోడ
నఖిల భూతంబులను మ్రింగునట్టి నాకు
నకట యీతనియందు వ మ్మయ్యె నాదు
శక్తి యుపలంబు సోఁకినశస్త్ర మట్లు. ౧౦.

వ. అని వితర్కించి. ౧౧.

క. ఆవిప్రుదివ్యతేజము
భావింపఁగఁ జక్కఁ జూడఁ బట్టఁగఁ గదియం
గా వెరవు లేక మృత్యువు
వేవేగమ వచ్చెఁ బ్రేతవిభు సన్నిధికిన్. ౧౨.

వ. ఇట్లు చనుదెంచి సమవర్తిం గనుంగొని మృత్యువు కృతాంజలి యై
యి ట్లనియె. ౧౩.

శా. దేవా దేవరయాజ్ఞ మోచుకొని ధాత్రిం బొల్చు భూతావళిన్

దైవానీకము నేచి మ్రింగుదు ; నసాధ్యం బెద్దియుఁ లేదు నా ;
కీవిప్రోత్తముఁ జూడ డగ్గఱ భయం బేపారె ; నాకాశజుం
డేవెంటన్ మఱి నాకు లోఁబడఁడు ; నీఁ డెవ్వాఁ డెఱింగింపవే. ౧౪.

చ. అన విని కాలుఁ డిట్లనియె ; నక్కట మృత్యువ కేవలంబు స
జ్జనుల వధింప నీ కెటుల శక్యము ? వారల వారికర్మముల్
గనుఁగొని చుట్టు ముట్టుకొని కాల్పఁగ, నీవు నిమిత్తమాత్ర మై
యనువునఁ ద్రుంతుగాక విగతాయువులన్ మదమత్సరాత్ములన్. ౧౫.

వ. అదియునుం గాక ౧౬.

క. ఏకర్మంబును బొరయక
నాకాశమునందుఁ బుట్టినాతనిఁ బుణ్య
శ్లోకుని నాకాశజు నీ
కేకతమునఁ ద్రుంపవచ్చునే హింసాత్మా? ౧౭.

వ. అని సమవర్తి మృత్యువునకుం జెప్ప ననిన విని సాశ్చర్యహృద
యుండై రఘుపుంగవుం డమ్మునిపుంగవున కి ట్లనియె. ౧౮.

గీ. మునివరేణ్య మీరు మున్ను సెప్పినపుణ్యుఁ
డొక్కవిప్రుఁ డంటి రక్కజంబు,
తనకుఁ దాన పుట్టి దనరుపితామహుఁ
డజుఁడు గాఁగ నోపు నాన తిమ్ము. ౧౯.

వ. అనిన వసిష్ఠుం డిట్లనియె. మృత్యువునకు వివాదం బొనరించు నతండు
కేవలంబ బ్రహ్మ యగు, నతండు పృథివ్యాదిభూతరహితుం డై యా
కాశంబునుం బోలె నిరాకారుం డై వెలుఁగి సంకల్పపురుషుం డనం
బడు. మఱియును. ౨౦.

గీ. అతఁడు చిన్మాత్రరూపుఁ డనాది వంద్యుఁ
డజుఁ డనంతుఁడు చిత్తలౌల్యమునఁ దాన
పుట్టి వంధ్యాతనయుభాతిఁ బురుషుభంగి

దేహి క్రియఁ దోఁచుఁ ; బరమాత్మ దేహి గాఁడు. ౨౧.

వ. అన విని రామచంద్రుం డఖిలభూతంబులకు నాధ్యాత్మికంబును నాధిభౌతికంబు నను దేహద్వయంబు గలిగియుండు, నాబ్రహ్మంబున కెవ్విధం బెఱిఁగింపవే యనుటయు నమ్మునికుంజరుం డిట్లనియె. ౨౨.

గీ. భూతజాలంబు కారణోద్భూత మగుట
దేహయుగళంబుతోన వర్తించుచుండుఁ.
గారణాత్ముఁడు గా కున్కిఁ గమలజన్ముఁ
డాధిదైవికదేహుఁ డయ్యె వెలుంగు. ౨౩.

వ. అట్లు గావున నద్దేవుండు సంకల్పపురుషుండును చిన్మాత్రస్వరూపుండును సకలజగదుత్పత్తిస్థితిలయకారణంబునై విహరించుచుండు. మఱియును. ౨౪.

గీ. హరి మనోరూపమును స్వయంభువును నగుచు
వెలయు నద్దేవుచే సృష్టి విస్తరిల్లు ;
నట్లు గావున నీతోఁచు నఖిలజగము
దన్మనోమయ మని యాత్మఁ దలఁపు మనఘ. ౨౫.

వ. అనిన విని రామచంద్రుం 'డమ్మనోరూపం బెట్టిది? యమ్మనంబు చేత నీదోషమంజరి యగుజగత్తు లెట్లు విస్తరిల్లె ? నాన తిమ్మ' ని యడిగిన, నప్పరమసంయమి యిట్లనియె. ౨౬.

క. విను మాత్మనిసంకల్పమె
మన మనఁబడుఁ గాక, వేఱ మన సొక్కటియే?
దనరఁగ సంకల్పము నెడ
మన మని వర్తించుచుండు మహితవివేకా. ౨౭.

వ. అట్లు గావున మనస్సంకల్పంబులకు నెన్నఁడును దేనిచేతను భేదంబు లేకుండు. మఱియు నవిద్యయు సంసృతియుఁ జిత్తంబు మనంబు బంధంబు మలంబుఁ దమంబను నివి సంకల్పనామంబులై యుండు;

వీనిచేత జగంబులు విస్తరింపఁబడు; నట్లగుటం జేసి ౨౮.

గీ. కణఁగి సంకల్పజాలంబు గళిత మైన,
నంబ రానిల ది గ్భూము లాది యైన
యఖిలజగములు నణఁగంగ, నణఁగ కొక్క
చిత్ప్రకాశంబు విమల మై చిక్కి యుండు. ౨౯.

వ. సకలజగద్ద్రష్ట యగువిమలాత్మునకు నీవు నేను జగంబులును దృశ్యనిమిత్తతఁ గలుగునప్పుడు కేవలత్వంబు లే కుండుఁ. దద్దృశ్యసంభ్రమం బణంగెనేని ప్రతిబింబరహితం బగుదర్పణంబునుంబోలె ద్రష్టృత్వంబు లేక కేవలాత్మస్వరూపం బై వెలుగుచుండు. ౩౦.

క. విను మన మాకాశం బగు;
మన మసదాకృతియు దోషమయము వినాశం
బును నగుఁ; ద్రిజగముఁ బెనుచును
గనుఁగొనఁ గలవలనఁ బొడముకలిమియుఁ బోలెన్. ౩౧.

సీ. అఖిలప్రపంచంబు నణఁగినలయవేళ
యందును సర్గాదియందు శాంత
మగురూప మొక్కటి యవశిష్ట మై యుండు
నస్తమింపనిసూర్యున ట్లతండు
నజుం డనామయుఁ డజుఁ డాదిదేవుండు
పరమాత్మకుఁడు మహేశ్వరుఁడు తనర,
సర్వకాలంబును సర్వంబు సేయుచు
సర్వాత్ముఁ డన నడిసన్నవాఁడు,

గీ. నిగమగోచరుఁడును గాఁగ నిగుడు నెవ్వఁ
డరయ మోక్షంబునం దభివ్యక్తుఁ డెవ్వఁ
డతని కాత్మాదినామంబు లరసి చూడఁ
గల్పితంబులు గాని నిక్కములు గావు. ౩౨.

వ. అది యెట్లంటేని. 33.

సీ. దొరసి వేదాంతవాదులు బ్రహ్మ మన, సాంఖ్య
వరశాస్త్రనిపుణులు పురుషుఁ డనఁగ,
విజ్ఞానవిదులు శుద్ధజ్ఞాన మిత్రఁ డన,
శూన్యమతజ్ఞులు శూన్య మనఁగ,
నర్కాది తేజంబు లన్నియు నెవ్వండు
వెలిఁగించుచును దాను వెలుఁగుచుండుఁ,
కర్తయు భోక్తయు స్మర్తయు భర్తయు
ద్రష్టయు ఋతము నై దనరునతఁడు,
గీ. అఖిలమున నుండి లేనివాఁ డయ్యె నెవ్వఁ,
డరయ దేహస్థుఁ డై దూర మయ్యె నెవ్వఁ,
డధిక తేజంబుతోఁ బేర్చి యతఁడు విమల
చిత్ప్రకాశస్వరూప మై చెలఁగుచుండు. 3౮.

క. విదితంబుగ నద్దేవుని
సదమలరూపంబునందు జగదూర్మ్యులాగిం
బొదువుచు విచ్చుచు వెలుఁగుచు
మది విస్మృతి సేయు నెండమావులభంగిన్. 3౫

వ. అనంతం బగుజగద్బృందంబు తాను జేయుచు నెన్నఁడు నెద్దియుం జేయనివాఁ డై యుత్పత్తిస్థితిలయంబులు దొలఁగి నిర్వికల్పజ్ఞానస్వరూపుం డై యాత్మ యొక్కండును దనయంతన వెలుంగుచుండు నని తత్త్వస్వరూపం బెఱింగించి యిట్లనియె. 3౬

సీ. అఖిలేతిహాసంబులందు సారం బైన
యాకాశజాఖ్యాన మధిప వినిన
వారలు నిత్యజీవన్ముక్తు లై పొల్తు.
రిట్టిజీవన్ముక్తుఁ డెవ్వఁ డనిన

పరఁగ రాగద్వేషభయముల కనురూప
మై చరింపక లోన ననుదినంబు
నాకాశమునుబోలె నతిస్వచ్ఛ మగు నెవ్వఁ
డతఁడు జీవన్ముక్తుఁ డనఁగఁ బరఁగుఁ;

గీ. తనరునఖిలార్థజాలంబులను జరించి
యెల్ల కార్యంబులందును జల్ల నగుచుఁ
బోరిఁ బదార్థంబులందును బూర్ణుఁ డెవ్వఁ
డతఁడు తన్ముక్తుఁ డన నొప్పు నమలచరిత. ౩౭.

వ. అట్టిజీవన్ముక్తుండు కాలవశంబునం దనశరీరంబు విడిచి జీవాత్మస్వరూపంబు నెడలి పరమాత్మయందుఁ బొందు నది విదేహముక్తి యనంబడు. నప్పరమాత్మ యెట్టి దనిన, జీవస్వరూపం బగుచిత్తునకుఁ జైత్యోన్ముఖత్వంబు గలుగునప్పుడ యది చిన్మయంబును నమలంబును శాంతంబును నగుపరమాత్మస్వరూపం బని యాకాశజోపాఖ్యానంబు బహుప్రకారంబుల సవిస్తరంబుగా నెఱింగించి, వసిష్ఠుండు రామచంద్రుం గనుంగొని 'యీయాఖ్యానంబునందుఁ బరమాత్మ మాయామనోరూపం బై జగత్తుల సృజియించుట వర్ణింపఁ బడియె. నింక నమ్మాయను బహుదుర్ఘట హేతుత్వంబును, జగత్తునకు మాయికత్వంబును, విదితం బగులీలోపాఖ్యానం బెఱిఁగించెద సావధానుండ వై వినుమ' ని యి ట్లనియె. ౩౮.

## లీలోపాఖ్యానము.

క. ఇలఁ బద్మకుఁ డనుభూపతి
గలఁ డాతనిభార్య లీల కాంతామణి, యా
లలన గడు భక్తి వానిం
బొలుపుగఁ గొలువంగఁ దనకుఁ బొడసూపుటయున్. ౩౯.

వ. అద్దేవికిం బ్రణమిల్లి యి ట్లనియె. ౪౦.

గీ. వాణి, నాకంటె మున్ను నావరుఁడు తనువు
విడిచెనేనియుఁ దజ్జీవుఁ డెడలిపోక
నొగి నిజాంతర్గృహంబున నుండునట్లు
వరము గృపసేయు మొకటి శాశ్వతము గాఁగ. ౪౧.

వ. మఱియు నేను మత్పతినిమిత్తంబై యెప్పుడు నినుఁ జూడ వేఁడెద నప్పుడు నాకుం బొడచూపునట్టివరంబునుం గా నీరెండువరంబులు నొసంగుము.—అని ప్రార్థించిన నట్ల యగుంగాక యని మఱియు నద్దేవి యిట్లనియె. ౪౨.

ఉ. నీపతి మేను వాయునెడ నెయ్య మెలర్పఁ బ్రసూనమంటప
స్థాపితుఁ జేసి పుష్పములు దట్టముగాఁ బయి నింప నంగకం
బే పరి పోక పుష్పములు నొడక క్రమ్మఱ నీకు భర్తయై
ప్రాపగు నాత్మగేహమునఁ బాయఁడు జీవుఁడు దా వియత్ప్రిభర్త.

క. అని చెప్పి వాణి చనుటయు
మనమున హర్షించి లీల మఱికొన్నేండ్లుం
జనఁ దత్కాలంబునఁ దన
పెనిమిటి మృతుఁడైనఁ జూచి బెగ్గిలక ధృతిన్. ౪౪.

క. భారతి చెప్పిన విధమున
నారాజుఁ బ్రసూనమంటపాంతఃస్థునిఁ గా
జేరిచి పైఁ బుష్పంబులు
బోరనఁ గుప్పించి శోకపూరితమతి యై. ౪౫.

వ. సరస్వతిం దలంపఁ దత్క్షణంబ చనుదెంచిన నద్దేవిపాదంబులపైఁ గన్నీరు దొరంగం బ్రణమిల్లి గద్గదకంఠి యగుచు నిట్లనియె. ౪౬.

శా. తల్లీ భారతి మద్విభుండు మృతుఁడై తా నేఁగె నీచెప్పిన
ట్లల్లం జేసితి; నాతఁ డెం దఱిఁగెనో? యెచ్చోట నున్నాఁడో? నా
యుల్లం బానృపుఁ బాసి యోర్వఁగలదే? యొం టెట్లు వేగింపుదున్?

జెల్లంబో నను జీవి తేశుకడకుం జేర్పించి రక్షింపవే. ౪౭.

వ. అని విలపించుచున్న యప్పరమసాధ్వి నూఱడించి వాణి యిట్లనియె.

క. రాకాశశిముఖి, విను చి
త్తాకాశం బనఁగ మఱి చిదాకాశము నా
నాకాశం బనఁ ద్రివిధం
బై కర మొప్పారు, నవి నిరాకారము లౌ. ౪౮.

వ. అట్లు గావున నివి యాకాశశబ్దవాచ్యంబు లై యుండు. నందు దక్కి-
న రెంటినిం బొరయక నెద్ది వెలుంగు నది చిదాకాశం బని యెఱుంగు.
మవి పరస్పరవిలక్షణంబు లై యుండు నె ట్లనిన బుద్ధియందు వికార
స్ఫూర్తియు,నాకాశంబున జాడ్య పరిపూర్ణతయుం,గలిగి యుండు.
నందును రెంటినిం బొరయక చిదాకాశంబు వికారజాడ్యంబులు దొ
ఱంగి స్ఫురత్స్ఫూర్తులు గలిగి యుండు. మఱియు నాసంవిత్స్వరూ
పంబునకును. ౫౦

క. దేశముననుండి వేఱొక
దేశంబును బొందునపుడు తిర మై నడు మే
దేశము లే కునికి చిదా
కాశం బని యెఱుఁగు మాత్మఁ గమలదలాక్షీ. ౫౧

క. అందును సంకల్పాదుల
నెందును నెడఁబాసి పొంది తేనియుఁ బరమా
నందు సకలాత్ము శాంతుం
బొందెదు సంశయము విడుము పూర్ణేందుముఖీ. ౫౨

గీ. అఖిలదృశ్యంబు లెడఁబాసి యందుఁ బొందుఁ
గాని యొండువిధమ్మునఁ గానఁబడఁడు,
మద్వరంబునఁ జేసి నీమగనిఁ గాంచె
దతివ శీఘ్రంబ యవ్విధం బాచరింపు. ౫౩.

సీ. అని వాణి తనయింటి కరుగుటయును, నంత
లీల సేసెను వినిర్లేపబుద్ధి
బాహ్యకర్మంబులఁ బాసి శీఘ్రంబున
నిర్వికల్పసమాధినిష్ఠ నిల్చి,
రంజిల్లునంతఃకరణపంజరముఁ బాసి,
పరమాత్ముఁ బరిపూర్ణు నిరుపమాను
నిరుపాధికునిఁ బొంది నిఖిలంబుఁ గనుదివ్య
దృష్టి మైఁ దనపతిఁ దేఱిచూడఁ,

గీ. బరఁగ షోడశవత్సరప్రాయ మైన
భూమిపాలకుఁ డగుట నద్భుతముఁ బొంది,
వాణిఁ దలఁచిన నప్పొద్దె వచ్చి భద్ర
పీఠమున నున్నఁ గని మ్రొక్కి ప్రీతిఁ బలికె. ౫౪.

గీ. వాణి, యద్భుత మయ్యె; నావరున కెట్లు
సృష్టివలనన వేఱొకసృష్టి పుట్టె;
నేమి? యీజాగరభ్రమ నెఱుఁగవలయు
నానతి మ్మన లీల కిట్లనియె దేవి. ౫౫.

క. అతివా మృతిఁ బొందిన నీ
పతితో లుపుట్టువును దలఁప భ్రాంతియ; యిపు డీ
క్షితిపతి రెండవజన్మము
ధృతి నిట్టిద యివ్విధంబు దెలియఁగ వినుమీ. ౫౬.

వ. అది యె ట్లంటేని. ౫౭.

సీ. తనరుచిదాకాశమున నొకానొకచోట
సంసారమంటపస్థలము గలదు.
దానియం దొకగిరితటమువ నొక్కెడ
నొకయూర నొక్క విప్రోత్తముండు

భార్యయుం దాను నిర్భరలీల వసియించి
యుండె. నా బ్రాహ్మణుం డొక్కనాఁడు
శైలసానుస్థితశాద్వలతలమునఁ
బొలుచునిష్ఠత నుండ, భూధరంబు

గీ. క్రింద సౌభాగ్యసంపద లంద మొంద
సకలసేనాసమన్వితప్రకటలీల
మెఱసి మృగయానురక్తుఁడై మెలఁగుచున్న
మానవేంద్రునిఁ జూచి విస్మయము పొంది. ౫౮.

క. చింతించె విప్రుఁ డీభూ
కాంతునిసౌభాగ్యమహిమ గడు నొప్పు. నయో
సంతసమున దిగ్వలయం
బంతయు నే నెప్డు రాజనై యేలుదునో? ౫౯.

వ. అని చింతావృత మానసుం డై యమ్మహీసురుండు పంచత్వంబు నొంది పద్మభూపాలుం డై జనియించె. నా బ్రాహ్మణి శరీరంబు విడిచి లీల యనుపేర నీవ వై యుదయించితివి. మీ రిరువురు మృతు లై యష్ట మదివసంబు వర్తిల్లుచున్నది; యిచ్చట డెబ్బదియేండ్లు రాజ్యసుఖంబు లనుభవించితి. రిప్పుడు పద్మభూపాలుండు కాలగోచరుం డగు ప్రథమ దివసంబున నయ్యూర్ధ్వభూపతికి షోడశవర్షంబు లయ్యె నని వాణి మఱియు ని ట్లనియె. ౬౦.

క. ఆవనితయు మును నీగతి
వావిరి ననుఁ బూజసేసి వరయుగళంబుఁ
దా వేఁడెఁ బ్రియునిజీవము
వే విడిచియు నిజగృహంబు వెడలక యుండన్. ౬౧.

వ. ఇట్లు గావున మీ యిరువుర సర్వసంసారమును నా బ్రాహ్మణి మంట పంబునంద యున్నయది. పునర్జాతుం డగుభూపతిసంసారంబు భవ

ద్గృహంబునం దున్నయది. యని చెప్పిన విస్మయం బంది లీల యి ట్లనియె. ౬౨

క. అక్కట విప్రునిజీవం
బెక్కడ నెచ్చోట నున్న? దే మెక్కడ? నీ
దిక్కులు గిరులును భూమియు
నెక్కడ మాయింట నణఁగె? నిది మిథ్య సఖీ. ౬౩.

సీ. సర్షపకోటరస్థలి మదాంధం బైన
దేవతాగజము బంధింపఁబడియె;
నణువులోపల మహాహర్యక్షసమితి దాఁ
బోరి నొక్కదోమచేఁ బోరలఁబడియె;
కమలబీజములోనఁ గనకాద్రి యుండంగ
భృంగపోతము చేత మ్రింగఁబడియె;
ననినట్లు పొసఁగనియనృతోక్తు లెట్లండి?
తనవుడు లీల కి ట్లనియె దేవి;

గీ. మెఱయ నామాట లెందును మిథ్య గావు
వినుము మన చేత నియతిభేదనము సేయఁ
బడదు దనయూర నాత్మీయభవనమునన
నుండు నావిప్రుజీవాత్మయును లతాంగి. ౬౪.

వ. అమ్మహారాష్ట్రం బాకాశరూపంబు గావున నాకాశాత్మం డైన యతం డంద యుండి చూచుచుండు నట్లు గావున. ౬౫.

గీ తరుణి మాయిద్దఱకుఁ దొంటితలఁపులందు
మఱపు జనియించి వేఱ సంస్మరణ వొడమెఁ.
గలల జాగ్రదవస్థల తలఁపు లెట్టు
లట్ల మరణంబు మర్త్యుల కంబుజాస్య. ౬౬.

గీ. అరయ సంకల్పముకురంబునందుఁ బోలెఁ

పొరిఁ జిదాకాశకోశకోటరమునందు
భూము లంతఃస్థితంబు లై పొలుపు మిగులు;
నని యెఱుఁగుము మనమున వనజనయన. ౬౭

వ. ఎట్లనినం బరమాకాశరూపం బగుచిదాత్మయందుఁ దద్రూపం బగు
మనంబున జగత్తులు ప్రతిభాసాత్మకంబు లై యుండును. అనిన విని
లీల యి ట్లనియె. ౬౮.

క. జననీ, యావిప్రుఁడు చని
యెనిమిదివసంబు లంటి; విచటను మాకుం
జనియెను సప్తతివర్షము;
లెనయఁగ నె ట్లయ్యె? దీని నెఱిఁగింపు తగఁ. ౬౯.

సీ. అన విని దేవి యి ట్లనుఁ. బ్రతిభాస మా
కంబె నొందును దేశకాలదైర్ఘ్య
ములు లేవు చిద్రూపమున. కట్టి ప్రతిభాస
తీరు సెప్పెద, విను ధీరహృదయ.
జీవుండు మరణమూర్ఛావస్థ లట్టొంది
తెలివొంది తొల్లిటితలఁపు లుడిగి
యన్యభావము నొంది యాధేయమానిది
యాధారమం దున్కి హస్తపాద
గీ. సహిత మీ మేను గలయది; జనకునకును
సుతుఁడు; నా కిట్లు సౌకర్యహితులు వీర,
లిది మదీయాస్పదం బనునిట్టిభ్రాంతిఁ
దొడర వేగంబ జగములు దోఁచుచుండు. ౭౦.

వ. అనిన విని లీల యి ట్లనియె. ౭౧.

క. పరమేశ్వరి, నీచేతం
బరమజ్ఞానంబు గానఁ బడసితి. నాథా

సురమిథున మున్న సర్గకు
గురుదయ నను వేగఁ దోడుకొని పొ మ్మనుడున్. ౨౨.

వ. అమ్మహాదేవి యి ట్లను నపరంబును భావంబును నగుచైతన్యచిద్రూపక మగునట్టి స్థితి సంహరించి నిర్మలస్వరూపవు గమ్ము; అట్లేని నిరర్గళంబున మనకు నచ్చటు చూడ నగు; నద్దర్శనంబునకు శరీరంబు మహార్గళంబు గావునం జిత్తస్వరూపం బగునాధిభౌతిక దేహంబు తద్ధ్యానంబున మముబోంట్లచేతఁ జిరవాసనలవలన గ్రహింపంబడు నవ్వాసనాణుత్వం బెప్పు డగు నప్పుడే యీశరీరంబునందు నాతివాహికత్వంబు నొందు నీహారంబు తపనతాపంబున నుదకం బైనట్లు శుద్ధసత్త్వానుపరత్వం బగుచిత్తతనువాసన యాతివాహికం బగు ననిన విని లీల యి ట్లనియె. ౨౩.

క. ఈయర్థమునందు సుఖా
శ్రా యాభ్యాసంబురూపు చను నెట్టిద కా
నేయనువున వర్ధిలు నది
పాయక వర్ధిలఁగ నేమి ఫల మగుఁ దల్లీ. ౨౪.

వ. అనిన విని సరస్వతి లీల కి ట్లనియె. ౨౫.

గీ. తత్త్వచింతనంబుఁ దత్కథనంబు న
న్యోన్యబోధనంబు నొగిఁ దదేక
పరతయును ననంగఁబడు నివి యభ్యాస
మంద్రు తత్త్వవేదు లమలహృదయ. ౨౬.

గీ. దృశ్యములసంక్షయంబును దెలియఁ జేసి
పరఁగ రాగాదివికృతులఁ బలచఁ జేసి
చెలఁగి యుపరతి నుదయింపఁ జేయు నెద్ది
యదియ బ్రహ్మానుసంధాన మనఁగఁ బరఁగు. ౨౭.

సీ. అని యిట్లు చెప్పి శా. నమ్మహానిశయందు

నతులితయోగసమాధినుండి
జ్ఞానదేహముతోడ శారద యక్లేఁగఁ
దరుణియు మానుషతనువు విడిచి
దివ్యకాయముఁ దాల్చి దివి నుండి యిరువురు
నలరు బ్రహ్మాండమండలముఁ బాసి
యటు పోవ నొకశైలతటమున నొకగ్రా
మమునందు నొకవిప్రమంటపంబు

గీ. గని యదృశ్యాంగు లయి యటఁ గదలి వేగ
నరిగి రెండవసగమంబునందుఁ బొంది
పువ్వుఁబానుపుపైఁ బద్మభూమిపాలు
శవముతో నొప్పు మంటపస్థలము గనిరి. ౭౮.

క. కని యోగస్థితి నొందియుఁ
జను దెంచి నిజేశుఁ డున్నసదనంబునకున్
మన మలర దివ్యయోగిని
వనితామణి లీల వేడ్క వాణియుఁ దానున్. ౭౯.

గీ. ఇట్లు చనుదేరఁ దత్పతి యెదురు వచ్చి
యమ్మహాదేవి కెఱఁగి పాదాంబుజంబు
లందుఁ బుష్పంబు లర్పించి యచలభక్తి
మ్రోల నిలుచున్న యాభూమిపాలుఁ జూచి. ౮౦.

క. జననాయక నీతొల్లిటి
జననము మదిఁ దలఁపు మనుచు శారద దయ నా
తనిశిరమునఁ జే యిడ న
మ్మనుజేంద్రున కంత హృదయమాయ దొలంగెన్. ౮౧.

వ. ఇట్లు మనోగతం బయినమాయ యాక్షణంబ పాసి తనపూర్వజన్మవృ
త్తాంతం బంతయు మనంబునఁ దోఁచిన నచ్చెరు వొంది యవ్విదూర

విభుఁ డాత్మగతంబున 'నోహో యతివిస్మయం బగుసంసారమా
య యిమ్మహాయోగినులకతంబున నాకుం బరిజ్ఞాతం బయ్యె' నని
పలికి వారలం గనుంగొని ముకుళితకరకమలుం డయి యి ట్లనియె.

క. వనజాక్షులార వినుఁ డీ
తను వెడలినదినమునకును దగ షోడశహా
యనము లయి పెక్కుగార్యము
లును బంధులు మిత్త్రగణములును దోఁచె మదిన్. ౮౩.

వ. అనిన విని వాణి యి ట్లనియె. ౮౪.

సీ. ఊహింప మృతిమహామోహమూర్ఛానంత
రంబున నీ కిట్లు రాజబుధభ
యాలోకమును బాసి యమ్ముహూర్తమునను
నాయింటిలోనను నలఘుసగన్
విభ్రమం బుదయించె. వేఱె యాకాశని
ర్మల మైనయట్టి యామనమునందు
విలసిల్లు వ్యవహారవిభ్రమకృత మైన
యీప్రతిభాస నీ కిచటఁ బుట్టెఁ.

గీ. బరఁగఁ బదియాఱువర్షాలప్రాయ మగుట
తలఁపఁ గలలోన నొక ముహూర్తంబునందు
వర్షశత మగు నేమాయవలన నెట్ల
నదియ యీజాగరభ్రాంతి యని యెఱుంగు. ౮౫.

మ. పరమార్థంబునఁ బుట్టుట ల్మడియుటల్ భావింప లే వెన్నఁడున్,
నిరుపాధిస్థితిశుద్ధబోధమయ మై నీయందు నీ వుండితి,
ట్టిరువారన్ సకలంబు గన్గొనుచు నొం డీక్షింప నొక్కింతయున్,
బోరి సర్వాత్మతఁ జేసి నీవ జననంబుం దాల్తు నీయం దొగిన్. ౮౬.

క. వితతపదార్థారాధ్యుఁడు

నతిజడుఁడు విశుద్ధమతియు నగు నాతనికిఁ
ధృతి సత్తు గాని జగములు
మతి దృఢమై వజ్రసారమయ మగు ననఘా. ౮౭.

వ. మఱియు బాలునకు బేతాళుండు మరణాంతదుఃఖం బొనరించునట్లును, మృగంబుల కెండమావు లుదకంబై తోఁచునట్లును, మూఢునకు నసత్తయినజగంబు సదాకారంబై దుఃఖం బొదవించుచుండును. కనకం బెఱుంగనివానికిఁ గనకమయం బగు కటకంబు కటకం బనుబుద్ధియ కాని హేమం బని యెఱుక లేనియట్లు పురాగారనగరనరేంద్రభాసురం బగు నీ ప్రపంచంబునందుఁ బ్రపంచం బనుబుద్ధియ కాని పరమాత్మబుద్ధి పొడమనేరదు అహంకారయుక్తం బగునీవిశ్వంబు దీర్ఘస్వప్నం బని యెఱుంగుము. ఈజాగరభ్రాంతి కలలయందుఁ దోఁచిన పురుషులయట్ల యని యనేక దృష్టాంతంబు లుపన్యసించి భారతి మఱియు నిట్లనియె ౮౮.

సీ. సర్వగతంబును శాంతంబుఁ బరమార్థ
ఘనమును శుచియును ననుపమంబు
నాతతంబును బరమానందమును జైత్య
చిన్మాత్రతనువు నచింత్యతమము
సర్వగతము సర్వశక్తియు సర్వాత్మ
కంబును దాన యై గలిగియుండు
నెక్కడ నెక్కడ నెబ్బంగి నుదయంచు
నక్కడ నీరూప మగు నృపాల;

గీ. నీవు లీలార్థ మిట్లు వర్ణింపఁ బడితి;
తివిరి సిద్ధాంతదృష్టిని దృష్ట మయ్యెఁ.
బోయి వత్తుమె నీకు నభ్యుదయ మనుచు
వనిత లిరువురు నరిగిరి మనుకులేశ. ౮౯.

వ. అని చెప్పి మఱియు వసిష్ఠుం డి ట్లనియె. నప్పరమయోగినులు చనిన యనంతరంబ యొక్కభూపాలుం డనేకబలసమన్వితుం డై చనుదెంచి విదూరపురంబుపై విడిసి యుద్ధార్థి యై పిలిపించిన నతండును జతురంగబలసమేతుం డై పురంబు వెలువడి తలపడిన నుభయబలంబులకుఁ బోరు ఘోరం బయ్యె నట్టియెడ. ౯౦.

శా. ఆరాజన్యు లుదగ్రు లుగ్రగతి నన్యోన్యప్రహారార్థు లై
వీరానీకము విచ్చలింపఁగ భుజావీర్యం బవార్యంబుగా
క్రూరాస్త్రంబుల నొండొరుం బొదవి దిక్కుల్ వ్రయ్యఁ బెల్లార్చుచుం
బోరాడంగ విదూరుఁ డీల్గె నపు డాభూమీశుచే భూవరా. ౯౧.

వ. ఇట్లు పడిన యతనిజీవరేఖ విద్యుల్లేఖయుం బోలె గగనంబున కెగయుట గనుంగొని సరస్వతి లీల కి ట్లనియె ౯౨.

ఉ. కోమలి యిప్పు డిట్లు మనకుం బ్రతిపత్తి యొనర్చి భూవర
గ్రామణి యివ్విదూరుఁ డిటు గయ్యమునం బగవారిచే మృతుం
డై మహి వ్రాలెఁ గం టె యది యక్కట యాతనిజీవరేఖ సౌ
దామనివోలె నెచ్చటికిఁ దా రెడునో చని చూచి వత్తమే. ౯౩.

వ. అని యయ్యిరువురు నత్తేజంబు వెనుచన నదియు ననేకసగరపరంపరలఁ బరిభ్రమించి మఱియును. ౯౪.

ఉ. కొండలు నబ్ధులు న్నదులుఁ గోన లసంఖ్యము దాఁటి చివ్వియ
న్మండల మూఁది యచ్చట వనంబు ఫలంబులుఁ బోలెఁ బేర్చి యొం
డొం డొరువర్తనం బెఱుఁగకుండఁ జరించుచు నున్న యట్టి బ్ర
హ్మాండసముచ్చయంబు లొకయబుఁసంఖ్యలు చూచి యవ్వలన్.

క. వివిధమణిగోపురంబుల
వివిధావరణముల నధికవిభవం బై యా
దివిజేంద్రుపట్టణముగతి
భువిఁ బెంపగుచున్నపద్మపురి వెసఁ జొచ్చెన్. ౯౫.

గీ. అట్లు సొత్తెంచి యిప్పురియంతరముల
జీవుఁ డల్లిల్లు వెసఁ జొచ్చి పోవఁబోవ
వెలఁది జోడును విడువక వెంట నరిగె
సూదిపిఱుఁదన చను దారముసూత్ర మట్ల. ౯౭.

వ. ఇవ్విధంబునఁ జనిచని యత్యంతరమణీయం బగు రాజమందిరంబు ప్రవే
శించి. ౯౮.

ఉ. మూడుగుక్కేవ సోమమణిమంటపముం గని దానిలోన్నెపై
వాడనిపుష్పఁజప్పర మవారణమై వెసఁ జొచ్చి యచ్చటన్
బాడఱి పాన్పుపైఁ బడినపద్మని దేహముఁ బొందె జీవుఁ డా
చేడెలు చూడ మేఘమును జెందినతీఁగె మెఱుంగుచాడ్పునన్. ౯౯.

క. ప్రాణమునఁ గూడుకొని త
ద్ఘ్రాణద్వారమున జీవకళ వికసించెన్
వేణుద్వారమున జగ
త్ప్రాణుఁడు విహరించునట్లు భానుకులేశా. ౧౦౦.

వ. ఇట్లు జీవకళ ప్రవేశించిన సర్వాంగంబులు కాంతియుతంబులు రసవం
తంబులు మృదులంబులు నయి యొప్పె నప్పుడు. ౧౦౧.

ఉ. మోము వికాస మందఁ, గరముల్ గదలించుచుఁ, గాళ్లు సాచి, యి
ట్లా మెయి ప్రక్కగాఁ దిరిగి, యల్లన నీల్గుచు నావులించెఁ, గెం
దామర రేకులట్ల జిగిదారెడుకన్నులు విచ్చి సూచి యా
భూమివిభుండు మేల్కనియెఁ బోల్పగు జంగమవిద్య యో యనన్.
వ. ఇట్లు మేల్కని గంభీరవాక్యంబుల నిది యెక్కడ నని పల్కనాభూ
పాలుం గనుంగొని. ౧౦౩.

క. కిలకిల నవ్వుచుఁ గన్నులు
తళతళ వెలుఁగొంద మోముఁదామరసొబగై
పలపలనినడుము నసరఁగ

కలకల నై వచ్చె లీల కాంతునికడకున్. ౧౦౪.

వ. ఇవ్విధంబునఁ జనుదెంచి తద్వృత్తాంతం బంతయు నెఱింగించిన నతం
డచ్చెరు వొందుచుండె నంత సరస్వతి యమ్మహీపాలునకుఁ బరమజ్ఞా
నోపదేశంబు చేసి నిజేచ్ఛ నరిగెఁ. బద్మభూపాలుండు లీలయుం దాను
ను జీవన్ముక్తులై యెనుబదివేలయేండ్లు రాజ్యసుఖంబు లనుభవించి,
పదంపడి దేహవిముక్తు లయి దివంబునకుం జని రని లీలోపాఖ్యానంబు
సవిస్తరంబుగా నుపన్యసించి వసిష్ఠుండు రామచంద్రున కి ట్లనియె.

క. కానఁబడు నీప్రపంచము
లీనం బని లోకులకుఁ దెలియ 'లీలోపా
ఖ్యానము' చెప్పితి మదిలో
నీ నిఖిల మతథ్య మని గణింపు కుమారా. ౧౦౫.

సీ. పరమ మధ్యాత్మంబు బ్రహ్మ మనాభాస
మతిశుద్ధపద మంచితాత్మకంబు
శాంత మద్వైతంబు సత్య మనంతంబు
సత్త్వ మానందంబు శాశ్వతంబు
నతుల మనిర్దేశ్య మమల మచిహ్నితం
బతిశుద్ధ మనఁ గల దనఘ వినుము.
కరుడు లేనట్టిసాగరము చందంబున
నత్యంతగంభీర మై వెలుంగు

గీ. నదియుఁ బరమాత్మ ; దేహంబులందుఁ బొంది
పరఁగ నిర్వాతదీపంబుభంగిఁ దనరు
నదియ జీవాత్మకళ; యని యాత్మ నెఱుఁగు
ప్రకటవిజ్ఞానగుణసాంద్ర రామచంద్ర. ౧౦౬

గీ. అదియ సంసారవాసన లగ్గలించి
క్రమము దప్పక ఘన మహంకార మయ్యె,

నణువుగతి సూక్ష్మమై పొల్చునగ్నికణము
బహుళతరకాష్ఠములచేతఁ బ్రబలినట్లు ౧౦౮.

వ. అయ్యహంకారంబు చేతనంబు మనంబు మాయ ప్రకృతియు నను బహునామంబులు గలిగి యుండు. నట్లు గావున నింతటికిం గారణంబు మనంబ తన్మనంబున జగంబులు విస్తరిల్లు మఱియును. ౧౦౯.

క. పారంబు లేనిసంవి
త్పారావారమునఁ దోఁచు భంగంబులయ
ట్లారూఢి యై ప్రపంచము
నారయఁ దానై వెలుంగు నాత్ముఁడు వత్సా. ౧౧౦.

గీ. మనమువికృతియె సంసారమయము గాన,
సత్యమనఁ బోల దిది మహాస్వప్నమయము
నిజముగాఁ జూడ నేరక నిక్కమండ్రు,
కొఱడు గని మర్త్యుఁ డనుశంక గూరినట్లు. ౧౧౧.

గీ. అరయఁ బరమాత్మజీవాత్మ లైక్యమైన
యట్ల జీవాత్మ చిత్తమై యలరుఁ. దాన
చిత్తరూపంబు సృష్టియై చెలఁగుచుండుఁ,
గాన నంతకుఁ బరమాత్మ కారణంబు. ౧౧౨.

వ. ఈ యర్థంబున నొక్కయితిహాసంబు గలదు కర్కటి యను రాక్షసి మహాప్రశ్నంబు చేసె దాన నఖిలంబును దేటపడు; నాకర్ణింపు మనిన రామచంద్రుం డి ట్లనియె. ౧౧౩.

కర్కటికోపాఖ్యానము.

క. ఆరాక్షసి యెక్కడియది?
యేరూపున నెట్టిప్రశ్న లెవ్వరి నడిగెఁ ?
వా రెట్లు చెప్పి రుత్తర ?
మారయ నవ్విధము దెలియ నానతి యీవే. ౧౧౪.

వ. అనిన వసిష్ఠుం డి ట్లనియె. ౧౧౫.

ఉ. కాటుకగుబ్బలి న్నలిచి కాలుఁ దొనర్చిననక్రృత్తిరయో యనన్
బాటిగ నట్టహాసములఁ బాదవిఘట్టనలన్ మహాకుభృ
త్కూటము లెల్ల దొల్లఁగ నకుంఠితవృత్తి హిమాచలాంతరో
గ్రాటవులన్ జరించుచు నిశాటిని కర్కటి యుండు నిమ్ములన్. ౧౧౬.

సీ. అమ్మహారాక్షసి యొకఁటి కోర్వక
నవని జీవులఁ జంప నాత్మఁ గోరి,
యతిఘోరతపమున నబ్జజు మెప్పించి
శూలయుఁ బోలె విషూచి యనఁగ
ధరలోనఁ గలజీవతతి నెల్లఁ బెక్కేండ్లు
దయ లేక భక్షించి తనివి నొంది,
నిష్ఠ మై నింద్రియనిగ్రహంబున నిరా
హారయు నై యతిఘోరభంగి

గీ. జీవహింసయు మఱి రోసి చిత్స్వరూప
మాత్మ భావించి నిత్యసమాధి నిలిచి
తన్మయం బైనచిత్తంబు దరల నీక
ప్రీతి వేయేండ్లు తప మాచరించి మఱియు. ౧౧౭.

వ. ఇ ట్లత్యంతనిష్ఠురానుష్ఠానంబు లనుష్ఠించుచున్న కర్కటి కడకుఁ
గమలగర్భుం డరుదెంచి యి ట్లనియె. ౧౧౮.

క. నీతపమున కే మెచ్చితి,
చేతోవిశ్రాంతి గంటి, జీవన్ముక్తి
ఖ్యాతిఁ గయికొంటి, విలలో
నే తపములు నీతపమున కెనయే తరుణీ !. ౧౧౯.

క. ఈ కూ డుడిగినతపములు
నీ కేటికి సర్వశాంతి నెమ్మది నిగుడన్ ?

నాకూన వత్స కర్కటి
చేకొని యాహారచింత చేయుము నెమ్మిన్. ౧౨౦

వ. మూఢులను దురారంభులను దుర్వ్యసనులను దుర్దేశవాసులను వెదకి భక్షింపుము. అనుచు నిర్దేశించి చనుటయు బాహ్యకర్మంబులు మఱచి నిర్వికల్పసమాధి ననేక దివ్యవర్షంబు లుండెఁ. పెద్దకాలంబునకుఁ జిత్తచలనం బగుటయుఁ బూర్వస్మరణంబున బుభుక్షాతృష్ణలు వేల్పం దొణంగిన నొక్కనాఁడు. ౧౨౧.

ఉ. అచ్చపలాత్మ దొంటిగతి నాఁకటి కోర్వఁగలేక నొంటిమై
వచ్చునెడన్, విదేహజనవల్లభుఁ డన్నడురేయి మంత్రితో
నిచ్చలు వేఁట వచ్చి చరియింపఁగ, నవ్వనభూమిఁ గర్కశం
బచ్చుపడంగ వారిఁ గని యాచుచు నిట్లని పల్కె నుగ్రతన్. ౧౨౨

క. ఈశర్వరి నిద్దఱును దు
రాశలఁ జనుదెంచి నాకు నగపడితిరి; య
క్లేశత మీరక్తము లా
పోశనముగఁ బీఁచమణఁచి పుచ్చెద మిమ్మున్. ౧౨౩.

వ. కాదేని నాయడిగిన ప్రశ్నంబుల కుత్తరంబులు సెప్పి ప్రాణంబులు గాచికొం డని పల్కె, మఱియు నిట్లనియె. ౧౨౪

సీ. ఏకమై యుండి యనేకసంఖ్యలు గల
యణువులోఁ జెంది బ్రహ్మాండలక్ష
లంబుధిలో బుద్బుదాకారములభాతి
నుండఁగ నవకాశ మొదవునట్టి
యాకాశ మెద్ది ? దా నరయ నేమియు లేక
యించుక గలవస్తు వెద్ది గలదు ?
నడుచుచునుండియు నడువనివాఁ డెవ్వఁ?
డుండక నుండియు నుండు నెవ్వఁ?

గీ. డెనయఁ జేతన మంది దా నెవ్వఁ డయ్యె?
నరయ నెవ్వఁడు మింటఁ జిత్తరువు వ్రాసె
బీజముననుండి వృక్షంబు బెరసినట్లు
జగము నే యణువందు నిశ్చలత నుండు?. ౧౨౫.

గీ. కడలి కడ లొందుగతిఁ బృథగ్భాగ మయ్యు
నేక మగువస్తు వరయఁ దా నెద్ది యయ్యె?
ద్రవము నుదకంబు నొక్కటై తనరుభంగి
రెండుబలెఁ దోఁచి యొక్కటై యుండు నెద్ది?. ౧౨౬.

వ అని చెప్పి మఱియు నారాక్షసి యి ట్లనియె. ౧౨౭.

క. బంధురగతి నీప్రశ్నలు
సంధానము సేసి సెప్పఁ జాలిన యా ద
ర్పాంధులఁ నా జఠరాగ్నికి
నింధనములఁ జేసి పుత్తు నిరువుర మిమ్ము౯. ౧౨౮.

వ. అనిన విని వార లిరువురు నొండొరువుల మొగంబు సూచికొని యవ్వి
భుం డాత్మవిద్యాసంవేది గావున భయపడక మంత్రి కి ట్లనియె. ౧౨౯.

క. కర్కటి యనియెడి రాక్షసి
మర్కటి. యిది యడుగు పట్టిమాటలు మిగులం
గర్కశము లనక సంవి
త్తర్కములకు నుత్తరములు తగఁ జెప్పు మన౯. ౧౩౦.

వ. అనిన విని మంత్రి యి ట్లనియె. ౧౩౧.

గీ. కణఁగి వడ్లను పెరుగును గలుపుభంగి
నకటవికటంబు లగుప్రశ్న లడిగె నదియు;
మూావలము వోలె దీనిచేఁ జావ నేల
యూడుజోడుగఁ జెప్పెద నెఱిఁగినంత. ౧౩౨.

వ అని పలికి యారాక్షసిం గనుంగొని మంత్రి యి ట్లనియె. ౧౩౩.

క. కమలేక్షణ నీ వడిగిన
విమలప్రశ్నములు బ్రహ్మావిద్బోధకవా
గ్యము లతిదుర్లభములు విను
క్రమమున నన్నియును నేర్పుగతి వినిపింతున్. ౧౩౪.

సీ. అతీంద్రియములకు నందకసౌఖ్యమై
యాకాశసూక్ష్మమై యలరునట్టి
యాత్మాణువునను బ్రహ్మాండకోటులు పక్క
బుద్బుదంబులు వోలెఁ బుట్టు నణఁగు.
నాకాశ మయ్యు బాహ్యము లేమియును జేసి
యనవకాశము చిన్మయత్వ మగుట
నిది మిథ్థ మన రామి నేమియు లేదు. స
ద్వస్తుసంతతి కొంత దానె గలిగి

గీ. తత్ప్రకాశతఁ జేసి చేతనము నొంది
లలి నభేద్యుండు గాన శిలాత్వ మయ్యె;
నాత్మ యనునాకసంబున నఖిలజగము
తలఁపుమిషమునఁ దానె చిత్తరువు వ్రాసె. ౧౩౫.

గీ. అతనితలఁపున విశ్వంబు నయ్యెఁ గాన
విశ్వ మన వేఱె యొక్కటి వెదుక నేల?
నన్నియును దాన యగుఁ గాన నరుగఁ డెందు;
నాశ్రయము దాన యగు గాన నతఁడు గలఁడు. ౧౩౬.

వ. అప్పరమాత్మ దాన సద్రూపం బగుటం జేసి కలం డని చెప్పంబడు.
నని యెఱింగించిన యామంత్రి వాక్యంబులు విని సంతుష్టాంతరంగ యై
యారాక్షసి యతని కిట్లనియె. ౧౩౭.

క. నీ వఖిలతత్త్వవిదుఁడవు
గావున నీమధురవాక్యగతి నా భవముఁ

భావనత నొందెదనని యా
భూవరుఁ గని శాంతవచనముల ని ట్లనియెన్. ౧౩౮.

వ. మద్వాక్యంబులకుం దగినయుత్తరంబులు నీవునుం జెప్పుదు గాక యన
వుడు నా నృపాలుండు కకఁటి కి ట్లనియె. ౧౩౯.

సీ. జగములు లేమి నిశ్చయముగాఁ దెలిసిన
నేదేవుసుజ్ఞాన మెపుడు వెలుఁగు,
నఖిలసంకల్పసంన్యాసంబు నేసిన
నేదేవు మనములో నిడగ వచ్చు,
మెఱసి యేదేవునిమీఁలనోస్మిలనం
బుల సృష్టి యణఁగుచుఁ బొడము చుండు,
నఖిలవేదాంతవాక్యములకు నిష్ట మౌ
నందాఁక నేదేవుఁ డతిశయిల్లుఁ,

గీ. గోటికోట్యంతరంబులఁ గొమరు మిగిలి
దృష్టివిషయంబు గాక యేదేవుఁ డమరుఁ,
గివిరి సచరాచరంబు లేదేవు లీలఁ
బరఁగి వర్తిల్లు, నది పరబ్రహ్మ మబల. ౧౪౦.

గీ. వెలయ విశ్వాత్మకుఁడు నాఁగ విశ్వములును
దాన యయ్యును నొక్కఁడై తనరునట్టి
శాశ్వతబ్రహ్మచిన్మాత్రసత్యవాక్య
ఫణితి నీచేత వినఁ గంటి పద్మనయన. ౧౪౧.

వ. అని చెప్పుటయు. ౧౪౨.

క. వెన్నెలఁ గన్నకుముద్వతి
చెన్నున మేఘుంబుః గన్నశిఖిగతి మదిలోఁ
దన్నెఱుఁగని సంతసమున
నన్నరపతిఁ గాంచి దనుజ యలరుచుఁ బలికెన్. ౧౪౩.

ఉ. అక్కట యస్తమింపనివియన్మణిభంగిని మీ వివేక మిం
పెక్కె వెలింగె, మీకు సరియే బుధు లెందును? బుణ్యులార మీ
మక్కువతోడివాక్యముల మామకదుఃఖమనోభయంబులుం
గ్రక్కునఁ బాసె దీపశిఖఁ గ్రాఁగినచీఁకటిభంగి మీ దయన్. ౧౪౪.

చ. అనుడు నృపాలుఁ డిట్లనియె; నంగన నీవతిపుణ్యశీల, వీ
వనముల నుండ నేల ? తగువస్త్రవిభూషణగంధమాల్యముల్
దనియఁగ నీకు నిత్తు ; నతిదారుణరూపము మాని సౌమ్య వై
యొనరఁగ గొన్నివాసరము లుండుము నాకడ నున్నతస్థితిన్. ౧౪౫.

వ. అట్లని చోరులను బాపకర్ములను రాజద్రోహులను నీకు భక్ష్యంబుగా నిచ్చెద. వారల హిమవత్పర్వతప్రాంతంబునకుఁ గొనిపోయి భుజియించి సుఖం బుండు మని పలికి యా భూపాలుండు నిజమంత్రిసమేతుం డయి గృహంబునకుం జనియె. కర్కటియు రాజు సెప్పినట్లు ప్రాణులను భక్షణంబు సేయుచు నప్పటప్పటికిం జని హిమాచల శిఖరంబునఁ బరమసమాధి నుండె నని కర్కటివృత్తాంతంబు రామచంద్రునకుం జెప్పి వసిష్ఠుం డిట్లనియె. ౧౪౬.

క. ఈసూచితవృత్తాంతము
మాసరముగఁ జెప్పఁబడియె మనుజేశ్వర నీ
కీసంసారము చిత్తవి
లాసస్ఫురణమున నైన లక్ష్యము దెలియన్. ౧౪౭.

క. రాగాదిదోషదూషిత
మై గహీనత మైనచిత్త మది సంసారం
బాగతిఁ బరిభ్రమింపమి
వేగమె భవబంధములకు విడుగడ గాంచున్. ౧౪౮.

వ. మఱియు నీ యర్థంబున సకలశ్రుతిభూషణంబును ననిందితంబును నగునొక్కయితిహాసంబు సెప్పెద. నందుఁ జిచ్ఛక్తిసముల్లాసంబునం

జన నిశ్చయం బగుటయుం జిత్తం బను బాలుండు ప్రపంచపిశాచం బుఁ గనుంగొని భయపడి ప్రబోధితుండై పరస్పరరూపం బని యెఱిం గిన చందంబునం దేటపడ నెఱింగించెద, నాకర్ణింపు. మని వసిష్ఠుం డు రామచంద్రున కి ట్లనియె ౧౭౯.

క. ఇంద్రుఁడు నా నొకవిప్రుఁడు
సుందరియును దాను నాత్మశుద్ధిసమాధిం
జెంది రజతాద్రితటమున
నిందుధరుం గూర్చి తప మహోన్నతిఁ జేసెన్. ౧౮౦

గీ. అట్లు తపము సేసి యద్దేవువరమునఁ
బుత్త్రదశకలబ్ధి బొంది, కొంత
కాలమునను వారు కాలగోచరు లైన,
నక్కుమారు లెందు దిక్కు లేక. ౧౮౧

వ. చింతాక్రాంతు లై యొండొరులం గూడుకొని యందఱు నగ్రజుకడ కుం జని యి ట్లనిరి. ౧౮౨.

సీ. ఏమిసేయుద మింక ? నేది కార్యము మన?
కెవ్వరు గల రిందు? నెందుఁ బోద?
మీదుఃఖములఁ బాసి యెబ్భంగి సుఖయింత?
మని తన్ను నడిగిన; నతఁడు మీకు
నెట్టిది మది కించు నట్టిది వర మిత్తు
నడుగుడు మీ రన్న; నాత్మఁ బొంగి
యచ్చట నొకయూరియధికారిఁ బొడగని
యాతనిసంపద యడుగ; నదియు

గీ. నెంతపని యన్న; వారు సామంతపదవి
యడుగ; నది యేల యన్న; వా రవని నేలు
రాజసంపద వేఁడ; నారాజ్య మెంత

యనిన ననుజన్ము లందఱు నన్న కనిరి. ౧౫౩.

వ. అ ట్లేని మాకు నఖిలరాజలోకశాసనుం డగురాజు సామ్రాజ్యపదంబు
గృపసేయు మనిన, నదియు నశ్వరం బేటికి? ననిన, వా రింద్రత్వం బడు
గుటయు నతండు. ౧౫౪.

గీ. తగఁ బ్రజాపతికిని ముహూర్తంబు సనిన
నింద్రసంపద చెడిపోవు, నేల మీకు?
ననిన వారలు మాకుఁ గల్పాంతములను
జేటు లేనట్టిగతి గృపసేయు మనిన. ౧౫౫.

వ. వారికి నగ్రజుం డిట్లనియె. ౧౫౬.

క. ఆకల్పాంతమునందును
బ్రాకటముగఁ జేటులేని బ్రహ్మపదంబుఁ
మీ కిచ్చెద నని పలికిన
నాకామరులు నన్నుఁ జూచి యని రుత్సుకులై. ౧౫౭.

వ. తండ్రీ మీవాక్యంబు లత్యంతయుక్తంబు లయి యున్నయవి; యప్ప
దం బెవ్విధిం బ్రాపింపఁ జెప్పవే యనిన నగ్రజుం డిట్లనియె. ౧౫౮.

గీ. అఖిలజగములు సృజియించునట్టి బ్రహ్మ
యేమ యనుబుద్ధి వెలిచింత లెల్ల మఱచి,
నియతిఁ బద్మాసనస్థులై నిలిచి చూచి,
తత్పదంబును బొందుఁడు తమ్ములార. ౧౫౯.

వ. అనిన వార లగ్రజువాక్యంబు లంగీకరించి యతండును దారును న
త్యంత నియతాత్ము లయి యొక్కపుణ్యనదీతీరంబునందు. ౧౬౦.

సీ. పద్మాసనస్థులై బాహ్యకర్మంబులు
మఱచి దేహంబులమమత లుడిగి
సకలేంద్రియంబుల సమతమై బంధించి
చిత్తంబు లొక్కటఁ జేసి నిలిపి

చింతలనెడఁబాసి యంతరంగంబులఁ
బరమాత్మతత్త్వంబు పదిలపఱిచి
యఖిలలోకంబుల నమరులఁ గల్పించు
బ్రహ్మల మే మనుభావనలను
గీ. దపము సేయంగఁ దొల్లింటితనువు లెల్ల
శీతవర్షాతపంబులఁ జివికి యెండి
జీర్ణపర్ణంబులట్లు విశీర్ణమైన
దివ్యదేహంబు లొంది భూదేవకులులు.                                        ౧౬౧.

చ. పదుగు కుమారులుం బదురు బ్రహ్మలరూపులు దాల్చి యెల్లెడన్
విదితము గాఁగ సృష్టులను వేఱె యొనర్చి సుఖించుచుండఁగా
మొదలిటిబ్రహ్మ వారిఁ గని ముక్కున వ్రేలిడి యాత్మ నద్భుతం
బొదువ శిరంబు లూఁచి వెఱపొందె రఘూత్తమ యేమి సెప్పుదున్.

వ. అని మఱియు ని ట్లనియె.                                        ౧౬౩.

క. చిత్తంబ కర్త సృష్టికి
చిత్తము జీవుండు గాక జీవుఁడు వేఱే ?
చిత్తంబ చేయును గ్రియల్
చిత్తవ్యతిరిక్తమైన చేఁతలు గలవే.                                        ౧౬౪.

వ. అది యె ట్లనిన, బ్రాహ్మణమాత్రుకు లగునైందవు లందఱు మనోభావన
బ్రహ్మరూపంబు దాల్చి సృష్టికర్త లయి వెలింగి రట్లు గావున. ౧౬౫.

గీ. దేహవాసన సేసినదేహి దాన
దేహబాధల సుడివడి తిరుగుచుండు ;
నాత్మవాసన సేసినయట్టియోగి
దేహ మిది మేలు కీ డని తెలియ నేచున్.                                        ౧౬౬.

వ. అనిన విని రఘుపుంగవుండు మునిపుంగవున కి ట్లనియె.                                        ౧౬౭.

క. దేహము జీవుఁడు వే ఱగు

టూహింప నతథ్య మైన, నొక్కటి వినుఁడీ;
దేహముసుఖదుఃఖంబులు
దేహికి ప్రాపింప కున్నె దివ్యమునీంద్రా ? ౧౬౮.

కృత్రిమేంద్రోపాఖ్యానము.

వ. అనిన వసిష్ఠమునీంద్రుం డీ యర్థంబున నొక్కయితిహాసంబు గల దాకర్ణింపు మని యి ట్లనియె. ౧౬౯.

క. ఇంద్రద్యుమ్నుం డనురా
జేంద్రుఁడు గలఁ డతనిసతి మదేభగమన స
న్మంద్రమృదువచన రాకా
చంద్రానన మదనమోహశర మన వెలయున్. ౧౭౦.

ఉ. ఆ సుదతీలలామ దనహర్మ్యతలంబున నిల్చి మానసో
ల్లాసము సేయుపట్టణవిలాసము సూచుచు నుండ, నయ్యెడన్
భూసురవర్యుఁ డొక్కవిటపుంగవుఁ 'డింద్రుఁడు' నాఁగ నొక్కఁ డా
సాసల వేశ్యవాటికలయందు రమించుచు నుండు నాతనిన్. ౧౭౧.

క. కని వానిపట్టుఁ బేరును
దన బోటులచేతఁ దెలిసి తరలేక్షణ నె
మ్మనమునఁ గోరిక తీఁగెలు
గొనసాఁగఁగ వానిఁ బొందఁ గోరుచునుండెన్. ౧౭౨.

వ. అంతట నొక్కనాఁడు. ౧౭౩.

ఉ. ఆ రమణీశుమ్రోల నితిహాసకుఁ డొక్కఁడు గోష్ఠి సేయుచున్
వారక యింద్రుఁ డొక్కమునివల్లభుభార్య నహల్యఁ దెంపునన్
జారత కోర్చి పొందిన ప్రసంగము చెప్పఁగ నామృగాక్షియున్
జేరువ వించునుండి దనచిత్తమునన్ దలపోసి యి ట్లనున్. ౧౭౪.

గీ. ఆతఁ డింద్రుఁ డే నహల్య నిద్దఱకును
బొందు గూర్చె మున్ను పుష్పశరుఁడు

పుణ్యకథలయందుఁ బొందుట సెప్పెడి
నింకఁ జిత్తశంక లేల నాకు. ౧౭౫.

వ. అని నిశ్చయించి ౧౭౬.

ఉ. ఆ తరలాక్షి యొక్కతెయ యానడురాతిరి పెక్కుమోసలల్
వే తఱియంగ దూరి యట వీథికి వెల్వడి సందిక్రంతగా
నాతని యిల్లు సొచ్చి ప్రియ మారఁగ వాఁడును దాను సంతత
ప్రీతి రమించుచుండె విపరీతగతిన్ భయ మేమి యెంతయున్. ౧౭౭.

వ. అంత నొక్కనాఁడు. ౧౭౮.

క. ఆ పట్టణంపుఁ దలవరు
లేపారఁగఁ బట్టి వారి నిరువురఁ గొని యా
భూపాలునొద్దఁ బెట్టినఁ
గోపంబున నృపతి వారిఁ గొట్టించె వెసన్. ౧౭౯.

వ. మఱియు ననేకవిధంబుల బాధింప వారల శరీరంబుల జర్జరితంబు
లయి రక్తధార లొలుకుచుండ మిసిమింతులు గాక కలకల నవ్వుచు
నానృపాలున కిట్లనిరి. ౧౮౦.

ఉ. ఈసునఁ జేయుకార్యముల నే మగు? నిద్దఱ నావలంతగాఁ
గోసిన నైన నొప్పియును గోపముఁ బుట్టదు దేహవాసనన్
బాసి మనోగతుల్ సురతభావనఁ గూడి రమించుచుండ నీ
చేసినచేత లెవ్వియును జిత్తము నొంపఁగ లేవు భూవరా. ౧౮౧.

క. ఇత్తరలాక్షికి నాకును
జిత్తము లేకముగఁ గలసి చిత్తజసౌఖ్యా
యత్తత నవ్వల నుండఁగ
నిత్తనువులబాధ మాకు నెఱుఁగఁగ నగునే? ౧౮౨.

వ. అది యెట్లనిన. ౧౮౩.

ఉ. చిత్తము కారణం బఖిలసృష్టికి, ప్రాఁకుల దీఁగెలన్ జలం

బత్తి రసస్వరూప మగునట్టివిధంబునఁ; జిత్త మవ్వలన్
మెత్తనిమేనితో మెలఁగ మేకొన నీ విటు రిత్త బొందులన్
గృత్తము సేయ నేల? పరికింపుము చిత్తవికారభావముల్. ౧౮౪.

ఉ. దేహ మణంగి పోయినను, దేహశతంబులు దా మడంగినన్,
మోహము సేయు నింతటికి మూలము చిత్తము; స్వప్నభూమిలో
నీహలు దీచుఁకొన్నయటు లిన్నియుఁ జిత్తలయంబు సేసినన్
దేహము వాసి పోవు జగతీవర దాఁపుము చిత్తరత్నమున్. ౧౮౫.

వ. అనవుండు. ౧౮౬.

క. పరమార్థామృత మగునా
యిరువురవాక్యములు విని మహీశుఁడు వారిన్
బోరి శిక్షించినవాఁడై
పురి వెడలఁగ నడిచి పుచ్చె భూవరముఖ్యా. ౧౮౭.

వ. ఇట్లు పురంబు వెలువడి యింద్రాహల్య లిరువురు నన్యోన్యప్రేమాతి
రేకంబునం గామోపభోగంబు లనుభవించి పెద్దకాలంబునకుఁ దనివి
సన దివ్యజ్ఞానసంపన్నులును నిత్యముక్తులు నై పరమసిద్ధిం జని రని
కృత్రిమేంద్రోపాఖ్యానంబు సెప్పి; వసిష్ఠుండు, సకలశరీరులకు శరీర
ద్వయంబు గలిగియుండు, నందు మనశ్శరీరంబు క్షిప్రగతియు సదాచ
లనంబు నై యుండు, స్థూలశరీరంబు రక్తాస్థిమాంస నిర్మితంబు నై
యుండు, ననిన రఘునందనుం డిట్లనియె. ౧౮౮.

క. మన మతిజడము నమూర్తం
బును సంకల్పప్రభూతమును నగు నేరూ
పున దేహము ధరియించెను
వినిపింపుము మునివరేణ్య విస్తరఫణితిన్. ౧౮౯.

వ. అనిన విని వసిష్ఠుం డనంతంబును సర్వశక్తిమయంబు నగుపరమా
త్మునిసంకల్పంబు శక్తిఖచితంబు మనం బని బుధుల చేత వినంబడు

నీయర్థంబునం దొల్లి బ్రహ్మోపదిష్టం బగునొక్కయితిహాసంబు
గల దాకర్ణింపు మని యి ట్లనియె. ౧౯౦.

బ్రహ్మోపదేశము.

సీ. ఏదిక్కు చూచిన నెంచి నూఱామడ
వెడలుపు నిడుపు నై విస్తరిల్లు
చలిదుర్గ మైనమహాటవి నిర్జనం
బును భీషణంబు నై దనరు; నందు
వేయు నేత్రంబులు వేయుఁజేతులు మహా
దీర్ఘవిస్తృతము నై తేజరిల్లు
భీమకాయంబునఁ బెం పొంది యొకమహా
పురుషుఁ డయ్యడవి నెప్పుడు వసించి
గీ. యుండి, యాతండు తనబాహుమండలముల
పరిఘములు పెక్కు దాల్చి నిబ్బరము గాఁగ
మొనసి తనమేను చదియంగ మోఁదికొనుచుఁ
దనుపుగలయొక్క కదలికావనము సొచ్చి. ౧౯౧.

ఉ. అచ్చటనుండి దుష్టతర మైనకరంజవనంబు సొచ్చి తా
నచ్చట నొక్కనూతఁ బడి యంతన లేచి యరంటితోఁటకు
గ్రచ్చర నేఁగి మేను పెనుగాదలు గట్టఁగ వ్రేసికొంచుఁ ద
న్మెచ్చక యున్నవానిఁ గని మే గురుదాల్పఁగ నిట్లు పల్కెనా. ౧౯౨.

క. ఈ కాంతారములోపల
నేకాంతమ యున్నవాఁడ వెవ్వఁడ? వకటా
నీ కీవ యడుచుకొనియెద
వీ కటికతనంబు మానవే యని కరుణన్. ౧౯౩.

గీ. వ్రేసికొన నీక పట్టిన వ్రేటు లుడిగి
వాఁ డెలుం గెత్తి యేడ్వంగ, వలవ దనిన

మాని యొత్తిలి నవ్వుచుఁ దాన తనదు
బాహులను మేను ఖండించి పాఱవైచి. ౧౯౪.

ఉ. ఊరక యున్నఁ జూచి వెఱఁ గొందుచు నే నటు వోవ నొక్కచో
దారుణకాయుఁ డొక్కరుఁ డుదగ్రత నాతనియట్ల యంగముల్
ఘోరముగాఁగ మోఁదుకొనఁ గొంకక పట్టిన వాఁడు నన్ను ధి
క్కారము సేసి దుర్ద్విజుఁడ కాలులు సెప్పకు మంచు నుద్ధతిన్.

వ. ఒక్కమహాంధకూపంబునం దురికె. నతండె కాఁ డట్టిపురుషుల ననే
కులం బొడగంటి నని సెప్పి; యీయాఖ్యానతాత్పర్యంబు నీ కెఱిం
గించెద విను మని యి ట్లనియె ౧౯౫.

సీ. అయ్యరణ్యంబు దా నది మహాసంసార,
మాబుధుల్ మాన సౌఖ్యంబు, లతని
కరములు పరిఘలు పరఁగ ధీవృత్తులు,
ప్రహరణంబులు దుఃఖపాపవితతు,
లంధకూపము నిరయం, బరఁటులతోఁట
స్వర్గంబు, బహుకరంజములు మర్త్యుల్,
లెసఁగుశాస్త్రవివేక మేను వివేకింప
భోగశైథిల్య మై పొడముచిత్త

గీ. తాప మూతంపు సేయురోదనము, హాస్య
మాత్మసంతోష, మంగకత్యాగ మనఁగ
వృత్తినాశంబు, వాఁడు దుర్వృత్తి నన్ను
ధిక్కరించుట నాస్తికస్థితి యెఱుంగు. ౧౯౬.

వ. అని పితామహుండు తనకుఁ దొల్లి సెప్పినకథాక్రమం బెఱింగించి
వసిష్ఠుండు మఱియు ని ట్లనియె. ౧౯౭.

గీ. కోరి యాత్మవివేకంబు కొంత గలిగి
యమలనిర్వాణపదమును నంద లేక

భోగముల మాని తద్గతిఁ బొందఁ దివురు
నదియ పరితాప మనఁబడు నవనినాథ. ౧౯౯

క. జ్ఞానవివేకప్రాప్తుం
డై నిఖిలము విడిచి తన్మయత్వంబునఁ ద
న్మానసలయ మొనరించుట
యానందం బనఁగ నొప్పు నవనీనాథా. ౨౦౦.

క. చిత్తమ ప్రకృతియుఁ బురుషుఁడుఁ
జిత్తమ సంసార మగుట చింతించి తగన్
జిత్తత్యాగము సేసి న
రోత్తమ యానందపదము నొందుము నెమ్మిన్. ౨౦౧.

వ. అని చిత్తోపాఖ్యానంబు రామచంద్రున కెఱింగించి వసిష్ఠుండు మఱియు నిట్లనియె. ౨౦౨.

గీ. సర్వశక్తిమయము శాశ్వత మాపూర్ణ
మవ్యయంబు బ్రహ్మ మనఁగ బరఁగి
సర్వదేహులందు శక్తిస్వరూపమై
మనము వెలుఁగుచుండు జనవరేణ్య. ౨౦౩.

వ. ఎట్లనిన నది యాత్మకు నుల్లాసశక్తియు బ్రహ్మంబునకుఁ జిచ్ఛక్తియు వాయువునకు స్పందశక్తియు శిలలయందు దార్ఢ్యశక్తియు నుదకంబునకు ద్రవశక్తియు ననలంబునకు దాహశక్తియు నాకాశంబునకు శూన్యశక్తియు వినాశంబునకు లయశక్తియు నయి ప్రవర్తిల్లు. చిత్రవర్ణ పింఛశిఖండమండితం బగు మయూరంబు తదండాంతర్గతజలం బై యున్నయట్లు మూలవిటపశాఖాపత్రపుష్పఫలసమేతం బగు వృక్షంబు బీజంబునం దున్నయట్లు స్థూలసూక్ష్మరూపంబున విహరించుచుండు; మఱియును. ౨౦౪.

గీ. దేశకాలాదివైచిత్రిఁ జేసి ధరణి

సస్యములుపుట్టుగతి నాత్మశక్తి నొదవుఁ
గోరి యొకచోట నొకవేళఁ గొన్నికొన్ని
నిత్యసత్యుండు పరమాత్మ నిఖిలగతుఁడు. ౨౦౫.

ఉ. మోక్షము సర్వధర్మముల మున్కొని కన్గొను దృష్టి తాన యై,
యక్షయ మైనయీజగము లన్నియుఁ దాన సృజించి, యంతయున్
రక్ష యొనర్చు మానసము రాగిలెనేని, వికల్పుఁ జేయుఁ బ్ర
త్యక్షముగాదు బాలకులయాటలపాటలయట్ల రాఘవా. ౨౦౬.

వ. ఈయర్థంబున కొక్కయితిహాసంబు సెప్పెద నాకర్ణింపుము. ౨౦౭.

క. ఒకదేశంబున నొకపురి
నొకరాజవరేణ్యుదాది యొక్కతె యొకచో
నొకరాజకుమారునితో
నొకకథ వినిపించె మంజులోక్తులు వెలయన్. ౨౦౮.

వ. అది యె ట్లనిన. ౨౦౯.

సీ. అవనిలో నతిశూన్యమైనమహాపురి
నేపార నొక్కరా జేలు చుండు;
నతనికి ముువ్వురు సుతులు ధర్మాత్ములు
గల; రందు నిద్దఱుఁ గనదు తల్లి;
యొకఁడు గర్భములోన నుదయింపఁ డెన్నఁడు;
నట్టిముువ్వురు నవయౌవనముల
నిగిడి తా రున్నయానగరంబు వెలువడి
యాకాశవనమున కరిగి, యందుఁ

గీ. బూచి కాచి యొప్పు భూరుహచ్ఛాయల
విశ్రమించి యచట వేఁటలాడి;
రనుచు దాది సెప్ప నబ్బాలుఁ డక్కథ
నిజముగాఁ దలంచె నృపవరేణ్య. ౨౧౦.

క. ఉపలాలోక్తుల నాయమ
విపరీతపుఁ గథలు సెప్ప వినినట్లు సుమీ
కపట మగునీ ప్రపంచము
చపలం బని తెలిసి రామ శాంతుఁడ వగుమా. ౧౧౧.

క. సంకల్పమ సంసారము
సంకల్పమ చిత్తవికృతిజాలం బని ని
స్సంకల్పుఁడ వయి మానస
శంక లుడిగి దాని నణఁచి శాంతుఁడ వగుమీ. ౧౧౨.

వ. అని యెఱిఁగించి వసిష్ఠుండు రామచంద్రున కిట్లనియె. ౧౧౩.

## లవణోపాఖ్యానము.

క. తనసంకల్పవశంబున
ననయము భవపాశబద్ధుఁ డగుమూఢుఁడు దాఁ,
దనసంకల్పవశంబున
ననయము భవపాశముక్తుఁ డగుధీరుఁ డిలన్. ౧౧౪.

క. బుద్ధిఁ దలపోసి యంతయు
సిద్ధంబుగ మును పరిత్యజించితి వెందున్;
సిద్ధుఁడవు నీవు; కేవల
బద్ధునివలె వగవఁ దగునె భానుకులేశా? ౧౧౫.

గీ. ఆత్మతత్త్వం బనంతంబు నద్వయంబు
నిర్వికల్పంబు తాన యై నిండి యుండు;
మూఢుఁ డగుబద్ధుఁ డెవ్వఁడు? ముక్తుఁ డెవ్వఁ?
డన్నియును తన్మయత్వంబు లరసి చూడ. ౧౧౬.

వ. అట్లు గావున మనోవిలాసమాత్రంబు బంధంబును, మన శ్శమనంబు మోక్షంబు నగుఁ; దద్విలాసంబున గోష్పదంబు యోజన శతం బగు; క్షణకాలంబు బ్రహ్మకల్పం బగు. నీయర్థంబున నొక్కనిదర్శనంబు

నెప్పెద నాకర్ణింపు మని యిట్లనియె. ౨౧౭.

క. అవనికిఁ దొడవగు నొకపురి
లవణుం డను రాజు రాజ్యలక్ష్మీయుతుఁ డై
తివిరి యొకనాఁడు కొలువున
నవిరళగతి నున్న వేళ నాతనికడకున్. ౨౧౮.

క. తిలకంబును మసిబొట్టును
జిలిబిలిబడిని కెలవూస చేరులు దెలిగ
న్నులకాటుకయును గుంచెయు
బలుమందులు దనర నొక్కపాలుఁడు వచ్చెన్. ౨౧౯

వ. ఇవ్విధంబున శంబరుం డను నైంద్రజాలికుండు చనుదెంచి యారాజును
దీవించి సభామధ్యంబున నిలిచి కొండొకసేపు నిమీలితాక్షుం డై.

క. చప్పట్లు వెట్టి చేతులు
విప్పుచు మంత్రించి కుంచె విసరుచు రాగం
బొప్పఁగ మొగసిరిఁ గాటుక
గప్పినకనుఁగవలఁ గొలువు కలయఁగఁ జూచెన్. ౨౨౦.

వ ఇట్లు సూచుటయు నతనిమాయాజాలంబునం బడి తత్సభాజనంబు
నిశ్చేష్టితం బై సూచుచుండె. లవణభూపాలుండును జిత్రరూపుచం
దంబున గద్దియ నొరిగి నిశ్చేతనుం డయి ముహూర్తద్వయం బుండి
మేను చెమర్ప నదరిపడి భయభ్రాంతచిత్తుం డగుచు సభ్యులం గనుం
గొని యొకయాశ్చర్యంబు వినుం డని యిట్లనియె. ౨౨౨.

(ఆల్వార్కర.)

మీ రిందు శంబరు మెచ్చి చూడ
నారూఢి నే నొక్కహయము నెక్కి
దూరించి పో వనదుర్గభూమి
భారంబుగాఁ జొచ్చె వాజివేగ. ౨౨౩.

వ. అంత రాత్రి యగుటయు మహాంధకారంబున నత్తురంగం బయ్యర
ణ్యంబునం గ్రుమ్మరుచుండ నే నొక్కతరుశాఖ పట్టుకొన్న; నవ్వాహ
నంబు నిజేచ్ఛం బఱచుటయు నిర్జనం బగు నవ్వనంబునందు. ౨౨౪.

క. ఆలంబితశాఖుఁడ నయి
వ్రేలుచు దిగ వెఱచి తీవ్రవేదన వగలం
దూలుచు నాఁకట నెంతయు
జాలిం బడునంత వేగి సవిత్రుఁడు వొడిచెన్. ౨౨౫.

వ. అట్టియెడ నలుదిక్కులుఁ జూచుచు భయభ్రాంతచిత్తుండ నై యుండ
నవ్వనాంతరంబునందు. ౨౨౬.

ఉ. చేతులగాజులున్ జెవులజిట్టును బొట్టును దాటియాకులున్
వాతెఱతీరు నై పఱపువాలికకన్నులు నల్లరూపునన్
భాతి దలిర్పన్ నొక్కతె యనామిక గ్రద్దన గంప మోచికొం
చా తెరువట్టి చేనికడ కంబలి తండ్రికిఁ గొంచుఁ బోవఁగన్. ౨౨౭.

క. కని డాయఁ బిలిచి నాన
చ్చిన తెఱఁగున బడ్డనెగులుఁ జెప్పుచుఁ దరుణీ
నను డింపు మన్న మాటలు
విని యదియును గంప దింపి వెలవెల నగుచున్. ౨౨౮.

గీ. కానికులముదానఁ గడియంగ వచ్చునే
యనినమాట కేను ననుమతింప,
లీల నదియు రెండు రా లెత్తుగాఁ జేసి
యెక్కి కొంకు కొస రొకింత లేక. ౨౨౯.

ఉ. నన్నును గౌఁగిలించి వదనంబు నురంబునుఁ జేర్చి డింపుచోఁ
జన్నులు సోఁకి మైఁ బులకజాలము నిక్కొనఁ జిత్త మెంతయున్
వెన్నవిధంబు దోఁప ననవిల్తునిబారికి నగ్గ మైతి నా
యన్నును నన్ను డించి మొగ మెల్లన వ్రాల్చుచుఁ బాసి నిల్చినన్.

UNIVERSITY OF HYDERABAD.
Acc. No. 7503 29 MAR 86

వ. దానితో ని ట్లంటి. ౨౩౧.

క. నిన్నటినుండియు నాఁకట
నున్ననిమిత్తమున దాహ మొదవెను; మేనుం
గన్నులును దిమ్మ దిరిగెడుఁ
గ్రన్నన నాదప్పిదీర్చి రక్షింపఁ గదే. ౨౩౨.

వ. అనిన నాచండాలి నాయభిప్రాయం బెఱింగి తనతెచ్చిన పర్యుషితా
న్నంబునం గామోపచారంబులం బరితోషితుం జేసిన; నేనునుం దాని
చేసినతగవునుం దగులంబు నగ్గలించి విడువ నోపక తజ్జనకానుమతం
బున వివాహంబై దానియింటనె యుండి దానివలన నలుగురు కొడు
కులం గని పెద్దకాలం బాచండాలసంసారసుఖంబు లనుభవించుచు
నుండ; నంత నద్దేశంబునకు రాజోపప్లవంబు గదిరి యూళ్లు విడిచి
వలసలు పోవుచుండ నప్పుడు. ౨౩౩.

చ. కడవలు కావటందు నిడి గ్రక్కున మూఁపున మోచి బిడ్డనిం
దడయక వీఁపునం దునిచి తక్కినమువ్వురఁ దోడుకొంచు, నా
పడతియు గంప మోచికొని పల్మఱు దిట్టుచు వెంటఁ గూడి రా
నడవికి నేఁగి పెక్కిడుము లందితి నయ్యెడ నేమి సెప్పుదుం. ౨౩౪.

వ. అంతఁ గొన్నిదినంబులకును. ౨౩౫.

క. కొడుకులు నాలును గడు నల
జడిఁ బడి గ్రాసంబు లేక సమసిన వారిం
బెడఁబాసినబహుదుఃఖము
దొడరిన సొద సొచ్చి మేను దొఱఁగితి నచటం. ౨౩౬.

వ. ఇట్లు వడిఁ దెలివొంది చనుదెంచితి. నింతయును శంబరునికృత్యంబ.
సకలజీవులకు మనోమాయ దుఃఖం బాపాదించుచుండు. నని యమ్మ
హీపతిపలుక; నంత నయ్యైంద్రజాలికుండు నంతర్ధానంబు నొందు
టయు, సభ్యు లాశ్చర్యహృదయు లై యారాజున కి ట్లనిరి. ౨౩౭.

చ. కనుఁగొన నైంద్రజాలికుఁడు గాఁ డితఁ; డట్టిఁడ యయ్యె నేని దా
ధన మభిలాష చేయఁడె? వృథా చనుదెంచి యదృశ్యుఁ డయ్యె; నె
మ్మనము జగద్విలాస మనుమాయిక మెల్లనుఁ జూప వచ్చిన
య్యనిమిషదూత గాని యతఁ డారయ మర్త్యుఁడు కాఁడు భూవరా.

వ అట్లు గావున ననంతరూపం బగుపరమాత్మమాయ మనోరూపంబు దాల్చి జగత్తుల భ్రమలం బెట్టుచుండు, దీనికిఁ జింతింప వలవ. దని సభ్యులారాజు ననునయించి. రని శాంబరికోపాఖ్యానంబు చెప్పి వసిష్ఠుండు రఘునందనున కిట్లనియె. ౨౩౯.

గీ. అనఘ యల్పకాలమునన పెక్కేఁడులు
జరుగు యెల్ల నింద్రజాలమహిమ.
యెంత సేసి రంత యెదుగు మనోమాయ;
యెంత యెడసి రంత యెడయుఁ దండ్రి. ౨౪౦.

వ. సమయమంబున మనశ్శాంతి యగుఁ; దచ్ఛాంతిని మననవర్జితంబును నుత్తమపదధ్యానంబును నగుఁ; మందరంబు సముద్రంబునుం గలంచినట్లు సంసారసంభ్రమం బుడుపవలయు. భోగసంకల్పవర్జితంబున సంసారవిషవృక్షాంకురంబు ద్రుంపవలయు; మఱియును. ౨౪౧.

క. చిత్తవ్యాధుల కౌషధ
ముత్తమమును బుజువు నయినయొక్కటి విను మ
త్యుత్తమ మభిమతసుఖముల
పొత్తెడలి నిరామయత్వమున సుఖి వగుమీ. ౨౪౨.

. ఏ యభిలాషలఁ బొందక
కాయము నిజ మనక బాహ్యగతు లెడలి మదిఁ
స్వాయత్తజ్ఞానంబునఁ
బాయక చిత్తంబు గెలువు భానుకులేశా. ౧౪౩.

గీ. శాస్త్రశిక్షల నిశితమై చల్లనైన

చిత్తమునఁ దోఁచు చింతలు మెత్తనయిన,
చిత్తశత్రునిఁ దునుమాడి చింత లుడుగు
మనఘ యినుమును నినుముచేఁ దునుమునట్లు. ౨౮౪.

గీ. పౌరుషంబున సాధ్య మై పరఁగునీప్సి
తముల భోగింపవల దన్నఁ దాని తోలఁగు;
నట్టి చిత్తంబు నియమింపనట్టిపురుష
కీటకంబులఁ గాల్పనే కిల్బిషారి. ౨౮౫.

సీ. పొలుచు బ్రహ్మంబునఁ బొంది నిరీహశా
స్త్రములచేఁ జిత్తకృంతన మొనరిచి
యేకాంతముననుండి యొసఁగుచిత్తమునఁ జి
ద్రక్షితంబుగఁ జేయఁ దగినయతఁడు
కల్పాంతపవనంబు కడువడి వీచిన
నంబుధు లొక్కటి యయ్యె నేని
ద్వాదశాదిత్యులు తఱిమి కాసిన నైనఁ
గల్పశతంబులఁ గ్రాఁగఁ డతఁడు.

గీ. ఏమి సెప్పుదు నొకచిత్ర మినకులేశ,
నిత్య మై యున్న బ్రహ్మంబు నిగుడ నీక
వినుము నిస్సార మైనయవిద్య దాన
యఖిలజగములు భ్రమఁ బెట్టి యాడుచుండు. ౨౮౬.

వ. స్ఫటికోపలరచితంబు లగు విచిత్ర ప్రతిబింబంబులం బోలె నఖిలకార్యం
బులం జేయుచు నిర్మలచిత్తుండ వయి యుండు. మని బోధించినఁ; బర
బ్రహ్మమూర్తి యగునమ్మునివాక్యంబులకు వికసితాంతఃకరణుం డయి
రఘుపతి యిట్లనియె. ౨౮౭.

గీ. తృణకణాంశంబు వజ్ర మై త్రుంచునట్లు
కోరి తామరనూలునఁ గొండ లెల్లఁ

గట్టువడినట్లు విశ్వంబు గట్టువడియె;
నకట మాయాప్రభావ మే మందు ననఘ! ౨౪౮.

వ. అని మఱియు ని ట్లనియె. ౨౪౯.

క. అక్కట లవణనృపాలుఁడు
తక్కక తనకొలువులోనఁ దనతను వుండఁగ
ది క్కెడలి మాలవాటుల
నక్కానలఁ బొందె నేమి యయ్యె మునీంద్రా ౨౫౦.

క. అనిన వసిష్ఠుం డి ట్లను;
విను రాఘవ లవణనృపతివృత్తాంతం; బా
యన రాజసూయయాగము
మును సేసినకతన దుఃఖములు కుడిచె వడిఁగ. ౨౫౧.

వ. అది యె ట్లనిన రాజసూయయాగకర్తలు ద్వాదశవర్షదుఃఖంబు లనుభవించుట జగద్విదితంబు గావున, నతని క్రతువునకు శతక్రతుం డసూయాయత్తుం డయి యొక్కదూతం బనిచిన వాఁడు శాంబరికరూపంబునఁ జనుదెంచి యారాజు నత్యంతమోహాంధుం గావించి చనియె. నది కారణంబుగా నతండు ముహూర్తద్వయంబునఁ బండ్రెండేండ్ల దుఃఖంబు లనుభవించె. నట్టి దురవస్థలం బడి లవణుండు కొలువువారలకుఁ జెప్పి వీడ్కొని నిజమందిరంబున కరిగి తనమనంబున ని ట్లని వితర్కించె. ౨౫౨.

ఉ. అక్కట రాజసూయమఖ మాగతిఁ జేసినయట్టినాకు నేఁ
డెక్కడిపాటు వచ్చె! నిది యేగతిఁ బాటిలె నొక్కొ దైవమా!
యెక్కడఁ జొచ్చువాఁడ నని యెంతయు బెగ్గిల నవ్వనంబు దాఁ
దక్కక తోఁచె నాతనిమనంబున దర్పణబింబభాతి యై. ౨౫౩

వ. ఇ ట్లత్యంతదుఃఖంబు నొందినయవ్వనం బంతయుం దనచిత్తంబునం దోఁచిన నాభూపాలుండు మఱునాఁడు సచివసమేతుం డై బలంబులం

గూర్చుకొని దిగ్విజయార్థగాం బరుగుచందంబున దక్షిణాభిముఖుం
డయి చని వింధ్యపర్వతప్రాంతారణ్యంబునందు. ౨౫౪.

చ. తురగము చన్న మార్గమును, దూకొను వృక్షము కొమ్మ,మాలవాఁ
డరసిన చేను, వానిసుత యన్నము వెట్టినతావు, దానిఁ జె
చ్చెర వరియించి కాఁపురము సేసినయిల్లును, నాలు బిడ్డలుగ,
సురిగినచోటు,దాను సొద సొచ్చినభూమియుఁ జూచె దెల్లగన్. ౨౫౫.

వ. ఇట్లు ప్రత్యక్షంబుగాఁ గనుంగొని లవణుం డాశ్చర్యహృదయుం డయి
యవ్విధం బెవ్వరికి నెఱింగింపక నిజమంత్రుల ననునయించుచు వార
లుం దానును బురంబునకుం జని సుఖం బుండె. నవిద్యాప్రభావం
బిట్టిద; యసత్యంబు సత్యం బయి తోఁచు. ననిన విని దశరథనందనుఁ
డి ట్లనియె. ౨౫౬.

క. కలలోఁ గాంచినవస్తువు
లలఘుమతీ యెట్లు నిక్కమై తోఁచు? జగం
బుల వినియుఁ గనియు నెఱుఁగము.
వెలయఁగ సంశయముఁ బాపి వినిపింపు తగన్. ౨౫౭.

వ. అనిన వసిష్ఠుం డి ట్లనియె. ౨౫౮.

ఉ. ఈయనుమాన మేల? విను మిట్టిద యల్ల యవిద్య పెం; ప దె
ట్లాయె ననంగరాదు సుగుణాకర; మీఁదట నాదివర్తనం
బాయెడ నన్నియున్ విదిత మయ్యెడివాసన లెల్లఁ గాకతా
లీయములట్ల కాని యవి లే వని సెప్పఁగరాదు భూవరా. ౨౫౯.

వ. అది యె ట్లనిన నాపల్లెయు వనంబును హయంబును నారాజునకుం
దొల్లియు దృష్టంబులు శాంబరికమాయాకృతంబునఁ దోఁచి నట్ల విం
ధ్యపుష్కరదేశంబునం గానంబడియె; భావికార్యంబులు సూచించు
స్వప్నంబునం బోలె దృశ్యంబు లయ్యె. నింతియ కాని దీని కింత విస్మ
యం బేల? జ్ఞానజ్ఞేయరూపం బగువస్తుసంతతి నాపాదించు. నింతియ

కాని సత్యంబు గా దట్లు గావున. ౨౬౦.

గీ. వస్తువస్తువునడుమఁ గేవలము బయలఁ
గలిగి యుండియు నేరికిఁ గాన రాక
తెలివియును జాడ్యమును లేక వెలుఁగు నెద్ది,
యట్టిరూపంబు నీవు గ మ్మనఘచరిత. ౨౬౧.

చ. మును పరమాత్మతత్త్వమున మున్కొని చిత్తము పుట్టుఁ, జిత్తస
మ్మననవికల్పజాలమున మానుగఁ బుట్టి జగత్ప్రపంచ మెం
దును దలపోయ శూన్య మయి తోఁచుచునుండు, నభంబు నీలిమం
బని తలపోసినట్లు పరమార్థ మను గామి యెఱుంగు రాఘవా. ౨౬౨.

క. జాలిన సంకల్పంబులఁ
జాలించినఁ జిత్త మణఁగి సంసారమహా
జాలము సెడు; నంత శర
త్కాలవియద్భాతిఁ బరమతత్త్వము వెలుఁగున్. ౨౬౩.

వ. అని లవణోపాఖ్యానంబు సెప్పి వసిష్ఠుండు రామచంద్రున కి ట్లనియె.

## అజ్ఞానభూమికోపాఖ్యానము.

సీ. జననాథ యెఱుఁగు, మజ్ఞానభూమిక లేడు
పాలుపొంద మనములోఁ బూని వెలుఁగు;
నేడింటిసందుల నేపారుభూములు
గణనకు మిక్కిలి గలిగి యుండు;
నవి బంధమూలంబు లై ఫలియించుచుఁ
జెప్పంగఁబడియె సంక్షేపభంగి;
మొగిని రాగద్వేషములఁ బాసి శుద్ధసం
విన్మాత్రచిత్తంబు విడువ నీక

గీ. జాడ్యనిద్ర లుడిగి సంకల్పములఁ బాసి
శిలయుఁ బోలె నొండుతలఁపు లేక

వస్తువస్తుమధ్యవర్తి యై వెలుఁగొందు
నదియ చిత్స్వరూప మనఁగఁ బరఁగు. ౨౬౫.

వ. అందు నారోపితంబులగు నజ్ఞానభూము లెవ్వియనిన-బీజజాగ్రత్తును, జాగ్రత్తును, మహాజాగ్రత్తును, జాగ్రత్స్వప్నంబును, స్వప్నంబును, స్వప్నజాగ్రత్తును, సుషుప్తియు, ననంబడు. నివి యొండొంటిం గలసి యనేకనామంబు లై యుండుఁ; దల్లక్షణంబు నెఱింగించెద. ౨౬౬.

గీ. చిత్తునకుఁ దాన మొదలిటి చేతనంబు
నై యనాద్యంబు విమలంబు నై వెలుంగు
భంగిఁ జిత్తార్థజీవసద్భావనమునకుఁ
బ్రథమబీజంబు బీజజాగ్రత్తుభూమి. ౨౬౭.

వ. అది యెఱుకకు నూతనావస్థ యనంబడు; నింక జాగ్రదవస్థ నెప్పెద.

క. ఇది నాయిల్లిది నామే
నిది రే పగ లని తలంచునెఱుక విశద మై
మదిఁ బొడమెడు ప్రాగ్భావం
బని జాగ్రత్తనఁగ నొప్పు నకళంకులేశా. ౨౬౯.

గీ. ఈతఁ డతఁడు నేను నిది నాది యనఁగ జ
న్మాంతరముల వచ్చునట్టియెఱుక
ననఘచరిత యెఱుఁగు మది మహాజాగ్రత్త
టండ్రు తత్త్వవేత్త లైనమునులు. ౨౭౦.

క. ఈరాజు గెల్చె నే నీ
యూరేలెద ననుచు నొండె నొం డొకటొండె
గోరుట జాగ్రత్స్వప్నం
బార మనోరాజ్యమహిమ లందుట రామా. ౨౭౧.

గీ. ఎండమావు లుదక, మిరువురు చంద్రులు,
కప్పచిప్ప వెండి, గాఁ దలంచి

పెక్కుగతులభ్రాంతి బెరయుట స్వప్నంబు
రఘుకులాబ్ధిచంద్ర రామచంద్ర. ౨౭౨.

గీ. పెద్దకాలమేని తద్దయుఁ దలఁచుగాఁ
జూడ కుండి పిదపఁ జూచి తెలియు
జ్ఞాన మనియ స్వప్నజాగ్రత్తు నాఁబడు.
ననిరి బోధవేత్త లైనమునులు. ౨౭౩.

క. జడ నొంది యిపుడు సెప్పిన
షడవస్థలఁ దొఱఁగి దుఃఖజాలము మదిలో
నెడఁబాపి భావిదుఃఖము
బొడఁగనఁబడనిది సుషుప్తి భూరివివేకా. ౨౭౪.

## జ్ఞానభూమికోపాఖ్యానము.

వ. అయ్యవస్థలయందు సకలజీవులును దమోలీనం బయి యుండు. నవి యజ్ఞానసప్తావస్థ లనం బడు. నానారూపంబుల నసంఖ్యంబు లయి యుండు. నింక జ్ఞానభూము లేర్పడం జెప్పెద. నవి బెక్కువిధంబులు గల వని యోగిజనంబుల చేత వినం బడు. వీని నెఱింగినయతండు దుఃఖపంకంబునం బొరయక నిత్యసుఖంబు లనుభవించునట్టిమతం బొక్కటి సెప్పెద; నది యెయ్యది యనిన—ప్రథమంబు సుభేచ్ఛయు, ద్వితీయంబు విచారణయుఁ, దృతీయంబు తనుమానసంబును, జతుర్థంబు సత్త్వసంప్రాప్తియుఁ, బంచమంబు సంసక్తియు, షష్ఠంబు పరార్థభావనయు, సప్తమంబు తుర్యగయు, నన నీసప్తభూమికలు ముక్తిమార్గంబులును సకలదుఃఖరహితంబులు నై యుండు. వాని వేఱువేఱ వివరించెద వినుము. ౨౭౫.

గీ. 'అకట నే నేల మూఢుండ నైతి?' ననుచు
శాస్త్రదృష్టిని సజ్జనసంగమమునఁ
దగిలి వైరాగ్యకాంక్షఁ జిత్తమున నూను

సది సుఖేచ్ఛాఖ్య యండ్రు వేదాంతవిదులు. ౨౭౬.

గీ. శాస్త్రసత్సంగవైరాగ్య సమితి గలిగి
సద్విచారప్రవర్తన సలుపుచున్న
సది విచారణ యనఁబడు ననఘచరిత;
యిదియె రెండవభూమి యై యెసఁగు చుండు. ౨౭౭.

క. ఈ రెంటిని మనమున నిడి
దారుణవిషయేంద్రియములఁ దగులక మననం
బారఁ దనుత్వము సేయుట
యారయఁ దనుమానసాఖ్య యగుబోధనిధీ. ౨౭౮.

గీ. అనఘ యీమూఁడుభూముల నభ్యసించి
యర్థవాంఛలు డించి సత్త్వాత్మనిష్ఠఁ
దగిలి శుద్ధాంతరంగుఁడై తలఁపు లుడిగి
పరఁగుచుండుట సత్త్వసంప్రాప్తి యండ్రు. ౨౭౯.

క. కూరిన యీనాలుగు మది
వారక తలపోసి సంగవర్జితుఁ డయి స
త్త్వారూఢస్థితి నుండుట
యారయ నసక్తినామ మగు దాశరథీ. ౨౮౦.

వ. ఈ యేనుభూముల నెఱిఁగి స్వాత్మారాముం డయి బాహ్యాభ్యంతరం బులఁ బదార్థంబులు లేమి తెలిసి పరమార్థంబు తెలియుట పరార్థభావన యనం బరఁగు చుండు. ౨౮౧.

గీ. ఆఱుభూములగతులును నాత్మ నెఱిఁగి
యేమిటను నైన భేదంబు లేమి దెలిసి
తత్స్వభావైకనిష్ఠమై దనరు నెఱుక
తుర్యగయటండ్రు బుధులు చాతుర్యహృదయ. ౨౮౨.

వ. తుర్యగావస్థయె జీవన్ముక్తియనంబడు. మఱి విదేహముక్తివిషయంబు

తుర్యగాతీతం బగు. నని చెప్పి వసిష్ఠుండు మఱియు ని ట్లనియె. ౨౮౩.

సీ. పొలిచెడి సప్తమభూమిక యగుతుర్య
గావస్థఁ బొందినయట్టి పుణ్యు
లమలు లాత్మారాము లధ్యాత్మవేత్తలు
భాగ్యవంతులు పరబ్రహ్మయోగి
వరు లనామయులు జీవన్ముక్తు లగువారు
సుఖదుఃఖరసముల సుళ్లఁ బొంది
మునుఁగ, రేయాచారమును జేయ నొల్లరు,
సేయంగ వలసినఁ జేసికొంద్రు,

గీ. తనరు సంసారసుఖముల ననుభవింతు,
రలసి తెప్పిరి నిద్రించి తెలిసినట్లు
మరులుసతి బాలుగతి మాట మఱచుచుందు.
రిదియ నిర్వాణపద మని యెఱుఁగు రామ! ౨౮౪.

క. జ్ఞానాజ్ఞానములకు సో
పానం బగుచున్నసప్తభూమాఖ్యానం
బే నెఱి నీ కెఱిఁగించితి
భానుకులోత్తంస రామభద్ర మహాత్మా. ౨౮౫.

వ. అని వసిష్ఠమహాముని రామచంద్రున కుత్పత్తిప్రకరణంబును, మనోవిలాసంబున సృష్టిపుట్టుటయుఁ, దత్త్యాగంబున నశించుటయు, దృష్టాంతంబు లగునుపాఖ్యానంబుల వ్యాఖ్యానంబు సేసె; నని సెప్పుటయు విని సంతుష్టాంతరంగుండై భరద్వాజుం డట మీఁదివృత్తాంతంబు వినిపింపు మని యడిగిన. ౨౮౬.

(తురగగతివృత్తము).

ప్రకటవిలిసుతజఠరగళదురురక్తసిక్తనఖాంకురా
సకలమునిజనహృదయసరసిజచారుషట్పదనాయకా

సుకవిజనమృదుమధురనవరసశు క్తిమౌ క్తికపూజితా
వికచజలరుహావిభవవిదళనవీక్షణా శుభలక్షణా. ౨౮౭.

క. విశ్వాత్మ విశ్వనాయక
విశ్వంభర విశ్వజనక విశ్వాతీతా
విశ్వామిత్రశుకాదిము
నీశ్వరనుతిఫలితసురమహీరుహరూపా. ౨౮౮.

(మాలిని.)

నిగమసదనదీపా నిశ్చితానందరూపా
సగుణవిగుణమూర్తీ సర్వసంపూర్ణకీర్తీ
యగణితగుణధన్యా యాదిమధ్యాంతశూన్యా
ఖగపతిగిరినాథా ఖండితారాతియూథా. ౨౮౯.

గద్య.

ఇది శ్రీనరసింహవర ప్రసాదలబ్ధకవితావిలాస భారద్వాజసగోత్ర
పవిత్ర అయ్యలామాత్యపుత్త్ర సరసగుణధుర్యసింగనార్య
ప్రణీతంబైన వాసిష్ఠరామాయణంబునం
దుత్పత్తిప్రకరణం బన్నది
ద్వితీయాశ్వాసము.

# వాసిష్ఠరామాయణము.

## తృతీయాశ్వాసము.

క. శ్రీకర శ్రీముఖకమలది
వాకర యదువృష్ణిభోజవంశామృతర
త్నాకరపూర్ణసుధాకర
నాకాహితదళనచాప నరమృగరూపా. ౧.

### స్థి తి ప్ర క ర ణ ము.

వ. దేవా సకలతత్త్వార్థవివేకి యగువాల్మీకి భరద్వాజున కిట్లనియె. అట్లుత్పత్తిప్రకరణంబువిని రామచంద్రుండు వసిష్ఠమహామునిం గనుంగొని కరకమలంబులు ముకుళించి యి ట్లనియె. ౨.

క. మునినాథ నీప్రసాదం
బున సర్వజగంబు చిత్తమునఁ బుట్టుట నా
మనసు విడుచుటయ ముక్తియు
నని తెలియఁగ వింటి నతికృతార్థుఁడ నైతిఁ. 3.

వ. అనిన విని వసిష్ఠుండు రఘునందనున కిట్లనియె. ఈ జగత్ప్రపంచయంబు మనంబునం జనియించి యంద యుండు ; నంద చిత్తంబు పరమాత్మ యగు. ఈయర్థంబున స్థితిప్రకరణంబు సెప్పంబడు. నందు శుక్ర దామ భీమ దాశూర కచగాథలను నుపాఖ్యానపంచకంబు గలిగియుండు; నందు సంసారంబు పరమాత్మయం దున్న చందంబున శుక్రుచిత్తంబునం గానంబడు ; తత్కథ వినుపింతు నాకర్ణింపుము. ౪.

## శుక్రోపాఖ్యానము.

సీ. చిత్రవర్ణాంబులుఁ జిత్రకుండును లేక
మింటఁ జిత్తరు వొంది మించినట్లు,
పటుశిలాస్థలమున బహురేఖ లున్నట్లు
కల నిద్ర వోవక కాంచినట్లు,
సాక్షిభూతంబును స్వచ్ఛంబు నిత్యంబు
నై వెలింగెడు పరమాత్మయందు
ప్రతిబింబ మై జగత్ప్రచయంబు వెలుఁగొందు
నద్దంబులో నీడ యలరునట్లు;

గీ. కార్యకారణ మిది యని కాన రాదు
వేఱ యొండొక రూపంబు వెదకి రేని.
యట్టి బ్రహ్మైకమూర్తిఁ జిదాత్మఁ బరము
నాత్మలో నిల్పి శాంతుఁడ వగు కుమార. ౫.

(తరువోజ).

విను రామ భృగుఁడను విప్రసత్తముఁడు,
వెలయుమందరశైలవిపినంబునందు
ననుపమయోగసమాధి మైఁ బూని
నయుతాబ్దములు నిల్వ నమ్మహామౌని
తనయుఁడు శుక్రుఁ డుదాత్తమానసుఁడు
తనతండ్రి కడ నుండఁ, దగ నొకనాఁడు
ఘనమార్గమున సురకాంత విశ్వాచి
కర మొప్ప మెఱుఁగుఁ దీఁగయుఁబోలెఁ జనఁగ. ౬.

క. తల యెత్తి యాతలోదరి
కలికికనుంగవయు నీలకచమును వలిచ

న్నలుఁ దెలిమొగముఁ గనుంగొని
వలరా జస్త్రములఁ జిత్తవాసనఁ గలఁపన్. ౭.

క. ఆనాతిఁ గవయు వేడుక
మానుపతను బుజ్జగించి మది దివ్యాంగం
బూని గగనమున కెగసెను
దానివిమానంబుఁ గూడ తరలాత్మకుఁ డై. ౮.

వ. ఇవ్విధంబునం జని శుక్రుండు దక్షాంతామణితోడి కామసౌఖ్యంబులు పెద్దకాలం బనుభవించి మఱియు ననేకజన్మాంతరసుఖంబుల నలజడిఁ బడు చుండె. నిక్కడ నమ్మహానుభావుశరీరంబు తజ్జనకుని తపోమహత్త్వంబునం జేసి వ్యాఘ్రకీటకాది క్షుద్రజంతువులు డగ్గఱ రా వెఱచి యుండ నతిశుష్కం బై యుండె. నంత దివ్యవర్షసహస్రంబులకు నాభృగుమహాముని సమాధి దెలిసి యున్మీలితనయనుం డై నలుదిక్కులుం జూచి తనయొద్దన పడియున్న పుత్త్రకళేబరంబుఁ గాంచి శోకక్రోధంబులు మనంబునం బెనంగొన ని ట్లనియె. ౯.

గీ. అడవిఁ దప మాచరించుపుణ్యాత్ము విప్రు
నాత్మవిదు మత్తనూభవు నపటు లేక
నిగడి చంపినశమనుని నీఱు సేయు
వాఁడ నీప్రొద్దు మతోగ్రతపవహ్ని ననుడు. ౧౦.

వ. భయసంభ్రమాయత్తచిత్తుం డై తత్క్షణంబ. ౧౧.

క. ఘనమహిషకంఠఘంటా
స్వనమును భటహుంకృతులును జటులత మెఱయన్
మునిశార్దూలునిపాలికిఁ
జని వినయావనతుఁ డగుచు శమనుఁడు పలికెన్. ౧౨.

గీ. అకట పెద్దకాల మబ్బంగిఁ జేసిన
తపము వీటిఁబోవఁ దామసమున

నేల యలిగి కన్ను లెఱ్ఱసేసెదు నిన్ను
నేమి సేసినాఁడ నిద్ధచరిత. ౧౩.

క. పాపంబు లేదు నాపై
కోపం బుపసంహరింపు క్రూరాత్ముఁడవై
శాపించితేని నిన్నును
శాపింపఁగ నేర్తుఁ నేను శాసకుఁడఁ జుమీ. ౧౪.

చ. విను మునినాథ, తొల్లి పదివేవురు విష్ణుల లక్ష రుద్రులన్
వనజభవాండకోటుల నవారణ మ్రింగినవాఁడ; నాకు నీ
యనిమిషనాయకుల్ తృణకణాభులు; వారల నెన్న నేల? పెం
పున మిముబోఁటివిప్రు లొకభోజనమాత్రమె నాకుఁ జూడఁగన్. ౧౫.

క. ఇంతతపం బొనరించియు
శాంతస్వాంతుఁడవు గావు. సమచిత్తుఁడ వై
చింతింపుము; నీయభిమత
మంతయు నెఱిఁగింతు; క్రోధ మడఁపు మునీంద్రా. ౧౬.

వ. అది యె ట్లనినఁ జిత్తంబు పురుషుండును, తత్కృతంబ బుద్ధియుఁ, దద్విలానం బహంకారం బై యభిమతకృత్యంబు లొనరించుచుండు. నట్లు గావున, చిత్తశాంతియ సర్వశాంతి. యని సెప్పిన కృతాంతు వాక్యంబుల నుపశమితక్రోధుండై భృంగు డి ట్లనియె. ౧౭.

క. రా వయ్య భూతకోటిక
నీ వెఱుఁగక జీవ మెడలి నిగుడదు, శుక్రుం
డేవిధమున మృతుఁ డయ్యెను?
నావిధ మంతయును జెప్పు మమల విచారా. ౧౮.

వ. అనిన విని యముం డి ట్లనియె. ౧౯.

సీ. అనఘాత్మ మీరు చిదాత్మసమాధి మై
నుండంగ నతఁడు మీయొద్దనుండి

పరిచర్య సేయంగఁ బణఁతి విశ్వాచి నా
నమరకామిని దివి నరుగఁ జూచి,
తమకించి నిజశరీరము డించి వరదివ్య
దేహుఁడై దానితో దివికి నరిగి,
కామలీలలఁ బెద్దకాలంబు భోగించి,
యంతట భోగజరాత్ముఁ డగుచు
గీ. శోణపురమున నొక్కభూసురునికూర్మి
తనయుఁడై పుట్టి, వెండి యత్తనువు విడిచి
కోసలక్షోణిపాలుఁడై కొంతకాల
మవనిఁ బాలించి, మఱి దండ కాటవులను ౨౦.

వ. మృగవ్యాధుండై జనియించి, మఱి భాగీరథీతీరంబున రాజహంస
యై జననం బంది విహరించి, పౌండ్రదేశంబున నినవంశజాతుండై
నేలఁ బాలించి, మఱియు సాళ్వదేశంబున సారమంత్రోపదేశకుండై
యుదయించి, మఱి యలకాపురంబున విద్యాధరుండై కొంతకాలంబు
చరియించి, వెండియు నొక్కమునికుమారుండై సరస్వతీతీరంబునఁ
దపంబు జేసి తద్దేహంబు విడిచి,సౌవీరదేశంబున నొక్క సామంతుండై
కొంతదేశం బేలి,యంత త్రిగర్తదేశంబున శైవారాధ్యుండై శిష్యుల
బోధించు చుండి, కడచని మఱియును. ౨౧.

గీ. విను కిరాతదేశమున నొక్కచో వంశ
గుల్మమై జనించి, కోరి మఱియు
శ్వానజాంగలమున జనియించి, హరిణమై
వెడలి, యొక లతానివేశ మందు. ౨౨.

క. పెనుఁబామై తిరుగుచుఁ ద
త్తను వెడలి తమాలవనలతాజాలమునన్
వనకుక్కుటమై పుట్టెను,

మునినాయక నీసుతుండు మోహాంధత చేన్. ౨౩.

(ఉత్సాహ.)

మఱియుఁ బెక్కు యోనులందు మహితచిత్రగతులఁ బెం
పఱి జనించి దుఃఖభాజి యై చరించి, వెండియున్
వఱలువిప్రవరునియింట వాసుదేవుఁ డనఁగ, దా
నెఱుక గలిగి పుట్టె వేల్పుటేటితీరభూమినిన్. ౨౪.

వ. జటావల్కలధరుండును రుద్రాక్షమాలాలంకృతుండును నింద్రియవర్జితుండును నత్యంతనియతాచారుండును నై యనుఁబది నూ ఱేం డ్లును గోలెఁ దపంబు సేయుచున్న వాఁడు నీకుమారుం జూడవలయు నేని చూపెద, నీవు సుజ్ఞానదృష్టి నీక్షించి దివ్యదేహంబు గైకొని రమ్మనుటయు, భృగుం డట్ల సేయ, నయ్యిద్దఱును దపఃకృశుం డగు శుక్రు కడకుం జని, యతనికి జ్ఞానోపదేశంబు సేసిన, శుక్రుండు నుస్మ్రితవదనుం డై, తనవృత్తాంతంబంతయుం దెలిపి, తండ్రిం గని నమస్కరించి, యి ట్లనియె. ౨౫.

క. మాయాభ్రమ చిత్తం బిటు
సేయ విజృంభించె వృద్ధసేవ దొలంగన్
వే యోనుల జనియించితిఁ;
బాయక పెక్కేండ్లు దుఃఖపడితిన్ దండ్రీ. ౨౬.

గీ. ఎఱుఁగవలసిన వెల్ల నే నెఱుఁగఁ గంటిఁ,
జూడవలసినయర్థంబు చూడఁ గంటి,
భ్రాంతి యంతయు దీఱి విశ్రాంతి గంటి,
నొనర చిన్మాత్రమునకంటె నొండు లేదు. ౨౭.

వ. అయ్యా మత్పూర్వశరీరంబు మందరతటంబున నున్నయది, చూడ వేడుక యయ్యెడుఁ, బోదమె? యని పలుకుటయు, నాక్షణంబ. ౨౮.

ఉ. కాలుఁడు శుక్రుఁడున్ భృగుఁడుఁ గ్రమ్మఱ మందరశైలభూమికిన్

వాలినవేడ్కఁ వచ్చి, చెద వట్టినభాగణపుడొక్కఁ గాంచి; ర
క్కాలువరంబుచే నతఁడు గ్రక్కున నందు వసించి, చేయునుం
గాలుఁ గదల్చి లేచి మదిఁ గౌతుక మందుచునుండె, రాఘవా. ౨౯

క. మానుగ సంసారస్థితి
మానసమున నొదవు టెఱుఁగుమార్గం బీయా
ఖ్యానంబున నెఱిఁగించితి,
మానసనిగ్రహము శాంతి మనుకుల తిలకా. 3౦.

వ. అని యిట్లు శుక్రోపాఖ్యానం బెఱింగించి, వసిష్ఠుండు రామచంద్రున
కి ట్లనియె. వినుము వివేకంబునం జిత్తశాంతి వొడము; తత్క్షణంబ సం
సారం బణంగిపోవు; వివేకహీనునకు సంసారవృద్ధి యగు చుండు.
నీ యర్థంబును దామాద్యుపాఖ్యానంబునం దేటపఱుతు; నాకర్ణిం
పుము. 3౧.

సీ. కృతవిచారుం డగునతని చేతోవృత్తి
మననవర్జితమునఁ బొనుఁగువోవ,
నొకకొంతపరిణతి నొంద సంసారవా
సన యెలుకలు దిన్న చామలట్లు,
రాగహీనత మనోగ్రంథిఁ ద్రెంపఁగ నీళ్ల
కలఁక నిండుపు రాచి తెలుచుభంగి,
విజ్ఞానవశమున వెలయుస్వభావంబు
నిత్యప్రసన్నమై నెగడుచుండు,

గీ. నట్టియోగికి బ్రహ్మాదు ద్రావిసుకులు
కృపకుఁ దగుపాత్రులై యుందు; కేవలంబు
కన్ను లూరక దిక్కులు గాంచుపగిదిఁ,
జిత్తరతి లేక కార్యంబు సేయుచుండు. 3౨.

గీ. ఎఱుక గలుగుయోగి యెట్లు భోగించిన

దురిత మెడలి భోగతుష్టి యొసఁగు,
చోరుఁ డొట నొత్తెఁగి పోరామి సేసిన
ప్రియునియిల్లు తస్కరింపనట్లు. 33.

వ. ఎట్లనినఁ బధికుండు మార్గగ్రామంబులు సూచుచుం జనుభంగి, గృహస్థితుం డుదాసీనభావంబున భోగంబు లల్పమాత్రంబు భోగించినను దూష్యత లేక యుండు. ఏ యుపాయంబున నైనం జిత్తంబు నింద్రియంబుల జయించి సంసారపారావారోత్తరణంబు సేయు; మట్లు సేయ వైతేని, దామవ్యాలకటన్యాయంబునం బోలె దుఃఖంబు ప్రాపించు నత్తెఱం గాకర్ణింపు మని వసిష్ఠుండు రామచంద్రున కిట్లనియె

దామవ్యాలకటోపాఖ్యానము.

సీ. శంబరనామరాక్షసుఁ డొక్కఁడును దొల్లి
యమరసైన్యము గెల్వ నాత్మఁ గోరి,
తలపెట్టుకొన్నంతఁ దనయోధు లందఱు
భయ మంది నల్గడఁ బాఱ, వాఁడు
కోపించి, తనమాయఁ గోరి దామవ్యాల
కటనామభటుల నక్కజము గాఁగ
సృజియింప, వారును విజయాశ దేహాభి
మానంబు సెడలి యమర్త్యబలము
గీ. సమయఁ జూచిన దివిజులు సంచలించి
చెదరి నలుదిక్కులను బాఱి చేష్ట లెడలి
సంభ్రమంబునఁ బఱచి యాజలభవుని
వెనుకఁ జొచ్చిన వారి కి ట్లనియె ధాత. 3౪.

ఉ. అక్కట మీకు నింతభయ మందఁగ నేటికి వారి నోచున్ లా
గొక్కటి సెప్పెదన్ వినుడు; యుద్ధమునం దలపాటు సేసి, మీ
రక్కడ నక్కడన్ విఱిగినట్లు తొలంగుచుఁ బోరు చుండఁగా

నక్కడ వారియాత్మల నహంకరణంబు జనించి యంతటన్. 36.

క. ఆ దామవ్యాలకటుల్
మోఁదంబడి జీవితాశ మునియోగంబుల్
ఛేదిలి మిాఁ కగపడుదురు
వేసనఁ బెనువలలఁబడినవిహగములగతిన్. 37.

గీ. ఎట్టిధీరులకును నెట్టన సంసార
తృష్ణ వాడమి తొంటితెలివి నణఁప,
నిగళబద్ధ మైనమృగరాజుభంగి నై
చిక్కువడి నశించు నక్కజముగ. 38.

వ. అని యుపదేశం బిచ్చి పరమేష్ఠి యంతర్ధానంబు నొందె. దివిజగణం
బులు నిజనివాసంబున దామాదులతో సమరంబు సేసి యాహారిసా
హారిం బెనఁగి విచ్చుచుం బోదువుచుండి; రంత నారాక్షసులు జయా
హంకార చిత్తులై దేహసుఖధనవాంఛ లగ్గలించి మరణభయం
బున ముందఱఁ గాననేరక యింధనక్షీణం బగునవలంబును బోలె
సత్త్వంబులు పోనుంగువడి దివిజులకు నోడ కనికని పఱచి రని సెప్పిన
విని కౌసల్యానందనుం డిట్లనియె. 39.

క. దామవ్యాలకటాసురు
లేమెయిఁ బరమాత్మువలన నెటు పుట్టి రొకో?
నామది సంశయ మయ్యెడు
ధీమన్నుత నాకు నాన తీవే యనుడున్. 40.

సీ. ఆమ్మహామౌని యి ట్లనియెను.—రాఘవ,
తనరుదామాదులజనన మరయఁ
బరమాత్మవిప్రతిభాతిమాత్రము గాని
సత్యమ్ము గాదు; సంశయ మ దేల?
నిగిడి వా రన నేల, నీవును నోలి స

ద్భావంబు లన్నియుఁ బరఁగ నెఱిఁగి,
ప్రకృతివికృతులను బాసి సమ్మదమునఁ
బరమాత్మ నాత్మను బదిలపఱిచి,

గీ. సత్త్వసంవేదనంబును శాశ్వతంబు
నిత్యబోధాత్మరూపంబు నిర్మలంబు
నస్తమును నుదయము లేనియట్టివెలుఁగుఁ
బొంది చిన్మూర్తిక వై సుఖింపుము కుమార. ౪౧.

వ. అని వసిష్ఠుండు దామాద్యుపాఖ్యానంబు సెప్పి, యింక దేహాహంకా
రరాహిత్యంబు పురుషార్థం బగుట యెఱుంగంబడు భీమాద్యుపాఖ్యా
నంబు సెప్పెద విను మని యి ట్లనియె. ౪౨.

గీ. ఎఱుకపడకున్న నహమర్థ మెద్ది యేని
మలినరూపంబు దోఁచి దంభకము నొందు
నెఱుకపడియున్న నహమర్థ మెద్ది యేని
యదియ పరమాత్మ నభము తా నై వెలుంగు. ౪౩.

వ. ఆ యహంకారంబు జగత్త్రయంబునందు మూఁడు విధంబులై యుం
డు. నందుఁ ద్యాజ్యం బొక్కటియు, ముఖ్యంబులు రెండునుం గలిగి
యుండు వినుము. ౪౪.

గీ. అతుల మమలంబు విశ్వ మచ్యుతముఁ బరము
నైన పరమాత్మరూపంబు నేనె కాని
యన్య మొక్కటి లే దని యాత్మఁ దలఁచు
నదియ యుత్తమాహంకృతి యనఁగఁ బరఁగు. ౪౫.

గీ. అరయ నన్నిట వ్యతిరిక్త మై వెలుంగు
తాన యాలాపశతకల్పితంబు నగుచు
నెసఁగు పరమాణురూపంబు నేనె యనెడు
నా యహంకార మది ద్వితీయంబు శుభము. ౪౬.

వ. ఇది మోక్షకారణంబును బంధనిరసంబు నై జీవన్ముక్తి యొనచుఁ
మఱియును ౪౭.

క. కరచరణాద్యవయవముల
కిరవై చరియించుదేహ మిది నీమదిలోఁ
దిరముగ నిలుపునహంకృతి
యరయఁ దృతీయాఖ్య మధమ మగు దాశరథీ. ౪౮.

వ. ఈ యహంకారత్రయంబును విడిచినయతండు పరమనిర్వాణపదంబు
నొందు. నహంకారరహితు లై భీమాదులు పరమపదప్రాప్తు లగుట
విస్పష్టంబుగాఁ జెప్పెద నాకర్ణింపుము. ౪౯.

సీ. మును శంబరుం డనుదనుజుండు తనమాయ
నిర్మింపఁబడు రజనీచరేంద్రు
లతిమూర్ఖు లైనదామాదులు సురలచే
హతు లైనఁ జింతిలి యతఁడు మఱియు;
దైవసేనల నోర్చుతలఁపున నధ్యాత్మ
శాస్త్రవివేకుల సత్త్వధనుల
గతమత్సరుల నహంకారదూరుల వేద
వేదాంతవేత్తల విమలమతుల
గీ. భీమబాహాఖ్యదృఢు లనుపేర్ల వారిఁ
బోలుచుతనమాయ నబ్ధిబుద్బుదములట్ల
నెన్నఁ బెక్కండ్ర సృజియింప; నెసఁగ వారు
నతిజరామృతివర్జితు లై కడంగిరి. ౫౦.

వ. ప్రాప్తార్థకాములును, వర్తమానానువర్తులును, సర్వసములు, నగు న
ద్దానవులచేత నిర్జరసైనికులు చచ్చియు, నొచ్చియు, వెఱచియు, పలా
యనపరాయణులై, జ్ఞానవాసన విషయానుభవంబున నశియించిన
ట్లణంగిరి. అట్లు గావున. ౫౧.

గీ. పరఁగ దుర్వాసనలఁ గట్టువడ్డమనసు
జ్ఞానవాసనచేఁ గ్రాఁగి శాంతి నొందు;
సమ్యగాలోకచిత్తవాసనల చిత్త
మణఁగు రఘురామ విను దీప మణఁగునట్లు. ౫౩.

వ. అని యిట్లు భీమాద్యుపాఖ్యానంబున జగత్స్థితిమాయికత్వంబు సెప్పి
యింక దాశూరోపాఖ్యానంబున నీయర్థంబు విశదంబుగాఁ జెప్పెదు.
ననిన, రామచంద్రుండు విశ్వాతీతం బైనచిదాత్మయందు విశ్వం బెట్లుం
డె? నివ్విధంబు తేటపడ నెఱింగింపవే యనిన,నమ్మునీశ్వరుం డి ట్లనియె. ౫౪.

క. విను రాఘవ నిర్మలచి
ద్ఘన మాత్మునియందుఁ దాన కలిగి ప్రపంచం
బను పేర విజృంభించును
ఘనమృగతృష్ణికలు నీళ్లగతిఁ దోఁచుక్రియన్. ౫౪.

గీ. పరఁగఁ దనయాత్మ మదవశభ్రాంతిఁ జెంది
యన్యుఁడును బోలెఁ దోఁచినయట్టిభంగి
మానసంబున నజ్ఞానమహిమఁ జేసి
యాతఁడు నతఁడు గా కుండు నలఘుచరిత. ౫౫.

గీ. ఒనర దీపంబునను వెలుఁ గున్న యట్లు,
పువ్వు గలుగంగఁ దావియుఁ బొలుచునట్లు,
సూర్యుఁ డుండంగఁ బగ లగుచున్న యట్లు,
చిత్తు గలుగంగ జగములు చెలఁగుచుండు. ౫౬.

వ అనిన విని రామచంద్రుం డమ్మునిచంద్రున కి ట్లనియె. ౫౭.

క. క్షీరోదధిలహరీగం
భీరము లై శీతలములు ప్రియములు నగు మీ
సారోక్తులచే నామది
యారయ సుజ్ఞానజనక మయ్యె మునీంద్రా. ౫౮.

గీ. గడియగడియకు వెలుఁగుఁ జీఁకటియు నగుచుఁ
జలియు నెండయు మాటికి సంచరించు
వర్ష కాలాభ్రములఁ బర్వువాసరంబు
సరణి యగుచుండు నామది సంయమీంద్ర. ౫౯.

వ. అనంతంబు, నప్రమేయంబు, సర్వంబు, నన స్తమితసారం, బగుపరమా
త్మకు, సృష్టివిలయం బను నీకలంకునకుం గారణం బేమి? యని యడి
గిన వసిష్ఠుం డిట్లనియె. ౬౦.

సీ. అనఘ యథార్థవాక్యార్థణంబు లయ్యుఁ బూ
ర్వాపరం బగు నిరూపార్థణములకు,
నేవిరోధము లేక యొసఁగుమదుక్తులఁ
గలబలాబలములు తెలివిపడఁగ
సుజ్ఞానదృష్టి మైఁ జూచి యెఱింగెద.
రుత్తమవిద్యయు నొగి నవిద్య-
నణఁపంగ సర్వదోషాపహారిణి యగు
విద్య సంప్రాప్తమై వెలుఁగుచుండు,

గీ. నస్త్రమస్త్రంబుచే శాంత మైనభంగి,
విషముచేతన విషమును విఱిగినట్లు,
శత్రుచేతన శత్రుండు సమయుపోల్కి,
మనసుచేతన మనసును మడియుచుండు. ౬౧.

గీ. విను మవిద్య యెట్లు జనియించెనో? యను
తలఁపు లెల్ల మాని, తత్త్వనియతిఁ
జెంది, దీని నెట్లు చెఱుతునో యనువిచా
రంబు నిలుపు మాత్మ, రామచంద్ర. ౬౨.

వ. అది నశించునప్పుడు, తజ్జననాదివికారంబు నెఱుంగ నగు. ననిన విని
రఘునంధనుండు—జీవుండు మనోరూపంబు దాల్చి యవ్విరించిపంద

బెట్లు వొందు? నానతిం డని యడిగిన, నతనికిఁ బరమార్థ విదుం
డగు వసిష్ఠుం డి ట్లనియె. ౬౩.

క. విను బ్రహ్మంబును దనువొం
దినమార్గం బెల్ల నీకుఁ దెలుపఁగ, నందుం
దనరు జగత్తుల యునికియు
వినఁబడు, దెలియంగ వినుము, విమలవిచారా. ౬౪.

వ. ఎట్లనిన దేశకాలవస్తు పరిచ్ఛేదరాహిత్యం బగునాత్మతత్త్వంబు బ్ర
హ్మశరీరం బనంబడు. అది వాసనావశంబున జీవుం డగు. నజ్జీవునివ
లన సంశయాత్మకం బగుమనంబు పుట్టుఁ. దచ్ఛక్తినియతి నిర్మలం
బై శబ్దోన్ముఖం బగునాకాశంబు సంభవించు. దానివలన శబ్దస్ప
ర్శోన్ముఖం బైనయనిలంబు జనియించు. నీరెంటిసంఘర్షణంబున శబ్ద
స్పర్శరూపగుణోపేతం బగుననలంబు పుట్టు. దానివలన శబ్దస్పర్శ
రూపరసయుక్తంబగు జలం బుద్భవించు. దానివలన శబ్దస్పర్శరూప
రసగంధసమేతం బగు భూమి యుదయించు. నివ్విధంబున బంచభూత
తన్మాత్రాచేష్టితం బైనజగత్తు మనోరూపం బై యుండు; నందు.౬౫.

గీ. అనలకణముభంగి నాకాశమున, నహం
కారబుద్ధి బీజ మైనతనువు
పొలుచు, దానిపేరె పుర్యష్టకవిభూతి,
హృదయపద్మభృంగ మదియె, రామ. ౬౬.

వ. అందు మనోభావవేగంబున బిల్వఫలంబులుం బోలెఁ బాకం బయి
స్థూలరూపం బగు. నదియు కరువునం బోసినపసిఁడిప్రతిమయుం బోలె,
నిర్మలం బగు నాకాశంబునం దత్తద్రూపంబుల వెలుంగు. దాని
కూర్ధ్వంబు శిరంబు, నుదరంబు మధ్యంబును, బార్శ్వంబులు
హస్తంబులును, బాదంబులు క్రిందు, నై, కాలవశంబున శరీరం బై,
బుద్ధిసత్త్వబలోత్సాహ విజ్ఞానైశ్వర్యాది గుణంబులు గలిగి, లోక

పితామహుండైన బ్రహ్మ యుద్భవిల్లెఁ. బరమాత్మ యైనయతనికి జనన మరణంబు లెందునుం బొందవు. మిథ్యాభావనలం గల వని సెప్పం బడు; నట్లుగావునఁ దృష్ణాభుజంగకంచుకం బగుసంసారాడంబరంబు విడువుము. ౬౭.

క. విను మజ్ఞానాంశము లగు
ధనదారసుతాదులందుఁ దనికెడు దుఃఖం
బును సుఖమును; నిక్కం బై
చను నెద్ది సుఖంబు తలఁప జనవరతిలకా. ౬౮.

గీ. మూర్ఖు లగువారితలఁపుల మోహ మొదవి
యేమివస్తుల భోగింప నిశ్చయింతు
రాత్మవిదు లైనవారల కరసి చూడ
నవియ వైరాగ్యహేతువు లై జనించు. ౬౯.

క. చే తప్పి చనినకార్యము
లాతతమతి విడువు, నీకు నబ్బినసుఖముల్
ప్రీతిఁ గైకొను సంవి
చ్చాతుర్యుఁడ వగుము రామ సంసారమునన్. ౭౦.

గీ. శూన్య మగుట గాంచి శోకింప రెన్నఁడు,
సమరవనఫలాదు లబ్బె నేనిఁ
జిత్తమునను వాంఛ సేయ రుత్తము లగు
వారు, సూర్యునట్ల వసుమతీశ. ౭౧.

వ. అనిన విని రఘూత్తముం డిట్లనియె. ౭౨.

క. ఈసృష్టియొక్క విధమే
భాసురముగ నెట్లు పెక్కుభంగుల నగునో
యీ సందు తెలియఁజెప్పుము
భూసురవరతిలక చిత్తమున కింపెసఁగన్. ౭౩.

వ. అనిన వసిష్ఠుం డి ట్లనియె. ౭౪.

చ. ఒకమఱి రుద్రనిర్మితము, నొక్కొకవేళ విరించినిర్మితం,
బొకయెడ విష్ణునిర్మితము, నొక్కొకచో మునికల్పితంబు, నొ
నొకకడశూన్యమై యణఁగు, నొక్కొకపట్టును దాన కల్గు, సృ
ష్టికి నిది యిట్లు పుట్టు నని సెప్పఁగరా దినవంశవల్లభా. ౭౫.

వ. మఱియు నొక్కయెడ భూమి యంతయుం దరులతాకీర్ణం బగు. నొ
క్కచోట జనసాంద్రం బై యుండు. నొక్క కాలంబునఁ బర్వతాక్రాం
తం బై యుండు. నందొక్కవిరించిజననం బెఱింగించితి. నింతియ కాని
సృష్టి కిది నిశ్చయం బన రాదు. ఈ యర్థంబున జగన్మాయాస్వ
రూపంబు తేటపడం జెప్పెద; నాకర్ణింపుము. ౭౬.

ఉ. భూరిగుణాఢ్యుఁ డొక్కమునిపుంగవుకూర్మితనూభవుండు దా
శూరుఁడు వేదపారగుఁడు సువ్రతుఁ; డాతని తల్లిదండ్రులున్
ఘోరవనంబులోన మృతిఁ గూలిన బెగ్గిలి యేడ్చుచుండఁగా
ధీరతఁ దోఁప వచ్చి వనదేవత పల్కె దయాసమేత యై. ౭౭.

ఉ. ఇచ్చటఁ గాన నొక్కఁడవ యేటికి నేడ్చెదు? వన్న, యేడ్వఁగాఁ
జచ్చినవారు వచ్చెదరె, చావును బుట్టును సృష్టి కింతకున్
వచ్చినజాలు గాక, మనవారికె వచ్చెనె? దేహకోటికిం
జచ్చుటవశ్య, మెందును విచారము సేయకు, దేహధర్మముల్. ౭౮.

క. ఉదయించుచు విహరించుచుఁ
బదపడి న స్తమితిఁ బొందుభానునిభంగిన్
విదితము జీవుల కెల్లను
నిది సహజము నీరి కడల నేటికిఁ బుత్రా. ౭౯.

వ. ధీరోదాత్తుండ వై తెలిసి నిలువు మని బోధించిన నవ్విప్రకుమా
రుండు దుఃఖం బుడిగి; తల్లిదండ్రులకుఁ బరలోకక్రియ లాచరించి,తపం
బు సేయ నుద్యుక్తుం డై. ౮౦.

క. శ్రద్ధాజడమతి నెందును
శుద్ధం బగుభూమి లేమి సూచి, యది కడున్
శుద్ధం బని వృక్షముతుది
సిద్ధాసననిష్ఠఁ దపము సేయుచు నుండెన్. ౮౧.

సీ. ఆతనితపమున కగ్ని ప్రత్యక్షమై
వరము లిచ్చుటయును వాఁడు మఱియుఁ
దనరు నావృక్షాగ్రమున నుండి యజ్ఞార్థన్
పరత మై మఱి దివస్పతిగుఱించి
దశహాయనంబులు తప మాచరించుచు
మానసంబున వస్తుమహిమఁ గూర్చిన్
నాకుల రప్పించి నరహయగోమేధ
యాగంబు లెన్నఁ బెక్కాచరించెఁ;
గీ. బరఁగ బహుదక్షిణల విప్రవరులఁ దనిపి
కాలవశమున నాతనికర్మఫలము
చిత్తనైర్మల్య మొందింపఁ జెన్ను మీఱ
జ్ఞానరూపమ్ము దనయంత గానఁబడియె. ౮౨.

వ. ఇవ్విధంబున దాశూరుండు నిర్మలజ్ఞానసమేతుం డై యుండునంత ౮౩.

చ. స్థిరమతి నొక్కనాఁడు వనదేవత యమ్మునినాథుపాలికిన్
బరువడి నేఁగుదెంచి ప్రణిపత్తి యొనర్చుచు సంయమీంద్ర చె
చ్చెర నొకపుత్త్రు నాకు దయ సేయుము; సేయక యున్న నీపదాం
బురుహములొద్ద నే ననలమున్ వెసఁ జొచ్చెద నన్న నవ్వుచున్.

వ. దాశూరుండు దనచేతికమలం బద్దేవికి సమర్పించి 'మాసమాత్రంబున విమలలోచనుండును శాంతుండును నగుతనయుం గాంచెదు, పొమ్ము; నన్ను నిర్బంధించి యడిగితివి గావున నీతనూజుం డజ్ఞాని యగు.' నని పలుకుటయు, నద్దేవతయుం బ్రసన్నముఖారవిందయై 'యట్లేని నీకుం

బరిచర్య సేయుచుండెదు, నీప్రసాదంబున నుద్భవించినకుమారుండు
పరమజ్ఞానసమర్థుం డగుఁగా దయసేయు' మనిన నట్ల కాక యనివీడ్కొ
ల్పుటయు, నద్దేవత చనియె నంత. ౮౫.

క. నెలనాళులు నిండఁగ న
ప్పొలతికి నుదయించె సుతుఁడు పుణ్యాత్ముఁడు ని
ర్మలతేజోనిధి కడుఁ బెం
పొలయఁగ నవలతకుఁ బుష్ప ముదయించుగతిన్. ౮౬.

వ. ఇట్లుదయించుటయు నద్దేవి యక్కుమారు నెత్తుకొని చనుదెంచి
యమ్మునిపుంగవుని పాదకమలంబులు సోఁక బాలునిం బెట్టి తానును
వినయావనతవదనారవింద యై 'మునీంద్రా, నీప్రసాదంబున నుద
యించినయిక్కుమారునకు జ్ఞానోపదేశంబు సేయుం డ' ని ప్రార్థిం
చిన నమ్మునిప్రవరుండు— ౮౭.

క. వేదములును శాస్త్రములును
వేదార్థంబులుఁ బురాణవిద్యలుఁ గథలున్
మోదమునఁ జెప్పి యొకనాఁ
డాదరమునఁ బుత్త్రుఁ జూచి యమ్ముని పలికెన్. ౮౮.

గీ. ఓకుమార నీకు నొకకథఁ జెప్పెద
సర్వతత్త్వశాస్త్రసమ్మతంబు
నఖిలలోకసేవ్య మైనయర్థం బిది
వినుము చిత్తగించి యనఘచరిత. ౮౯.

సీ. స్వాంతుండు నా నొక్కసౌందర్యవంతుండు
భుజవీర్యవిఖ్యాతుఁ డజితబలుఁడు
శ్రీమంతుఁ డుత్తమస్థితి యతిశూరుండు
రాజశిరోమణి రాజఋషభుఁ
డారూఢకులజాతుఁ డసమానచారిత్రుఁ

దతిసూక్ష్మబుద్ధి గర్వాతిరూఢుఁ
డతిసాహసుఁడు గలఁ; డతఁడు సేయఁగ సుఖ
దుఃఖకారణము లై తోఁచుపనులు
గీ. తలఁచి చూడంగ జలనిధితరఁగలట్టు
లెన్న గోచర మై యుండ నెసఁగు; నతఁడు
విహరణక్షమలీలల విశద మైన
యట్టిదేహత్రయము దాల్చి యలరు చుండు. ౯౦.

వ. తచ్చరిత్రంబు జగంబులం దా నాక్రమించి యుత్తమమధ్యమాధమం
బు లై యుండు. నతం డాకాశంబునఁ జరించుపక్షియుంబోలె నంద
సంచరించుండె. ననిన విని పుత్త్రుం డి ట్లనియె. ౯౧.

గీ. అయ్య, స్వాంతనాముఁ డతఁ డెవ్వఁ? డెట్లంగిఁ
దనువు లెన్ని దాల్చి వినుతి కెక్కె?
నెచట నుండు? నాతఁ డేలీల విహరించెఁ?
జెప్పు. మనిన, నతఁడు చెప్పఁ దొణఁగె. ౯౨.

క. విను పుత్త్ర, తెలియఁ జెప్పెద,
ఘన మగుసంసారచక్రకలనం బిది; త
జ్జననము సవస్తువిస్తర
మును నగుకథ యగుట చిత్తమునఁ గనుఁగొనుమీ. ౯౩.

సీ. పరమవియద్వీథిఁ బ్రభవించునట్టి సం
కల్పంబు స్వాంతవిఖ్యాతి నొందుఁ;
దాన జనించుచుఁ దాన లీనతనొందు
నతఁడు యీయఖిలంబు నని యెఱుంగు;
హరిహరబ్రహ్మాదు లందఱు నాతని
యవయవరూపు లై యలరుచుంద్రు;
ఘనజగత్త్రయము నాతనిపట్టణం బగు;

వానితలంపున వనజభవుఁడు

గీ. నిలఁ జతుర్దశభువనంబు లేలెఁ దాన;
వనము లెల్లను నుద్యానవనము లతని;
కరయ మందరమేరుహిమాద్రు లెలమి
కేళిశిఖరుల నా నెందుఁ గీర్తిఁ కెక్కు. ౯౪.

వ. శీతోష్ణరుచు లయినసోమసూర్యులు దీపంబులు, నుత్తుంగతరంగంబులు గల గంగాదినదులు ముక్తాహారంబులు, లవణేక్షుదధిక్షీరాదులు సలిలంబులును ముక్తామణులువిద్రుమాంకురంబులును బాడబంబునుజలంబునుం గల సప్తార్ణవంబులు కేళీదీర్ఘికలై యొప్పారు. జగద్విహారంబునకు గృతార్థంబు లగు శరీరగృహంబుల సంకల్పమహామహీపాలుం డధమోత్తమమధ్యమంబు లగు తమోరజస్సత్త్వగుణంబు లనుదేహత్రయంబుతో విహరించు. నవి యెట్టి వనిన. ౯౫.

క. అరయఁ దమోరూపంబునఁ
బరఁగినసంకల్పలీల ప్రాకృతచేష్టా
పరతయు దీనత్వము నై
తరమిడి క్రిమికీటకాదితనువులు దాల్చున్. ౯౬.

గీ. సత్త్వరూప మైనసంకల్ప మది యాత్మ
బోధరమ్యనిత్యబుద్ధిఁ దగిలి
కేవలంబ యాత్మభావంబు దాన యై
యవనిరాజ్య మేలినట్టు లుండు. ౯౭.

గీ. సకలసంసారభోగవాసనలఁ దగిలి
పుత్త్రదారాదిమిత్త్రులమైత్త్రి నెగడి
జననమరణాదిసుఖదుఃఖసమితి మునుఁగు
ఘనరజోరూపసంకల్ప మనఘచరిత. ౯౮.

క. ఈ సంకల్పత్రయమును

నోసరిలం జేసి చిత్త మొక్కంతయు గా
జేసి పరమాత్మఁగూర్చిన
యాసంకల్పమునఁ బొందు మమలవిచారా. ౯౯.

వ. సకలవిషయనిరసనం బగుమనంబున మనోనియమనంబుఁ జేసి, బాహ్యా భ్యంతరాదిసంకల్పత్రయంబు నాశం బొనరింపు. మనిన దాశూరునకు బుత్త్రుం డి ట్లనియె. ౧౦౦.

క. జనకా, యీసంకల్పం
బెనయఁగ నేవెంటఁ బుట్టె? నెబ్భంగి విన
ర్ధన మొందు? నెట్టు లయ మగు?
వినిపింపుము దీనివిధము విస్పష్టముగన్. ౧౦౧.

క. అనవుడు దాశూరుం డి
ట్లనియె. —ననంతస్వరూప మగునాత్మునకున్
ఘనసంసారోన్ముఖతయ
విను సంకల్పంబు నాఁగ వెలయుఁ గుమారా. ౧౦౨.

వ. ఎట్లనిన, లవమాత్రంబగుపరమాత్మయ జగత్స్వరూపం బగు. మేఘంబు నుంబోలె సాంద్రం బై చిత్తం బగునది ప్రపంచభావన నాత్మవ్యతిరిక్తం బయి తోఁచు. బీజం బంకురం బయినట్లు, సంకల్పంబు ప్రపంచం బగు. నీసంకల్పంబు తాన జనియించి, తాన వర్ధిల్లి, తాన యణంగుచుండు. నీన సుఖంబు లేదు. దుఃఖం బాపాదించుచుండు నట్లు గావున సంకల్పభావన లుడిగి శుభంబు నొందుము ౧౦౩.

గీ. అనఘ, సంకల్పనాశన మయ్యె నేని,
యత్నములు మీఁదఁ బొడమక యణఁగి పోవు.
భావనాభావములు లేక పరఁగు నేని,
యదియ సంకల్పనాశన మగుఁ గుమార. ౧౦౪.

గీ. కడఁగి సంకల్పమును నసంకల్పములును

మనము చేతన; మనమును దునిమి వైచి,
యాత్మనిష్ఠుఁడ వై యుండు. మట్లు సేయ,
దుష్కరము నీకు మఱి లేదు దోషదూర ౧౦౫.

వ. అని మునీంద్రుం డన్కుమారు బోధించె. నని చెప్పి వసిష్ఠుండు మఱి
యు నిట్లనియె. ౧౦౬.

క. ఈ దాశూరాఖ్యానము
వేదాంతసమాన మాత్మవిద్యామృతముౕ;
మోదమున నీకుఁ జెప్పితి
నాదరమున; నిది జగద్విహారము రామా ౧౦౭.

వ. అని దాశూరోపాఖ్యానంబు సెప్పి యింక నీ స్థితిప్రకరణతాత్పర్యంబం
తయు నుపదేశంబునం జెప్పంబడు తత్ప్రకారం బెఱింగించెద, సావ
ధానుఁడ వైవిను మని వసిష్ఠుం డిట్లనియె ౧౦౮.

క. తుద మొదలు లేక కాలం
బిద మిథ్థ మనంగరాక యిందుల నూ
తేం ౘ్లిని యంత. యింతకష్టపు
బ్రతుకులయం దేమి యాస్థ పరమవివేకా. ౧౦౯.

క. భావశ్రీమయగర్విత
మై వెలసినయంత రాత్మ నడఁచినధీరుం
డే వెంటను విహరించునో
యా వెరవున సంచరింపు మర్కకులేశా. ౧౧౦.

గీ. ఇచ్ఛ లేకయ రత్నంబు లెట్లు వెలుఁగు,
ఘటపటాదులు నెబ్బంగిఁ గానిపించు,
నట్ల యణుమాత్ర మగుపరమాత్మునందు
జగము లన్నియుఁ దన లోన సంచరించు. ౧౧౧.

గీ. కణఁగి యాత్మయందుఁ గర్తృత్వమును నక
ర్తృత్వమును వెలింగి తోఁచుచుండు,

నాస లేక సేయు నటు గాన కర్త గాఁ
డెనయఁ గర్త చెంత నునికిఁ జేసి. ౧౧౨.

గీ. కార్యములు సేయు నెడలఁ దాఁ గాని వాఁడ
నైనభావన గట్టిగా నాత్మ నిలిపి,
సేయవలసినకార్యంబు సేయు, మన్ని
పనులయెడను నిర్లేపతఁ బరఁగు మెందు ౧౧౩.

గీ. అట్లు గాక యున్న నఖిలంబునకు నేన
కర్త ననుతలంపు గలిగియుండు;
సకలకార్యములును సమతమైఁ జేసిన,
యదియ యుత్తమంబు నని యెఱుంగు. ౧౧౪.

వ. రాగద్వేషంబుల మోదఖేదంబులం దొఱంగి సంకల్పక్షయంబు సేయ సమతయ చిక్కియుండు. కాదేని సర్వకర్తవ్యంబును నకర్తృత్వంబున విడిచి మనోలయంబు సేసి యెవ్వండు సుఖయించు నట్టివాఁడవై సుఖయింపుము. ౧౧౫

క. విను దేహాహంకారము
సునిశిత మగుచున్న కాలసూత్రపదవి దా
పనపథ మవీచివాగుర
ఘనమగునసిపత్త్రవనముఁ గాఁ దలఁపు మదిన్. ౧౧౬.

ఉ. కర్తను నేను సీతుఁడును గా మని యైనఁ దలంపు, మింతకున్
గర్తను నేను వేఱొకఁడు గాఁ డని యైనఁ దలంపు, మెవ్వఁడో
కర్త మ తేను నెవ్వఁడనొ కార్యమునం దని యైన, నుత్తముల్
వర్తిలుశిష్టమార్గమున వర్తిలి, సౌఖ్యము నొందు రాఘవా.

క. వాసనలఁ దగులు బంధము,
వాసన లుడుగుటయ మోక్షపద, మని మదిలో
వాసనలు దొఱఁగి మఱి మో

త్తాసక్తియు విడువు మీఁద నకటా కులేశా. ౧౧౮.

వ. అందు మనోవాసనలు విడిచి నిర్మలంబు లగుగుణమైత్ర్యాదివాసనలం గీలింపుము. తద్వర్తనంబుం దెలిసి యవియునుం బరిత్యజించి, శాంతి వహించి చిన్మాత్రవాసనల సుఖించి, మనోబుద్ధిసమన్వితం బైన తద్వాసనాపరిత్యాగంబు చేసి, సుస్థిరసమాధానంబున నెద్ది తెలిసిన దదియునుం బరిత్యజించి,మనోవృత్తిం జేసి సర్వదృశ్యంబును విడుచున ప్పు డెద్ది శేషించె. నదియ మోక్షం బనంబడు. నట్టిపుణ్యాత్మునకు సుజ్ఞానకర్మంబులు సేసినను జేయకుండినను విరోధంబు లేదు. మఱియును.

క. పాయక నిర్వాసన ని
శ్శ్రేయోధికుఁడై నయతనిచిత్తముఁ కు నా
ధేయంబును మఱి యందును
హేయంబును ననఁగఁ గలదె యినవంశనిధీ? ౧౨౦.

గీ. యుక్తి సంచరింప నోపిన సంసార
మయము గోష్పదాభ మయి యణంగు;
యుక్తి లేక తిరుగునుద్వృత్తునకు మహా
ర్ణవముభంగి నతనిఁ దివిరి ముంచు ౧౨౧

వ. ఈయర్థంబున ముదితాత్ములగుపూర్వజుల చేత వినంబడు పావనంబు లగుకచగాథలు గల వత్తెఱంగు తేటపడ నాకర్ణింపుము. బృహస్పతినందనుం డగుకచుం డాత్మసమాధిం దెలిసి యొక్కనాఁ డేకాంతంబున నుండి గద్గదకంఠుం డగుచు మధురంబుగా ని ట్లనియె ౧౨౨.

కచుని గాథ.

సీ. ఏమి సేయుదు? నింక నెక్కడఁ బోదు? నే
నేమి చేపట్టుదు? నేమివిడుతుఁ?
బ్రళయకాలాంబుధిభంగి విశ్వంబున
బ్రహ్మంబు నిబిడమై పరఁగుచుండు.

వెలుపల లోపల వెలయ దిక్కులయందుఁ
క్రిందను మీఁదను సందులందు,
నిక్కడ నక్కడ నెల్లచోటుల నైన
నాత్మ లేకున్నచో టరయ లేదు;

గీ. ఒనర నే నెల్లచోటుల నున్నవాఁడ;
నన్నియును నిండి నాయందు నున్న వెపుడు;
నిఖిలజగములు చిన్మయం బై వెలుఁగు
నాత్మలోపల; నే నేమి యభిలషింతు? ౧౨౩.

వ. అని నిరంతరానందపరిపూర్ణమానసుం డై యుండె నని కచగాథ ప్రసంగం బెఱింగించి వసిష్ఠుండు మఱియు ని ట్లనియె. ౧౨౪.

క. ఎవ్వరు సత్త్వగుణంబున
నివ్వటిలుదు? రట్టియోగనిత్యులు సుఖు లై
యెవ్వేళ నైన వాడరు
మవ్వం బగుకనకమయకమలముంబోలెన్. ౧౨౫.

గీ. కోరవలసినవస్తువు కోరికొనరు,
కడు రమింతురు సిద్ధమార్గములయందుఁ,
జంద్రబింబంబులోపలిశైత్య మట్లు
గుణము లెడఁబాయ రాపదగూడినపుడు. ౧౨౬.

గీ. ఈ రహస్యోపదేశము నిట్లు నీకు
నెఱుఁగఁ జెప్పితి మున్ను నాయెఱిఁగినంత;
శాంతచిత్తుఁడ వై వెలిచింత లుడిగి
నిత్యసుఖి వై చరింపుము నృపవరేణ్య. ౧౨౭.

వ. అని యిట్లు స్థితిప్రకరణకథా ప్రసంగంబు వసిష్ఠుండు రామచంద్రున కెఱింగించె; ననిన విని భరద్వాజమునీంద్రుండు వాల్మీకి కి ట్లనియె.

గీ. అమృతరససమాన మగుభవద్వాక్యంబు

లధిక విన(గ మది గృతార్థక మయ్యెః
ననఘు, యవ్వసిష్ఠుఁ డటమీఁద రఘుపతి
కేమి సెప్పె, దాని నెఱుఁగవలయు. ౧౨౮.

వ. అని యడుగుటయు. ౧౨౯.

(అంబురుహమాలావృత్తము)

శ్రీరమణీముఖపద్మ దివాకర శిష్టమానసమందిరా
భూరిదయాకర పూరితసద్గుణ భూషణా రిపుశోషణా
వారిజసంభవపూజిత సోమదివాకరానలలోచనా
నారదగీతచరిత్ర యహోబలనాయకా శుభదాయకా. ౧౩౦

క. అద్వైతవాదమహిత భ
రద్వాజ వసిష్ఠ భృగు పరాశర శుక కృ
ష్ణద్వైపాయనముని ముఖ
విద్వన్నుతనిత్యచరణ విశ్వాభరణా. ౧౩౧

(మాలిని).

కువలయదళభాసా కుందమందారహాసా
భువనభరణదక్షా పుండరీకాయతాక్షా
ధవళవిపులకీర్తిః ధర్మరాగానువర్తీ
వివిధమతివిహారీ విశ్వలోకోపకారీ. ౧౩౨.

(గద్య).

ఇది శ్రీనృసింహవరప్రసాదలబ్ధకవితావిలాస భారద్వాజసగోత్ర
పవిత్రాయ్యలామాతృపుత్త్ర సరసగుణధుర్య సింగనార్య
ప్రణీతం బైనవాసిష్ఠ రామాయణంబునందు
స్థి తి ప్ర క ర ణం బ న్న ది
తృతీయాశ్వాసము.

# వాసిష్ఠరామాయణము.

## చతుర్థాశ్వాసము.

క. శ్రీగౌరీసంతతనుత
సాగరతనయాకుచాగ్రసన్మణిహారా
నాగేంద్రశయన ఘనది
జ్నాగేంద్రపరీతకీర్తి నరమృగమూర్తీ. ౧.

### ఉపశమనప్రకరణము.

వ. దేవా, సకలతత్త్వార్థవివేకి యగువాల్మీకి భరద్వాజున కిట్లనియె. నట్లు స్థిత్యుత్పత్తిప్రకరణంబు సెప్పి వసిష్ఠుండు రామచంద్రుం గనుంగొని యిట్లు వక్కాణించె. రాఘవతిలకా! జగదుత్పత్తి స్థితిలయకారణంబు మనం బని సెప్పంబడు. తత్ప్రశమనోపసిద్ధిదం బగునుపశమనప్రకరణంబు సెప్పెద. నందు, జనక, పుణ్యపావన, బలి, ప్రహ్లాద, గాధి, ఉద్దాలక, సురఘు, భాసవిలాస, వీతహవ్య, ఆకాశగత్యభావంబు లనం బరఁగినట్టి జీవన్ముక్తివర్ణితం బైన యితిహాసదశకంబు గలదు. అందు ప్రథమం బగుజనకోపాఖ్యానంబు తేటపడ నెఱింగించెద నాకర్ణింపుము. ౨.

### జనకోపాఖ్యానము.

క. మునినుతచారిత్రుఁడు దు
ర్జనదూరుఁడు మిథిల యేలు జనపతి జనకుం
డనునతఁడు రాజ్యసుఖములు
మనముఁ దగిలి యాత్మసుఖము మఱచి తిరుగఁగాఁ. 3.

ఉ. అంతఁ బ్రవేశ మయ్యె మదనాధిపరాజ్యరమావిభూషణా
నంతము భూరిసౌరభలతాంతము కోకిలచంచరీకసా
మంతము పూర్ణచంద్రరుచిమంతము పాంథవిలాసినీమనో
ధ్వాంతము దంపతిస్వదనవంతము నాఁగ వసంత మున్నతిన్. ౪.

వ. ఇట్టి వసంతసమయంబు సకలజీవస్వాంత సంతోషణక్రాంతంబై ప్రవ
ర్తిల్లు చున్నసమయంబున. ౫

గీ. ఉల్ల మురియాడ మధువేళ నొక్కనాఁడు
వనమునకు నేఁగి, తనుఁ గొల్చి వచ్చుజనుల
నునిచి, యొక్కండ చని, యందు నొకతమాల
కుంజమున నాడుమాటలు కోరి వినియె. ౬.

క. విని డాయఁ బోవునప్పుడు
తనువు లదృశ్యంబు లగుచుఁ దనరెడుసిద్ధుల్
వినుతచరితార్థగీతలు
పనుపడఁ దమలోన నిట్లు పలికిరి రామా. ౭

వ. అందుఁ బ్రథమసిద్ధుండు. ౮

గీ. చూడఁ బడుచున్నవస్తువుఁ జూచి దాని
యోగమున నాత్మతత్త్వసముత్థ మైన
జ్ఞాననిశ్చయనిశ్చలానంద మెద్ది
యది యుపాసింతు మనమున ననుదినంబు. ౯.

క. పూని యభీష్టపదార్థము
గానంబడునపుడు చిత్తకలితం బగున
య్యానంద మెద్ది యది బ్ర
హ్మానందం బని భజింతు ననవరతంబున్. ౧౦.

వ. అనిన విని రెండవసిద్ధుండు. ౧౧.

గీ. ద్రష్టృదర్శనదృశ్యసంతతిఁ దదీయ

వాసనాయుక్తముగ నెడఁబాసి ప్రథమ
దర్శనాభాస మైనయాత్మస్వరూప
మెల్లకాలంబు నే భజియింతుఁ దగిలి. ౧౨.

క. ఏవెలుఁగు తాన వెలుఁగఁగ
నావెలుఁగునఁ గానిపించు నఖిలము వెలుఁ గై,
తా వెలసి మొదల వెలిఁగెడు
నావెలుఁ గగునాత్మ నే నుపాసింతుఁ దగన్. ౧౩.

వ. అనిన తృతీయ సిద్ధుండు. ౧౪.

గీ. కలదు లే దను రెండుపక్షములనడుమఁ
జెంది సర్వంబుఁ బొడగానఁ జేయుచున్న
యట్టి నిత్యస్వరూపంబు నాత్మయందు
నిలిపి సద్భక్తి సతతంబు దలఁతు నేను. ౧౫.

క. ఆకారము గల దనియు ని
రాకారం బనియు శూన్య మను జనమతముల్
పోఁకక సంవిద్రూపు ని
రాకారము నైనయాత్మ ననుసంధింతున్. ౧౬.

వ. అనినఁ జతుర్థసిద్ధుం డి ట్లనియె. ౧౭.

(మత్తకోకిల).

ఆజగత్పతి చిత్తగేహమునందుఁ గాఁపుర ముండగాఁ
బూజసేయక యొండువేల్పులఁ బూని కొల్వఁగఁ బోవుటల్!
రాజసంబునఁ జేతికౌస్తుభ రత్నమొల్లక బేల వై
గాజుఁబూసలు విల్వ సేయఁగఁ గాంక్ష సేసెద రే మనన్. ౧౮.

క. అని సిద్ధవరులు వలికిన
యనుపమగీతార్థగీత లన్నియుఁ దనలోఁ
గని ఖేద మినుమడింపఁగ

ననఘాత్ముఁడు జనకుఁ డిట్టు లని చింతించెన్. ౧౯.

సీ. కటకట ! యత్యంతకష్టతరంబులు
లోలంబు లైనయాలోకదశల,
ఱాలపైఁ బొరలెడిఱాతిచందంబున
ననిశంబు బొరలుచు, నవధి లేని
కాలంబునం దొక్కకళ యైన లేనియీ
బ్రతుకున కై పొక్కి పడెడునాకు
నీరాజ్య మన నెంత? యింత యేమిటి? కిది
పాసియుఁ బాయక భ్రమలఁ బెట్టు.

గీ. నిట్టి సంసారతరుమూల మీమనంబు.
ఇదియ సంకల్ప మనఁబడు. నిట్టిమనముఁ
ద్రుంచి యీపాదపంబు నెండించువాఁడ.
నేల మూఢునిగతి నాకు నిందుఁ దగుల? ౨౦.

క. తెలిసితిఁ దెలిసితి; నిఁక నా
తలఁపులు చేకూఱెఁ; బ్రజ్ఞఁ దరలించెడు నీ
ఖలు నాత్మచోరుఁ జిత్తము
బలిమి నిరోధించి త్రుంచి భ్రాంతి నణంతున్. ౨౧.

క. దేవత లగునీసిద్ధులు
వావిరిఁ దలపోయుసాధువాదంబుల ని
ష్ఠావాప్తి యయ్యె; నానం
దావృత మగునాత్మపదము నందెదఁ బ్రీతిన్. ౨౨.

క. ఇది యే, నిది నాయది, యని
మదిఁ బొడమెడు నహమికామమత్వము లుడిగెన్,
హృదయరిపుఁ డణఁగె, శాంతియు
విదితం బై తోఁచె, నోవివేకమ జేజే. ౨౩.

గీ. అని విచారించి పరమసమాధి నొంది
శాంతనిశ్చలచిత్తుఁడై జనకవిభుఁడు
చిత్రరూపంబుకైవడి చేష్ట లుడిగి
ధారుణీనాథ కొంతసేపూర కుండె ౭౪.

వ. ఇవ్విధంబున నుండి కొంతప్రొద్దునకుం దెలిసి యవ్వనంబు వెలువడి నిజపరిజనంబులం గూడుకొని ౭౫.

క. తనపురికి నరిగి జనకుఁడు
పనుపడఁ గర్తవ్య మైనపనులు నిరీహం
బునఁ జేయుచుండె నిచ్చలు
దిననాథుఁడు దినము గడపుతెఱఁగున నధిపా. ౭౬.

పుణ్యపావనోపాఖ్యానము.

వ. అని చెప్పి వసిష్ఠుండు వెండియు ని ట్లనియె.—ఆకాశఫలపాకంబునం బోలె జనకజ్ఞానంబు వర్ణింపంబడియె. నట్లు గావున యోగసిద్ధి క్రమాభ్యాసంబున సిద్ధించు నని మోక్షశాస్త్రంబుల వినంబడు. నీకథాకర్ణనంబునం జేసి యాత్మజ్ఞానంబు ప్రకాశించి చిత్తశాంతి యొనచుఁ నట్టిపుణ్యపావనోపాఖ్యానంబు గల; దందు మొదలం బ్రశాంతస్వాంతుఁ డయ్యును జీవన్ముక్తుం డై వర్తించుట సెప్పంబడు. నాకర్ణింపుము. ౭౭.

సీ. అన విని రాముఁ డి ట్లను మహాభాగ! నీ
మితవాక్య మతులగంభీర మరయ,
విను మహంకారంబు విడు మని సెప్పితి
వీయహంకృతి మాన్ప నెట్లు వచ్చు?
నిఖిలదేహంబులు నిశ్శేష మై పోక
యది యేకతమ మాన్ప నలవి యగునె?
కూఁకటివేళ్లకుఁ గొడవంటఁ గోయక

భూమీరుహం బెండిపోక యున్నె?

గీ. యనిన నమ్ముని—వాసన లణఁపవలయు;
నవి యణంపంగ రెం డుపాయములు గలవు,
ధ్యేయ మన నేయ మన; నివి దేటపఱుతు
చిత్తగింపుము; రామ రాజీవనయన. ౨౮.

వ. అవి యెయ్యవి యంటేని. ౨౯.

మ. ఇవి నాప్రాణము, లీపదార్థములు నా కేప్రొద్దు ప్రాణంబు, నా
కివి యెందుఁ వెలి గావు, వీని విడి నే నెట్లుందు? నంచుండు నీ
యవిచారం బెడలించి, ద్రవ్యములయం దాసక్తి చాలించి, కృ
త్యవిధుల్ శీతలభాతిఁ జేయుటయ ధ్యేయత్యాగ మౌ రాఘవా. ౩౦.

గీ. సర్వమును నేన యనుబుద్ధి సర్వమైన
వాసనాశయ మొనరించు వరుసఁ; దాన
మనముతోడనె దేహసంబంధ మెడలు;
నదియ చూవె నేయత్యాగ మమలహృదయ. ౩౧.

క. తనర నహంకృతి యనువా
సనవలనఁ దొలఁగి మిగుల శాంతాత్మకుఁ డై
మను నాధ్యేయత్యాగిని
విను జీవన్ముక్తుఁ డండ్రు విమలవివేకా. ౩౨.

క. కర్మములను వాసనలను
నిర్మూలము గాఁగ విడిచి నిఖిలము దానౌ
ధర్మము నేయత్యాగం;
బర్మిలి నాతండె ముక్తుఁ డర్కకులేశా. ౩౩.

క. ధ్యేయత్యాగవిలాసత
నాయత మగుపూర్ణదృష్టి నంతయు నీవై
పాయక జీవన్ముక్తుఁడ

వై యిల విహరించుచుండు మనిశము రామా. ౩౪.

క. వెలిఁ గృత్రిమసంరంభం
బలవడఁ గర్తయును నీవ యై చిత్తములో
పల సరభసకర్తృత్వం
బులు దొఱఁగి చరింపు లోకమున రఘురామా. ౩౫.

గీ. ఇతఁడు నాకు మిత్త్రుఁ డితఁ డమిత్త్రుం డగు
నని తలంచువార లల్పమతులు.
తగ నుదారచిత్తు లగువారి కెందును
వసుధ యెల్ల బంధువర్గ మరయ. ౩౬.

(త ర ల).

వివిధజన్మశతావృతం బయి విభ్రమం బగుసృష్టిఁ దాఁ
బ్రవిరళంబుగ వీరు బంధు లబంధు లీ రని చూడఁగా
నవిరళభ్రమ గాని తాఁ బరమార్థ మెందును గాదు; త్రై
భువనము న్నెఱి బంధురం బగుబుద్ధి బంధువు గా దిలన్. ౩౭.

వ. అని చెప్పి మఱియు ని ట్లనియె. ౩౮.

సీ. తనరు నీయర్థంబునను బుణ్యపావన
చరితంబు చెప్ప నచ్చెరువు వినుము.
దీర్ఘతముం డనుదివ్యమునీంద్రుని
తనయులు పుణ్యపావనులు నాఁగ
గల రిద్ద. అందు నగ్రజుఁడు బ్రహ్మజ్ఞాని
పుణ్యుండు. తమతండ్రి పుణ్యలోక
గతుఁడైన విప్రసమ్మతితోడ నతనికిఁ
బారలౌకికములు భక్తిఁ జేసి,

గీ. యనుజుఁ బొడగాన కెంతయు నడవి వెదకఁ
బోవునప్పుడు కానలోఁ బొగిలిపొగిలి

తండ్రిం జేకొని వనరుచు ధరణిం బొరలు
చున్న తమ్ముని బొడగాంచి యుమ్మలించి, ౩౯.

క. తూలుచుం డగ్గఱి కౌఁగిటఁ
గీలించుచుఁ గంటినీరు గీటి యతనిపై
ధూళి వెసఁ దుడిచి నెమ్మొగ
మాలోకించుచును బుణ్యుఁ డనుజుని కనియెన్. ౪౦.

ఉ. ఏమిటి కిందు నొక్కఁడవ యేడ్చెద వక్కట ! నేను గల్గ నీ
కేమి భయంబు? నీజనకుఁ డెందును బ్రాజ్ఞుఁడు, దివ్యమైన తే
జోమయసిద్ధిఁ గాంచె; విను శోకముఁ జెప్పఁగ నేల? మున్ను నీ
కీమహిఁ దల్లిదండ్రు లిటు లెందఱు చావరు? లెమ్ము తమ్ముఁడా. ౪౧.

వ. అది యెట్లంటేని; యత్యంతమోహావిస్తీర్ణంబును, శుభాశుభ తరంగితంబును, నైన వాసనామరుమరీచికాజలాశయం బనంతం బై ప్రవర్తిల్లు. నందు పుత్త్ర మిత్త్ర కళత్ర శత్రు లన నుదయించి స్నేహ మోహ ద్వేష దోష దశామయంబై స్వసంజ్ఞామాత్రం బగు నీప్రపంచంబున శత్రుభావంబున శత్రుండును,మిత్త్రభావంబున మిత్త్రుండునై విషామృతభావారూఢి నుండు. నేకత్వంబున సర్వపరిపూర్ణం బగు నాత్మ కితండు హితుం డితం డహితుం డను నివి కల్పనాకృతు. లిట్లు గావున. ౪౨.

గీ. పలలరక్తాస్థిమయదేహపంజరమున
నకట నే నేల యున్నాఁడ? నని తలంపు.
మేలు నీ వను నిద్ది యజ్ఞానబుద్ధి
గాని, పరమార్థమున వేఱు గలుగ దెందు. ౪౩.

క. అని బోధించినఁ దెలియక
తనజనకునిఁ దలఁచితలఁచి తలపోయుచు హా
యని యేడ్చుచున్న పావనుఁ

గనుఁగొని పుణ్యుండు తత్త్వగతి నిట్లనియెఁ. ౪౪.

క. ఈతండ్రికి నడలినగతి
నాతతముగఁ దొంటిభవములందులఁ గల యా
తాతలకుఁ బుత్త్రమిత్త్ర
వ్రాతములకుఁ జుట్టములకు వగవం దగదే. ౪౫.

వ. అది యె ట్లంటేని. ౪౬.

సీ. అనఘాత్మ విను మొక్కయద్రిశృంగంబున
సింహమ వై జనించితివి మున్ను,
మఱి దశార్ణక్షితి మర్కటం బై పుట్టి
తగఁ దుషారంబున ధరణిపతికిఁ
బట్టి వై యుదయించి, పౌండ్రదేశంబున
కాకమై యుదయమై, క్రమముతోడ
హైహయంబున మదహస్తి వై జనియించి,
గార్దభం బైతి త్రిగర్తభూమి,

గీ. సురఘుసుతుఁ డన సాల్వభూవరుఁడ వైతి;
సరభసంబునఁ బక్షి వై సంచరించి;
తేమి సెప్పుదు నీజాము లెన్నఁ బెక్కు;
లందు నేబంధులకు నేడ్చె దనుజవర్య ? ౪౭.

క. జననీజనకులు పురుషున
కనంతముగఁ బొలిసి పోదు. రది యేటికియో !
వనతరుపత్త్రము లెట్ల
ట్లని యెఱుఁగుము. దీనికేల యడలెదు వత్సా ? ౪౮.

గీ. కలదు లే దను రెండుపక్షములనడుమ
జరయు మరణంబు లేక నిశ్చలత వెలుఁగు
నట్టిపరమాత్మతత్త్వ మవ్యగ్రబుద్ధిఁ

దలఁపు; మూఢుఁడ వై పోకు తమ్ముకుట్టీ. ౪౯.

మ. అకలంకాత్ముఁడ వై నిరామయుఁడ వై యానందచిత్తుండ వై
సకలవ్యాపకతత్త్వబోధనిధి వై సమ్యగ్విధిన్ నీ మనో
వికచాబ్జంబున నిన్ను నీవ యెపుడున్ వీక్షించుచున్ సంభ్రమో
త్సుకభావంబులఁ బాసి నిత్యమును సంతుష్టుండ వై యుండుమీ.

వ. అని యనేకప్రకారంబుల బోధించిన యగ్రజువాక్యంబులు విని పావ నుండు సర్వదుఃఖరహితుండును, సర్వసంగవిముక్తుండును, జీవన్ముక్తుం డు నై ప్రవర్తిల్లె నని పుణ్యపావనోపాఖ్యానంబు సెప్పి, వసిష్ఠుండు రామచంద్రున కిట్లనియె. ఒక్కొక్కయెడలఁ బుణ్యాతిశయంబునం జేసి వైషయికసుఖము వైరాగ్యకారణం బగుట వర్ణింపంబడు. నీయర్థం బున బల్యుపాఖ్యానం బొక్కటి సెప్పెద; నాకర్ణింపుము. ౫౧.

## బల్యుపాఖ్యానము.

క. అనుపమపుణ్యుఁడు వైరో
చనుఁ డనుదనుజేంద్రవరుఁడు సకలావనియున్
ఘనుఁ డై పదికోటుల హా
యనములు పాలించి సౌఖ్య మందుచు నుండెన్. ౫౨.

సీ. వసుధపైఁ గలమహావస్తుసమూహంబు
లన్నియుఁ గ్రమయుక్తి ననుభవించి,
భోగేచ్ఛఁ దనిసి తా బుద్ధిలోఁ జింతించె
నొకనాఁడు మేడపై నుండి యతఁడు;
'మూఁడులోకముల కద్భుతకారణంబును
నఖిలభోగాఢ్యంబు నైనరాజ్య
మతిమోహమధురంబు నస్థిరంబును నిది.
యేటికి నీభోగ మేల నాకు ?

గీ. ననుభవించుపదార్థమే యనుభవించి,

పొంది విడిచిన కాంతనే పొంది విడిచి,
దినదినంబులు భ్రాంతుఁ డై తిరుగుచుండు
ప్రాజ్ఞుఁ డైనను మఱి సిగ్గుపడఁడు కంటె. ౫౩.

క. రేలుఁ బగుళ్లును విడివడి
యోలిన చనుదెంచుచుండు; నుడుగుట లే; దీ
కాలము చర్వితచర్వణ ;
మాలోకింపంగ సుఖము లల్పము లెందున్. ౫౪.

వ. అని విచారించి తొల్లి తన బాల్యంబునం దనతండ్రి యగువిరోచ
నుండు తన కుపదేశించిన వాక్యంబులు నాఁడు తలంచుకొని యతండు
శాంతస్వాంతుం డై యుండె. నవి యెయ్యవి యంటేని. ౫౫

క. బలియొక్కనాఁ డతిభక్తితోఁ దనతండ్రి
పాలికి నేతెంచి ప్రణతుఁ డగుచుఁ,
'బుణ్యాత్మ! సుఖదుఃఖములకు దూరం బగు
నద్దేశ మెద్ది నా కానతిమ్ము ;
ఎచ్చో టవిద్యయు నీషణాత్రయమును
జడిసిపోఁజేయు, విశ్రాంతి యొసఁగు?'
నని వేఁడుటయుఁ, దండ్రి తనయున కిట్లను;
వినవయ్య నందన, వితత మైన
గీ పరచిదాకాశకోశకోటరము పొల్చు;
నందు బ్రహ్మాండకోట్లు ప క్కణఁగి యుండు,
నచట నేలయు నింగియు నంబునిధులుఁ
దరులు గిరులును నదులుఁ దీర్థములు లేవు. ౫౬.

ఉ. అందు విశాలతేజుఁడు నృపాఖ్యుఁడు సర్వసముండు సంతతా
నందుఁడు సర్వసాక్షి యనఁ జాలిన యవ్విభుఁ డేలుచుండఁగా
నెందు నియుక్తుఁ డై యతని కేపను లైనను బొపఁ ద్రుంప న

స్పందబలాఢ్యుఁ డైన యనుసంధుఁడు మంత్రి గలండు పుత్త్రకా.

వ. అనిన విని బలీంద్రుం డయ్యాధివ్యాధిరహితం బగుదేశం బెయ్యది? యది యెవ్విధంబునఁ బ్రాపించు? నది యెవ్వరిచేతం బొందంబడియె? సకలజగజ్జేత యగునీ కజయ్యుం డగునరపాలుం డెవ్వం? డతనిమంత్రి యెట్టివాఁ? డానతిమ్మని యడిగిన, విరోచనుం డిట్లనియె. ౫౮.

సీ. అనఘాత్మ యొకదేశ మంటి నింతియ కాని
యవ్యయం బగుమోక్ష మదియ సువ్వె;
షడ్గుణపూర్ణుండు సర్వాత్మకుండు నగు
నారాజు నాఁ బరమాత్మసుమ్ము;
అతని కతిప్రాజ్ఞుఁ డగుమంత్రి చిత్తంబ,
యింద్రియార్థములఁ బాలించు నెపుడు;
పరఁగ ననాస్థయుఁ బరమంబు నగుయుక్తిఁ
గాని నాతని నోర్వఁ గడిఁది యొందు;

గీ. నిదియ యధికయుక్తి; యీయుపాయమునను
మహిత మైనచిత్తమత్తగజము
నణఁచినట్టి పుణ్యు లందుదు రేప్రొద్దు
నట్టి మోక్షపదము నచలహృదయ. ౫౯.

వ. ఎట్లనిన నప్రాజ్ఞుండును, నల్పప్రాజ్ఞుండును, ప్రాజ్ఞుండును, నన మువ్వురు గల; రందు నప్రాజ్ఞునకుఁ జిత్తంబున భోగానుభవంబు రెండుపాళ్లును, శాస్త్రచింత యొక్కపాలునుం, గలిగియుండు. నల్పప్రాజ్ఞునకు భోగానుభవం బొక్కపాలును, శాస్త్రచింత రెండుపాళ్లును, గలిగి యుండు. ప్రాజ్ఞునకు చిత్తంబు భోగానుభవరహితంబై వైరాగ్యధ్యానగురుపూజలం బరిపూర్ణం బై యుండు. ౬౦.

క. విను మల్పవిగహార్ణమున
ధనము నుపార్జింపు; దానఁ దగుసాధుల మ

న్ననఁ గూపుర్; వారిసంగతి
ఘనవిషయము లణఁగఁ దత్త్వగతిలాభ మగుర్. ౬౧.

వ. అని యివ్విధంబునఁ దమతండ్రి యుపదేశించిన వాక్యంబులకు సంతుష్టాంతరంగుం డై యచ్చేరువ నున్న శుక్రుం గని వినయావనతుం డై బలి యి ట్లనియె. ౬౨

క. ఏ నెవ్వఁడ ? నీ వెవ్వఁడ?
వీనిఖిలము నెంతమాత్ర ? మెట్టిది ? యేరూ
పే నిది ? యెయ్యది గల ? దిం
దానతి యిం డనిన, శుక్రుఁ డతనికి ననియెర్. ౬3.

క. పెక్కు లిఁక నేల ? మాకును
గ్రక్కున దివి కరుగవలయు రక్షోధిప ? నీ
కొక్కటి తెలియఁగఁ జెప్పెదఁ,
జక్కన విను సర్వశాస్త్రసారం బెల్లర్. ౬౪.

గీ. కణఁగి యెల్లచోటఁ గలది చిద్రూపంబు.
అదియ నీవు నేను నఖిలములును.
ఇదియ నిశ్చితార్థర్. మిది దప్ప మఱి లేదు
సర్వశాస్త్రసార సంగ్రహంబు. ౬౫.

క. ఈయర్థము నిశ్చయముగఁ
జేయక వేఱొక్కమతము సేయుట యెల్లర్
వే యేల బూది వేల్చిన
నేయినిఁ బోలియును మీఁద నిష్ఫల మందుర్. ౬౬.

గీ. అరయఁ జిత్తేచ్ఛ యుత మగునదియు బంధ,
మది విసర్జించి నిల్చిన నదియ ముక్తి,
నియతిఁ జిత్తును జైతన్యకళ యనంగ
సర్వసిద్ధాంతసంగ్రహసార మిదియ. ౬౭.

క. ఈవిధము నిశ్చయం బగు
భావారూఢప్రబోధపరిణతబుద్ధిన్
నీవ నినుఁ జూచుకొంచును
భూవినుత యనంతపదముఁ బొందుము ప్రీతిన్. ౬౮.

వ. అని చెప్పి శుక్రుండు దివంబునకుం జనియె. బలియును నీజగత్త్రితయంబును జిన్మయంబుగా మనంబునం దలంచి దృశ్యదర్శన విముక్తుండును, కేవలజ్ఞాన మయుండును, నూర్జితుండును, నిరాభాసుండును, సకలజగద్ద్రష్టయు, పరమేశ్వరుండును, నగు నాత్మ నే నని చైత్యనిర్ముక్తచిద్రూపుండును, సర్వపూరకంబును, సర్వంబును, శమితసకలసంవేద్యంబును, సంవిన్మాత్రంబును, నగు తత్త్వంబు దానయై మఱియును. ౬౯.

సీ. ఇది తలంచుచును గోవిదుఁ డగుబలి ప్రణ
వంబునం దర్ధమాత్రంబులోని
యర్థంబు మనమున ననవరతధ్యాన
కలితుఁడై కర్మసంకల్ప మెడలి,
జితచైత్యనిర్మలచేతనుఁ డై మది
దలఁచెడువాఁడును, దలఁపుఁ, దలఁపఁ
బడియెడునదియును, నెడఁబాసి యశ్రాంత
శాంతనిర్మలమానసంబుతోడఁ,

గీ బరఁగు నిర్వాతదీపంబుభంగి నతఁడు
పరము నగుచున్న నిర్వాణపదము నొందె.
నని వసిష్ఠుండు బలియుపాఖ్యాన మిట్లు
మనము దళుకొత్త రామచంద్రునకుఁ జెప్పె. ౭౦.

క. ఈయూఖ్యానాకర్ణన
మాయుః శ్రీ కీర్తు లిచ్చు నఘనిరసనముల్

జేయు, జగజ్జాలంబుల
మాయిక మణఁగించి, మోక్షమార్గము దెలుపున్. ౭౧.

వ. అని చెప్పి వసిష్ఠుండు రామచంద్రుం గనుంగొని యిట్టి తత్త్వజ్ఞానం
బు పరమేశ్వరానుగ్రహంబున కాని సంభవింప; దీయర్థంబున ప్రహ్లా
దోపాఖ్యానంబు గల దవ్విధంబు తేటపడ నెఱింగించెద. ౭౨

ప్రహ్లాదోపాఖ్యానము

సీ. వినుము ప్రహ్లాదుండు విష్ణు నారాధించి
బ్రహ్మవిజ్ఞానవిశ్రాంత మైన
పరమవిచారంబు వరముగా నియతాత్ముఁ
డగునాకు హరియిచ్చె నాత్మబోధ,
యది యెట్టిచంద మెు మొదల నేనెవ్వఁడ ?
నీసృష్టివిభ్రమ మెట్టి ? దరయ
నెక్కడి కేఁగెద ? నేమాట లాడెద?
నెద్ది యంగీకార్య ? మెద్ది కృత్య ?
గీ. మరయ బ్రహ్మంబు, పర్వతతరువనంబు
లతిజడంబును నైన యీయఖిలజగము
నాత్మరూపంబుగాదు, నా కన్య మిదియు,
నేను నీ సృష్టి గాకుని కిది నిజంబు. ౭౩

క. జడమును పవనస్ఫురణము
గడు నసదుద్భవము నల్పకాలము నన తాఁ
బొడవణఁగెడునదియును నగు
నొడలును నేఁ గాన, యెట్లొకో తలపోయన్. ౭౪.

సీ. కర్ణరంధ్రాంతరకలితక్షణంబున
జడము శూన్యము నైన శబ్దగుణము,
అస్థిరత్వగ్గ్రాహ్య మతిభంగురము చిత్స్వ

సొదలబ్ధార్థఁ మీ స్పర్శగుణము,
అతిలోలతనుమాత్ర మతితుచ్ఛ మస్థిర
ద్రవ్యనిష్ఠంబు నీ రసనగుణము,
దృష్టిదృష్టాంతమై ద్రష్టకేవలుఁ డైన
రూపు లే కణఁగు నీ రూపగుణము,

గీ. ఇవ్విధంబున నశ్వర కృతము నైన
ఘ్రాణమునఁ దోఁచు జాలుకని గంధగుణము;
నరయ నివి యెవ్వియును గానిపరమతత్త్వ
శుద్ధబుద్ధాత్ముఁ డగుపురుషుండ నేను. ౭౫.

వ. మఱియు మరణరహితుండును, నిర్మోహుండును, నిర్మలమానసుండును, నిర్వికల్పచిదాభాసుండును, బంచేంద్రియభ్రమరహితుండును, విగత కలాకలనుండును, శుద్ధచైతన్యస్వరూపుండును, వీతచేతశ్చిన్మాత్రుం డును, సకలప్రకాశుండును, నిర్మలసన్మయుఁడును, బహిరంతర్వ్యా పియు, నైన యద్దేవుండు తలంపంబడి వెలుంగు. నట్టితత్త్వంబు నే నతనిచేత సూర్యాతపంబై ప్రకాశించునదియును, ప్రకాశింపజేయు నదియును, దానరైు జగంబుల వెలుంగుచుండు. ౭౬.

క. మానుగ నింద్రియవృత్తులు
దీనన వెలుఁగొందుచుండుఁ, దేజముతోడఁ
లీన మయి ప్రజ్వరిల్లఁగఁ
గానంబడుచున్న యగ్నికణములువోలెఁ. ౭౭.

గీ. వివిధభావాంతరస్థుఁడై విగతచైత్య
చిన్మయుండును పరిపూర్ణచేతనుండు
నవ్యయాచ్ఛిన్నుఁ డగుచున్న యట్టియాత్మ
నేన యగు ; నాకు మ్రొక్కెద మానసమున ౭౮.

గీ. నిఖిలలోకప్రకాశమాణిక్య మైన

దేవ, చిరకాలమునకు సిద్ధించి యుదితుఁ
డై వెలింగెదు నిత్య యనంత నీవ
యేన యగునాకు మ్రొక్కెద మానసమున. ౪౯.

మ. అని చింతించుచు శత్రుసూదనుఁడు ప్రహ్లాదుండు దా నిర్వికే
ల్ప నిరాలంబసమాధి నిల్చె మది త్రైలోక్యం బింతయుఁ లేక వ్రా
సినరూపంబునుబోలె నేక మగుదృష్టిఁ బంచసాహస్రహా
యనముల్ నిర్మలనిష్ఠతోఁ బరమయోగానందనిర్మగ్నుఁ డై. ౫౦.

క. ఆయెడఁ బాతాళం బ
న్యాయమును నరాజకంబు నై ప్రజ మాత్స
ర్యాయమున లోభమోహ
ప్రాయమున నశించుచుండెఁ గృపాతత్పరుఁ డై. ౫౧.

ఉ. కంబుగదాసిచక్రఘనకాంతులు బాహు లలంకరింప, వ
క్షంబున శ్రీతనుద్యుతులు కౌస్తుభదీప్తులఁ బ్రోదిసేయఁగా,
నంబుజపత్త్రసన్నిభకటాక్షరుచు ల్వాలయంగ వచ్చెఁ బీ
తాంబరుఁ డంగకాంతివిజితాంబరుఁ డా దితిపౌత్త్రుపాలికిన్. ౫౨.

వ. ఇవ్విధంబున సకలజగజ్జాలపాలనశీలుం డగు నీలవర్ణుండు ప్రత్యక్షం
బై—'మహాప్రబుద్ధుండ వై మమ్ము వీక్షింపు' మనుచు దిగ్వలయం
బద్రువఁ బాంచజన్యంబు పూరించిన. ౫౩.

క. ఆ నినద మల్లనల్లన
వీనులు సోఁకిన, సమాధి వీడ్కొని జలద
ధ్వానమున నలరుశిఖిగతి
నానందము నొంది సూచె హరి నరగంటన్. ౫౪.

వ. ఇట్లు ప్రత్యక్షం బైనయప్పుండరీకాక్షు నిరీక్షించి పునఃపునఃప్రణా
మంబు సేయుచున్న రాక్షసేశ్వరునకు నప్పరమేశ్వరుం డిట్లనియె. ౫౫.

సీ. పుణ్యాత్మ నీరూపమును రాజ్యలక్ష్మియుఁ

దలఁపు; మూఱకయేల తను వలంప ?
గతనేయధేయసంకల్పుండ వగునీకు
నిలఁ గల్గి లేము ల వెంత దలఁప ?
నీవు జీవన్ముక్తి నియతి నీతనువుతో
నవని యాకల్పాంత మనుభవింపు.
మిను లొక్కపెట్ట పన్నిద్దఱుఁ బొడమను,
విరళ మై కొండలు విరిసి పోవు.

గీ. జగము లన్నియు నొక్కట సమయు నకట.
యనఘ తను వేల యొల్ల? వి శ్లైన నీకు
విషయసుఖదుఃఖవాసన విడుచునట్టి
వరము నిచ్చితి గృప నీకు వత్స లెమ్ము. ౧౬

క. ఏ దీనుండను నే సుఖి
నే దుఃఖని మూఢబుద్ధి నే నని మది ను
న్మాపించునట్టివానికి
నాదర మగుచున్న మరణ మది లెస్స యగుఁ. ౧౭.

క. ఆశాపాశనిబద్ధుం
డై శమము దొలఁగి చిత్త మటు నిటు దివియం
గాసిఁబడునతని కెందును
నాశము గద మేలు విన వనా పుణ్యాత్మా. ౧౮.

ఉ. ఆరయ సర్వభూతసముఁ డై పరిబోధమయాత్ముఁ డై యహం
కారవికారభావనలఁ గ్రాఁగక యుల్లము చల్ల నై తమో
దూరుఁడు రాగరోషరహితుండును నై భువనప్రవృత్తికిఁ
వారక సాక్షివోలె మనువానికి జీవిత మొప్పు నెప్పుడుఁ. ౧౯.

వ. అట్లు గావున. ౨౦.

క. దనుజాధీశ్వర నీ వీ

తను వలఁపకు; వేగ లెమ్ము; తగ నీసింహా
సన మెక్కు; రాజ్యలక్ష్మికి
ఘన మగు నిను( బట్ట మేను గట్టెదఁ బ్రీతిన్. ౯౧.

వ. అని పలికి యతని నిఖిలరాజ్యాభిషిక్తుం జేసి--యాకల్పాంతస్థిరసౌఖ్యం
బనుభవింపు; మని పుండరీకాక్షుం డంతర్థానంబు నొందె నని న
విని రఘుకుంజరుం డమ్మునికుంజరున కిట్లనియె. ౯౨.

గీ అనఘ యత్యంతపరిణామ మైన యట్టి
యమ్మహాయోగివరునిచిత్తమ్ము దలఁప
బాహ్యకల్పిత మైన యప్పాంచజన్య
నినదమునఁ జేసి యెట్లు మేల్కొనియెఁ జెపుము. ౯౩

సీ. అనిన వసిష్ఠుఁ డి ట్లను భ్రష్టబీజంబు
కరణి జన్మాంకురకారి గాక
శుద్ధవాసన వొల్చుఁ జుమ్ము జీవన్ముక్తు
లగువారిహృదయంబులందు నెపుడు;
నది యుఁ బావనియును నధికయు శుద్ధస
త్త్వానుసారియును నధ్యాత్మవతియు
నిత్యప్రబుద్ధయు నియతయు నై సహ
స్రాబ్దాంతముల నైన నలరుచుండుఁ.

గీ. గనుఁగి యవ్వాసనయు మేనఁ గలిగియుండుఁ,
దాన యొకచోటఁ బొడసూపి యైన వారి
దివ్యవిజ్ఞానమహిమ వర్ధిలఁగఁ జేయు
రఘుకులోత్పలవనచంద్ర రామచంద్ర! ౯౪.

వ. అని చెప్పి మఱియు ని ట్లనియె. ౯౫.

క ఘనపుణ్యుఁ డైన ప్రహ్లా
దునిశుభచరితంబు భక్తితోడ ముదితు లై,

వినునట్టి పుణ్యమతులకు
మునుకొని దుఃఖములుడిందు మోక్షము చెందున్. ౯౬.

వ. అని యిట్లు ప్రహ్లాదోపాఖ్యానం బెఱింగించి వసిష్ఠుండు మఱియు నిట్లనియె. ౯౭.

## గాధ్యుపాఖ్యానము.

క. విను రాఘవ సంసారం
బను పేరిటిమాయ కెందు నవసానము లే;
దెనయంగఁ దన చేతోజయ
మునఁ గా కేమిటను బొలిసి పో దెన్నటికిన్. ౯౮.

వ. అట్లు గావున జగంబుల మాయావైచిత్రిఁ దెలుపు మంటి. మున్ను లవణువృత్తాంతంబు సెప్పినట్లు, గాధి యనువిప్రువర్తనం బెఱింగించెదఁ, దత్పరబుద్ధి వై యాకర్ణింపుము. ౯౯.

ఉ. పావనమూర్తి గాధి యనుబాడబుఁ డొక్కరుఁడు విష్ణుఁగూర్చి గో
దావరినీటిలోపల నుదగ్రతపం బొనరింప, నవ్విభుం
'డేవర మైన నీకు దయ నిచ్చెదఁ, గొంకక వేఁడు వత్స' నా;
నా వసుధామరుం డనియెఁ నంజలి యౌదలఁ జేర్చి మ్రొక్కుచున్.

వ. 'దేవా, భవదీయ మాయ నిరీక్షింప నపేక్షించుచున్నవాఁడ. నీవరము ప్రసాదింపు;' మనిన, నట్ల కాక యని యప్పరమేశ్వరుం డంతర్ధానంబు నొందె. నంతఁ గొన్నిదినంబులకు నొక్కనాఁ డమ్మహీసురవరుండు.

సీ. స్నానంబు సేయుచు జలమధ్యమునఁ గ్రుంకి
యఘమర్షణము సేయునపుడు చిత్త
విస్మృతి వొడమిన, విప్రుండు వెగ డొంది
తగ నీటిలోఁ దన తనువు విడిచి,
హూణదేశంబున నొకయూరఁ జండాల
భామునకుఁ బుట్టి యపత్యసమితిఁ

గని, యాలుబిడ్డలు కాలగోచరు లైన,
విమలాత్ముఁ డై యిల్లు విడిచి, కీర

గీ. పురమునకు నేఁగ, నాప్రోలి ధరణివిభుఁడు
మరణమొందిన, నారాజమంత్రు లొక్క
కరి నలంకార మొనరించి పురమునందుఁ
విడుచుటయు, నది యంగళ్లు వెదకి వెదకి. ౧౦౨.

క. గుండుకొనిసూచుమానిసి
తండము తలగంగఁ ద్రోచి తత్కరి వెస నా
చండాలుఁ దెచ్చి భూజన
మండలి కభిషిక్తుఁ జేసె మంత్రులు సూడన్. ౧౦౩.

ఉ. మాలఁడు వీడుఁ నా నెఱుకమాలినమంత్రులు తత్పురంపుభూ
పాలునిరాజ్యసంపదకుఁ బట్టముగట్టిన, నాతఁడున్ నృప
శ్రీల రమించె, హేమమయచిత్రితహర్మ్యములం బ్రియాకటా
క్షాలసమందహాససురతామృతపానమదాంధబుద్ధి యై. ౧౦౪.

వ. ఇవ్విధంబున నెనిమిది యేండ్లు రాజ్యసుఖంబు లనుభవించుచుండ ;
నంత నొక్కనాఁ డాతనిబంధు వగుచండాలుండు హూణమండలంబున
నుండి చనుదెంచి యతనిచుట్టఱికంబుఁ దెలుప,నందఱు నెఱింగి,'యక
టా ! యీచండాలు సహవాసదోషంబునం బెద్దకాలం బుండితి.
మింక నేమిసేయుద!' మని నివేదించి తత్పాపనిర్వాపణంబు సేయం
దలంచి మంత్రిపురోహితసామంత దండనాథసహితంబుగాననలంబుం
బ్రవేశించిన. ౧౦౫.

క. వారలు దనకతమున నతి
దారుణ మగునగ్నిశిఖల దగ్ధం బగుడున్
వారి నెడఁబాసి దుఃఖము
గూరిన నెద నొచ్చె వెగడు గుడిచిన మదితోన్. ౧౦౬.

వ. అంత. ౧౦౭.

క. అదరిపడి సూచి తొల్లిటి
యుదకములోఁ దీర్ఘమాడు చుండినవాఁడై
మది 'నాలుగుగడియలలో
నిది యేదరి వచ్చెనొకొ యిట నా' కనుచున్. ౧౦౮.

గీ. అంత నావిప్రుఁ డుదకంబునందు వెడలి;—
యకట విభ్రాంతిచిత్తంబులందుఁ దవిలి
యెల్ల దేహాల భ్రమియించి యెందుఁ దిరుగుఁ
బులి యుదగ్రత నడవుల మెలఁగునట్లు— ౧౦౯.

వ. అని చిత్తమోహంబుం దిరస్కరించుచు, నిజాశ్రమంబునకు వచ్చి, తన మనంబున మెఱమెఱపడుచుండునంత. నొక్కనాఁడు కీరదేశంబుననుండి యొక్కభూసురుం డతిథి యై చనుదెంచిన గాధి యతనిం బూజించి యవ్విప్రువలనఁ గీరదేశవాసు లగుమనుష్యు లొక్కచండాలు సహవాసదోషంబునకై సహకుటుంబు లై యనలంబుం బ్రవేశించి రనిన విని, యంతయుఁ దనకృత్యంబ కా వగచి. ౧౧౦.

ఉ. అచ్చటు చూడ వేడ్కపడి యామ్ముని మార్గమునందు దేశముల్
చెచ్చెరఁ బెక్కు దాఁటి చని చెన్నెసలారెడు హూణభూమిలో
మచ్చిగఁ దాఁ జరించు పెనుమాలనిపల్లెయు నాలుబిడ్డలున్
జచ్చినయిల్లుఁ గాంచి మది సంచలియింపఁగఁ గీరభూమికిన్. ౧౧౧.

క. చని తన యేలినపురమును
గనకాలయములను దనకుఁగా మంత్రులుఁ ద
జ్జనులు సొద సొచ్చు నెడలును
గనుఁగొని విధిసేఁత కడలి కళవళపడుచున్. ౧౧౨

క. తన యంతరంగమున నా
వనజోదరుఁ డిచ్చినట్టివరమున నా కా

తనిమాయ గానఁబడియెను.
విన నచ్చెరు వనుచు నచటు వెలువడి యంతన్ ౧౧౩.

క. అలసినసింగముభంగిని
దలరుచుఁ జని యొక్కశైలతటమునఁ దా ని
శ్చలవృత్తిఁ దపము సేసెను
దలఁపున హరి నిల్పి యధికతత్పరబుద్ధిన్. ౧౧౪.

వ. ఇట్లత్యంతనిష్ఠాపరుండై తపంబు సేయుచుండఁ బెద్దకాలంబునకును.

ఉ. శ్రీకరరత్నకుండలమరీచులఁబెళ్కులు చెక్కులొత్త, శో
భాకరకౌస్తుభద్యుతి నుదంచితమై వనమాల వ్రాల, ల
క్ష్మీకరగంధసారరుచిచిహ్నితవక్షుఁడు చక్రి వచ్చె నా
లీకవిలోకనాంశులు దలిర్పఁగ గాధిమునీంద్రు పాలికిన్. ౧౧౫.

వ. ఇట్లు ప్రత్యక్షంబైనకమలాక్షు నిరీక్షించి పునఃపునఃప్రణామంబులు
సేసి నిటలతటఘటితాంజలియై యి ట్లనియె. ౧౧౬.

(మత్తకోకిల.)

'దేవ, దేవరమాయ నాకు సుదీర్ణమై మదిఁ దోఁచె; ని
ట్లే విచిత్రమొ చిత్తవిభ్రమ మీముహూర్తయుగంబునం
దే విధంబునఁ బుట్టెనో చన నింతయున్ విశదింపవే.'
నావుడున్ విని గాధి కంబుజనాభుఁ డి ట్లను సత్కృపన్. ౧౧౭

సీ. అనఘాత్మ భూమ్యాదు లరయఁ జిత్తమునంద
కాని యెన్నఁడు వెలిఁ గావు వినుము.
మది విభ్రమస్వప్నమయముగా సర్వంబు
ననుభవింపఁగఁ జాలి తఖిలములను.
ఇన్నియుఁ గల్పించు నీచిత్తమునకుఁ జం
డాలత్వ మనఁగ నేడది తలంప?
శ్వపచత్వమునఁ దోఁచు విపరీత మెట్ల య్యె

నతిథిఁ గాంచుటయును నట్ల యయ్యె.

గీ. హూణమున మాలవాఁడ వై యున్నయట్టు
లచటివర్తనమును గంటి; వచటు వాసి
కీరపురి లీల లన్ని గన్నారఁ గంటి;
వదియుఁ బ్రతిభాసమాత్రమ యని యెఱుంగు. ౧౧౯.

ఉ. ఈయెడ నీకుఁ దోఁచుగతి నీప్రతిభాసయ హూణకీరదే
శీయుల కెల్లఁ గానఁబడి చిత్తములన్ భ్రమిపుట్టె; నిప్పు డి
ట్లాయె ననంగ రాదు; విను మిన్నియు నిక్కడఁ దోఁచు గాక తా
ళీయము లొక్కచోఁ బ్రతిఫలించును బల్వుర కొక్కచందమై. ౧౨౦.

వ. అది యెట్లంటేని; హూణదేశంబునఁ గటంజకుం డనుచండాలుండు త
త్ప్రదేశంబున విహరించి తద్దుఃఖంబు లనుభవించెఁ. బదంపడి కీరదేశం
బునకు రాజై యబ్బంగి ననలంబు సొచ్చె. నప్పుడు నీచిత్తంపు స్వసం
బంధంబునం జేసి నీ కాకటంజభావంబు దోఁచె నింతియ. యట్లు
గావున. ౧౨౧.

క. ఇతఁ డే నితఁ డేఁ గా నని
మతి దలఁచినయతఁడు భ్రాంతిమగ్నుం డగుఁ దా;
ధృతి నేన యఖిలమును నను
నతఁ డెందును భ్రాంతిఁ బొరయఁ డమలవిచారా. ౧౨౨.

క. అర్థిఁ బరార్థవిభాగా
నర్థము తత్త్వజ్ఞుఁ డెందు నందఁడు దానన్.
అర్థవ్యయమోహము ల
త్యర్థము చొరనీఁడు మనముఁ దజ్జ్ఞుం డెందున్. ౧౨౩.

గీ. నీకుఁ బరిపూర్ణబోధంబు లేక యునికిఁ
జిత్తవిభ్రాంతి నణఁగంగ మొత్తలేవు.
మాయ యనుచక్రమునకు నెమ్మనము నాభి;

యది యణంచినఁ దద్భ్రమ లంద వెందు. ౧౨౪.

క. అది గాన లేచి యీగతిఁ
బదిలం బై తప మొనర్పు. పదియేండ్లకు నీ
కుదయించు దివ్యబోధం
బది. యని కరుణించి విష్ణుఁ డరిగె నిజేచ్ఛన్. ౧౨౫.

వ. అనంతరంబ యమ్మునికుంజరుండు వివేకజనితం బైన పరమవైరాగ్యం
బు నొంది దయాయత్తచిత్తుండును నిరస్తాఖిలసంకల్పుండు నై యొక్క
శిలాగ్రంబున నుగ్రతపంబు దశవత్సరంబు లొనరించి యాత్మజ్ఞానంబు
నొందె. నని గాధివృత్తాంతం బతివ్యక్తంబుగా నెఱిఁగించి వసిష్ఠుం
డి ట్లనియె ౧౨౬

క. మాధవసేవారతుఁ డగు
గాధిమునీశ్వరుని పుణ్యకథ విన నాధి
వ్యాధులు పొందక చిత్తస
మాధానము గలిగి మోక్ష మరచేతి దగున్. ౧౨౭.

వ. అని చెప్పి మఱియు ని ట్లనియె. పరమం బగుయోగాభ్యాసంబునఁ గా
ని చంచలం బగుహృదయంబు కుదురుపడదు. ఈయర్థంబున నుద్దా
లకోపాఖ్యానంబు వర్ణింపంబడు నాకర్ణింపుము. ౧౨౮.

క. మును చిత్తాక్రమణం బను
వినుతౌషధమునన గాక విను సంసారం
బను దుష్టరోగ మణఁపఁగ
నను వగు నే యెట్టిభంగి నైనను రామా. ౧౨౯.

క. క్రిందటి మీఁదటి కాలము
లం దగులక వర్తమానలవమున బాహ్యం
బొందిన బుద్ధిం దైకొని
చెందిన చిత్తంబు దా నచిత్తత నొందున్. ౧౩౦.

గీ. వలయు సంకల్పభోగవిసర్జనంబు;
ఎల్ల కాలంబు దానన యుల్ల మణఁగఁ
జేయు; మంతట భావన స్థితి భజింప
నోపు; శక్తియు నీ కబ్బు సురగుణాఢ్య. ౧౩౧.

సీ. తాఁ గానివస్తువు తన్నుఁగాఁ గల్పించు
పుత్త్రదారాదుల మైత్త్రి చేత,
సహామికా మమతల ననిశంబు గల్పించు
నిగము నాయది యను సిహచేతఁ,
గణఁగి యాధివ్యాధిగతుల హేయాహేయ
మతులఁ దద్వస్తుసంతతుల చేత,
లలనామణిద్రవ్యలాభలోభముల చే,
నాపద సుఖవిషయముల చేతఁ,

గీ. దెగనియాశాపయఃపానతృష్ణ చేత,
నమిత మగుచున్న భోగభోగముల చేతఁ,
బ్రకటితాష్టావధానచోరకుల చేతఁ,
జిత్త మంతంత నభివృద్ధిఁ జెందుచుండు. ౧౩౨.

వ. అట్లుగావున నట్టిచిత్తంబు పెంపు విచారింప నుద్దాలకుండునుం బోలె నంతర్విచారదృష్టి నిన్ను నీవ కనుంగొని సుఖింపు. మనిన రామచంద్రుండు ప్రాంజలియై—మునీంద్రా, ఉద్దాలకుం డెట్టివిధంబున నాత్మావలోకనంబు చేసి చిత్తంబుఁ గెలిచి పరమసిద్ధికిం జనియె? నవ్విధం బానతిం డని యడిగిన నమ్ముని పురాణపురుషున కిట్లనియె. ౧౩౩

## ఉద్దాలకోపాఖ్యానము.

సీ. ఉద్దాలకుం డనునొకమహాముని గంధ
మాదనంబునఁ దపోమహిమ నిల్చి,
మతిహీనత్వతను డించి యతివివేకంబునఁ

తనలోన ని ట్లని తలఁపఁ జొచ్చెఁ;
బూని యంతటికిఁ బ్రధాన మై ప్రాప్య మై
యొద్ది వెలుంగు? నే నెచట నుండి
యీదుఃఖ మణఁగింతు? నెప్పు డీ తలఁపునఁ
బాసి పరబ్రహ్మపదము నొంది

గీ. మేరుశృంగంబుపైఁ బొల్చు మేఘమట్లు
చిత్తవిశ్రాంతి నెన్నండు చెందఁ గలుగు?
ననుచు సంకల్పములఁ ద్రుంచి హరి గుఱించి
నిశ్చలధ్యానతత్పరనియతి నొందె. ౧౩౪

క. ఈతెఱఁగు తపము సేయఁగ
నాతనిచిత్తంబు నిలువ కగచరగతితో
వే తిరుగఁ జొచ్చె, నాత్మ
ప్రీతి నెసఁగునిష్ఠ గడచి బిసబిసపోవన్. ౧౩౫

గీ. ఇట్లు దిరిగెడు చిత్తంబు నెట్టకేనిఁ
బట్టి బంధించుటయును, లోపలన తిరిగి
జడిసి యాంతరవిషయసంచయముఁ గూడి
వెడలి దివి కేఁగె; నురియాడుపులుగువోలె. ౧౩౬

వ. ఇవ్విధంబున బిరుసుఁదనంబునం బఱచి పఱచి. ౧౩౭

చ. అరుదుగ నొక్కవేళ నుదయార్కనిభద్యుతిఁ గానిపించుఁ; జె
చ్చెర నొకచో వియత్తలము చెన్నగు; నొక్కొకనాఁడు శూన్యమా
నిరవుగఁ దోఁచు నొక్కమఱి; యీగతి నిల్వక చిత్త మేపఁగాఁ
బరమసమాధి వే తెలిసి బాడబుఁ డచ్చటు వాసి వ్రేల్మిడిన్. ౧౩౮

వ. అమ్మహాగిరి విపినంబులఁ బరిభ్రమించుచు నొక్కనాఁ డొక్కయేకాం
తప్రదేశంబున నుపవిష్టుం డై నిర్వికల్పసమాధి నుండి తనమనంబున
నిట్లని వితర్కించె. ౧౩౯

క. ధీమంతు లైనవారలు
కామింపరు మీఁద దుఃఖకారణ మగు న
ట్టీమాయాసంపదలం
దేమి సుఖము గలదు మూర్ఖహృదయమ నీకున్ ? ౧౪౦

క. శాంతరస మనురసాయన
సంతోషము దొఱఁగి విషయసక్తుఁ డగుట దా
సంతానవనము విడిచి దు
రంతపుమరుభూమి దిరుగ నరుగుట గాదే ? ౧౪౧

క. పాతాళంబునఁ గ్రుంకుము
భూతలముననుండి మింటఁ బొందుము మనసా ;
యేతెరువున నివృత్తి లే
దాతతశమనామృతంబు నానక నీకున్. ౧౪౨.

ఉ. అక్కట కల్మిలేము లనునట్టితలంపులఁ జిక్కి నిచ్చలుం
బొక్కెదు గాని శాంతరసమున్ వినఁగ్రోలఁగఁ నొల్ల వెన్నఁడున్ ;
దక్కక యింద్రియాదులకు దాసుఁడ వై పఱవంగ నెందు నీ
కెక్కడ నేమి వచ్చె; నిటు లేటికి నేఁచెదు నన్నుఁ జిత్తమా? ౧౪౩.

గీ. శ్రోత్రభావ మొంది సొలయక శబ్దంబు
నాలకించి యంతకంత కుబ్బి
వేఁటకానినాదు విన నాసచేసి లోఁ
బడినమృగమువోలెఁ జెడకు మనస. ౧౪౪

గీ. చర్మభావ మొంది సంస్పర్శసుఖముల
కాసఁ జేసి నీవు ననుదినంబు
గజము వేడ్కఁ దగిలి గజము లోఁబడుభంగిఁ
గట్టువడకు మోఁరకంపుమనస. ౧౪౫.

క. ఓలిని రసనాభోగపు

జాలిం బడి చవులఁ దగిలి చచ్చెదు సుమ్మీ,
గాలం బెరచవి మ్రింగిన
మీ లుడిగి యణఁగినట్లు మిన్నక మనసా. ౧౪౬.

గీ. నేత్రవృత్తిఁ దగిలి నెలఁతలు మొగ మైన
దృశ్యసుఖము మరగి తిరిగి తిరిగి
మంటలోన నుఱికి మడిసిపోయినయట్టి
మిడుతవోలెఁ గాలి చెడకు మనస. ౧౪౭.

క. నాసావృత్తులఁ బడుచు దు
రాసం దనువనజకోటరములోపల నీ
వాసల సుడివడకుము కమ
లాసక్తినిఁ జిక్కినట్టియళిగతి మనసా. ౧౪౮.

క. హరిణ కరి ఝష శలభ మధు
కరములు నొక్కొకటఁ గ్రాఁగెఁ, గడు నింద్రియముల్
పరువడి నన్నియు నిన్నుం
బొరి నడవఁగ నెట్లు సుఖముఁ బొందెదు మనసా. ౧౪౯

క. చిత్తము వాసన లన్నియు
నత్తిన బంధంబుకొఱకు నగు ; నేగతి నీ
వత్తెఱఁగు విడిచి శాంతము
పొత్తయిన ననంతజయము పొందెదు సుమ్మీ. ౧౫౦.

గీ. నీవు చెప్పి నట్ల నిత్యంబు సేయుచు
నేల బేల నైతి నివ్విధమునఁ !
దగువిచారవంతు లగుమహాత్ములయెడ
నీవు లేక యునికి నిజము మనస. ౧౫౧.

క భూరిపరమాత్మతత్త్వము
కారణ మగు నీకు ; నందుఁ గలసితివేనిఁ

వారణకుక్షిగతం బగు
మారెపుబండ్లట్ల రూపుమాసెదు మనసా. ౧౫౨

క. ఆపాదమస్తకం బై
చూపట్టినతనువునందు శోధింపఁగ నిం
దేపట్టున నేకాకిగ
నేపురుషుఁడు నిలుచు నిందు నే నని మనసా. ౧౫౩.

వ. అది యెట్లంటేని. యీప్రపంచం బంతయు సకలదిగ్భరితంబును సంవేద్య రహితంబును సర్వసంపూర్ణంబును నగు సంవిద్రూపంబుగాఁ దలంచెద. నది యింతంత యనుపరిమాణంబును నామపరకల్పనంబును నేకత్వంబు నన్యత్వంబు జడత్వంబు మహత్త్వంబు నేలుపడక వేదనాఖ్యంబై స్వసంవేద్యంబును నైననాయందు నీయునికి దుఃఖకారణం బని వివేకజంబైనపరమజ్ఞానంబునం జేసి నిన్నుం దునిమెద. నదియునుం గాక. ౧౫౪.

సీ. ఇది మాంస, మిది రక్త, మిది యస్థి, నిశ్వాస
మిదియు, నే ననుచుండు నెవ్వఁ డిందుఁ;
బలరక్తకీకసస్పందముల్ వేర్వేఱ
యివియు నే ననుచుండు నెవ్వఁ డిందు;
యిది జిహ్వ, యిది నాస, యివి కర్ణముల్, దృక్కు-
లివియు నే ననుచుండు నెవ్వఁ డిందు;
నివి యెవ్వియును గాక యింతయు నేకమై
యేన యుండుదు నొం డొకింత గలుగ;

గీ. దిది యసన్మయదృష్టి; యొం డెల్లఁ గాదు;
వేఁచె నజ్ఞానధూర్తుఁడు నన్నింతకాల;
మాత్మచోరుని వీనిఁ బుణ్యమునఁ గంటి;
నింత పరమార్థహాని ఖండింతు నేను. ౧౫౫.

వ. అదియునుం గాక, నేత్రాదీంద్రియంబులు వాసనారహితంబు లయిన బాహ్యార్థంబులం బ్రవర్తింప ; వ ట్లగుట వాసన యకారణం బన రాదు, గావున మూర్ఖంబు లగువీని విడిచి యంతర్భావనం జెందు నంత నేదుఃఖంబులం బొరయక సుఖించెదు మనంబ. ౧౫౬

గీ. ఇట్టులంబుగఁ దముఁ దామె చుట్టుకొనుచుఁ
బొత్తినూ లొనరించెడి పురువులట్ల
వ్యర్థ మృగతృష్ణచేత దుర్వ్యథలఁ బొంది
చెడితి రేమందు నింద్రియశిశువులార. ౧౫౭

క. నిండినయింద్రియధనముల
భండారము నీవు; వానిఁ బట్టి యసత్తై
యుండి నిను నీవ తెలిసి య
ఖండామలబోధవీథిఁ గైకొను మనసా. ౧౫౮

వ. అని యనేకప్రకారంబుల నాలోకించి యమ్మునీంద్రుండు. ౧౫౯

సీ. పద్మాసనస్థుఁడై పరమచిత్సుఖనిద్రఁ
గన్నార మోడ్చి, యోంకారరవము
ఘూతితలాంగలఘుంటికాఖండనా
దముభంగి బ్రహ్మరంధ్రమున మ్రోయఁ,
గోరి ప్రాణాయామకుశలుఁడై రేచక
మునఁ బ్రాణనిష్క్రాంతిఁ దనరి మేను
కుంభసంభవనిపీతాంబోధిగతిఁ దోఁప,
హృదయపూరితమైనచదలఁ బొల్చు

గీ. ప్రాణములఁ బేర్చి హృదయాగ్నిఁ ప్రబలఁ జేసి
కాయ మేర్పించి, మరి కుంభకంబు నొంచి
క్రింద మీఁదను వెలి లోను సందు లేక
పరఁగ నిస్తంద్రితము లైనభంగి నంత. ౧౬౦

వ. తత్ప్రాణంబులు పూరకక్రమంబున భజియించి చేతనామృతమధ్యగ
తంబు లై తదాకాశంబునం గళాకాష్ఠారూపపరిపూర్ణం బై వెలుం
గుచున్న సుధాకరబింబంబునం బొంది హిమస్పర్శసుందరం బగుశీత
కళత్వంబు దాల్చిన రసాయనసుధాధారాసారంబునం దోఁగిసంపన్నం
బు లయ్యె నంత. ౧౬౧.

ఉ ఆ యతి తొల్లి దగ్ధమగునంగముఁ దద్రసధారఁ జల్లఁగాఁ
జేయుచుఁ జంద్రబింబరుచిఁ జెన్నెసలారఁగఁ జూడఁ జూడ నా
రాయణరూప మయ్యెఁ గనకాంబరశార్ఙ్గగదాసిశంఖచ
క్రాయుధహారకుండలసితాంబుజనేత్ర కిరీటచిహ్నుఁ డై. ౧౬౨.

వ. అంత రసాయనమయంబు లగునతనిప్రాణంబులం దచ్ఛరీరంబు పూ
రించి తదంతఃకుండలి నిండించె నయ్యవసరంబున. ౧౬౩.

సీ ఆవిష్ణురూపసంయమి నిర్వికల్పస
మాధి కుద్యోగించి; యంతరంగ
మునఁ దోఁచుప్రతిభాసముల మనంబునఁ జేసి
యసిధార నురు లెట్టు లట్లు త్రుంచె,
నా వికల్పము లెల్ల నణఁగిన హృదయాంబ
రంబున నర్కచంద్రములఁ గప్ప
కజ్జలపంకంబుగాఁ బర్వుచీఁకటి
సడలించి మీఁది తేజంబు గాంచి

గీ. కొలను సొచ్చిన యేనికకొదమ భంగి
నదియుఁ దునుమాడ, తేజోమయాంధకార
మోహనిద్రలు దొఱఁగి యిష్టుల వెలుంగు
నట్టివిశ్రాంతిదశ నొందె నతనిమనము. ౧౬౪.

వ. ఇట్లు విశ్రమించి తద్ధ్యానానుసంధానంబున నాత్మసంవిత్పరిస్పందం
బునం జేసి కనకంబు మంజీరం బైనయట్లు విశ్వరూపం బగుచిన్మయ

త్వంబు దాల్చి యతని చిత్తంబు చైత్యంబు పరిత్యజించి చిత్తత్వంబు
విడిచి శుద్ధచిన్మాత్రప్రభావంబు నొందె. మఱియును ౧౬౫.

గీ. అతఁడు బోధానురక్తుఁడై యఖిలమునను
వాసనావర్జితమును విశ్వంభరమును
వితతమును నిశ్చలంబు నై వెలుఁగుచున్న
యా చిదాకాశరూపి దా నయ్యె ననఘ ౧౬౬.

వ. ఇవ్విధంబున దృశ్యదర్శనవర్జితంబు నుత్తమాహ్లాదంబును నై
యమృతార్ణవంబునుంబోలె నొప్పు పరమానందంబునం బొందె
మఱియును. ౧౬౭.

క. ఆమేనివలన వెలువడి
యేమియు ననరాని యొక్కయిరవున సత్తా
సామాన్యాత్మత నానం
దామృతసాగరము దాన యై వెలుఁగొందెన్. ౧౬౮.

గీ. పరఁగ నిర్వాతదీపంబుభంగి నిలిచి
చిత్రరూపంబు కైవడి చేష్ట లెడలి
సద్విజోత్తముఁ డానందసరసియందు
నొప్పు చిన్మయహంస యై యుండె ననఘ. ౧౬౯.

సీ. అంతటఁ జిరకాల మచ్చోటనుండి, తా
నాకాశచరు లగునమరసిద్ధ
వరుల చిత్రం బైన వరసిద్ధజాలంబు
గని, యింద్రదూతలు తనదుపొంగ
విఘ్నకారులు నన విని యన్నిటిని బాసి,
పరఁగ జీవన్ముక్తపదవి నొంది,
యిచ్ఛావిహారుఁడై యిర వైనవనములఁ
దాపసాశ్రయములఁ దత్త్వనిష్ఠ

గీ. నుండి యొకొక్కకతావున నొక్కదినము
నొక్కచోటను నెలయును నొక్కచోట
నొక్కయేఁడును నొకచోఁ బెక్కుహాయ
నములుఁ జరియించుచుండెఁ దన్మయత నొంది. ౧౭౦.

వ. చిత్తత్త్వఘనాభ్యాసంబున నమ్మహాచిత్తంబు చిత్సామాన్య చిత్స్వభా
నుభవంబునం జేసి సత్తాసామాన్యంబునం బొందె నవ్వుండు రామ
చంద్రుం డమ్మునిచంద్రున కిట్లనియె. ౧౭౧.

గీ. ఆత్మవిజ్ఞానవిద్యాదినాకరరూప
సకలసంశయతృణజాలసప్తజిహ్వ
సంతతాజ్ఞానతాపసుధాంశుబింబ
యీశసత్తాసమానత యెట్టి దయ్యె? ౧౭౨.

వ. అనిన విని వసిష్ఠుం డిట్లనియె. తనకంటె నితరం బెద్దియు లేదను
భావనచేత చిత్తం బెప్పుడు సంక్షీణం బగు నప్పుడు చిత్సామాన్య
స్వరూపంబునకు సత్తాసామాన్యత కలుగును. ౧౭౩.

క. నెట్టన భయహరణం బగు
నట్టిపదం బొంది యంత నమ్మునీ యిరవై
నట్టి జగద్భ్రమమున నే
పట్టున విహరించుచుండె భానుకులేశా. ౧౭౪.

ఉ. అంతటఁ గొంతకాలమున కమ్మునిముఖ్యుఁడు యోగనిశ్చల
స్వాంతసమాధి నొంది ఘనశాంతి వహించి యథేచ్ఛమై శరీ
రాంతమునం దొఱంగి నిరుపాధికనిర్మలచిత్ప్రకాశుఁడై
యంతము లేనియట్టి పరమాత్మపదంబున నొందె రాఘవా. ౧౭౫.

౧౭౬.

వ. అనిచెప్పి

క. పాలితపుణ్యుం డగును
ద్దాలకమునిచరిత వినిన ధన్యుల కాయుః

శ్రీ లోదవుఁ, జిత్తవృత్తుల
జాలి యణఁగు, మోక్షపదము సమకూఱుఁ మదిన్. ౧౭౭.

వ. అని యి ట్లుద్దాలకోపాఖ్యానంబు సవిస్తరంబుగా నెఱింగించి వసిష్ఠుం
డు రామచంద్రుం గనుంగొని.—యింక పరమసమాధికి నుత్తమావస్థ
యగునట్టిచిత్తవిశ్రాంతి యొద్ది యది య జీవన్ముక్తాశ యం బగు నని వర్ణిం
పంబడు. నీయర్థంబున సురఘూపాఖ్యానంబు సెప్పెద నాకర్ణింపు
మని యి ట్లనియె ౧౭౮.

క. విను నీవ తెలిసి యీక్రమ
మున విహరించుచు నతీతమును బరమును భా
వనమును నగుతత్త్వమున
ననిశము విశ్రాంతిఁ బొందు మంబుజనయనా. ౧౭౯.

వ అనిన విని రామచంద్రుండు కృతాంజలియై యి ట్లనియె —మునీం
ద్రా, త్రికాలవేది వగుని న్నొకటి యడిగెద. నొక్కఁడు సంసారవ్యా
పారంబు క్తుం డయ్యును సమాధినిష్ఠుండై నిరంతరవిశ్రాంతి గని సుఖిం
చుచుండు. నొక్కఁ డేకాంతశీలుండై పరమసమాధినియతి నుండు.
నీయిరువురయందు నెవ్వండు ముఖ్యుం డాన తిమ్మని యడిగిన వసిష్ఠుం
డి ట్లనియె. ౧౮౦.

గీ. అఖిలగుణములు నాత్మ కా వని తలంచి
యంతరంగంబు చల్ల నౌ నది సమాధి,
దృశ్యములు లీన మౌ నను తెలివి గలిగి
ధ్యాని యైనను వ్యవహారి యైన నేమి. ౧౮౧.

వ ఇట్లు నిరుపాధికచేతశ్శీతలత్వంబు కలుగుటం జేసి వీర లిరువురు సము.
లట్టిశీతలత్వంబు మనోవృత్తిం జలింపం దొణఁగె నేని యోగసమాధికి
నుపక్రమంబు సేయవలయు. నున్మత్తంబు లగుచిత్తతాండవంబుల నా
త్మసమాధానంబు లే కునికిం జేసి. ౧౮౨.

క. అంతర్వాసన లన్నియు
శాంతం బగు. నట్టిసర్వసమునకు వెలిఁ ద
త్స్వాంతం బేగతి నున్న న
నంతం బగుచిత్స్వరూప మగు రఘురామా. ౧౮౩.

గీ. ఒనర సందేహరహితుఁ డై యుండి చిత్ప్ర
బుద్ధమానసుఁ డై యున్న పుణ్యపురుషుఁ
డడవి నుండిన సంసారి యైన నేమి
రెండుగతులును సమము లై యుండు ననఘ. ౧౮౪.

వ. ఇబ్భంగి వాసన గలచిత్తం బెద్ది నేసినను జేయనియదియ. దూరంబున మనం బుఁడిగినయత్నం బేమియు నెఱుంగని యట్లు. ౧౮౫.

గీ. అల్పవాసన గలచిత్త మలమి యెద్ది
నేసినను జేయకున్నట్ల చెంద దెందుఁ;
గడఁగి కలలోన నూతిలోఁ బడినవాని
యంగముల కించుకేనియు హాని యగునె? ౧౮౬.

క. మనమున నెద్దియుఁ జేయక
యునికి సమాధాన; మదియ యుత్తమమును బా
వనమును శుభమును గేవల
మును బరము నివృత్తి యనఁగఁ బొల్చును రామా. ౧౮౭.

క. చిత్తము శీతల మగున
య్యుత్తమునకుఁ జల్ల నగుచు నుండు జగంబుల్.
చిత్తము శీతత నందని
యత్తఱికి నైన ననల మగు జగ మెల్లన్. ౧౮౮.

సురఘూపాఖ్యానము.

వ. ఇట్లంతశ్శీతలత్వంబు సురఘుఁ డను రాజునందుఁ బరిస్ఫుటం బగు. వినుమతండు నిగ్రహానుగ్రహక్రమంబున రాజ్యతంత్రంబాతయునిర్వ

తిరించుచు సుఖదుఃఖంబులఁ జిత్తంబు పరిభూతం బగుటయు నొక్క నాఁ డి ట్లని వితర్కించె. ౧౮౯.

ఉ. అక్కట లల్పసుఖంబులును నార్తియు నా కెటు లట్లు భూజనం బక్కట దుఃఖ మొందఁ డలయంత్రము నువ్వులఁ బీడసేయున ట్లక్కటికంబు మాలి ప్రజ నాఁడి నొంపుదు ; నొంప నైతి నా త్రిక్కకణంగి పోదురు పరిత్తుల నూళులు పోవు కైవడిన్. ౧౯౦.

వ. అని డోలాయమానమానసుం డై యున్న యమ్మనుజవరేణ్యుకడకు మాండవ్యుం డనుమునిముఖ్యుం డరుగుదెంచిన నతనిం బూజించి సురఘుండు తనచిత్తసంశయం బంతయు నెఱింగించిన విని యత్తపో ధనుం డిట్లనియె ౧౯౧.

సీ తన యుపాయప్రయత్నమునను నీహార
లవభంగి మనము పేలవత విడుచుఁ.
దన విచారంబునం దగ మనోంతర్మల
మణుమాత్రమును లేక యణఁగి పోవు.
నెవ్వఁడ నే ? నిది యెద్ది ? యేగతి నిట్టి
మరణజన్మము ? లని మనములోనఁ
దలపోసి చూడుము దాన నిర్మమతయుఁ
జిత్తశాంతియు నెందుఁ జెందు నీకు.

గీ నను చు బోధించి యమ్ముని యరిగె. నంత
నతఁడుఁ దనలోన—హస్తపాదాదిసహిత
మైనయీ కాయ మేటికి ? నంతరంగ
మున విచారింపవలయుఁ గా కని—తలంచి. ౧౯౨.

వ. మాంసాస్థిరుధిరంబులు నచేతనంబులు నగుశరీరంబులు, జడంబులు నసత్య రూపంబు లగుబుద్ధీంద్రియంబులు, నేఁ గాను ; కర్మరహితుం డఁ గావునఁ గర్మేంద్రియంబులు నాయవి గా. వట్టి శరీరాదివ్యతిరిక్తం

బును వికల్పరహితంబును శుద్ధంబును విశిష్టంబును నగుచిదాకారం
బేన యై యుండెను. నె ట్లనిన ౧౯౩.

గీ. వనరుహాసనరుద్రేంద్రవరుణపవను
లాది యగుచున్న సర్వభూతాత్మలందుఁ
బెక్కుమౌక్తికములలోన నొక్కసూత్ర
మున్నగతి నుండు షాడ్గుణ్యయుక్తి నాత్మ. ౧౯౪.

క. అని తెలిసి సురఘుఁ డవనిం
బనుపడ నేలుచును యోగపదవి వహించెఁ
జనపతి విశ్వామిత్త్రుం
డొనరఁగ బ్రహ్మణ్యపదవి నొందినభంగిన్. ౧౯౫.

వ. ఇవ్విధంబున దయాకరుండును నిదర్యుండును గుటుంబియు నకుటుం
బియు బోధయు నబోధయు నర్థియు ననర్థియు నిద్వంద్వుఁడు
నై యనాసక్తి రాజ్యపరిపాలనంబు సేయుచున్నయమ్మహీపాలునికడ
కుఁ బరమమిత్త్రుండును దపఃఫలితతత్త్వజ్ఞానియు నగుపరిఘుఁ డనురా
జరుగుదెంచి యతనిచేతఁ బూజితుం డై యి ట్లనియె. ౧౯౬.

మ. ఘనతత్త్వజ్ఞుఁడ నీవు నీకు శుభమే ? కర్తవ్యకృత్యంబు లె
ల్లను సాధింపుదె ? బోధసృష్టి దనరన్ లాఁతు ల్శమం బందెనే !
కని యెప్పాటను రమ్యభోగనదిఁ గ్రుంకం బాఱకున్నాఁడవే ?
వినుతానందసమాధిశాంతసరణిన్ వీక్షింతువే భూవరా ? ౧౯౭.

వ. అనిన సురఘుండు పరిఘున కి ట్లనియె. ౧౯౮.

సీ. అనఘ యనాదరంబునఁ గ్రియ లేసేయుచు
నంతస్సమాధికి నై పెనంగు
నిత్యప్రబుద్ధుండు నిఖిలకర్మంబుల
నొనరించు నసమానయోగరతుల
బద్ధాసనుం డైనబ్రహ్మయోగియు నవి

శ్రాంతాత్ముఁ డగు నేని శమము లేదు.
ఆశాతృణానలంబగుతత్త్వబోధంబు
పరమసమాధి నాఁబడు మహాత్మ.

గీ. నిత్యతృప్తి సమాహితనిశ్చయార్థ
దర్శనియు నైన ప్రజ్ఞయ దగుసమాధి
దశ; యహంకార లోభనిర్వాణంద్వ యగుచు
శీతగిరిభాతి నగుమతిస్థితి సమాధి. ౧౯౯.

వ. అని యివ్విధంబున నంతశ్శీతలయు జీవన్ముక్తియు నను శబ్దంబులకుఁ గలయర్థంబు లుపన్యసించి సురఘుండు నిత్యముక్తుం డై పెద్దకాలంబు రాజ్యంబు చేసి విదేహముక్తుం డయ్యె నని చెప్పి వసిష్ఠుండు.

క. సురఘూపాఖ్యానము విను
పురుషులు దురితముల నణఁచి పుణ్యాత్మకు లై
పరమజ్ఞానముఁ బొందుదు
రరుదుగ నిది చిత్తగింపు మకలంకులేశా. ౨౦౧.

వ. అని సురఘూపాఖ్యానం బెఱిఁగించి వసిష్ఠుండు రామచంద్రున కిట్లని యె విశ్రాంతిరాహిత్యంపుఁ బ్రయాసంబులు బహుప్రకారంబు లని చెప్పంబడు నీయర్థంబునకు భాసవిలాససంవాదంబు గల దెట్లనిన -- చేతనానుసంధాతయు నంతర్ముఖుండును నధ్యాత్మమయుండు నై నిరంతరంబు నెవ్వండు దుఃఖంబులం బొరయక సుఖంచుచుండుఁ, గణధారునివలనం గలం బెట్లు దరివొందు నట్లా మహానుభావసంపన్నుని చేత సంసారార్ణవం బుత్తరించునుపాయంబు గానంబడుఁ గాని, దుస్తరంబగునిది; యొండుపాయంబునం గా. దది గావున ౨౦౨.

భాసవిలాసోపాఖ్యానము

క. ఈ సంసారసముద్రము
భాసురముగ దాఁటు తెఱఁగు ప్రవ్యక్త మగుఁ,

భాసవిలాసులు తమలోఁ
జేసిన సంవాద మెఱుఁగఁ జెప్పెద వినుమా. ౨౦౩.

వ. ఎట్లనిన, వా రన్నదమ్ము లిద్దఱు గల రందు భాసునకు విలాసుం డొక్కనాఁ డేకాంతంబున ని ట్లనియె. ౨౦౪.

గీ. ఎఱుఁగవలసినయర్థంబు నెఱిఁగి కంటె?
పరమబోధంబు గానంగఁ బడియె నయ్య?
బుద్ధి నే పీడయును లేక పొలుచుచున్నె?
యన్న, కుశలంబె నీకు నిరంతరంబు? ౨౦౫.

క. అన విని భాసుం డి ట్లను;
నిను నాభాగ్యమునఁ గంటి నిర్మలహృదయా,
ఘనసంసారస్థుల మై
యెనసిన మా కెందుఁ గుశల మెక్కడి దన్నా. ౨౦౬.

వ. అనిన విలాసుం డిట్లనియె. ౨౦౭.

సీ. ఎఱుఁగంగ నగునర్థ మెందాఁకఁ దోఁపింప
దందాఁకఁ జిత్తంబు డిందుపడదు.
సంసార మెందాఁక సన్న మై యణఁగదు
చిత్తసంభవము లై చెలఁగుచున్న
యాశాలతలు మొద లంటంగ నన్నియుఁ
గొడవంటఁ గోసిన ట్లణఁగి పోవు.
ఎందాఁక సమతయుఁ జెందదు పరమాత్మ
బోధ యావంతయుఁ బొడమ దెందు.

గీ. నెట్లు కుశలంబు గలుగ దిఁ కెన్నిగతులఁ.
బ్రకటసంసార మనువిషూచికకు మందు
పరమ మగుచున్నయాత్మలాభంబు దక్క
నేమియును సౌఖ్య మీ నోప దేమి యందు? ౨౦౮.

చ. మనుజుఁడు పేర్చి దుఃఖసుఖమధ్యమునం బడి తీవ్రవేదనం
బనుపడి తా జరామరణ భంగము లొందును, జీర్ణపర్ణముల్
ఘనగిరిసాను పాత వికలంబున జర్జరితంబు లైన య;
ట్లనుపమపుణ్య యి ట్లరుగ నారయ నెమ్మదిఁ గానఁ డెవ్వఁడుర్వి ౨౦౯.

వ. అని యనేకప్రకారంబుల బోధించినయగ్రజువాక్యంబులు విని, భాసుండు పరమజ్ఞానసంపన్నుండును జీవన్ముక్తుండు నై సుఖం బుండె. నని భాసవిలాసోపాఖ్యానం బెఱింగించి వసిష్ఠుండు రామచంద్రుం గనుంగొని—యింక సంగవర్జనంబునను వాయునిరోధంబునను సమాధ్యభ్యాసపాటవంబునను జిత్తవిశ్రాంతి సిద్ధించు. నీయర్థంబున వీతహవ్యోపాఖ్యానంబు సెప్పంబడు; నాకర్ణింపు మని యి ట్లనియె.

గీ. ఎందు నభిలాష సేయని డెందమునను
గోరి సంసారమున నున్నఁ గొఱఁత లేదు.
ఉగ్రతప మాచరించుచు నున్న నైన
సక్తచిత్తంబె బంధసంశ్రయము దలఁప. ౨౧౧

వ. అని మఱియు నా నృపశ్రేష్ఠునకు వసిష్ఠుం డి ట్లనియె— ౨౧౨.

గీ. దేహ మిది, దేహి నే నను తెలివిఁ దొఱఁగి,
తనువు నే నను నట్టి తాత్పర్య మొదవు
నట్టి సంగంబు బంధార్థ మనఁగ నొప్పు,
రఘుకులాంబుధిచంద్ర శ్రీరామచంద్ర. ౨౧౩.

క. శారీరజ సుఖదుఃఖము
లారూఢి ననంతతత్త్వ మగునాత్మునియం
దారోపించిన సంగము
మారయ బంధంబుకొఱకు నగు రఘురామా. ౨౧౪.

చ. అకుటిల మైనయట్టి పరమాత్మమహత్త్వము సర్వదిక్కులం
బ్రకటితదేహసౌఖ్యములఁ బాయక పొందును; నేను గా ని దే

నొకఁడన, రెండు లేవు; సుఖ మొందిన నూఱకయున్న లెస్స; యం
చొకగతి నుండుసజ్జనుఁడె యుక్తికి మించగు రాఘవేశ్వరా. ౨౧౫.

వ. ఎట్లనిన వంధ్యయు నవంధ్యయునన సంసక్తి రెండువిధంబులై యుండు.
నందు వంధ్య కేవలసంసారం బొదవించి నిష్ఫలిత యై ప్రవర్తిల్లు.
మఱియు నవంధ్య ముక్తిప్రదాయిని యగు. నందు. ౨౧౬.

సీ. ఆత్మతత్త్వజ్ఞాన మందక దేహాది
వస్తుజ యై త్రిప్పు వంధ్యశక్తి,
యరయంగఁ గాలసూత్రాసిపత్త్రాదినా
రకములు నంతఃపురములు దలఁపఁ,
దత్సంగు లగువారు తగునారకాగ్నికి
నీరసేంధనములై నిగుడువారు.
మఱియు నవంధ్య యాత్మజ్ఞాన సత్య వి
వేకజ యసారవిగత యంద్రు.

గీ. అట్టిశక్తిని శంఖచక్రాబ్జహస్తుఁ
డిచ్చ వే పొంది జగమున నేలుచుండు
సకలసిద్ధులు లోకపాలకులు మునులు
నుండుదురు దానివశమున నురుగుణాఢ్య. ౨౧౭.

గీ. బర్హిపింఛాగ్రతరళంబుభంగి విరియు
మేరుతుల్యంబు లోను నై మెఱయుచున్న
యమ్మహాత్ములు శుద్ధబుద్ధాంతరంగు
లట్టిశక్తిని విహరింతు రనుదినంబు. ౨౧౮.

క. విను భవపాశచ్యుతుఁ డై
మునుకొని దేహాభిమానములఁ దొఱఁగిన యా
ఘనుఁ డురుచిద్రసమున న
ల్లనఁ గరఁగును జలములోనిలవణము భంగిన్. ౨౧౯.

గీ. జడము నజడంబు నైన దృక్స్ఫురణినడుమఁ
దలఁపఁ బరమార్థ మై యెద్ది వెలుఁగు నదియ
బహువిధజ్ఞానబోధకోపనిషదర్థ
విదులచేఁ జెప్పఁబడెడి వివేకనిలయ. ౨౨౦.

వ. దృశ్య దర్శనాసంబంధం బై యనుభూతం బై పారమార్థికం బైన సుఖం బెద్ది యదియ బ్రహ్మం బనంబడుఁ. గాని ముక్తి యన నాకాశంబునను భూతలంబునను బాతాళంబునను లేదు. నిఖిలాశాపరిక్షయం బైన మోక్షం బగు నందు;— ౨౨౧.

గీ. అన్యపురుషానురక్త యౌనతివ యింటి
పనులు వేడుకఁ జేసినభంగి ధీరుఁ
డఖిలక్రియలను వెలిఁ జల్పి యంతరంగ
మునఁ జిదానందసౌఖ్యంబు ననుభవించు. ౨౨౨.

చ. దినమణి చల్ల నైన, హిమదీధితి తీవ్రత నొంద గాసినన్,
అనలుఁడు పేర్చి క్రిందుశిఖ లై ప్రసరించిన, నాత్మసక్తు లే
యనువున నైన విస్మరణఁ జెందక యుందురు గాని, యెట్టి చో
ద్యమును గని విస్మయంబు మదిఁ బొందరు రాఘవచంద్ర యెప్పుడున్.

వ. అనిన విని రాఘవేశ్వరుండు వసిష్ఠున కిట్లనియె. ౨౨౪.

క. ఏమిటఁ జరించు చిత్తం?
బేమిటఁ జలనం బణంగు? నీ రోగము నే
నేమందున నణఁగింపుదు?
ధీమన్నుత యవ్విధంబు దెలియఁగఁ జెపుమా. ౨౨౫

క. అనిన వసిష్ఠుం డిట్లను.
విను కల వందులకు రెండు వెరవులు యోగం
బును సుజ్ఞాన మనం గాఁ
బనుపడ నివి తెలియ వినుము భానుకులేశా. ౨౨౬.

వ. అందు యోగంబునఁ జిత్తనిరోధంబును, సుజ్ఞానంబున సమ్యగవలోకనంబును, నగు; నట్లు గావున ౨౨౭.

గీ. ప్రాణముల చేతఁ జిత్తంబు భ్రాంతి నొందు,
నవి నిరోధింప నదియును నణఁగు నంద్రు,
చిత్తసంచలనంబు నివృత్త మైన
యంత సంసారశాంతియు నగుఁ గుమార. ౨౨౮.

క. పూరకము మొదలుగాఁగల
మారుతధారణల, యోగమతి, నేకాంతో
దార ధ్యాన సమాధిని,
నారయఁ బ్రాణములచలన మడఁగును రామా. ౨౨౯.

క. సంతతము ప్రాణకరణ
ప్రాంతాశబ్దార్థ తత్త్వ భావన నగు నే
కాంతజ్ఞానసుషుప్తి న
నంతం బగుచిత్తచలన మడఁగుఁ గుమారా. ౨౩౦.

గీ. యత్నమునఁ జేసి తాలుమూలాంత మైన
ఘంటికాకోటరము జిహ్వఁ గదియఁ జేసి,
ప్రాణములఁ బేర్చి యూర్ధ్వరంధ్రమున మెలుపఁ
బ్రాణచలననిరోధ మౌ భానువంశ. ౨౩౧.

వీతహవ్యోపాఖ్యానము.

వ ఇట్టు లనేకసంకల్పవికారితంబు లై వివిధాచార్యమతంబుల ప్రాణచలననిరోధంబు బహుప్రకారంబులు చెప్పంబడు. పరమవైరాగ్యాపరిచ్ఛిన్నం బైన యభ్యాసంబు దృఢత్వంబు నొందఁ, దదభ్యాసానుకూల్యంబునఁ బ్రాణాయామంబు సఫలం బగు. నిది యోగాభ్యాసంబింక విజ్ఞానస్వరూపం బెఱింగించెద; నాకర్ణింపుము. ౨౩౨.

గీ జనన కల్ప వికల్ప సంక్షయము గాఁగ

నేనయ సవిశిష్ట మగుపద మెద్ది, యదియ
యఖిల వేదాంతవాక్యాల కందరాని
సర్వసంపూర్ణ మైనసుజ్ఞాన మధిప. ౨౩౩.

వ అట్లు గావున సర్వంబును బ్రహ్మం బగునెఱుకయ పదార్థదర్శిత్వం
బగు. నిట్టి యోగజ్ఞానవివరణంబులకు నిదర్శనం బొక్కటి సెప్పెద.
సావధానుండ వై వినుము. ౨౩౪.

చ. ఘనుఁడు శ్రుతి స్మృతి ప్రహిత కర్మపటిష్ఠుఁడుఁ వీతహవ్యుఁ డ
న్మునివరుఁ డెల్లకర్మముల మున్కొని పాసి విరక్తచిత్తుఁ డై
వనమున నేకతంబ గరువం బగుయోగ సమాధినిష్ఠ మైఁ
జని వెలి సర్వముం మఱచి శాంత మనోగతి నుండె రాఘవా. ౨౩౫.

వ. ఇట్లు బాహ్యాభ్యంతరంబు లగు నింద్రియార్థంబు లుపసంహరించి
నిర్మలం బగునంతరంగంబున ని ట్లని వితర్కించె. ౨౩౬.

క. కటకట ప్రత్యాహారం
బిటు సేసిన నైనఁ జలన మొందుచుఁ గడు సం
కటపడుచున్నది చిత్తము,
పటువిచలిత మైనజీర్ణపర్ణము భంగిన్. ౨౩౭.

గీ. సర్వసాక్షియు నజుఁడును సముఁడు నైన
చిన్మయాత్ముండు జగములు సేయుచుండు,
నకట యింద్రియగణము నిరర్థకంబ
యా కలంకముఁ బొందెడి ననుదినంబు. ౨౩౮.

(మత్తకోకిల.)

పాములం గని డాయనోడెడు పాంథు కై వడి, మాలలన్
వేములుం గని డాయరోసిన విప్రు చాడ్పున, నింద్రియ
స్తోమవృత్తికి నెల్లప్రొద్దును దూర మై వెలుఁగొందు వీ
తామయంబును చిన్మయంబును నైన యా పరమాత్మ దాన్. ౨౩౯.

వ. సకలదుఃఖదము, సకల విషయోన్ముఖము, నగు మనంబును విజ్ఞానాదిమ్యతికలనారహితుం డగుజీవునందును, జడం బగు దేహంబునందును, నాత్మస్వరూపంబు వేద్యనిర్ముక్తం బై శుద్ధసంవిత్సారం బై యుండుం గాని, యితరంబు గాదు ౨౮౦.

క. అని నిశ్చయించి యపు డ
మ్ముని యాసలు వీడి చిత్తమును బలవంతం
బున నిల్పి యింద్రియంబుల
పనుల నణంచి చిరసమాధిపదమున నుండెన్. ౨౮౧.

సీ. అబ్భంగి నుండంగ నతనిప్రాణంబులు
క్రమయుక్తిలోననె శమము నొందె;
నబ్జకోరకభాతి నరగంటిచూడ్కులు
కొమరొంద నాసికాగ్రమున నిగుడ,
మేనియుగ్గులు మాన్చి మెదలక చిత్రరూ
పముభంగిఁ బర్వతభాతి నుండె
న ట్లుండి వింధ్యగుహాంతరంబున మహారా
త్రముభంగి వర్ష శతత్రయంబు

గీ. నిర్వికల్పసమాధిమై నిలిచియుండఁ,
గాయ మతనిది ధరణిపంకమునమునిఁగి,
యున్నచో లేపఁబోవ రాక యుర్విఁ గలిసి
యుండె, నే మందు నమ్మునియుగ్రతపము! ౨౮౨.

వ. ఇవ్విధంబున మున్నూ ఱేండ్లకుఁ బరమసమాధివలన మేల్కని పూర్వనిష్ఠితం బై యనేకజన్మసంచితం బగుకర్మఫలంబు తపఃఫలంబుపోలెఁ దోఁచుటయు, నతండు మనోరాజ్యంబున సర్వంబు ననుభవించుచుండె. నది యె ట్లనిన, జనులకు జాగ్రత్స్వప్నమనోరాజ్యంబు లనం గర్మఫలానుభవావస్థలు మూఁడు విధంబు లై యుండు. నందుఁ దెలివి

గలిగి బాహ్యకర్మంబుల సంసారంబు సేయుచు, సుఖదుఃఖంబు లనుభ
వించుట జాగ్రదవస్థ యగు. బాహ్యేంద్రియంబులు నిద్రానిగృహీతం
బై యుండ నంతర్విషయంబు దగిలి చిత్తంబు గమించుచునికి స్వప్నా
వస్థ యగు. తెలిసి యుండియు బాహ్యంబు మఱచి పురోభూతంబులు
గానివస్తువులం దగిలి సుఖించుచునికి మనోరాజ్యం బనంబడుసుషు
ప్తి యగు. నట్లు గావున. ౨౮౩.

ఉ. అమ్ముని హృద్గతంబున సుమాధిపుఁ డేలెడివెండికొండప్రాం
తమ్మునవనంబునం దొకకదంబమహీజమునీడ నుండి స
ర్వమ్ము పరిత్యజించి శతవత్సరముల్ దప మాచరించి తా
నిమ్ముల దేవలోకసుఖ మెంతయు వేడుక పుట్టి నెమ్మదిన్. ౨౮౪.

గీ. రమణ నూఱేండ్లు విద్యాధరత్వ మొంది,
యెనయ నూఱేండ్లు కాలుఁ డై, యింద్రలీల
నమరభోగంబు నొక్కమా టనుభవించి,
వెండి శివుకడ బ్రమథుఁ డై యుండె ననఘ. ౨౮౫.

వ. ఇవ్విధంబునఁ బ్రతిభాసవశంబున ననేకజన్మాంతరసుఖంబు లనుభవించి
పూర్వజన్మంబులం దలంచుకొని తొల్లి దోషరహితంబు లై నష్టంబు
లగుశరీరంబులు పెక్కులు పొడగని వీతహవ్యాభిదానం బగునీశరీరం
బెందునుం జెడదు గదే యని సంతసించి. ౨౮౬.

మ. అనపాయస్థితిపంకమగ్న మగు మే నట్లోచుఁ జూచి యో నోప కా
యన పుర్యష్టకగాత్రుఁ డై యనిలుఁ డై యాదిత్యునిం జొచ్చె; న
య్యినుఁ డాత్మన్ గని పింగళుం డనుభటున్ వీక్షించి వే పంప, వాఁ
డనివార్యంబున దెచ్చె నచ్చటికిఁ దా నమ్మౌనిదివ్యాంగమున్. ౨౮౭.

వ. ఇట్లు దెచ్చినం గనుంగొని. ౨౮౮.

శా. ఆవిప్రుండు నిజాంగపంజరగతుం డై సంగనిర్ముక్తుఁ డై
జీవన్ముక్తిపదంబు నొంది సుఖి యై చిన్మాత్రుఁ డై యెల్లెడన్

దా వతిక్షించుచు నిష్టలీల నయుతాబ్జంబుల్ వినోదించి స
ద్ధ్యానం బైన విదేహముక్తిపదముగ్ బ్రాపింప నుద్యుక్తుఁ డై ౨౪౯.

వ. ఒక్క యేకాంతప్రదేశంబున సుఖాసీనుం డై యంతరంగంబున వితర్కించుచు ని ట్లనియె ౨౫౦

క. రాగద్వేషములారా,
యీగతిదుఃఖములు గుడిచి యెంతయు మాతో
వేగించితి రిక వగునెడ
భోగింపుఁడు తమ్ములార పొం దలుగకుఁడీ. ౨౫౧.

క పంచేంద్రియంబులారా,
వంచన నాయొద్దనుండవలవదు మీ రొ
క్కించుక తడవు నిలిచినఁ బ్ర
పంచభ్రమ గదియుఁ బొందుపట్లకుఁ జనుఁడా. ౨౫౨.

క. పంచేంద్రియవర్గము నా
పంచినగతిఁ దిరిగి నన్ను బహువిధముల మ
న్నించితిరి వలయునెడకు ను
దంచితగతిఁ బొందు మీకు దండము సుండీ. ౨౫౩.

గీ. ఇట్టి పరమపదము నెట్టన మఱపించి
త్రిప్పిత్రిప్పి తెచ్చితెచ్చి చూపి
నన్ను మోసపుచ్చుచున్న యోర్యైహిక
సుఖమ నీకు మ్రొక్కు సుమ్ము పొమ్ము. ౨౫౪.

క. ఘనదుఃఖమ నీచేతం
బనుపడఁ బరితాప మొంది పరమాత్మునిఁ గ
న్గొనఁగంటి ముక్తిమార్గం
బును జూచితిఁ గాన నీకు మ్రొక్కెదఁ జుమ్మీ. ౨౫౫.

గీ. ఇతఁడు నన్ను విడువ నేకాకి నై యెట్లు

సంచరింతు ననుచు సంశయింప
కిచ్చు వచ్చునెడకు నేఁగి వర్తింపు నా
తల్లి తృష్ణ నీకు దండ మవ్వ. ౨౯౬.

వ. అని యి ట్లంతఃకరణగుణంబులను వీడ్కొలిపి ప్రశాంతుండై యల్ల
నల్లన ప్రణవోచ్చారణంబు సేయుచు సంకల్పవికల్పంబులు త్రైలో
క్యసంభవంబులు సూక్ష్మస్థూలతరంబులు నగుబాహ్యాభ్యంతరభావం
బులం బరిత్యజించి యమ్మునివరుండు. ౨౯౭.

సీ. అంతటఁ బ్రాణాంత మగుదీర్ఘ నిశ్వాస
తంతువుతోఁ గూడి తగుహృషీక
తన్మాత్రముల నెల్లఁ దరలిచి, యట మీఁదఁ
దామసపటలంబు నామ మణఁచి,
తగిలి ప్రాజ్ఞుని కావ లగుచు నందంబున
నొదవుతేజము దాఁటి యదియుఁ ద్రుంచి,
తమము తేజము లేక తగుశూన్యమై తోఁప,
నందును దగులక యల్ప మైన

గీ. మనముచేతన మన మనుతృణముఁ దునిమి,
యప్పు డటఁ బుట్టుశిశువు బోధాంకురంబు
మాడ్కి నిర్మల మైనచిన్మయపదంబు
గని నిమేషచతుర్థభాగమునఁ బొందె. ౨౯౮.

మ. అనిలుం డచ్చలనంబుఁ బాయుగతిఁ జైత్యం బెల్ల వర్జించి, చ
య్యన సత్త్రైకవినిశ్చితంబు నగుపశ్యంతీపదం బొంది, య
ల్లన మేరుస్థిత మై సుషుప్తిపద మాలంబించి, సుస్థైర్యుఁ డై
మునినాథాగ్రణి యంత తుర్యపదముం బొందెన్, సదానందుఁ డై.

వ. ఇవ్విధంబున నిరానందుండును, సానందుండును, స్వచ్ఛుండును,నచిన్మ
యుండును, చిన్మయుండును, నై నేతి నేతి వాక్యంబుల నుపనిషత్తు

లుపన్యసించు నవాఙ్మానసగోచరం బైనపరతత్త్వంబు తానై వెలింగె.
నది యెట్టి దనిన. ౨౬౦.

సీ. శూన్యవాదులు కడు శూన్యతత్త్వం బన,
బ్రహ్మవేత్తలు పరబ్రహ్మ మనఁగ,
విజ్ఞానవంతులు విజ్ఞాన మది యనఁ,
బొరి సాంఖ్యయోగులు పురుషుఁ డనఁగ,
నెసఁగుయోగీశ్వరు లితఁ డీశ్వరుం డన,
శివమతాచార్యులు శివుఁ డనంగ,
కాలతత్త్వజ్ఞులు కాలరూపం బన,
నాత్మార్థవిదులు చిదాత్మ యనఁగ,

గీ. దాద్వైతాత్ములు తాదాత్మ్యతత్త్వ మనఁగ,
మాధ్యమికు లెల్ల నిది యాదిమధ్య మనఁగ,
రమణ సమచిత్తులెల్ల సర్వంబ నాఁగ,
నఖిలసిద్ధాంతసమ్మత మగుచు మఱియు. ౨౬౧.

వ. సర్వహృదయానురాగంబును, సర్వతత్త్వంబును, సర్వంబును, నై నిర్వాతదీపంబునుంబోలె, మానసంబు లేక, వెలుంగుల కెల్ల మొదలి వెలుంగై, యాత్మానుభవైకమానంబు, నేకత్వంబును, ననేకత్వంబును, సాంజనంబును, నిరంజనంబును, సమంబును, నజంబును, నాద్యంబును, సకళంబును, నిష్కళంబును, నగునిరాలంబసంవిత్స్వరూపంబు దాన యై వెలింగె. నంత. ౨౬౨.

క. అప్పరమసంయమీంద్రుఁడు
ముప్పదివేలేండ్లుయోగమును గని చని తా
నొప్పాఱు చిత్తలయమునఁ
దప్పక తద్బ్రహ్మపదము తా నై వెలిఁగెఁ. ౨౬౩.

వ. అని వసిష్ఠమునీంద్రుండు. ౨౬౪.

గీ. వీతహవ్యమహిమ విను ధన్యమతులకు
నఘము లణఁగు శుభము లగ్గలించుఁ,
జిత్తశాంతి వొడము, చిన్మయానందసౌ
ఖ్యంబు చెందు, నెపుడుఁ గమలనయన. ౨౬౫.

వ. అని యిట్లు వీతహవ్యోపాఖ్యానంబు సవిస్తరంబుగా నెఱింగించి, యింకఁ జిత్తోపశమనప్రాప్తి పరిస్ఫుటం బగుటకు నాకాశగత్యభావోపాఖ్యానంబు చెప్పెద, నాకర్ణింపు మనిన విని, రఘుపుంగవుండు మునిశార్దూలున కిట్లనియె. ౨౬౬.

క. మునివర జీవన్ముక్తులు
ననఘులు నాత్మార్థవిదులు నగువారలకున్,
విను మంబరగత్యాదుల
ఘనసిద్ధులమహిమ లేల కాన్పింపవొకో. ౨౬౭.

సీ. అనిన వసిష్ఠుఁ డి ట్లను నభోగమనాది
కము లైన సిద్ధులు గావు ముక్తి,
ద్రవ్యమంత్రక్రియాతత్కాలశక్తుల
నవిముక్తుఁడును బొందు నట్టిసిద్ధు,
లాత్మజ్ఞునకు నవి యప్రయోజకము, ల
య్యాత్మజ్ఞుఁ డెపుడును నాత్మవిదుఁడు,
ఆతండు తనయాత్మయంద సుఖించుచు
నుండుఁ గాని యవిద్యనొందఁ డెందు,
గీ. నార్యు లివి యెల్ల మాయామయంబు లండ్రు,
ఈజగద్భావములయందు నెల్ల నాడు
విగతమాయాప్రపంచులు విగతమతులు
ముక్తులును నైనపుణ్యులు మునుఁగ రెందు. ౨౬౮.

వ. ఆత్మజ్ఞానవిదుం డయ్యు నెవ్వఁడే నిట్టి సిద్ధిజాలంబుఁ బొందఁ గోఁ

నతండు తత్సాధనంబులైన ద్రవ్యంబుల నయ్యైసిద్ధులం బొందు. ద్రవ్య మంత్ర క్రియా కాల శక్తులు సిద్ధిప్రదం బగు. నైనను బరమపదప్రాప్తికి నంతరాయంబులు గాని, యుపాయంబులు గావు. అట్లు గావున.

గీ. సమత నిచ్ఛాసమూహంబు శాంతిఁ జేసి
యాత్మలాభంబు నొందినయట్టి యోగి
కకట తుచ్ఛపుసిద్ధులయందు నేల
తిరుగఁబడుచుండు, చిత్తంబు తెలివి విడిచి? ౨౭౦.

క. అనిన విని రాముఁ డిట్లను
మునివల్లభ పెద్దకాలములు యోగీంద్రుల్,
తనువులు నిల్పి చరింతురు
రనిశము నత్తెఱఁగుఁ దెలియ నానతి యీవే. ౨౭౧.

వ. అనినఁ బరమసంయమి యి ట్లనియె. ౨౭౨.

క. విను మనిలస్పందనమునఁ
దనువును జలనంబు నొందుఁ, దద్గతి శాంతం
బును బొందఁ జలనరహితతఁ,
దనువును సుస్థిరత నొందుఁ, దపనకులేశా. ౨౭౩.

వ అట్లు గాన వాయుధారణానియతులైనపరమయోగీంద్రులు నిత్యులగుదురు. ఎట్టిదేహంబున మనఃపవనంబులు బాహ్యాభ్యంతర చలనంబు లుడిగి యుండు నద్దేహంబు ధాతుక్షీణత లేక చిరకాలం బుండు. ననిన విని రామచంద్రుం డి ట్లనియె. ౨౭౪.

క. అనఘ వివేకాభ్యుదయం
బునఁ జిత్తము లయముఁ బొందుపుణ్యాత్ములకున్
ఘనమైత్ర్యాదిగుణావళి
యొనయఁగ నె ట్లుద్భవించు నెఱిఁగింపు తగన్. ౨౭౫.

సీ. అనిన నమ్మునిపతి యనుఁ జిత్తనాశం బ

రూపంబు మఱియు నరూప మనఁగ
రెండువిధంబు లై యుండు. జీవన్ముక్తి
యదియ సరూప మౌ, నటు వి దేహ
ముక్తి యరూపకంబును నగు, సుఖదుఃఖ
ములచేత బద్ధ మై కలఁగుమనసు
సంసారనామవృక్షమునకుఁ బ్రోది యౌ,
నిది చిత్తవిభ్రాంతి యొఱఁగికొనుము.

గీ. దీని సంక్షయ మెఱిఁగింతుఁ దెలియ వినుము,
కొండ గాడ్పునఁ గదలక యుండినట్టి
భంగి సుఖదుఃఖములచేత భంగపడక
యుండునది చిత్తలయ మండ్రు యోగివరులు. ౨౭౬.

క. జ్ఞానస్వరూప మగు న
మ్మానసమె యమానసంబు! మది మఱవక తా
ధ్యానంబు నిశ్చయించిన
మానస మది సాత్త్వికంబు మనుకులతిలకా. ౨౭౭.

గీ. పరఁగు రాజస తామస భావనాశ
మగుడుఁ జిత్తంబు సన్న మై నిగిడి, సత్త్వ
గుణము చిక్కఁగ మైత్ర్యాదిగుణము లొదవు
నని యెఱుంగుము మనమున నంబుజాక్ష. ౨౭౮.

క. ఇదియ సరూపమనోలయ
మిది జీవన్ముక్తునందు నెసఁగు, సరూపా
స్పదహృదయనాశనం బది
విదేహముక్తునకు నమరు, విమలచరిత్రా. ౨౭౯.

వ. ఇట్లు రజస్తమోగుణంబుల నిరసనంబున విశేషించినయదియ సకల సద్గుణసారంబును సాత్త్వికవిశేషంబు నగు జీవన్ముక్తి. విదేహముక్తి

యందుఁ దన్మనంబు లీనం బగు. నట్లు గావున. ౨౮౦.

క. అనిలస్పందనవాసన
లనిశము ప్రేరేప నింద్రియజ్ఞానము గొ
బ్బున నబ్బకుండె నేనియు,
ననఘా తన్బ్రిష్టా మీవ యగుదువు సుమ్మీ. ౨౮౧.

వ. వేద్యవేదనోల్బణత్వంబు చిత్తంబు. అదియ యనర్థమూలం బగుఁ దన్నిరసనంబునన కాదె మహాయోగీంద్రులు ప్రాణసంరోధనంబు సేయుచుందు. రది యెట్లంటేని. ౨౮౨.

క. మానుగఁ బ్రాణాయామ
ధ్యానమునను యుక్తికల్పితపుయోగములన్,
బూనఁగ ననిలనిరోధం
బై నిలువఁగఁ జిత్తశాంతి యగు రఘురామా. ౨౮౩.

సీ. వినుము వృత్తిజ్ఞానవిభవప్రభూత మై
యనుభూతివాసనలను జయించు
పరమచిత్తోత్పత్తిపద మెఱిఁగించెదఁ;
గడిఁదివాసనలచే విడువఁబడిన
పూర్వాపరవిచారముల జనించుపదార్థ
రక్తి వాసన యండ్రు, రాజవృషభ,
యది యతివ్యగ్ర మై యాత్మలో నూనంగ
నఖిలసద్వృత్తులు నడఁగి పోవు,

గీ. నట్టివాసన దగిలినయట్టి పురుషుఁ
డేది గనుఁగొన్నఁ దన కది యెల్ల మంచి
దనుచు మోహించు ; వాసనాభ్యాసవృత్తి
జననమరణాదికారణ మనఁగఁ బరఁగు. ౨౮౪.

క. ఇమ్ముల హేయోపాదే

య మ్మగుణాగరవిలాస మణుమాత్రము చి
త్తమ్మునఁ దోఁపక యున్నపు
డమ్మానస మింకఁ బుట్ట దని యెఱుఁగు మదిన్. ౨౮౫.

వ. వాసనారాహిత్యం బగునంతన పరమశమప్రదంబై మనోలయం బగు. నది యె ట్లనిన. ౨౮౬.

మ. అనిలస్పందనవాసనల్ పొడమ న ట్లన్యోన్య మేతద్ద్వయం
బును బీజాంకురముల్ మనంబునకు నై పొల్పొందు; నీమూఁటికిన్
విను బీజంబు ప్రపంచ; మట్లగుట సంవేద్యంబు వర్జింపు; మం
తన నిర్మూలితవృక్షమట్ల యడఁగున్ దత్సర్వమున్ రాఘవా. ౨౮౭.

గీ. వినుము సంవేద్యమునకు సంవిత్తు బీజ,
మివియు నొండొంటి నెడఁబాసి యెందు లేవు,
నూనెతోఁ బాసి నువ్వులు లేనియట్ల
యని యెఱుంగుము, మనమున నినకులేశ. ౨౮౮.

క. వారని విషయజ్ఞాన మ
పారభవోదారదుఃఖపరకారణ మౌఁ;
గోరిక గూరని విషయ
స్ఫారజ్ఞానంబు సౌఖ్యపదహేతు వగున్. ౨౮౯.

ఆకాశగత్యభావోపాఖ్యానము.

వ. అనిన విని రామచంద్రుం డయ్యా, జాడ్యరహితుండును, నిర్విషయజ్ఞానియు, నగు నతం డెట్టివాఁ డతనికి తజ్జడభావం బెట్లు నివర్తించుఁ జెప్పవే యని యడిగిన, నప్పరమసంయమి యి ట్లనియె. ౨౯౦.

క. సర్వావస్థలయందును
నిర్వాణమనస్కుఁ డై ననిత్యుఁడు జడుఁడున్
నిర్విషయజ్ఞానియు నగు
నుర్వీశ్వర, కార్యకోటియుతుఁ డై యున్నన్. ౨౯౧.

ఉ. వాలినసర్వధర్మముల వాసన లన్నియుఁ గ్రాఁగి పోవఁగా,
బాలునిభంగి మూఁకక్రియఁ బాటిలి చిత్సుఖపారవశ్యుఁడై
వ్రాలుట యెప్పు డప్పు డవికారత నాతతమై యజాడ్యమై
యోలిన రాకపోక లవి యుండని తత్పదమొందు రాఘవా. ౭౯-౨.

క. ఎసఁగిన సంవిత్తికి బ్ర
హ్మాసదృశ సమభిజ్ఞ యెద్ది యని యుపయించుఁన్,
వసుధేశ్వర, విను తేజో
విసరమునఁ బ్రకాశమహిమ వెలుఁ గొందుగతిన్. ౭౯-3.

సీ. విను మనీషాంతరవిషయమై సన్మాత్ర
మై యనాదరణమై యధికరూప
మై యేకరూపమైనదియ సత్తాస్థితి
యగు; నట్లు కల్పితావిగళితంబు
నాద్యంబు మఱియు ననాద్యంబు; సామాన్య
సద్భావమునకు బీజంబు లేదు;
గాన సంవిత్తియు గలుగంగ నందులఁ
బొందిన మఱి రాక పోక లేదు.

గీ. సకలహేత్వర్థమునకును సార మిదియ;
హేతు వెన్నఁడు దానికి నెన్న లేదు;
సారముల కెల్ల మొద లగుసార మిదియ,
యింతకంటెను మఱి సార మెందు లేదు. ౭౯-౪.

వ. అట్లు గావునఁ బురుషప్రయత్నంపు బలిమిని సకలవాసనాపరిక్షయం
బు సేసి తత్త్వజ్ఞుండవై యక్షయాత్మకం బగునట్టిపదం బొక్కనిమే
షమాత్రంబునం బొందునదియ యుత్తమంబు. ౭౯-౫.

మ. తతచిత్తక్షయ వాసనాహరణ తత్త్వజ్ఞానముల్ నాఁగ నీ
త్రితయంబున్ గడుదుష్కరంబు లగుటన్ ధీయుక్తిమైఁ బౌరుష

స్థితిభోగేచ్ఛఁ దొలంగి యత్నమునఁ బ్రీతిన్ వీని సేవించి సం
తతసౌఖ్యోదయ మైనచిన్మయమహాతత్త్వంబునం బొందుమీ. ౨౯౬.

క. ఈ మూఁడు నభ్యసింపని
యా మూఢుఁడు జన్మశతసహస్రంబులకున్,
భూమీశ్వర, యచ్యుతపర
మామృతపద మెవ్విధమున నందఁడు సుమ్మీ. ౨౯౭.

క. క్రమకాలంబున నీ త్రిత
యము నబ్బిన ముక్తిఫలద మగు; నొక టొకటే
సమకొన సంకల్పిత మం
త్రములుగ నత్యుచ్చసిద్ధిదము లగుఁ దలపన్. ౨౯౮.

గీ. అనఘ యీమూఁడు గూడ నభ్యస్త మైనఁ
గలుషతర మగుమానసగ్రంథు లెల్లఁ
దొడవు దెగ దాన నూలును దునియునట్లు
తివిరి నిశ్శంక నన్నియుఁ ద్రెస్సిపోవు. ౨౯౯.

క. ఘన భావనావిరతి సం
గనివర్తనములను దనదుకాయ మసత్యం
బని తెలిసిన, వాసనలను
మునుకొని యవి యణఁపఁ, జిత్తమును నణఁగుఁజుమీ 300

సీ. సకలార్థవితతకి సంగంబు హేతువు,
సంగంబు నిలయంబు సంసృతికిని,
సంగంబు మూల మాశాలతావలికిని,
సంగంబె యాపద్దశలకు నెలవు,
సంగవర్జనమె మోక్షము, సంగవిరతిని
జన్మనాశం బగు జనవరేణ్య,
కలిమిలేములు రెండు కడు దుఃఖ మొనరించు

మలినవాసన సంగమం బెసంగ,

గీ. నింక సన్ముక్తిరక్తుల కిట్లు వితత
జన్మ ఖేదము హర్ష విషాదగతియు
సడల వతిఁడల్లు శుద్ధవాసన యెసంగ,
ననుచుఁ గొనియాడుదురు మును లనఘచరిత. ౩౦౧.

వ. ఆ జీవన్ముక్తులు, మూఢుఁడచిత్తులు దీనమతులు నగుదురేని పునర్జన్మ
మొందుదురు అట్లు గావున. ౩౦౨.

చ మును సుఖదుఃఖజాలమున మోదము ఖేదము లేక, యాశకుం
జన వొకయింత యూఁక, ఘనసంపద లాపద లొందినట్టిచో
ట్లను సమబుద్ధి నొంది, యొకటిఁ దగు లొందక, ప్రాప్తవస్తువుల్
గొని సుఖియించె దేని ధృతి గూడి యసంగుఁడ వౌదు రాఘవా.

వ. అని ఆకాశగత్యభావోపాఖ్యానం బెఱింగించి వసిష్ఠుండు ౩౦౪.

క ఉపశమన ప్రకరణమున
నపరిమితం బైనచిత్త మణఁగువిధము నా
త్మపరిస్ఫుటవిజ్ఞానము
నుపదేశించితి నెఱుంగు ముత్తమచరితా. ౩౦౫.

వ. అని యి ట్లుపశమనప్రకరణంబు వసిష్ఠుండు రామచంద్రున కెఱింగిం
చుటయు సవిస్తరముగా విని భరద్వాజుండు సంతుష్టాంతరంగుం డై
యటమీఁద నేమి సెప్పె నానతి మ్మని యడిగిన. ౩౦౬

(మత్తకోకిల).

వేదవేద్యపదాంబుజద్వయ, విశ్వరక్షణదక్షకా,
యాదిశత్రునిరస్తనిత్యదయారసామృతనేత్ర, ప్ర
హ్లాదనారదపుండరీకశుకాదిభాగవతోత్తమా
హ్లాదకారణ, దివ్యనామ, భవాబ్ధిశోషణబాడబా. ౩౦౭.

క. సంసారభయనివారణ,
కంసాసురమల్లముఖ్యఘనదానవవి
ధ్వంసభుజసార, దివిజో
త్తంసమణిశ్రీపరీతతతపదకమలా. ౩౦౮.

(మాలిని).

కమలభవవధూటీ కాశకర్పూరవాటీ
హిమకర హిమశై లాహీంద్ర సత్కీర్తి లోలా
దమితవిమలవీరా దైత్యవక్షోవిదారా
విమలకమలనేత్రా వీరలక్ష్మీకళత్రా. ౩౦౯.

(గద్య).

ఇది శ్రీనృసింహవరప్రసాదలబ్ధకవితావిలాస భారద్వాజసగోత్ర
పవిత్రాయ్యలామాత్యపుత్త్ర సరసగుణధుర్య సింగనార్య
ప్రణీతం బైనవాసిష్ఠ రామాయణంబునందు
ఉపశమనప్రకరణం బన్నది

చతుర్థాశ్వాసము

---

# వాసిష్ఠరామాయణము.

## పంచమాశ్వాసము.

క. శృంగారాకార శ్రీ
సంగతదివ్యాంతరంగ సరసిజనిలయా
లింగితవక్ష యహోబల
శృంగస్థలనటనరంహ శ్రీనరసింహా. ౧.

### నిర్వాణ ప్రకరణము.

వ. దేవా పరమతత్త్వార్థవివేకి యగు వాల్మీకి భరద్వాజున కిట్లనియె. న ట్లు పశమనప్రకరణం బెఱింగించి, వసిష్ఠుండు రామచంద్రుం గనుంగొని–యీయర్థంబునకు ఫలంబు నిర్వాణంబ యని సెప్పంబడు. నందు భుసుండ, దేవపూజ, బిల్వ, శిలాఖ్య, అర్జున, శతరుద్ర, వేతాళ, భగీరథ, శిఖధ్వజ, కిరాత, చింతామణి, గజ, చూడాల, కచ, మిథ్యా పురుష, భృంగి, ఇక్ష్వాకు, వ్యాధ, యోగభూమికోపాఖ్యానంబులన జీవన్ముక్తవర్ణితంబు లగునితిహాసంబు లేకోనవింశతి యుండు. నందు ప్రణవధ్యానంబునం జిత్తవిశ్రాంతి గలుగుట భుసుండోపాఖ్యానంబు నం జెప్పంబడు, నవ్విధం బాకర్ణింపుము. ౨.

గీ దేహములయందు నహమిక, దృశ్యసమితి
యాత్మ యనుటయు, వస్తువులందు మమత,
యలమి యెందాఁక వర్తించు నంతదాఁకఁ
బాయ దెప్పుడు చిత్తవిభ్రమము వత్స. 3.

క వినుమంతర్ముఖుఁడై జగ
మను తృణముఁ జిదగ్నియందు నాహుతిగాఁ దా

నొనరించిన మునివరునకు,
మొనయదు విభ్రాంతి చిత్తమున నెన్నఁటికిన్. ౪.

వ. అనిన విని రఘువరుండు మునివరున కి ట్లనియె. ౫

క. నీ విచ్చినబోధంబున
జీవన్ముక్తుండ నైతిఁ, జిరవాసనతో
నీవిధము వాయుధారణ
నేవిధమునఁ బొందవచ్చు నెఱిగింపు తగన్. ౬.

వ. అనినవసిష్ఠుం డి ట్లనియె. ౭.

క. ఘోరభవోత్తారణకును
నారూఢధ్యానయోగ మగునది—యంత
ర్మారుతధారణ మన, నా
త్మారామజ్ఞానసౌఖ్య మన, ద్వివిధ మగున్. ౮.

క. ఈ రెంటియందు మారుత
ధారణ మది యోఁగ మంద్రు, తెలుపఁగ నివి సా
ధారణములు గా వని యధి
కారివిశేషమును శివుఁడు గావించెఁ జుమీ. ౯.

వ. అట్లు గావున, నీకుఁ బరమజ్ఞానం బెఱింగించితి నింకఁ బ్రాణధారణా
యోగంబు తెఱం గెఱింగించెద. నాకర్ణింపుము. ౧౦.

సీ. భూనాథ విను రత్నసానుశృంగంబునఁ
బద్మరాగపురుచిఁ బరఁగుకల్ప
తరు వొప్పు. నామ్రాని దక్షిణస్కంధ కో
టరమునఁ గనకవల్లరులయింట
నుండు భుసుండాఖ్యుఁ డొకవాయసశ్రేష్ఠుఁ.
డాతండు చిరజీవి, యఖిలములను
వీతరాగుఁడు, కాలవేది, శ్రీమంతుఁడు,

శాంతుఁడు, నిత్యవిశ్రాంతబుద్ధి.

గీ. యతనిఁ గనుఁగొను వేడుక నచటి కరిగి
చూచునెడ నమ్మహీజంబుఁ జుట్టియున్న
పసిఁడితీఁగెలకొనలపుష్పములయందుఁ
గలసి క్రీడించు బహువిహంగముల గంటి. ౧౧.

వ. మఱియును. ౧౨.

క. శశిశకలసదృశబిసలత
లశనములుగ సామగాయనాభ్యాసకళా
వశుల పితామహవాహన
శిశులను హంసములఁ గంటి చెలఁగుచు నంతన్. ౧౩.

ఉ. వాయసవృద్ధవర్గ మిరువంకల డగ్గఱి తన్నుఁ గొల్వఁగా
నాయతపక్షయుగ్మమును నంజననీరదనీలవిస్ఫుర
త్కాయము దీర్ఘతుండమును గల్గి సుఖస్థితి నున్నవాని దీ
ర్ఘాయురుపేతు నిత్యవిజితాంతకశుంభు భుసుండుఁ గాంచితిన్ ౧౪.

## భుసుండోపాఖ్యానము.

క. కని డాయఁబోవఁ బ్రీతి
న్ననుఁగొని సత్కారవిధు లొనర్చెన్ సుఖాసీ
నునిఁ జేసి పరమసమ్మద
మున బొందెడువాయసోత్తమున కిట్లంటిన్. ౧౫.

శా. ఏకాలంబునఁ బుట్టితీవు? మఱి నీ కీబ్రహ్మవిజ్ఞాన మి
ట్లేకృత్యంబున సంభవించె? నది మున్నెంతయ్యె నీ కాయువు? ఏ
వేకార్యంబు లెఱింగి? తీగృహము నీ కెవ్వాఁడు మున్నిచ్చె? నో
కాకాధీశ్వర, నాకుఁ జెప్పుము మదిన్ గౌతూహలం బయ్యెడిన్. ౧౬.

సీ. అనిన భుసుండుఁ డిట్లను.—మహాభాగ నా
తెఱఁ గెల్లఁ జెప్పెదఁ దెలియ వినుము,

స ప్తమాతృకలు నుత్సవవేళఁ గఱకంఠుఁ
గొలుచువేడుక వెండికొండ కరుగ,
నందు బ్రాహ్మికి వాహ మగుహంసికకు నలం
బుసవాహ మగుకాకపుంగవునకుఁ
బుట్టితిఁ; బుట్టినప్పుడు బ్రాహ్మి నా కిట్టి
విజ్ఞానసంపద వేడ్క నిచ్చె;

గీ. వెండి నాతండ్రి యిందు న న్నుండఁ బనిచె;
నతనిపంపున నిం దుండ నగణితంబు
లైనకల్పాంతములును మన్వంతరములుఁ
జనియె, నే నెన్ని చెప్పుదు మునివరేణ్య. ౧౭.

వ. అనిన నే నిట్లంటిఁ. గల్పాంతంబులం దెట్టియోగీంద్రులు నిత్తెఱంగున నున్నవారు లేరు. నీ వెత్తెఱంగున నుంటివి? యనిన; నతండు—మునీంద్రా, యీశ్వరశాసనం బలంఘనీయంబు, గావునఁ గల్పాంతంబుల యందు పృథివ్యాదిభూతంబులందు యణఁగి వర్తించుచు నెక్కాలంబు సుఖించుచుండుదు.—ననిన; నతని కిట్లంటి. ౧౮.

క. నీవును జ్ఞానవిదుండవు,
గావున మును సన్న బ్రహ్మకల్పంబులయం
దే వేవి చూచి తేర్పడ,
నావిధ మెఱిగింపు మనిన నతఁ డి ట్లనియెన్. ౧౯.

మ. అనఘా, యే మని చెప్ప! ధాత్రి జనసంతాన్యం బయ్యెఁ బెక్కేఁడు;లం
త నగ క్ష్మాజ లతా తృణాది యదరన్ దా భస్మ మై తోఁచె; న
య్యినచంద్రాదులపుట్టువుల్, సురవరోపేంద్రస్థితుల్, క్రోడ మై
కనకాక్షున్ హరి ద్రుంచుటల్,శిశువులై కాన్పింతు రింకేటికిన్. ౨౦.

క. ము న్నేడుగురు వసిష్ఠులఁ
గన్నారఁగఁ జూచినాడ కమలజతనయా,

యెన్నఁగ నష్టమ తను వగు
నిన్నిచటం జూడఁ గంటి నిండిన ప్రేమన్. ౨౧.

క. ఒకమా టాకాశంబున,
నొకపతి యుదకమున, నగ్ని నొకయెడ, గిరియం
దొకవేళఁ, జుట్టు చుండుదు
నకలంకవిభావనంబు లద్భుతలీలన్. ౨౨.

వ. మఱియును. ౨౩.

సీ. కలియుగంబులు నూఱు గనుఁగొంటి, హరి బుద్ధ
జన్మంబులును నూఱు చనియె మున్ను,
త్రిపురదాహంబులు దీఱె ముప్పదిమాఱుల్,
దశముఖంబులు లక్ష యణఁగె,
సాంగంబు లగువేదసంఖ్యలు పెక్కేఁగె,
నెన్నంగరాని యనేకపాఠ
ముల నొప్పెడు పురాణములు పెక్కు వఱలెంచె,
న ట్లితిహాసరామాయణములు

గీ. చనియెఁ బెక్కులు, మోక్షశాస్త్రములగ్రంథ
లక్ష లుదయించె, వాల్మీకిదక్షనిరత
శిక్షులును వ్యాసుఁ డనుమునిచేతఁ బరుల
చేత భారతములుఁ బెక్కు సేయఁ బడియె. ౨౪.

క. భువి రామాయణకథలును
భవిష్యదుద్భవముతోడఁ బంద్రెం డగుచు
న్నవి, కృష్ణావతరణములు
నవి పదియా అయ్యె, వచ్చు నవతారముతోన్. ౨౫.

వ. అట్లు గావున జగద్భ్రాంతి యిట్టిది. దీని కవధి సెప్ప రాదు. నీవడిగిన యర్థం బెఱింగించితి. నింక నేమి యభీష్టం బడుగు మనిన నతనితోఁ

ప్రాణు లపమృత్యు రహితు లై చిరంజీవు లె ట్లగుదు రెఱింగింపవే.
యనిన నవ్వ్యాసవిభుం డి ట్లనియె. ౨౬.

క. దోసము లనుమా ర్తికములు
వాసన లనుతంతువుల నవారణఁ గ్రువ్వన్,
రోసినచి త్తమువానికి
నోసరిలున్ మృత్యు వెందు ను త్తమపురుషా. ౨౭.

క. విను నిర్మలమును భావన
మును నేకముఁ బరమసౌఖ్యమును నైనపదం
బున నెవ్వనిమది దగులునొ,
యనఘా, యాతనికి మృత్యు వతిదూర మగున్. ౨౮.

గీ. ప్రకటసంసారరోగకారణము లగుచు
నడరుకామాదిశత్రుల నడఁచునట్టి
యాత్మరతులును బ్రాణచింతాభియుతులు
నగుమహాత్ములదెస మృత్యు వరుగ దెపుడు. ౨౯.

వ ఈ రెంటియందును సర్వదుఃఖక్షయకారిణియు, సకలభాగ్యదాయిని యుఁ, జిరాయుఃకారణంబును, నగు ప్రాణచింతన మతిసుఖప్రద నై యతిశిల్లు. దాని విధం బెఱింగించెద నాకర్ణింపుము. ౩౦.

సీ. పరఁగ హృద్గత మైనప్రాణానిలము వెలి
ద్వాదశాంగుళమాత్ర వచ్చి యణఁగు
నది రేచకం బగు; నదియ నిశ్చలత
బహిఃకుంభకం బగు; నదియ మఱల
హృదయంబు సొచ్చి పెం పెసగఁ బూరక మగుఁ;
గదల కాంతరకుంభకత్వ మొందుఁ;
దప్పక యిబ్భంగిఁ దాన వతిలువాయు
చింతనం బది ప్రాణచింత యండ్రు.

గీ. ఇదియు దుఃఖౌఘనిరసని, యిందు నిలిచి
యెవ్వ రుండుదు; రట్టివా రెల్లనాఁడు,
శుద్ధబుద్ధస్వరూపులు సుఖులు ఛిన్న
మతులు నై యెందుఁ దగులక మనుదు రనఘ. 3౧.

క. విను బహిరంతర్సుఖముల
మునివర ప్రాణము నపానమును వలికాల రెం
టిని గూర్చి నడుమఁ జిత్తముఁ
గొనకొని వలికింప నదియ కుంభక మయ్యెన్. 3౨.

క. మానుగఁ బ్రాణము వొదువ క
పానం బడఁగంగ నేది ప్రబలుం డమల
జ్ఞానస్వరూపతత్త్వము
నానందముతో భజింతు ననవరతంబున్. 33.

ఉ. ప్రాణ మణంగి యుండఁగ, నపానము నుద్భవమొందకుండఁ, ద
త్ప్రాణవియత్పదంబున నకంపితమై కలనాకలంక ని
ర్వాణను నిష్కళంకముఁ బరంబుఁ జిరానుభవోత్తమంబు గీ
ర్వాణనుతంబు యోగిసుకరంబును నైనపదంబు నొందెదన్. 3౪.

గీ. అట్టి ప్రాణసమాధిని నట్టివిమల
సంవిదానంద మైనవిశ్రాంతి గలిగి,
తలఁప భూతభవిష్యదర్థముల నెపుడు;
వర్తమానంబు చూతు నకర్త నగుచు. 3౫

క. ఈ దలను ధీరుఁడ నై
శ్రీపరిణతి సముఁడ నగుచుఁ జిత్తంబున న
వ్యాపితభావాభావుఁడ
నై పెంపునను జిరజీవి నై యున్నాఁడన్. 3౬

వ. అనిన నతనిం గనుంగొని 'మహాభాగా, నీచరిత్రం బింతయొప్పునే! యతి

విచిత్రం. బట్లు గావున సకలభువనభూషణుండ వై యాత్మారామసుఖం బు లనుభవింపు.'మని యవ్వాయసయోగి నామంత్రణంబు చేసి, చను దెంచితి. నట్లు గావునఁ బ్రాణనిరోధంబునను జిరకాలజీవులు జీవన్ముక్తులు నై సుఖయింతు రని యెఱింగించి వసిష్ఠుండు. ౩౭.

క. భూనాథ యీ భుసుండా
ఖ్యానము వినఁ గాంచుపుణ్యకర్ముల కచల
జ్ఞానంబు సంభవించుఁ జి
దానందసుఖంబు లొందు నంబుజనయనా. ౩౮.

వ. అని భుసుండోపాఖ్యానంబు సవిస్తరంబుగా నెఱింగించి, యిట్టి చిత్త విశ్రాంతిరూపం బైననిర్వాణంబు దేవపూజ నైన సంభవించుఁగావున తత్కథాక్రమం బెఱింగించెద నాకర్ణింపు. మని వసిష్ఠుండు రామ చంద్రున కి ట్లనియె. ౩౯.

చ. తిరముగ శయ్య నుండి పెరదేహముతోఁ గలలోన దిక్కులఁ దిరిగెడునట్లు గాని, యొకదేహమునం దిర మొంద దాత్మ; సం సరణము నిట్లు దీర్ఘ మగుస్వప్నము, దీర్ఘమనోభ్రమంబు, దీ ర్ఘరమితచిత్తరాజ్యమును, గా మదిలోనఁ దలంపు రాఘవా. ౪౦.

వ. అదియునుం గాక. ౪౧.

ఉ చచ్చుట నిక్క మందఱకుఁ, జావునకై పరితాప మేటికిఁ?
వచ్చుధనం బవశ్యమును వచ్చును, దాన మదింప నేటికిఁ?
గ్రచ్చర రాగరోషభుజగంబులు రెండు మనోబిలంబునం
జొచ్చి కలంపఁగా నెఱుక చొప్పడ కున్నది గాక, రాఘవా. ౪౨.

క. చతురులు శాస్త్రప్రజ్ఞా
రతులును నై రాగరోషరక్తు లగుదు రే,
నతిభారవాహిగార్దభ
గతిసదృశులె కాన వారిఁ గాల్పనె తండ్రీ. ౪౩

గీ. అట్లు గావున భయదంబు నాత్మధైర్య
హానియు నమంగళంబును నైనయట్టి
క్షుత్పిపాసంబు నెడలించి స్రుక్కి చెడని
చిన్మయానందసౌఖ్యంబుఁ జెందు మెపుడు. ౪౪.

వ. అని బోధించి యమ్మహాముని తొల్లి శంకరుం డానతిచ్చిన దేవపూజా
మహిమ యెఱింగించెద నాకర్ణింపు మని యి ట్లనియె. ౪౫.

## దేవపూజోపాఖ్యానము.

సీ. భక్తి నే నొకనాఁడు భాగీరథీతటి
శివునిఁ జిత్తమునఁ బూజించి, పిదపఁ
గను విచ్చి చూడ, శంకరుఁడు ప్రసన్నుఁడై
ముంగటఁ బొడసూప, మ్రొక్కి నిలిచి
ప్రాంజలి నై — దేవ, పరమాత్మ, పరమేశ,
శర్వ, కళ్యాణంబు సర్వపాప
హరణంబు నగు దేవతార్చనవిధ మెట్లు
లాన తిమ్మనుటయు హరుఁడు పలికె.—

గీ. మునిగణాధీశ యీక్రియ వినుము దెలియ;
హరిహరులు గారు దేవత, లరయఁ జిత్ర
దేవరూపులు గా, రకృత్రిమ మసాధ్య
మైనసంవిత్స్వరూపం బనాదివేల్పు. ౪౬.

క. ఆకాశాదులపగిది న
నేకం బగువస్తువందు నేర్పడ నాద్యం
బై కృత్రిమరహితం బగు
శ్రీకరతత్సత్త్వ మదియ శివుఁ డనఁబరఁగున్. ౪౭.

క. ఆ మహిమ యెఱుఁగ నేరని
పామరు లాకారపూజఁ బరఁగుదు రొకపె

ట్టామడ చననోపక యర
యామడ చని నిల్చినట్లు యాత్మవివేకా. ౪౮.

క. పారావారవివర్జిత
మై రంజిలు చిత్ప్రకాశ మది దృఢ మగు; నా
కారాదులు లే వెల్లెడ;
నారయఁ గల్పాంతదశలు నంద యణంగుౙ. ౪౯.

సీ. శాంతియ బోధంబు, సమతయ పుష్పముల్,
చిత్సౌఖ్యసత్తయే శివుఁడు, నిట్టి
యాత్మార్చనయె దేవతార్చన యగుఁ; గాని
యాకారపూజ లనర్చనంబు
లాత్మపూజయ యనాద్యంతంబు నద్వితీ
యము నఖండము నబాహ్యంబు నైన
యానంద మొసఁగు, బాహ్యము నాంతర మనంగఁ
దత్పూజ ద్వివిధ మై తనరు ; నందు

గీ. బాహ్యపూజాప్రకారంబు పరఁగ వినుము,
సర్వభావాంతరస్థయు శమితకళయు
సదసదంతరసామాన్యసత్త్వవతియు
నైన సంవిత్తిసత్త దా నమరు నొకటి ౫౦.

వ. అమ్మహాసత్తాత్మత దేవుం డనిపించుకొనును. నతండుసర్వశక్తిమయుండు గావున శక్తిమండలతాండవంబునఁ బ్రవృత్తినివృత్తులం బొందుచుండు. నదియు విజ్ఞానశక్తియు క్రియాశక్తియు కర్తృత్వశక్తియు నుల్లాస శక్తియు నిరోధశక్తియు నను నిట్లనంత శక్తు లగుచుండు. నందు నుల్లాసశక్తి సంసారవిజృంభణంబు సేయు. నిరోధశక్తి దాని నిశ్శేషంబు సేయుచుండుఁ. గావున. ౫౧.

క. జగదాధార మనంతము
నగణితరవినిభము భాసనాభాసకముౙ

విగుణము సంవిన్మయమును
నగు నంతస్స్వప్రకాశ మది పూజ్యముగాన్. ౫౨.

వ. అది యెట్లంటేని ౫౩.

సీ. కడలేని తత్పరాకాశకంధరము వా
సాదికాకాశకోశాంఘ్రితలము,
నఖిల దిక్పూర్ణబాహామండలము శివ
మగణితస్ఫురిత నానాయుధంబు,
హృత్కోశకోణసంహితవిశ్రమితమహా
బ్రహ్మాండభాండపరంపరంబు,
నై చెలువొందిన యఖిలపూజ్యుఁడు సంవి
దాత్ముఁ డాతని కుపహారవిధులు

గీ. వలవ వవినాశనంబు శీతలము లమృత
మును నదీనంబు నాత్మీయమును ఘనంబు
నైన యక్లేశలభ్యవిజ్ఞాన నియతి
నమ్మహాత్ముఁడు పూజల నందుఁ దాన. ౫౪.

క. విను ముట్టుఁ జూచుఁ జను మూ
ర్కొను బలుకును నిద్రవోవుఁ గుడుచు న్విడుచున్
ఘనచిన్మయాత్ముఁ డగు నా
తని కొండొకపూజవలదు ధ్యానము దక్కన్. ౫౫.

క. విను మిట్టిపూజలను మూఁ
డునిమేషములంత సేయుదును గోదానం
బునఁ గలఫల మగు; దిన మె
ల్లను జేసిన పరమధామలాభము నొందున్. ౫౬.

వ. ఇది పరమధర్మంబును పరమయోగంబును నగు; నిది బాహ్యపూజ
యనంబడు. నింక నంతఃపూజ యెఱింగించెదఁ; జిత్తగింపుము ౫౭.

మ. స్థితుఁడు న్నిర్గతుఁడుఁ బ్రసుప్తుఁడును నాసీనుండుఁ దా భోగియుఁ
గతభోగుండును దూరసంస్థితుఁడు భ్రాంతస్థుండు సర్వంబు నై
వితతాకాశ శివాత్మకం బయిన సంవిజ్జ్ఞానలింగంబు నం
చితబోధాత్మసమాధి నిచ్చలును బూజింపం దగుఁ సంయమీ. ౫౮.

సీ. అట్టి చిన్మయరూప మగునాకుఁ బెక్కఁగు
చిత్తదృక్ఛక్తులు చెలఁగుసతులు,
విశ్వంబు నాకు నివేదన, మనముఁ దౌ
వారికుం డగుఁ, బ్రతిహారి చిత్త,
మతులఖండజ్ఞానవితతి భూషణములు,
ద్వారంబు లింద్రియదశక మరయ,
నబ్భంగి నీరూప మగునన్ను సమబుద్ధిఁ
దప్పక పూజింప నొప్పు; నిట్టి

గీ. పరమపూజకుఁ ద్రవ్యసంపత్తివలదు;
కామదం బగు పూజయుఁ గలదు వినుము,
ప్రాప్త మగునట్టి భక్ష్యపానాదు లాత్మ
కర్చనము చేసి సుఖ యగు టదియ లెస్స. ౫౯

వ ఇట్లాత్మపూజాహారంబు లగు భక్ష్యాదివస్తుసంపద్ద్రవ్యంబు లన్నియు
నేకం బగుశాంతరసంబు చేతను దిరస్కృతంబు లగు నట్లు గావున దేశ
కాలకలనాకలితంబు లగువస్తువులవలసి సుఖదుఃఖవిభ్రమంబు లుడిపి
నిత్యజ్ఞానార్చితశరీరనాయకుండ వై సుఖం బుండు. మని యుపదే
శించి యమ్మహాదేవుండు మఱియు ని ట్లని యాన తిచ్చె. ౬౦.

క. ఈవిధము పూజ నిచ్చలు
గావించెడు నతని కేను గలదైవములుఁ
సేవితుల మగుచుఁ దగ సం
భావింతు మతండు నొందుఁ బరమపదంబుఁ. ౬౧.

గీ. లేని వయ్యును గలయట్లు గానిపించు
జగము లాభాసమాత్రమ యగు మునీంద్ర;
యెండమావులు నీళ్లని యెఱిఁగినట్లు
మూఢుఁ డేతత్త్వ మెఱుఁగక మునుఁగు నందు. ౬౨.

చ. అలఘువివేక, జీవుఁ డని యాత్ముని దెల్తురు గాక యెందున
జ్ఞులు. జడిమోద్భవుండ నలసుండు ననార్యుఁడు నైనమూఢు నే
కొలఁదుల శిక్ష సేసెదరు? క్రూరుని సౌమ్యునిఁ జేయఁ బోక, తాఁ
గలఁ బొడగన్నమర్త్యునకుఁ గన్నియ నిచ్చుట యాఁ దలంపగాన్.

వ అని యనేకప్రకారంబుల నుపదేశించి యప్పరమేశ్వరుం డంతర్ధా
నంబు నొందె. నని రామచంద్రున కెఱింగించి వసిష్ఠుండు మఱియు
ని ట్లనియె. ౬౪.

క. ఈ యర్చన యక్లేశం
బాయతవాసనలు దీన నణఁపుదు మెపుడున్.
బాయక ప్రాప్తిక్రియ యగు
నా యాత్మార్చనము నింద యణఁచినభంగిన్. ౬౫.

చ. అరయఁగఁ బ్రాప్తమైనక్రియలం దొకవిఘ్నము గల్గెనేనియున్
మెరమెర పొందఁగా దదియు మిక్కిలి పూజయు, దాన దోషముల్
పోరయవు, గాన జీవునెడఁబుట్టెడు గ్రాహ్యము గ్రాహకత్వమున్
సరి యగుయోగపూజ ధృతిఁ జల్పుము రాసుత యాత్మపూజయున్.

వ. అనియిట్లు దేవపూజోపాఖ్యానం బెఱింగించి వసిష్ఠుండు రామచంద్రుం
గనుంగొని యింక నంతర్భావకంబు లగుసకలార్థంబులుం గలయది
యవ్యయం బగు చైతన్యంబ. యీయర్థంబు విదితం బగు బిల్వో
పాఖ్యానం బెఱింగించెద నాకర్ణింపు. మని యి ట్లనియె. ౬౭.

## బిల్వోపాఖ్యానము.

గీ. ప్రాప్తములు వచ్చుచోటను బ్రథమవేళ
సుఖత మగునట్లు, తర్వాత సుఖము లేక
యునికి యనుభూతసిద్ధంబు జనుల కెల్ల
దీని నెవ్వఁ డెఱుంగఁడు ధీరహృదయ ౬౮.

ఉ. కోరినవేళ వస్తు వొడఁగూడ సుఖం, బది మీఁదఁ గల్గఁ; దా
గౌరవమెల్లఁ గోరికయ గాపున, వాసనఁబాయ నిస్పృహా
చారత సర్వకర్మములుఁ జల్పుము, పెక్కుకళంకువల్ మదిం
గూరిననైన; దీని మదిఁ గొందల మందక నిల్పు రాఘవా. ౬౯.

వ సర్వాత్మకంబు నేకంబు నగు బ్రహ్మంబు భువనభ్రమవిభ్రమంబుల ననే
కంబువోలె నుండు. నంతియకాని తక్కొండు లే దీయర్థంబు బిల్వఫ
లరూపంబునం జెప్పంబడు వినుము. ౭౦.

సీ. విపులత్వమునను వేవేలయోజనము లై
యుగసహస్రములందు నిగిరిపోక
నమలంబు నధికంబు నతివిస్ఫుటంబు నై
యొక్కమారేడు బం డొప్పుచుండు,
నది ప్రాఁతయయ్యును నమృతాంశుశకలమా
దణవసుందరంబు నై తనరుచుండుఁ,
గల్పాంతవాతవేగంబునఁ గదలక
కోటియోజనముల కొలఁది వడిని

గీ. మూల మనఁగల్గి యీజగంబులకు నెల్లఁ
దాన యాధార మగుచుండు, దానిచుట్టు
మెఱసి బ్రహ్మాండములు విశ్రమించుచుండు,
రవికులక్షీరనిధిచంద్ర రామచంద్ర. ౭౧.

వ. అనిన విని రామచంద్రుఁ డి ట్లనియె. ౭౨.

క. మునిసార్వభౌమ, బిల్వం
బని యిప్పుడు మీరుసెప్పినది నామదికిన్,
మును చెప్పిన చిత్సత్తయ
యని తోఁచెడి దీనిఁ దెలియ నానతి యీవే. ౨౩.

వ. అనిన నమ్ముని యఖిలంబును జిత్తోద్భవరూపంబు. అది యహంకారం
బున విస్తరిల్లుచుండు. భేదంబు చిత్తచాంచల్యంబె కాని, యన్యంబు
గా; దని బిల్వోపాఖ్యానంబెఱింగించి వసిష్ఠుం డధ్యాత్మనిర్వికల్పము,
నఖండైకరసము, నగు నీయర్థంబు విశదంబు సేయుటకు శిలోపాఖ్యా
నంబుసెప్పంబడు. నాకర్ణింపు మని రామచంద్రున కిట్లనియె. ౨౪.

శిలోపాఖ్యానము.

క. మృదువును మెఱుఁగును విస్మయ
పదమును నిబిడము నరంధ్రపరిపూర్ణము నై
విదిత మగు నొక్కశిల యన
నది విని రఘురాముఁ డనియె నధికప్రజ్ఞన్. ౨౫.

గీ. అనఘ మీరు చెప్పినది చిత్పదమ, యది
శిలయు ఘనము నేకకళయు నగుటఁ,
దా నరంధ్ర మయ్యు లోనుంచు జగముల
మిన్ను గాడ్పు నాఁచికొన్నయట్లు. ౨౬.

క. నాకము భువియును భవనము
నాకాశముఁ బర్వతములు నబ్ధులు దిశలున్
దూఁకొని శిలలో నివి గన
నేకత మచ్ఛిద్రతయును నెందుఁ దలంపన్. ౨౭.

వ. సకలలోకంబులు దనయంద యుండ యమ్మహాశిలయు నరంధ్రంబును,
నభేద్యంబును, శంఖచక్రగదాపద్మ రేఖాంకితంబును, నై సుషుప్తిభా
వంబున నుండు పరబ్రహ్మం బని శిలోపాఖ్యాన తాత్పర్యంబు సెప్పిన

విని వసిష్ఠుండు హర్ష నిర్భరమానసుండును, పులకితశరీరుండును, బాష్ప కణకలితకపోలుండును, గద్గదకంఠుండును, ముకుళితకరకమలుండును, నై రామచంద్రుం గనుంగొని—అహో మహాప్రాజ్ఞుండవు గదే ! ఈ రహస్యంబుసెప్పి. తీవయప్పరమేశ్వరుండ. వని యగ్గించి యింక వివేకి యగువానికి యుద్ధాదిక్రియలను జిత్తవిశ్రాంతిబోధకం బగునీయ ర్థంబున కర్జునోపాఖ్యానంబు గల దాకర్ణింపు. మని యిట్లనియె.

## అర్జునోపాఖ్యానము.

గీ. సమతఁ గర్తృత్వ భోక్తృత్వ సాక్షి యగుచు
నునుగమించిన పుర్యష్టకాఖ్య మగుచు
నెఱయు సంవిత్తి యర్జునునిం బ్రబుద్ధుఁ
డైనకృష్ణుఁడు బోధించె నయ్య వినుము. ౭౯.

మ. ఇటమీఁదర్కరవిసూనుఁ డైనయముఁ డీ శ్లేప్రొద్దు నీప్రాణులం
బటురోషంబునఁ జంప వేసరి తపఃప్రాప్తుండుగా, భూమియు
త్కటభారం బుడుపం జనించెదరు వీరల్ గృష్ణపార్థాఖ్యులై
నటనోదారబలప్రసిద్ధి నరుఁడున్ నారాయణుండున్ భువిన్. ౮౦.

గీ. అందు భారతరణమున నర్జునుండు
యుద్ధవిముఖాత్ముఁ డగుటకు నొయ్య నతని
ననునయించుచు శ్రీకృష్ణుఁ డానతిచ్చు
నట్టి వ్యాఖ్యాన మెఱిఁగింతు ననఘ వినుము. ౮౧.

సీ. చిద్రూప మెన్నఁడుఁ జెడదు సంపూర్ణంబు
నిర్దోష మీవును నిర్జరుండ,
వజుఁడవు, నిత్యుండ. వాత్మ, కేపట్టునఁ
బుట్టువుఁ జావును బొరయ వెందు,
నిట్లయ్యె నిటమీఁద నెట్లగు ననరాదు,
శాశ్వతుఁ డాద్యుండు, సర్వమయుఁడు,

తనుబాధ లెందు నాతని సోఁక, వటుగాన
నసురక్తిఁ దొలఁగి యేకాంతబుద్ధి

గీ. నన్ని కర్తవ్యములును బ్రహ్మార్పణముగ
నాచరింపుము, బ్రహ్మంబ వగుదు వీవ;
విలయవాయువు వీచిన వింధ్య మగులు
నపుడుగురుశాస్త్రమతు లలంఘ్యములు పార్థ. ౮౨.

వ. అట్లుగావున నప్రబోధంబున వాసనలధికంబగు, నాత్మవిజ్ఞానంబువలనం జేసి నశించు నని మఱియుఁ బెక్కువిధంబులఁ గృష్ణుం డర్జును బోధించి సమరకర్తవ్యోన్ముఖుఁ జేయంగలవాఁ డగుం గావున నట్లనాసక్తచిత్తుండవై సర్వంబు నాచరింపు మని వసిష్ఠుం డర్జునోపాఖ్యానం బెఱింగించి రామచంద్రుం గనుంగొని జంతువులకు జన్మపరంపర సంకల్పభ్రాంతియ. ఈయర్థంబున శతరుద్రోపాఖ్యానంబు గల దాకర్ణింపు మని మఱియు ని ట్లనియె. ౮౩.

శతరుద్రోపాఖ్యానము.

మ. ఒకభిక్షుండు సమాధిశాలి గలఁ డయ్యోగీంద్రుచిత్తాంబుజం
బొకనాఁ డాపగ వీచులై నిగుడున ట్లుల్లోలమై తా నొకా
నొక కర్మాశ్రయచింత నొంది తిరమై యొక్కింతసే పుండఁగా
నొకయాత్మప్రతిభావిశేషకలనం బుద్భూతమై యంతటన్. ౮౪.

సీ. అతని చిత్తంబు లీలార్థమై సామాన్య
జనభావకాంక్షతో మనుజుఁ డగుచుఁ,
గోరి జీవితుఁ డనుపే రిడికొని ఘన
స్వప్న పట్టణమున సంచరించి,
యట పానమదమత్తుఁ డై నిద్రవోవుచు,
కలలోన విప్రుఁ డై చెలఁగి, యందు
నిద్రించి కలలోన నెఱయ సామంతుఁ డై

భుజియించి, మఱి నిద్రఁబొంది కలను
గీ. ఒక్కభూపాలుఁ డై నిద్రనొంది, యందుఁ
గల సురాంగన యై, రతిక్రాంతి నిద్ర
నెసఁగ మ్మఱి యయ్యెఁ, గ్రమమున నివ్విధమున
బహువిధస్వప్నభవపరంపరలు వొంది. ౮౩.

క తుది రుద్రుఁ డైతి నని తన
మది నిక్కల గాంచి తొంటి మహితభవంబుల్,
విదితముగఁ గనియె, శివురూ
పొదవిన విజ్ఞాననిర్మలోత్తమ బుద్ధిన్. ౮౪.

వ. ఇవ్విధంబునం దెలిసి యంత నొక్కయేకాంతస్థలమున సుఖాసీనుండై యాత్మీయంబైనస్వప్నశతదర్శనంబులు దలంచుకొని విస్మితుండై,-యహో విశ్వమోహిని యగుమాయ యిట్టిదిగదే, మరుమరీచికాజలంబువోలె లేని దయ్యును గలయట్ల భ్రమియించుచున్నయది; యాయారూపంబుల నమితంబు లగు సంసారారణ్యభూములయందుఁ బెక్కుజన్మంబులఁ బరిభ్రమించి నేఁడు రుద్రుండనైతి. నిందు ననేకయుగంబులును బహువిచిత్రంబులునుం జనియె.అతీతంబైన యతిప్రభృతిసంసారశతంబు నాలోకించెదంగాక.-- యనితలంచుకొని చను దెంచి యతండు.

ఉ. ఆటఁ బ్రసుప్తమాడ్కి నగు నయ్యతిదేహము గాంచి చేతనో
త్పాదన యందుఁ జేసిన నతండును రుద్రుఁడ యయ్యె; నిద్దఱున్
సాదరలీలఁ జిద్గగనసంస్మృతిపట్టినమేనిఁ గాంచి ప్రా
ణోదయ మందుఁ జేయుటయు నొప్పుగ రుద్రుఁడ యయ్యె నాతఁడున్.

క. ఇవ్విధమునఁ జని వరుసన
యవ్విప్రప్రభృతు లైనయంగంబులకున్,
నివ్వటిలఁ దనువు లొసఁగిన
నవ్విధి శతరుద్రమూర్తు లైరి కుమారా. ౮౫.

వ. ఇట్లు మహాభిక్షుసంకల్పంబు లగుజీవితాదులు శుద్ధసంవిదంశంబు లై నిత్యులుంబోలె నుండి. రిది మనోమాయ యని శతరుద్రోపాఖ్యానం బెఱింగించి వసిష్ఠుండు రామచంద్రుం గనుంగొని.—యింక సుషుప్తి యనువునఁ బునర్జనకకం బగు వివేకం బెఱింగించుటకుఁ గర్కటికథ యునుంబోలె నొప్పు బేతాళప్రశ్నసంఘుంబుగల దాకర్ణింపు. మని మఱియు ని ట్లనియె. ౯౦.

క. మునివృత్తి—గాష్ఠతాపసి
యన జీవన్ముక్తుఁ డనఁగఁ న ట్లిరు దెఱఁగై
చను; నందుఁ గ్రియ లసారము
లని విడుచు జితేంద్రియత్వ మది ప్రథమ మగుఁన్. ౯౧.

క. యుక్తాయుక్తము లెఱిఁగి వి
రక్తుం డయి సువివేకరతుఁ డయ్యును లో
కోక్తిఁ జరించిన జీవ
న్ముక్తుం డగునది ద్వితీయమునివృత్తి యగున్. ౯౨.

వ. అట్లు గావున. ౯౩.

గీ. శాంతు లగువీర లిరువురు సములు, వీరి
చిత్తనిశ్చయరూపాత్మసత్త యైన
భావ మది మౌన మని చెప్పఁబడుఁ గుమార
యదియు మూఁడు విధంబు లై యమరు నందు. ౯౪.

వ. అది యె ట్లనిన ౯౫.

గీ. మాటలాడక యునికి వాఙ్మౌన, మింద్రి
యములఁ గుదియించుబలిమియె యక్షమౌన,
మన్ని చేష్టలు నడఁగించియున్న యునికి
కాష్ఠమౌనంబు నాఁబడుఁ, గమలనయన. ౯౬.

వ. ఇట్లు చెప్పంబడు చిత్తవిభ్రమ హరణం బగు మౌనత్రయంబునకు గాష్ఠతాపసుండు ముఖ్యుం డట్లు గావున. ౯౭.

సీ. అవిభాగయును, ననాయాసయు, నాద్యంత
శూన్యయు, నైనసుషుప్తి సత్త.
ధ్యానచిత్తులకు నధ్యానమానసులకు
మౌనసంగతిమై సమంబు దలఁప,
నానాత్వవిభ్రమం బైనయీజగ మెల్ల
నస్థిరం బని నిర్ణయముగ నెఱిఁగి,
సందేహరహిత చిత్సద్భావ మది యాకర
క్లిష్ట మైనట్టి సుషుప్తి యండ్రు,
గీ. ఏకమయ్యు దా ననేకసంవిద్రూప
మై వెలుంగు జిత్స్వభావ మదియ
యనిన యట్టియొుక యత్యంత మగు నేని,
మహిత మగుసుషుప్తి మౌనమండ్రు. ౯౮.

క. విను సమ్యగ్జ్ఞాన స్థితి
నొనరించి సమాధిఁ జేసి యుత్తమసంవి
ద్ఘను లగువారల నెందును
ననుపమ విజ్ఞానయోగు లండ్రు కుమారా. ౯౯.

క. సమమతిఁ బ్రాణమనోయో
గము నందఁగ శాశ్వతమును ఘనతరము ననా
ద్యము నగు చిత్పద మొందెడు
నమృతాత్ములె యోగయోగ్యు లండ్రు మునీంద్రుల్. ౧౦౦.

వ. ఇట్లీరుదెఱంగులవారికి నకృత్రిమం బగుసంవిత్తత్త్వం బెట్టిదనిన. వాసనావాగురాక్రాంతం బగుమనఃప్రాణవర్తనంబు లెచ్చోట నణంగు నదియ పరమపదం బనంబడు. సంసారస్వప్నవిభ్రాంతులయందు బేతాళవాక్యంబులైన శుభప్రశ్నంబులు గల వవి యెఱింగించెద. నాకర్ణింపు; మని వసిష్ఠుం డిట్లనియె. ౧౦౧.

## బేతాలోపాఖ్యానము.

మ. వెలయాం గర్కటిభంగి నాత్మవిదుఁ డా బేతాళుఁ డొక్కండు రే
యిల వర్తించుచు నొక్కపట్టణములో నేకాకి యై వచ్చు భూ
తలనాథుం గని వెంటఁబట్టి—నరనాథా మాకు నాహార మీ
స్థలి నీవాత్మవిదుండవేనిఁ జెపుమా సాధించి మాప్రశ్నముల్. ౧౦౨.

సీ. పరఁగ నేరవిరశ్మిఁబరమాణువులు నజాం
డంబు లౌ, నేమారుతంబు వీవ
నెగయుచు నమ్మహాగగనరేణువు లుండుఁ,
బలుమాఱుఁ గలలను గలఁడుఁ జనుచు
నమలతేజోమయం బగునాత్మరూపంబు
విడుచుచు నుండియు విడువఁ డెవ్వఁ,
డరఁటి యేకం బయ్యు నాకులుఁ బొరలు నై
నట్టిచందమున నేయణువు లమరు,

గీ. నణువిధం బగు నేపరమాణువునకు
నణువు లగు మేరుగగనాబ్జజాండసమితి
యవయవములేని యేపరమాణుశిఖరి
శిలలలోపలిమజ్జ యీసృష్టి యయ్యె? ౧౦౩.

క. ఇత్తెఱఁ గగు నాప్రశ్నల
కుత్తరములు వేగచెప్ప నోపవ యేనిన్,
దుత్తునుకలుగా నాచే
కత్తిని మెడఁ గోసి నీదుకండలఁ దిందున్. ౧౦౪.

క. అని జంకించుచుఁ బ్రశ్నలు
దను నడిగిన, భూవిభుండు దంతమరీచుల్
వినువీథి నిగుడ, నాతనిఁ
గనుఁగొని యిట్లనియె మృదులగంభీరోక్తిన్. ౧౦౫.

సీ. అతనుసువిత్స్ఫూర్త్యఁ దఖిలంబు నెఱిఁగించు
పరమభాస్వరచిత్ప్రభామయుండు,
త్రసరేణువులు జగత్త్రయములు, తత్కాంతి
విజ్ఞానరవిచేత వెలుఁగు నెపుడుఁ,
గాలసత్తయును, నాకారసత్తయుఁ, బరి
స్పందసత్తయుఁ, జిదానందశుద్ధ
చైతన్యసత్తయు, సర్వంబుఁ బరమాత్మ
మాయారజం ; బకంపమునఁ బొరలు

గీ. జగము లనియెడి నీమహాస్వప్నమునను
బహుతరస్వప్నములు గాంచు; బ్రహ్మ మరియ,
శాంతిసంపన్నమైన నిజస్వరూప
మెన్నఁడును విడువఁగ లే దహీనచరిత. ౧౦౬.

క. అరఁటియుఁ బత్త్రంబులచేఁ,
బొరలైన ట్లంతరములఁ బొందుచుఁ బ్రహ్మ
స్ఫురణవివృత్తముఁ బరవును
బొరలును నై విశ్వ మగుఁ బ్రబోధనిధానా. ౧౦౭.

క. తగ సూక్ష్మంబు నలభ్యము
నగుటఁ బరబ్రహ్మరూప మణు వగు నది దా
నగణితశక్తి ననంతం
బగుటను గన కాచలాదు లై పొలు పొందున్. ౧౦౮.

గీ. దీని పరమాణువులు మేరువినకరాదు
లవి యసంఖ్యంబు లగు, బరమాణు వదియు
సర్వపూరక మగుమహాశైల మయ్యె,
జ్ఞప్తిమయ మగుదీనిమజ్జయె జగంబు. ౧౦౯.

వ. అనఘా విజ్ఞానమాత్రంబ యీజగత్త్రయం బని మహీపాలుండు చెప్పిన

నిజప్రశ్నోత్తరంబులు విని సంతుష్టాంతరంగుఁడై బేతాళుం డతని విడిచి భావితాత్ముండును, నవిచారవంతుండును, విగతక్షుత్పిపాసుండు ను,నై యొక్కయేకాంతప్రదేశంబున నిరంతరధ్యానపరుండై సుఖం బుండె. నని బేతాళోపాఖ్యానంబు సెప్పి వసిష్ఠుం డింక దుర్లభంబగు బుద్ధివిశ్రమం బాత్మప్రయత్నంబున సులభం బగు. నీయర్థంబున భగీరథోపాఖ్యానంబు గల దాకర్ణింపు మని యి ట్లనియె. ౧౧౦.

## భగీరథోపాఖ్యానము.

సీ. రాజేంద్రుఁ డగుభగీరథుఁడు ప్రాణులయార్తి
నరసి నిర్విణ్ణుఁడై యాత్మఁ దలఁచి,
తిరిగివచ్చుచు నుండు దినములు రాత్రులు,
నాదానదానంబు లణఁగ వెందు,
నిస్సారకృత్యంబ నిత్యమై జరిగెడు,
నెద్ది ప్రాపింపంగ నెల్లక్రియలుఁ
జెడిపోవు నాచేతఁ జిక్కిన దం దెల్ల
నత్యంతదుర్వ్యాప్తి; యని విరక్త

గీ. చిత్తుఁడై త్రితలుని గురుఁ జేరి మ్రొక్కి,
యయ్య యీదుఃఖముల కెప్పు డవధి యనుడుఁ;
దనదు చిన్మాత్ర యగు పరమాత్మ యెప్పు
డెఱుఁగఁబడు నప్పు డీయార్తి దొలఁగు, ననిన. ౧౧౧.

క. విని నరపతి చిన్మాత్రము
ననుపమమును నచ్యుతంబు నని యెఱుఁగుదు, నా
త్మను, నందు నాకుఁ జిత్తం
బనఘా యెబ్బంగి నిల్చు నని యడుగుటయున్. ౧౧౨.

వ. అనిన విని త్రితలుం డి ట్లనియె. ౧౧౩.

క. భీషణసంసారరుజా
భేషజమును రాగశైలభిదురము దళిత
ద్వేషము నైన యహంకృతి
శోషణ నాత్మోపలబ్ధి చొప్పడు ననుడున్. ౧౧౪.

క. గిరియందుఁ దరువు పొడలిన
వరుసన కాయంబునందుఁ బ్రభవించె నహం
కరణ; మది యెట్లు చెడు? నని
ధరణీశ్వరుఁ డడుగ, గురుఁ డతని కి ట్లనియెన్. ౧౧౫.

మ. సకలంబుం బెడఁబాసి శాంతత విశేషంబుల్ విసర్జించి పా
యక నిర్భీకత యీషణత్రయమనోహంకారశత్రుండ వై,
యకలంకాత్ముఁడ వై, యకించనత భిక్షాహారి వై, యొందుఁ జే
రక వర్తించిన నున్నతోన్నతపదప్రాప్తుండ వౌ దెల్లెడన్. ౧౧౬.

క. అని త్రితలుఁడు బోధించిన
జననాథుఁడు సన్న్యసించి జగమున భిక్షా
శనుఁ డై ధీవిశ్రాంతిం
గనుఁగొని క్రమ్మఱుచుఁ గొంత కాలంబునకున్. ౧౧౭.

గీ. మార్గవశమునఁ జేసి క్రమ్మఱఁగఁ దనదు
పురికి నేతేర నెఱిఁగి యప్పురమువారు
పిలిచి యిండ్లకుఁ గొనిపోయి భిక్ష సేయ
నచట భూపతి చనుదెంచి యర్థి మ్రొక్కి. ౧౧౮.

క. ఈరాజ్య మేలుకొమ్మని
యారాజు ప్రియంబు సెప్ప నచ్చట నుండక,
దా రోసి వెడలి క్రమ్మఱి
ధారుణిఁ గ్రుమ్మఱుచుఁ గనియెఁ దనగురు నొకచోన్. ౧౧౯.

వ. కనుఁగొని వినయావనతుం డై తనకు చిత్తవిశ్రాంతి యగుట విన్న

వించె. నంతఁ గొంత కాలంబునకు నిజపురవిభుండు మృతుండైనం, బౌరులు రాజర్షియైన భగీరథుకడకుం జనుదెంచి ప్రార్థించినఁ గ్రమ్మఱం జని రాజ్యాభిషిక్తుండై సప్తసముద్రముద్రితం బగుధరావలయంబు పాలించుచు సర్వసముండును, శమయుక్తుండును, వీతమత్సరుండును, బ్రాప్తకార్యకర్తయుఁ,గృతనిశ్చయుండును, జీవన్ముక్తుండునై యుండె, నని భగీరథోపాఖ్యానం బెఱింగించి వసిష్ఠుండు ప్రతిబంధంబులు వాయక యాత్మజ్ఞానంబు దుర్లభం బగు నీయర్థంబున శిఖిధ్వజోపాఖ్యానం బెఱింగించెద నాకర్ణింపు. మని రామచంద్రున కిట్లనియె

## శిఖిధ్వజోపాఖ్యానము.

సీ. అనఘ చూడాలాఖ్యయును శిఖిధ్వజుఁడును
నను దంపతులు రాజ్య మనుభవించి,
వార్ధకంబున ముక్తివాంఛమై యధ్యాత్మ
శాస్త్రముల్ విన గురుశరణ మొంది,
రందు చూడాల మన్నాత్మప్రబోధకై
నిర్మలబుద్ధిఁ జింతించె నిట్లు;—
ఆత్మ యెయ్యది? కాయయష్టిచోదితలోష్ట
మట్లు వ్యాప్తిప్రేరిత మైనతనువు

గీ. నింద్రియగణంబు నేఁ గాను. హృదయ మనిన
దరములిడి రాయివారలించుకరణి బుద్ధి
నిశ్చయంబునఁ బొడవడి నిగుడుఁగాన,
నదియు నేఁ గాను బుద్ధి నే నందు నేని. ౧౨౧.

క. అది నిశ్చయాత్మ గావున
నది జడ మేఁ గాను నిశ్చయము నిస్సారో.
ద్యదహంకృతిజన్మం బగు
నదియును నేఁ గాను మఱి యహంకృతి యన్నన్. ౧౨౨

గీ. అదియు బాలుని భూతంబు గుదుచుభంగి
భ్రమిత మగుచున్న జీవంబుఁ బట్టు జడతఁ,
గావున నదియు నేగాను. జీవ మనినఁ
బ్రాణమయమై కలంకువఁబడుమనంబు. ౧౨౩.

వ. ఇట్టి సుకుమార మగుజీవం బన వేఱె యొక్కటి యుండంబోలు.నోహో యెఱింగితిం గదే! అది జగదుదరయైకకలంకమును,స్వస్వరూపంబు నగు చిద్రూపంబుచేతన బ్రతుకుచున్నయది. ౧౨౪.

క. అక్కట సంవిద్రూపం
బిక్కపటజ్ఞేయకలన నెనసినజడతం
జిక్కినది యట్టు, లనలము
పెక్కుదకముఁ బొంది రూపుఁ బెడఁబాయుగతిన్. ౧౨౫.

సీ. అట్టి చిన్మయముఁ జైతన్యము గూడి జడము శూ
న్యమును జైతన్యబోధ్యంబు నయ్యె,
నింతకాలమునకు నెఱిఁగితి నిబ్భంగి
సకలంబు చిద్విలాసంబు దలఁప,
సమలత సమత నహంకారరహిత మై
యుండు చిత్సత్తయ యొండు లేదు,
శూన్యమై యుండెడు శుద్ధసత్తయె బ్రహ్మ
మచ్యుతంబు శివంబు నై వెలుంగు.

గీ. నను వివేకంబు నెమ్మది నభ్యసింప,
నాత్మబోధ మఖండ మై యాత్మఁ బొడమ,
నవ్యధూమమణి పొల్చెఁ బేరె పగ్గలించి
లాలితం బైన నవపుష్పలతయుఁ బోలె. ౧౨౬.

ఉ. ఆరమణీలలాము నవయౌవనసంపద నివ్వటిల్ల శృం
గారరసంపుబొమ్మ యనఁగా నలిచన్నులుఁ జిన్నిమోము నూ

గారుఁ గృశోదరంబు నలకావలియుం బొలుపొందఁగా దర
స్మేరకటాక్షము ల్వ్రాలయఁ జెచ్చెర వచ్చె నిజేశుపాలికిన్. ౧౨౭.

క. వచ్చినభామినిఁ గనుఁగొని
యచ్చెరువడి యానృపాలుఁ డంబుజనయనా,
యిచ్చెలువ మైనయావన
మెచ్చట నీ కబ్బె ? ననిన నింతియుఁ బలికెన్ ౧౨౮

సీ. విను మేను విడుచుట వెండి పుట్టుట లేదు;
జననాథ, యిది సహజంబు దలఁప;
నీసర్వమును బాసి యాసర్వమును సత్య
మును నైనయొక్కటి ముట్టఁగంటి;
నాకాశసంకాశ మై కేవలం బైన
మనములో నశ్రాంతమును రమింతు,
లే దుదయంబును, లేదు నాశనమును,
లేనిదియును లేదు, లేదు కలది,

గీ. అననుభూతియ యనుభూత మని సుఖింతు;
దోషమును రోషమును మదిఁ దోఁప దెపుడు;
జగ దఖండప్రభుత్వంబు సంభవించె,
నాత్మ కిది రూప మి దరూప మనఁగ లేదు. ౧౨౯.

క. గతరాగద్వేషంబుల
నతిసూక్ష్మపు శాస్త్రదృష్టి యనుచెలికత్తెల్,
సతతము గొలువఁగ, మది శ్రీ
మతి నై సుఖ మున్నదాన మనుజవరేణ్యా. ౧౩౦.

చ. మును నయనంబులుం గరణముల్ మతియుం గనువాని నెమ్మొయిన్
గనుఁగొన, వీనితోడ వెలిగానివియుం బొడగాన; నాత్మ నెం
దును నిది యిట్టిభావ మని తోఁపదు; సుస్థిర నైతి దీన.— నే

ననవుడు సాధ్వివాక్యముల కర్థ మెఱుంగక యానృపాలుఁడున్.

వ. వనితా పదుచ్ఛేదనంబున ననంగతంబు లాడెద వని లేచి చనుటయుఁ జూడాల యాత్మగతంబున. ౧౩౨.

గీ. ఇతనికర్మబంధ మొందాఁకఁ బొలియదో?
యుడుగ కేను నిచట నుండ నేల?
ముక్త నైతి, యోగమున నభోగమనాదు
లాచరింతుఁగాక, యని తలంచి. ౧౩౩.

చ. సతియు సమాధియుక్త యయి సంవిదుపాయము తంత్రి నిచ్చలున్
సుతునకుఁ దెల్పుభంగి మృదుసూక్తులఁ దెల్పుచు నున్న నైన: ద
త్పతి తెలియంగలేఁడు పసిబాలుఁడు విద్య లెఱుంగలేని యా
గతి నొకకొన్ని యేండ్లకును గాంచి యెఱుంగక వేఁడ నాసతిన్. ౧౩౪

వ. ఇవ్విధంబునఁ జిత్తవిశ్రాంతిరహితుండైన యాశిఖధ్వజునకుఁ జూడాల తనయోగసిద్ధులు నిచ్చలు శూద్రునకు యాగక్రియ లెఱింగించినట్లు లెఱింగించుచు నుండె. నని శిఖధ్వజోపాఖ్యానంబు సెప్పి, వసిష్ఠుండు గురూపదేశంబున విజ్ఞానహేతు వగు నని యీయర్థంబున కిరాటో పాఖ్యానంబు గల దాకర్ణింపు. మనిన విని రామచంద్రుం డమ్ముని చంద్రున కిట్లనియె ౧౩౫.

గీ. యోగివర్య సిద్ధయోగిని యైన చూ
డాల దెలుపఁ దెలియఁ జాలఁ డయ్యె
నకట యాతుఁడైన యాశిఖధ్వజుఁడును,
నెవ్వ రింక దీని నెఱుగఁగలరు. ౧౩౬.

చ. అనిన మునీశ్వరుండు—మనుజాధిప యొందు గురూపదేశ మి
ట్లనన యొకత్రోవచూపు, మఱి యావల శిష్యుని సిద్ధబుద్ధి దాఁ
గనుఁగొను నన్న—రాముఁడు జగంబున నిట్టిగురూపదేశ మే
యనువున నాత్మబోధకు నుపాయ మగున్ బుధవర్య సెప్పవే. ౧౩౭.

## కిరాటోపాఖ్యానము.

సీ. అనిన వసిష్ఠుండు విను రామ వింధ్యాద్రిఁ
గలఁడు కిరాటుఁ డొక్కరుఁడు భార్య
యును దాను నార్తుఁ డై మునివోలెఁ దిరుగుచు
నొక్కజాంగలభూమి నొక్కగవ్వ
కపవుమాటున నున్నఁ గనుఁగొని కృపణుఁ డై
గదియంగఁ జలి యది గానలేక
యచ్చోటఁ గసవుగ్రాం ద్రంతయుఁ బుచ్చి య
త్నంబున దివసత్రయంబు వెదక

గీ. నంత పూర్ణేందుమండలం బనఁగ వెలుఁగు
నమరమణి యబ్బె నతనికి; నట్లు గవ్వ
వెదక మణి యబ్బినట్లు కోవిదగురూప
దేశగతి నాత్మబోధంబుఁ దెలియఁ బొందు. ౧౩౯

వ. ఒకటివెదుక నొకటి కానంబడుఁ. గావున గురూపదేశంబు తత్త్వజ్ఞానం బునకుఁ గారణం బగు నని కిరాటోపాఖ్యానంబు సెప్పి. వసిష్ఠుండు—సంశయగ్రస్తచిత్తునియందు విజ్ఞానంబు నిలువనేర; దీయర్థంబున చింతామణ్యుపాఖ్యానంబు గల దాకర్ణింపు మని రామచంద్రున కిట్లనియె.

ఉ. అంత శిఖధ్వజుండు మది నాత్మవివేక మెఱుంగలేక య
త్యంతతమోనిమగ్నుఁ డగునట్లు విమోహితుఁ డౌచు దుఃఖిత
స్వాంతముతోడ భోగములు సత్యము గా వని చాలరోసి దే
శాంతర మేఁగి తీర్థముల నాడుచు గృచ్ఛ్రము లాచరించుచున్.

గీ. ఎందునను జిత్తవిశ్రాంతి నొంద లేక
యాతుఁడై రాజ్య మిది విష మని తలంచి
ప్రజలఁ బాలింపఁ జూడాలఁబనిచి యడవి
నుగ్రతపమాచరించుచు నుండె నంత. ౧౪౧.

క. ఆదేవి దివ్యదృష్టి ను
నోదయితునికర్మబంధనోదన మిఁక న
ష్టాదశనమలకు నగు నని
మోదిలె; నట నతనిచిత్తమున శమ మొందన్. ౧౮౨.

వ. ఇవ్విధం బంతయుఁ దన దివ్యజ్ఞానంబునఁ దెలిసి, చూడాల యొక్క
బ్రహ్మచారి యై నిజేశుముందట నిలిచిన నమ్మహీపాలుండు ౧౮౩.

చ. కలయఁ బసింది లేపమునఁ గట్టినరూపముఁ బోలి, మేనిపైఁ
దెలు పగుజన్నిదంబు నునుఁదెల్లనిగోఁచియు నుత్తరీయముల్
వెలిఁగెడుతారహారమును వేలిమిబొట్టును నూర్ధ్వపుండ్రముల్
బొలుపుగఁ, బాపముల్ దరను మోసక వచ్చిన విప్రనందనున్. ౧౮౪.

క. కని పూజించిన, నాతఁడుఁ
దన సేమం బడుగ, భక్తిఁ దత్పతి మీ ద
ర్శనమున ధన్యుఁడ నయ్యెద
ననఘా నీ వెవ్వ రనిన, నవ్వటు వనియెన్. ౧౮౫.

వ. ఏను నారదపుత్త్రుండ నన, నన్నరపతి యమ్మహాముని కెట్లు పుత్త్రుండ
వై తెఱింగింపవే యన, నక్కుమారుం డిట్లనియె. ౧౮౬.

ఉ. నారదుఁ డొక్కనాఁడు మును నాకనదిన్ విహరించుచో మరు
న్నారులు నీటులో వివసనంబులతో రమియింప వారి యా
కారము లెల్లఁ జూచి ముని గ్రక్కున సంస్ఖలనంబు నొందినన్
గోరి యమోఘవీర్య మొకకుంభమునం దిడ నందుఁ బుట్టితిన్. ౧౮౭.

వ. కుంభుం డనువాఁడ నాతెఱం గెఱింగించితి. నీ వెవ్వండ? వీపర్వతంబున
నేల యున్నాఁడ? వనిన, నవ్వటువున కమ్మహీపతి యిట్లనియె. ౧౮౮.

మ. విను విప్రోత్తమ యే శిఖధ్వజుఁడఁ బృథ్వీపాలుఁడన్, భూమిపా
లన వర్జించి పునర్భవైకభయడోలాలోలచిత్తుండ నై

వనవాసంబునఁ గ్రుస్సి తాపసుఁడ నై వర్తించుచున్నాఁడ; నిం
దును నేమందు సుధారసంబు విషమై దుఃఖంబు రెట్టించెడున్.౧౪౯.

ఉ. నా నతఁ డిట్లనెన్ ధరణినాథ సులబ్ధ గురూపదేశవి
జ్ఞానమ, నిత్యకర్మములు నా మదిఁ గాలముఁ బుచ్చుకంటె; న
జ్ఞానులు వాసనారతి ఘనం బగుతత్క్రియలన్ ఫలేచ్ఛమై
నూని యొనర్తు, రీవు నటు లుండుట యజ్ఞత గాదె చూడఁగన్.౧౫౦.

క. ఏ నెవ్వఁడ? నె ట్లీసు
జ్ఞానం బగు? నెట్లు చిత్తశమ మగు? నని య
జ్ఞానత నేల నలందుర
భూనుత? యన, నతఁడు విప్రపుత్త్రునితోడన్. ౧౫౧.

క. గురుఁడును దండ్రియుఁ బంధుఁడుఁ
బరమాప్తుఁడ వీవ, శిష్య భావన నన్నుం
గరుణింప నీకు మ్రొక్కెద
ధరణీసురవర్య; యనుడుఁ దత్పతి కనియెన్. ౧౫౨.

తరల.

గురుఁడు చెప్పినభంగిఁ బుత్త్రుఁడు కోరి చేసినచాడ్పునన్
ధరణినాయక చెప్పెదన్ విను తథ్య మైన మదుక్తులన్
అరయ నద్భుత మైనయీయితిహాస మిట్లు ప్రసక్త మై
యరుగుదెంచెను దీనిఁ జెప్పెద నాత్మబోధము సెప్పెదన్. ౧౫౩.

చింతామణ్యుపాఖ్యానము

వ. అది యె ట్లంటేని. ౧౫౪.

సీ. సర్వగుణాఢ్యుండు శాస్త్రీయు నయ్యును
తజ్జ్ఞుండు నగునొక్క ధన్యపురుషుఁ
డవనివారి కసాధ్య మైనచింతామణిఁ
బడయంగఁ గోరి తపంబు సేయ,

నామణి ప్రత్యక్ష మై చేతి కబ్బినఁ
    గని యాత్మ సంశయమున నతండు
నిమ్మణి యిటువేగ యిది యెట్లువొందెను
    నని యూరకుండిన నదియు మఱలె,

గీ. నతఁడు మఱియును బహుళతపం బాచరింపఁ
గన్నులకుఁ దోఁచె నొక మంచి గాజుపూస,
యిదియ సురరత్న మని యిచ్చ నెంచి దీన
నఖిలసుఖములఁ బొందెద నని తలంచె. ౧౫౫.

వ. అట్లు నీవు సర్వశాస్త్రకోవిదుండవు గావున తత్త్వజ్ఞానివై యకృత్రిమం బగు సర్వకర్మపరిత్యాగంబు చింతామణిగా నెఱుంగుము. సకలదుఃఖంబుల నణంచెడు నని రాజ్యపరిత్యాగంబు సేసి పురంబు విడిచి దూరం బగు మా యాశ్రమంబునకు వచ్చినాఁడవు. తత్త్యాగంబు పరిపూర్ణంబుగాఁ జేయవేని యాకాశంబు నంబుదంబు లాశ్రయించు భంగిని సంకల్పవికల్పంబులు నిన్నుం బొదువంగలయవి. ౧౫౬.

మ. ఇది యెట్లెక్కడ దుష్కరంబ యను నిట్లేచింతల న్నిచ్చలుఁ
మదిఁ దాత్పర్యము లేమి సంశయము సంపన్నం బగుఁ; దాన నొం
దదు సంకల్పవివర్జనంబు, పరమానందోదయం బంద, దా
యది లేకుండిన గాజు రత్న మని డాయం బోవున ట్లౌఁ జుమీ. ౧౫౭.

వ. అమితం బగు నానందంబు విడిచి దుఃఖసాధనంబు లగుమిథ్యావస్తువుల యందు వేడ్క సేయునట్టి జనుండు హాస్యాస్పదుం డగు. నీవును చింతామణిం బొందెదఁ గా కని తలంచి యొక్కస్ఫటికోపలంబునుం బొందితివి. అని కుంభుండు శిఖిధ్వజునకుఁ జింతామణ్యుపాఖ్యానం బెఱిఁగించి; చిత్తత్యాగాత్మకం బైన సకలత్యాగంబుకంటెఁ బురుషార్థసమాప్తి వేఱొక్కటి లేదు; ఈయర్థంబున గజవృత్తాంతంబు సెప్పెద, నాకర్ణింపు; మని యిట్లనియె. ౧౫౮.

## గజోపాఖ్యానము.

సీ. కలదు వింధ్యాటవి గజరాజ మొక్కటి
తత వజ్రసన్నిభ దంతశోభి,
హస్తిపుఁ డొక్కఁ డాహస్తి నేపుణనఁ బట్టి
గొలుసున నొకతాటఁ గుదియఁ గట్టి,
వ్రా నెక్కె; నంత నాయేనుఁగు కొమ్ముల
సంకెలఁ ద్రెంచుచో సరభసమున
నా వ్రాని విఱుచునో యని వాఁడు దానిపై
కుటికెన నని తప్పి యుర్విఁ బడిన,

గీ. వానిఁ గనుఁగొని కరుణ నవ్వారణేంద్ర
మిట్లు పడియున్న వాని నిం కేల చంప
ననుచు మన్నించి తనభూమి కరిగె, నడవి
జంతువులయందుఁ బుణ్యవాసనలు గలవు. ౧౫౯.

ఉ. ఆతఁడు వెంబడించికొని యాకరిచొప్పున నేఁగియేఁగి తా
నాతతగుల్మమధ్యమున నారసి గన్గొని దానిఁబట్ట నా
ఖాతము ద్రవ్వి యాకలము గప్పినఁ, గానక కుంభి దామద
స్ఫ్యాతత నందుఁ గూలెఁ గులిశోద్ధతిఁ గూలినకొండకైవడిన్. ౧౬౦.

గీ. ఇవ్విధంబున లోఁబడి యిభము తేఁకు
కట్టువడియును పోని దుఃఖమున నుండె;
నల్లగా ధర లోఁబడ్డయప్పుడె పగఱఁ
దునుమఁ డేనియు మీఁదట దుఃఖ మొందు. ౧౬౧.

వ. అని చెప్పి కుంభుండు నీకు గజవృత్తాంతకథాభిప్రాయం బెఱుంగం
బోల దెఱింగించెద. దీనం బ్రబుద్ధుండవై సర్వత్యాగపరుండవు గమ్మని
యిట్లనియె. ౧౬౨

సీ. అనఘ వింధ్యము ధర, యాగజం బీవు, వై
రాగ్యవివేకముల్ రదనయుగము,
హ స్తిపుం డనఁగ నీయజ్ఞత, రాగశృం
ఖలమునఁ గట్టినకాలు మనసు,
ఆగోలు నూడ్చుట భోగేచ్ఛ విడుచుట,
తాటిపై నుండి తా ధరణిఁ బడుట
పరగ రాజ్యము నీవు పాసిరాఁ దలఁకున
జ్ఞానంబు, దయ వానిఁ జంపకుంట
గీ. ఫలసమాస క్తితోఁ జేయఁబడినక్రియలు
దాన క్రమ్మఱ లేచి యజ్ఞాన మట్లు
వారకయ వచ్చి నీవెంట వడిఁ బ్రపంచ
ఖాతమునఁ ద్రోచె నినుఁ బట్టి భూతలేంద్ర. ౧౬౩.
క. నీ వారాజ్యము విడిచినఁ
దా విడువక వెంటఁదగిలి తఱి దప్పక ని
న్నావిధినిఁ ద్రోచె లోఁబడఁ
దా వడి నినుఁ గట్టి మోహతమ మచలాత్మా ౧౬౪.
క. ఆ మదకరిపరివారము
నీమానసవైభవంబు, నెఱి నోదముపై
వేములు గప్పిన తీఁగెలు
భూమీశ్వర వినుము నీ తపోదుఃఖంబుల్. ౧౬౫.
వ. అని గజోపాఖ్యానంబు కుంభుండు శిఖిధ్వజునకుఁ జెప్పె. నని వసిష్ఠుం డు రామచంద్రున కెఱిఁగించె. నిబిడంబైన గురూపదిష్టజ్ఞానంబున సర్వత్యాగంబు గలుగు. అట్లు శిఖిధ్వజుండు కుంభుండు చెప్పిన వాక్యం బులువిని సంతుష్టాంతరంగుం డై యతనితో నిట్లనియె. ౧౬౬.
మ. పుడమిన్ రాజ్యము మందిరంబులు మహాభోగంబులున్ మాని యీ
యడవిన్ దాపసి నైతి, విప్ర, సకలత్యాగంబు లిం కెట్లు? నా;

వడు గోహా నరనాథ యిట్టిదియు సర్వత్యాగమే! దీనిపై
నుడివోకున్న దినీకు రాగ, మెదలో నూహింపు, మేలయ్యెడిన్. ౧౬౭.

వ. అనిన నాశ్రమోపకరణం బైన యతనిశరీరంబునందు సద్యోజాతం
బగుసర్వత్యాగం బుదయింప జేయ వెండియుఁ దపశ్చరణంబు సేయు
చున్న యవ్విభున కి ట్లనియె. ౧౬౮.

క. ఈగతిఁ జేసిన నఖిల
త్యాగము నీ కబ్బ దెందు నవనీశ, తనూ
వాగురయు జన్మమరణో
ద్యోగకరం బైనమనసుఁ దనుమక యున్నన్. ౧౬౯.

గీ బంధము జగంబు, చిత్తంబు పరఁగ దాని
నణఁప నేచిన నది మహాత్యాగ, మనిన;
చిత్త మేరూపముది? దానిఁ జెఱుచు టెట్టు?
లాన తి మ్మన నావిప్రుఁ డతని కనియె. ౧౭౦.

సీ. అలవేదనాత్మ కాహంకృతి చిత్తభూ
జమునకు రూపబీజంబు; దీన
నిగిడిన యనుభూతిచిగురు; తద్వృత్తిని
రాకరణయు నిశ్చయాత్మికయును,
సంకల్పమూతిన్ నాఁ జనునట్టిబుద్ధియ;
దానిభేదంబు చిత్తంబు మనము
చేతనంబును; నిట్టి చిత్తవృక్షంబు నా
మూలశాఖలతోడఁ గూలఁద్రోయు.

గీ. మనుడుఁ; జిత్తమునకు నహామిక వి త్తంటి
విది దహించు నగ్ని యెద్ది ? యనుడు;
నేను నాఁగ నిందు నెవ్వండ నను విచా
రంబు దాని కింగలంబు సుమ్ము. ౧౭౧.

వ. అనిన మహీపతి యిట్లనియె. ౧౭౨.

క. ఔనౌఁ దెలిసితి, మేనుం
గాఁ నింద్రియగణము నహమికాచిత్త మనో
ధీ నిచయము జడము లవియుఁ
గా; ననవుఁడుఁ గుంభుఁ డతనిఁ గనుఁగొని పల్కెన్. ౧౭౩.

గీ. ఇవి జడంబు లగుట నిన్నియు నేఁ గాన
టంటి, మఱియు నెవ్వఁ డగుదు వనిన?
సకలభావములను జని మృతి లే దను
నట్టి చిన్మయాత్మ నగుదు నేను. ౧౭౪.

ఉ. ఇట్టిది యైననన్నుఁ గుదియించె నహంకృతి చిత్తబీజమై
యొట్టి తపంబున న్విడువ, దేను నశక్తుఁడ నైతి, నావుడున్;
గట్టిగఁ గారణంబునన కార్యము పుట్టు, న టన్న దీనికిన్
గట్టడిరోషవేదనము కారణ? మట్టిది మానిపింపవే. ౧౭౫.

క. చిత్తము చిత్తోన్ముఖమై
యుత్తైఱఁ గహమిక ఘటించె నిటు సేయంగా;
నత్తపసి మఱియుఁ జెప్పుమ
యొత్తైఱ వేదనకు హేతు వెయ్యది; యనుడున్. ౧౭౬

వ. అన్నరపతి యిట్లనియె. ౧౭౭.

సీ. అనిలుచే ఘనకంప మడరునట్టుల సత్య
తత్త్వమాత్రమున వేదనలు వొడముఁ,
దతవేదనలను జిత్తమునకు విత్తైన
యహమిక వేదన యయ్యె. ననుడు;
మునిచంద్రుఁ—డక్కార్యమునకుఁ గారణ మెందు
లేదు, గార్యంబును లేదు, భ్రమము

భ్రాంతిని తోఁచుఁ, బ్రపంచంబు రజ్జుస
ర్పన్యాయమున నకారణము—యనిన,

గీ. నధిపుఁ డీసృష్టి మును చేసె నట్లు వేధ,
యతఁడు కారణ మేల కాఁ డనిన, విప్రుఁ—
డనఘ మును శాంత మైన బ్రహ్మము తదీయ
కలనఁ మది దాన యజునకు, గారణంబు. ౧౭౮

వ. అనిన విని శిఖధ్వజుండు--అయ్యా! కారణంబు లేక బ్రహ్మయెట్లుదయిం
చెం జెప్పవే? యని యడిగిన,కుంభుం డతని కిట్లనియె. అనంతం, బజితం
బు,శాంతం, బప్రతర్క్యం, బవిజ్ఞేయంబు, శివంబు, శుద్ధంబు,నై యొద్ది
వెలుఁగు, దానివలనఁ బద్మభవుండు దాన తానయై యుదయించెఁ
దన్మాత్రజనితంబును, దదాత్మకంబును; నై సృష్టి వెలుంగు; నట్లు
గావున, కార్యకారణంబు లెవ్వియు నొండు లేవు; నాకుం గర్తృత్వ
భోక్తృత్వంబులు లేవు; తత్పర బ్రహ్మంబు సకలంబు నని నిశ్చయించి
యజ్ఞానంబు శాంతిం బొందింపుము. దానిచేఁ జైత్యంబు నాశం బగు
నని సెప్పంబడు నెట్లనిన. ౧౭౯.

క. స్థానచ్యుత మగునట్టి
నానాఁటికి నాశ మొందు నరవర మఱి తా
దానన ప్రుందిన నదియును
దా నొదవక చెడెడి నెందు దప్పదు సుమ్మీ. ౧౮౦

(మత్తకోకిల)

ఆదిదేవుఁడు తాఁ జిదాత్మకుఁ డౌట నాత్మఁ దనంతఁ దా
మేదినీసలిలాదు లైన యమేయ శక్తిమహత్త్వసం
పాదనాత్మత నొంది దానన పద్మజుం డన నుండు నం
దేదియు స్మృతి లేదు బ్రహ్మ మొంతయుఁ నరనాయకా. ౧౮౧.

చ. అనిన నృపాలుఁ డిట్లను మహాత్మ యొఱింగితి నీ సదుక్తులఁ
బనుపడ కర్తఁ లేమినిఁ బ్రపంచము లేమిఁ పదార్థదర్శి లే

మిని, మఱి నేను లేనపు డమేయపదార్థవిభాగదృష్టియున్
జనియె, ననంతశాంతరససాగర మెల్లెడ నిట్లు దొట్టెడున్. ౧౮౩.

వ. అని యిట్లు కుంభునిచేతఁ బ్రబోధితుండై పరమజ్ఞానవంతుఁ డైన య
మ్మహీపాలుండు మహామోహసముద్రసముత్తీర్ణుం డై మఱియును.

క. ఆ వటు నుపదేశము మది
భావించి, చిదాత్మసౌఖ్యపదపరిణతుఁ డై,
భూవిభుఁడు శాంతిరూపము
కైవడి, చిత్తంబుఁ గన్ను గదలక యుండెన్. ౧౮౪.

వ. ఇవ్విధంబునఁ గొంతసేపునకుఁ బ్రబుద్ధుండును, బ్రస్ఫురితనయనుండు,
నైన యతినిం జూచి, కుంభరూపిణి యైనచూడాల యిట్లనియె ౧౮౫.

గీ. అమల మై పూర్ణ మై మృదు వై నపదవి
భానుఁడును బోలె విశ్రాంతిఁ బడయఁ గంటె,
తరలెనే భ్రాంతి ? గలదె యంతఃప్రబుద్ధి ?
ధ్యేయ మెఱిఁగితె; దృశ్యంబు దెలిసె నయ్య! ౧౮౬.

చ. అన విని నీప్రసాదమున నన్నిటిమీఁద మహావిభూతియున్
ఘనమును నైనచిత్పదవిఁ గంటిఁ; జిదాత్మవివేకు లైన స
జ్జనపదసంగమం బమృతసారసుఖంబు మునీంద్ర; యిట్టి దేఁ
గనుగొనమున్ను, నీకతనఁ గంటిని నేఁ, డిది యేమి నాపుడున్. ౧౮౭.

సీ. ఆ కుంభుఁ డను— నృప, యంతవిశ్రాంత మై
యింద్రియోల్లాసభోగేచ్ఛ లణఁగ,
నాచార్యహితవాక్య మంటి చిత్తంబున
కాలపాకమున వృక్షమునఁ బండ్లు
రాలు కైవడి, దేహమాలిన్య మురిఁబోవుఁ,
డివిరెడి తద్భేదదృష్టి నుండు

నజ్ఞాన మనునది యణఁగించునదియె పో
ప్రకటవిజ్ఞానంబు పరమపదము,

గీ. తుదిఁ బ్రబుద్ధుండ వైతి, ముక్తుండ వైతి,
విజితచిత్తుండ వైతివి, వినుము, మౌని
నిర్మలుండును నాకాశనిభుఁడు నగుచు
నలరు.—నన విని యతని కిట్లనియె విభుఁడు. ౧౮౮.

వ. మునీంద్రా, ప్రబుద్ధుండ వైననీవు తజ్జ్ఞునకుఁ జిత్తంబు లే దంటివి. జీవన్ముక్తు లగువారు చిత్తంబుఁ బాసి యెట్లు విహరింతు? రెఱింగింపవే యనిన నతం డిట్లనియె. ౧౮౯.

మ. పునరుత్పత్తి నిమిత్తవాసన ఘనీభూతస్థితిం జిత్తమై
తనరుం; దజ్జ్ఞునియందు లే దదియ, సత్తామాత్రమై యుండు, నా
తనికిం గర్మములం బునర్జననమందం జేయు, దన్మూఢభా
వన చిత్తంబు, ప్రబుద్ధభావనను సత్త్వం బండ్రు, భూమీశ్వరా ౧౯౦.

సీ. అనఘ చిత్తత్త్వలయప్రబుద్ధులు నతి
సత్త్వయుక్తులు సర్వసములుఁ దలఁప
స్వర్గాదిఫలద మౌ సకలక్రియలు మాని
శమదమాసక్తత సర్వవస్తు
వుల నుదాసీనత గలిగి యస్పందచి
త్తుఁడవు గ; మ్మచలచిత్తులకుఁ దిరిగి
రాదు సంసారంబు, నీదుఃఖతతి యెల్ల
బుద్ధిచంచలతన పుట్టుచుండుఁ,

గీ. గాన నెప్పుడుఁ జిత్తసంకలన లుడిగి,
శాశ్వతైశ్వర్య మొందు ధీసార.—యనుడు,
నెట్లు చలనాచలత్వంబు లెడసి యుండు,
నానతిమ్మన, వటువు దా నతని కనియె. ౧౯౧.

మ. జల మంభోనిధి యైనమాడ్కి జగ మా సత్త్వైకచిన్మాత్ర మ
వ్వలనన్ బ్రహ్మము! మూఢకోటి కిది దృగ్వైషమ్య మై తోఁచుఁద
త్కలనం దోఁచినదృష్టి సమ్యగవలోకం బైనఁ దల్లీన మౌ,
దలఁపన్ ద్రాటను బుట్టుసర్పభయ మా త్రాటన్ లయం బౌగతిన్.

గీ. శాస్త్రచింతల సజ్జనసంగమములఁ
జల్లనగుఁ జిత్త మల్లనఁ జంద్రుభంగిఁ,
కేవలాభాస మది స్వానుభావమహిమ
దోఁచు నుల్లంబులో మహాత్ములకుఁ దాన. ౧౯౩.

వ. అని యిట్లుపదేశించినం బ్రీతుండై శిఖధ్వజుండు పరమసమాధి నుండె. చూడాలయు నిజరూపధారిణియై తనపురంబునకుం జని రాజ్యానుసంధానంబు చేసి కొన్నిదివసంబులకుఁ గ్రమ్మఱ నమ్మహీపాలుకడ కేతెంచి సమాధినిష్ఠుం డై యున్న యతనిం గనుంగొని. ౧౯౪.

చ. అతని సమాధి మాన్ప సతి యాచెన్ వనేచరు లెల్ల బెగ్గిలన్,
మఱిఁ జలియింపకుండె గిరిమాడ్కి నతండును, నింతి వెండి సం
తతముగ నాచిన్ యార్చియుఁ గదల్పఁగ నోపక సత్త్వనిష్ఠమైఁ
బతి యొడలి న్గదల్చెదనుపాయము వేఱె తలంచె నావుడున్. ౧౯౫.

క. విని రఘురాముఁడు శాంతిం
గని యాత్మం దాన నిష్ఠ గలరూపుక్రియన్
దనర మునిబుద్ధి శేషిం
చెనె సత్త్వగుణంబ! నా వసిష్ఠుఁడు, పలికెన్. ౧౯౬.

చ. ఎనయఁ బ్రబోధహేతు వగు నెవ్వనియుల్లము సత్త్వశేష, మా
ఘనుఁ డచలాత్ముఁ, డాపురుషుకాయము సంతతపుష్టి గల్గి యుం
డును, మఱి స్రుక్క దుక్కఱదు, దూలదు, దాఁ దనకేవశంబయై
మను నిది, యట్లు మీఁదికథ మానుగఁ జెప్పెద నీకు రాఘవా. ౧౯౭.

వ. ఇట్లు తలంచి చూడాల యతని శరీరంబు సొచ్చి యాద్యంతరహితం
బైన తన చేతనస్థితిం జెంది కేవలసత్త్వవంతుం డగు నిజకాంతుని

చేతనా చలనంబు నొందించి విహంగంబు వినువీథినుండి నిజమందిరంబు ప్రవేశించి నట్లు క్రమ్మఱ తన శరీరంబు సొచ్చి బ్రహ్మచారి రూపంబున సుఖాసీన యై యుండె. ౧౯౮.

ఉ. తారక మంత్ర మధ్యములు తానము లేపఱడఁ జంచరీకఝుం
కారముభంగి సామములు గానము సేయఁగ, నల్ల నల్ల నా
తారతరస్వరంబు విని తత్పతి సత్త్వగుణైకచేతనం
బారఁ బ్రబుద్ధ మై తనరె నామనిఁ బద్మిని పొల్చుకైవడిన్. ౧౯౯.

సీ. ఇబ్బంగి మేల్కాని యెదురఁ గుంభునిఁ గాంచి
యర్చించి నిలిచిన యానృపాలుఁ
జూచి — జీవన్ముక్తి సుస్థితి నొందెనే?
పరమచిదానందపదవియందు,
విశ్రాంతి నొందితే? విదిత మై యట భేద
మిద భేద మనుబుద్ధి యెడలె నయ్య?
ఆపాతరమ్యంబు లైనసంకల్పంబు
లరిగెనే? చిద్దర్శి వైననీకు

గీ. సమము నాధేయహేయదశావ్యతీత
మును ప్రశాంతముఁ బ్రాప్తార్థమోదమయము
నగుచుఁ జల్ల నై యున్నె నీయంతరంగ?
మనిన,— నాబ్రహ్మచారి కిట్లనియె, నతఁడు. ౨౦౦.

వ. మహాత్మా! నీప్రసాదంబున విశ్రాంతరంగం బైనమార్గంబుఁ గంటి; సంసారసీమాంతం బయ్యెఁ; బొందవలసిన నిశ్చయార్థంబుఁ బొందితి. ననిన, నట్లగాత, సుఖంబుండు, మని చూడాల తనపురంబునకుం జని కతిపయదినంబులకుఁ గ్రమ్మఱ బ్రహ్మచారి యై ఖిన్నముఖారవిందంబుతోఁ బొడసూపినం గని, శిఖిధ్వజుం — డిది యేమి? యింత ఖేదం బేల వచ్చె? నని యడిగిన,— కుంభుం డిట్లనియె ౨౦౧.

గీ. అధిప నిన్నుఁ జూడ నరుదేర, నడుమ దు
ర్వాసుఁ డట్టె చూచి వట్టియలుకఁ
గనలి రేలు సతివి గ మ్మని శపియించె,
నదియ దుఃఖహేతు వనిన నృపుఁడు. ౨౦౨.

క. అడలకు మునివర నియతిం
గడవఁగ రా దటి యవశ్యకర్తవ్యము నా,
వడు గొఁ గా కని రేలం
బడఁతియుఁ బగ లెల్లఁ బురుషభావము నగుచున్. ౨౦౩.

ఉ కొన్నిదినంబు లి ట్లగుడుఁ గోమలి నా కగుభర్త ధాత్రిలో
నెన్నఁగ లేఁడు భూప, నను నీవ వరింపు మటన్న, దీన నే
మున్నది? యట్లు కా కనుడు, నుగ్మలియుం గపటానురక్తితో
నన్నరనాథుఁగూడి సుఖ మందుచు నుండెఁ జెలంగి రాత్రులన్.౨౦౪.

క. ఈగతిఁ గొన్నాళ్లకుఁ బతి
భోగేచ్ఛఁ బరిక్షుఁ గొనఁగఁ బొలఁతుక మాయా
యోగమున నొకసురేంద్రుని
వేగమ పుట్టింప నతఁడు విబుధులు గొలువన్. ౨౦౫.

మ చనుదెంచెన్ సితదంతి నెక్కి విపులైశ్వర్యంబుతో దేవతా
వనితావక్త్రసరోజసౌరభసుఖవ్యాసంగభృంగాంగనా
ఘనఝుంకారసమేతకిన్నరవధూగానానుమోదాత్ముఁ డై
జననాథాగ్రణిపాలికిం జనఁగఁ, బూజల్ చేసెనా యింద్రునిన్.౨౦౬.

వ. ఇవ్విధంబునఁ బూజించి;— దేవా! యతిదూరం బగుదివంబున నుండి యిచ్చటికి రాఁగతం బేమి? యనిన; నతనికి దివిజనాయకుం డిట్లనియె.

సీ. భూమీశ నీగుణంబులు విని వచ్చితి
మరయ భిక్షులు వచ్చుకరణి; నిపుడు

రమ్ము నాకమునకు, రంభాదిసతులు నీ
యొప్పు చూడఁగఁ గోరుచున్న వార;
లఖిలభోగంబుల నచట జీవన్ముక్తుఁ
డవు నీవు కల్పాంత మనుభవింపు —
మనుఁడు మహీపాలుఁ డచటిపోడుము లెల్ల
నెఱుఁగుదు, నాకేల యింత సెప్ప ?

గీ. నెచట నేనియు దివియ నా కచట నేల?
నెల్లచోటుల నే రమియింతు సుఖము;
స్వర్గ మది యెంత యచ్చటి సౌఖ్య మెంత?
యందు రా నొల్ల విచ్చేయు మమరనాథ. ౨౦౮.

క. అన విని సురవిభుఁ డతనిఁ
గనుఁగొని దీవించి చనినఁ గ్రమ్మఱఁ; దా నా
తని రాగద్వేషస్థితిఁ
గనియెదఁ గా కని తలంచెఁ గపటప్రేమన్. ౨౦౯.

చ. మెలఁతుక యోగమాయ నొకమిండనిఁ దా ఘటియించి వేడ్కమైఁ
జెలఁగుచుఁ బణ్ణశాలకడఁ జీకటిమామిడిమ్రానిక్రింద ను
ద్గళరవకంకణక్వణనతాడనభూషణచుంబనధ్వనుల్
కలగొని మ్రోయఁ జౌర్యరతిఁ గాంతుని వీనులు సోఁకఁ జేయఁగాన్.

క. అంతయు గనియాపతి యా
వంతయుఁ జింతిలక ముదితు లగుదురు గాతన్
గాంతయు విటుఁడును నని తా
సంతసమున నచటు వాసి చనియె నిజేచ్ఛన్. ౨౧౧.

వ. ఇట్లు చనుటయుం గని చూడాల యచ్చెరువడి యహో యనేక
సిద్ధులు నితని యందుండు నితని చిత్తంబు గలంప నేర, నత్యంత సుస్థి
రుం డయ్యెంగదే! యని యతనికి నిజవృత్తాంతం బెఱింగించెదగాక;

యని పూర్వశరీరధారిణియు, మనోహారిణియు, నై తనమ్రోల నున్న
యింతిం గనుంగొని విస్మితోల్లసితలోచనుం డై శిఖిధ్వజుం డిట్లనియె.

ఉ. ఓలలితాంగి నవ్యదళనోత్పలలోచన యెందునుండి నీ
వే లరుదెంచి తిందులకు ? నీ చిఱునవ్వులు నీ మృదూక్తులున్
నీ లలితాస్యమండలము నీ చనుదోయి మదీయభార్య చూ
డాలయ పోలెఁ దోఁచెడు; విడంబము మాని యెఱుంగఁ జెప్పుమా.

సీ. అన విని చూడాల నగుచు నే; సంశయం
బేల నరోత్తమ? యిట్టి నేన
కుంభరూపంబుఁ గైకొని నిన్ను బోధింప
నన్నిరూపంబులు నైతి వినుము.
విదితవేద్యుఁడ వీవు విజ్ఞానదృష్టి నం
తయుఁ జూచుకొ మ్మన్న, ధరణినాథుఁ
డచ్చెరు వంది రాజ్యము వాసినది మొద
లిడి తుద యగుకృత్య మెల్ల నాత్మ
గీ. దృష్టిఁ గనుఁగొని, నిజసమాధియును వదలి,
యుచితభాషల నద్దేవి నూఱడించి,
సంతసము మానసంబున వింతసేయ
నతివ కవికాగలీల ని ట్లనియె, విభుఁడు. ౨౧౪.

వ. నిరీహుండును, నిస్పృహుండును, నిరాశుండును, శాంతుండును,
సహామత్థరూపంబు నై యున్నవాఁడ. నింతియకాని యన్యంబు లే
దని కేవలచిన్మాత్రనిష్ఠుండఁ గావున మోదఖేదంబులం దొఱంగి నిబ్బ
రంబున నతిశయక్షయరహితత నొంది సంవిద్రూపంబు నైతి నది
యిట్టి దట్టి దని చెప్ప నశక్యంబు. ౨౧౫.

క. నీకారణమున భవము ని
రాకరణ మొనర్చి, సంవిదాకాశగతిన్

గైకొంటి, నీకు మ్రొక్కెద
నాకాచార్యుండ వీవనలినదళాక్షీ. ౨౧౬.

వ. అనిన విని చూడాల యప్పుడు మహీపాలుని బోధించి నిజపురంబునకుం దోడ్కొని పోయి యిరువురు జీవన్ముక్తులై పదివేలేండ్లు రాజ్యసుఖంబు లనుభవించి విదేహముక్తులైరని చూడాలోపాఖ్యానం బెఱింగించి; వసిష్ఠుండు—చిత్తత్యాగంబున సర్వత్యాగంబగు. నీయర్థంబునఁ గచోపాఖ్యానంబు గలదాకర్ణింపు, మని రామచంద్రున కిట్లనియె. ౨౧౭.

కచోపాఖ్యానము

చ. కచుఁడు మరుద్గురున్ జనకుఁ గన్గొని మ్రొక్కుచు, నయ్య, సంసృతి
ప్రచరణ మెట్లణంగు? నని పల్కిన;—సర్వవివర్జనంబు దా
నుచితము దీని కన్నఁ;—జని యొక్కఁడు గానల వత్సరాష్టకం
బచలితవృత్తి నుండి, శమ మందమి వెండియుఁ జెప్పెఁ దండ్రికిన్.

క. చెప్పిన సర్వత్యాగము
యప్పుడు బోధించి తండ్రి యరిగినఁ, గచుఁడున్
దప్పక గతకల్మషుఁడై
యప్పాటఁ జరింప, మూఁడుహాయనములకున్. ౨౧౯.

క. మతి శమ మందక వాచ
స్పతిఁ గ్రమ్మఱఁ గాంచి యలఁతఁ బడి యిట్లను;— నీ
గతి సర్వంబును విడిచిన
నతిశయవిశ్రాంతి యేల యందదు తండ్రీ. ౨౨౦.

వ. అనిన కొడుకున కతఁ డిట్లనియె. చిత్తత్యాగంబు చేసిన సర్వశాంతి యగు ననినఁ,—జిత్తం బెట్టిది? తత్త్యాగం బేవిధంబున సంభవించుఁ? జెప్పవే, యనిన గురుం డిట్లనియె. ౨౨౧.

క. చిత్తమన నొకటి వేఱే
హత్తిన యంతరభిమాన మది గావున నో

యుత్తమగుణ తత్త్యాగం
బెత్తెఱఁగునఁ గలుగు ననియు నెఱిఁగింపు దగన్. ౨౨౨.

క. అనుడు, బృహస్పతి కనుమా
సినకంటెం, బుష్పతోడిమఁ జిదుముటకంటెం,
జను నది యక్లేశంబన
విను చిత్తత్యాగ మహిమ విమలవిచారా ౨౨౩.

వ. ఏకంబు, నాద్యంతరహితంబు, జిన్మాత్రంబు, వితతంబు, వియదమలంబు, నగు పరమచైతన్యంబు గలదనియ చిత్తగింపు, మంతట విగతఖేదుండ వగుదువు ౨౨౪.

గీ. ఈ యహంకృతి యేటిది? యెందుఁ బుట్టె?
నింతయును భ్రాంతి, యేనును, నితఁడు ననెడు
ద్వైత మది మిథ్య, కాలదిగ్వశతఁ గ్రాఁగి
పోవు రూపాదికము లెల్లఁ బొందకు లనఘ. ౨౨౫.

వ. అట్లు గావున దిగ్దేశకాలావచ్ఛిన్నంబును, నిర్మలంబును, నిత్యోదితంబును, సర్వార్థమయంబును, నేకార్థంబు,నగు చిద్రూపంబ వగు. మని యుపదేశించిన, నతండును నట్టి పరమజ్ఞానయోగంబున జీవన్ముక్తుం డయ్యె. నని కచోపాఖ్యానంబు సెప్పి వసిష్ఠుం డవిచారితరమణీయం బగునీయహంకారం బెంతయు నిరర్థకంబ. యీయర్థంబున మిథ్యాపురుషోపాఖ్యానంబు సెప్పెద. నాకర్ణింపు మని రామచంద్రున కిట్లనియె. ౨౨౬.

## మిథ్యాపురుషోపాఖ్యానము.

సీ. కలఁడు మాయాయంత్రగతుఁ డైనపురుషుండు;
వాఁ డాత్మ సంకల్పవశతనొంది,
యాకాశ మార్జించి, యది యిష్టధన మని
యొనరఁ దద్రక్షకి ల్లొకటి గట్టి,

యిది నాకుఁ దక్కెఁ బో మ్మనునంత, నాయిల్లు
కాలవశంబునఁ గూలుటయును,
నాయింటితోడ నా యాకాశమును బోయెఁ
గటకటా యనుచు దుఃఖమునఁ బొగిలి,

గీ. చపలమతిఁ బొంది, యీ యాకసంబు గావ,
నాతఁ డొక నూయి ద్రవ్విన, నదియుఁ గూలఁ,
గూపగత మైన బయలును గూలె నకట
యనుచు వాపోయెఁ, దత్పురుఁ డగుటఁ జేసి. ౨౨౭.

క. వెండియును గగనరక్షకుఁ
గుండంబులు మేడ మాళిగలు నూతులు వాఁ
డొండొండు కట్టనవి చెడు
చుండఁ, దదాకాశములకు, నో యని యేడ్చెన్. ౨౨౮.

వ. అని చెప్పి వసిష్ఠుం డీవృత్తాంతంబు తేటపడ నెఱింగించెను, నాకర్ణిం
పు. ముష్మామాపురుషుండు సర్గాదియందు ననంతంబును, నసత్తును,
శూన్యంబును నై, స్వయంప్రకాశం బగునంబరంబున జనియించిన య
హంకారం బగు. నతండు నాత్మం డయ్యును నాత్మరక్షణార్థంబై యనే
క శరీరంబులు గల్పించుకొని యవి చెడుచుండ నాత్మహాని యయ్యె
నని దుఃఖితుం డగుచుండు. నీవును నట్లపోలె ఘటమఠాకాశనాశక్లేశం
బునం బొందక సుఖం బుండు. మని మఱియు ని ట్లనియె. ౨౨౯.

శా. ఆకాశంబునకంటె విశ్రుతము శూన్యం బవ్యయంబుల్ సదా
వ్యాకోచంబును నైనయాత్మ యది గ్రాహ్యం బౌనె నెద్దానఁ; జి
త్తాకాశంబున మేన పుట్టి చెడఁగా నయ్యాత్మయుం బోయె నం
చేకాలంబున నేడ్చు భూతతతి దా నిక్ష్వాకువంశాగ్రణీ ౨౩౦.

గీ. ఘటమఠాదులు చెడిపోవ గగన మెందు
నేక మై యున్న భంగిమై నినకులేశ

దేహములు వోవ చెడిపోక దేహియందు
నేకనిర్లేపరూప మై యెసఁగి వెలుఁగు. ౨౩౧.

వ. ఇట్లు గావున శాంతంబును, సర్వంబు, నేకంబును, నాద్యంతవర్జితంబును, భావాభావనిర్ముక్తంబును, నగు బ్రహ్మంబ కాని యితరంబు లేదని యెఱింగి, సుఖివి గ. మ్మని మిథ్యాపురుషోపాఖ్యానంబు సెప్పి, వసిష్ఠుండు-సమాధిరహితం బయ్యును, మహాకర్తృత్వంబున ధీవిశ్రాంతి సంభవించు. నీయర్థఁబున భృంగీశోపాఖ్యానంబు గల, దాకర్ణింపు మని రామచంద్రున కిట్లనియె. ౨౩౨.

గీ. వివిధ మగుచింత లన్నియు విడిచి పెట్టి,
భవ్య చిన్మాత్రకోటర పదవిఁ గూడి,
వేద్య నిర్ముక్త మైన సంవిత్తి తత్త్వ
నిష్ఠ నేప్రొద్దు విహరింపు, నృపవరేణ్య ౨౩౩.

క. వినుచుం బల్కుచు ముట్టుచుఁ
గనుచుఁ మూర్కొనుచుఁ గ్రొత్తగా దిది సత్యం
బని తలఁపు మెల్లక్రియలును
ఘన మగుచిద్బ్రహ్మతనువు గా కొండగు నే. ౨౩౪.

వ. అది యెట్లం టేని. ౨౩౫.

భృంగీశోపాఖ్యానము.

సీ. భృంగీశుఁ డొకనాఁడు గంగాధరునిఁ గాంచి
మ్రొక్కి హస్తంబులు మొగిచి—దేవ,
యేనిశ్చయముఁ బట్టి యీ జగజ్జీర్ణ గే
హమున గతజ్వరుఁ డై చరింతు,
నాన తి మ్మనిన;—మహాదేవుఁ డను—సర్వ
శంకలు నుడిగి సుస్థైర్యలీల
ననఘ మహాత్యాగి వగుము, మహాకర్త
వగుము, మహాభోక్త వగు, మనుటయుఁ

సీ. దద్విధ త్యాగ భోగ కర్తవ్యములకు
నెద్ది లక్షణ? మనిన నుమేశుఁ డనియె —
బరమగోప్యంబు. కైవల్యపదము, నైన
దీని నెఱిఁగింతు, నెంతయుఁ దెలియ వినుము ౨౩౬.

క. జననియును, మృతియును, ధర్మం
బు నధర్మము, దుఃఖమును, లే దని నె
మ్మనమునఁ బోవిడు నెవ్వం
డనఘా, మఱి యతఁడె పో మహాత్యాగి ధరన్. ౨౩౭.

క. ఫల విఫల రాగరోషో
జ్జ్వల ధర్మా ధర్మదుఃఖసౌఖ్యము లెందున్
దలఁపక చరించు నెవ్వం
డలఘుమతీ, యతఁడె పో మహాకర్త ధరన్. ౨౩౮.

క. సమభావన నెందు విరో
ధము వడయక, కోర్కు లెల్ల దా వీడ్కొని ప్రా
ప్తమ యనుభవించు నెవ్వం
డమలమతీ, యతఁడె పో మహాభోక్త ధరన్. ౨౩౯.

వ. మఱియు దృశ్యకరణం బంతయు దొలంగిన యతండును,మహాత్యాగి
యగు. నని శంభుండు భృంగీశున కుపదేశించె. నీవు నీమార్గంబు
బెఱింగి సుఖింపుము. ౨౪౦.

క. అంతర్ముఖుఁడై కృత్యం
బంతయు వెలి నాచరించునయ్యోగియ యే
కాంతుఁడు నిరహంకార
స్వాంతుఁడు నై చిన్మయాత్మసౌఖ్యముఁ గాంచున్. ౨౪౧.

వ. అని భృంగీశోపాఖ్యానం బెఱింగించి, వసిష్ఠుం డాత్మాహంకారాభిధా
నవిచారంబున నెఱుంగ నశక్యం బైనయది గురూపదేశంబున నెఱుంగ

నగు. నీయర్థంబున నిక్ష్వాకూపాఖ్యానంబు గల దాకర్ణింపు;
మన విని, రఘువల్లభుండు—మహాత్మా, యహంకారాభిధానం బగు
చిత్తంబు గళితం బగునప్పుడు సత్త్వగుణం బెట్లునిలుచు? నానతిమ్మ
నిన, నమ్మునిపతి యిట్లనియె. ౨౮౨.

## ఇక్ష్వాకూపాఖ్యానము.

సీ. కలుషంబు చెడి యహంకారమయస్వాంత
మడఁగంగ, లోభమోహాదు లెందుఁ
బొదలవు; బలిమి మైఁ బుట్టె నేనియు వాని
ముంపలే, వుదక మంబుజము వోలె;
ముదితాదికస్త్రీల వదనంబు విషము,
వాసనాగ్రంథులు నోసరిల్లఁ,
గోపంబు రూపఱు, లోపించు మోహంబు;
గాన కవ్యాపన్న మైనవస్తు

గీ. వమల విజ్ఞానదృష్టి నాద్యంబు గాఁగ,
ముక్తి కుద్యోగి గానట్టిమూఢహృదయుఁ
గాల్పనే! రామ, తొల్లి యిక్ష్వాకు మనువు
నడిగె, నీయర్థ మదియు నేర్పడఁగ వినుము. ౨౮౩.

క. ఎట్లు జనించెఁ బ్రపంచం?
బెట్టిది రూపంబు దీని ? కీభవపాశం
బె ట్టూడును ? వలలందును
బిట్ట వెడలి నట్లు ముక్తి బెరయుర్ దండ్రీ. ౨౮౪.

వ. అనిన విని యిక్ష్వాకునకు మను విట్లనియె. ౨౮౫.

శా. ఓహో యీదృశ నీవివేకమున ని ట్లొప్పారె నీప్రశ్న మీ
దేహాద్యం బగుదృశ్య మింతయును మృగీతృష్ణాంబు లెట్లట్ల; తా

నూహాతీతము, నచ్యుతం, బగుచిరవ్యోమంబు, నిత్యంబు ; దు
ర్మోహాహం బైనజగంబు, బోధముకురంబుం బొంది తోఁచుం జుమీ

చ. సహజము లై బహిఃస్ఫురణశక్తులు గొన్ని యజాండపంక్తు లౌ,
బహువిధభూతభావపరభావము లౌ ; నది యెల్ల నిజగ
న్మహిమ, యనైక్య మైక్యమును నా మఱిబంధవిముక్తి నాఁగ లే
దు, హిమకరాన్వయద్యుతిచిదాత్మ వెలుంగుచు నుండు నెప్పుడున్.

క. జలము తరంగము లగుగతి
నల చిచ్ఛక్తియ ప్రపంచ మగుఁ గానఁ, జలా
చలబంధమోక్షకలనలు
దలఁపక సౌఖ్యుండ వగుము ధరణీనాథా. ౨౮౮.

చ. కుచములమీఁదఁ బెన్నిదురఁ గూరినబాలునిఁ దల్లి గాన లే
కెచటికిఁ బోయెనో యనుచు నేడ్చినయట్లజరామరస్థితిన్
అచలితుఁ డైనయాత్మ గన నందక దేహముపాటు చూచి తా
న చివికి డస్సితిన్ విధివినాశము బొందితి నన్ జనం బిలన్. ౨౮౯.

గీ. అంబువు గదల బుగ్గలు నైనయట్లు
చిత్తసంకల్పవశమున సృష్టి యయ్యెఁ,
గాన నిశ్శంకఁ గదలక కదలినట్టు
లాత్మసంకల్ప మని రాజ్య మనుభవింపు ౨౯౦.

సీ. అకట చిత్రము మాయ యఖిలమోహిని! సర్వ
గతుఁ డయ్యుఁ దన్ను దాఁ గానఁ డాత్మ.
కడలేని సచ్చిదాకాశమయంబ యీ
జగ మని తెలిసిన శాంతమూర్తి
సద్బ్రహ్మకవచుఁ డై సతతంబు సుఖియించు.
నహమికా విరహిత మయి, యభావ
మైనభావము శూన్య, మది నిరాలంబంబుఁ,
జిన్మయంబును గాఁగ సృష్టిఁ దలఁపు

గీ. ద్వైతభావంబు దుఃఖావహంబు, దీని
సామ్యశిఖఁ గాల్చితే నీకు సౌఖ్య మందు,
కణఁగి యతి యైన గృహి యైన కామి యైన
శాంతుఁ డై నను నీబుద్ధి జరగవలయు. ౨౫౧.

క. పోలియుట, బ్రతుకుట, పోవుట,
కలుగుట, నే నతఁడు ననుట, గలుగక మదిలోఁ
దలఁచినయట్టి మహాత్ముం
డిల జీవన్ముక్తుఁ డగు నహీనవివేకా. ౨౫౨.

క. అనుదినము నభ్యసింపని
జనులకుఁ జెడిపోవు కళలు. జ్ఞానకళ మనం
బున నొలసిన సుక్షేత్రం
బునఁ బెట్టిన రాజనంబుపోలికఁ బొదలున్! ౨౫౩.

చ. హరిహరపద్మసంభవముఖామరు లెంచినచర్చ లెల్ల నాం
తరమతిఁ జిత్తలీనగణనాదిచరిత్రము లంచు నుండుమీ.
యరుదుగ సర్వదర్శనము లందలియర్థము నిశ్చయించి య
ట్లరసినఁ జిద్విలాసము నిరంకుశ మౌను నరాధినాయకా. ౨౫౪.

గీ. చిత్తలయము గన్న చిన్మాత్రులకు ముక్తి
సుఖమువోలె నొండుసుఖము లేదు.
ముక్తి దేశకాలములు గా వహంకృతి
ప్రకృతిభావ మణఁపఁబడుట ముక్తి. ౨౫౫

క. వర్ణాశ్రమధర్మాచా
రార్ణవము తరించు నెవ్వఁ? డతఁడు ప్రపంచో
త్తీర్ణుఁ డగు ననుట పరఁగు, ను
దీర్ణమతిన్ వెడలు వనమృగేంద్రము పోలెన్. ౨౫౬.

క. విను కర్మఫలత్యాగికి
దనుకవు మఱి సుకృతదుష్కృతంబులు, స్ఫటికం
బున వర్తిలు రాగమునా
యనువున ఫలకర్మరాగ మంటదు తజ్జ్ఞా. ౨౫౭.

క. జ్ఞానప్రాప్తిక్షణమున
దా నవు ముక్తుండు; పిదపఁ దను వది తీర్థ
స్నానమునఁ బడిన శ్వపచ
స్నానంబునఁ బడిన రెండు సమము తలంపన్. ౨౫౮.

వ. అని యివ్విధంబునఁ బరమజ్ఞానోపదేశంబు చేసి, బ్రహ్మవిదుండ వగు మని
మనువు నిజగృహంబునకుం జనియె. నిక్ష్వాకుండును నతండు సెప్పినట్ల
జీవన్ముక్తుం డై రాజ్యసుఖం బనుభవించుచుండె. నని యిక్ష్వాకూపా
ఖ్యానంబు సెప్పి, వసిష్ఠుండు- విశ్రాంత స్వాంతుం డైనవానికి లౌకికా
చారంబు తలుచు లేకుండు, నీయర్థంబున మృగవ్యాధోపాఖ్యానం
బు నెఱింగించెద; ననిన రామచంద్రుం డిట్లనియె. ౨౫౯.

క. జీవన్ముక్తుల కధికము
గా వంటిరి మీరు గగనగమనాదులు ము,
న్నీవిధమునఁ దగువారల
కేవి యపూర్వాతిశయము లెఱిఁగింపుఁ డనన్. ౨౬౦.

క. జ్ఞానికి నేయతిశయమును
నూనదు మదిఁ దాఁ దనంత, నురుతర మంత్ర
ధ్యానతపస్సిద్ధి నభో
యానాదులు గలుగు, దీన నధికత గలదే? ౨౬౧.

క. ఆరయ విజ్ఞానికి సం
సారికిని విశేష మెందు సకలంబున నా
స్థారహితంబును నిర్మల
వైరాగ్యము నైనమనసు వసుధాధీశా. ౨౬౨.

చ. అపగతసంసృతిభ్రముఁడు నాత్మరతుండును నైనయోగి కే
నెపమున నొందుఁ జిహ్నము జనింపదు. కామవిషాదరోషలో
లుపగుణమానమత్సరవిలోపము సేసి యనామయస్థితిం
జపలత లేక యుండుటయె శాశ్వతచిహ్నముగాని రాఘవా. ౨౬౩.

ఉ. జీవులకారణంబు విను చిత్పదదూరత నుండ్రు, కర్మముల్
ద్రోవఁ గరాక వారి సుఖదుఃఖము లేపడఁగించుచుండు; నా
స్థావరవృత్తి బంధమును, దానివిముక్తియ, ముక్తి, గావునన్
నీవును నట్ల హృత్కలన నిల్వఁగ సౌఖ్యమునొందు రాఘవా. ౨౬౪.

వ. గ్రాహ్యగ్రాహకసంగంబుల సావధానుండవై సంకల్పంబులం దొలంగి సుఖింపుము. తత్త్వజ్ఞులు గతార్థంబునకు వగవరు; భవిష్యదర్థంబునకుఁ జింతింపరు; క్రమప్రాప్తమగువర్తమానార్థంబు గ్రహింతు రదియునుంగాక. ౨౬౫.

సీ. ధీరజీవునకును ద్రివిధరూపంబులు
స్థూలంబు, సూక్ష్మంబు, తుదిఁ బరంబు;
నందుఁ బరముఁ బట్టి నారెంటి విడువుము;
కరపాదమయ మైన కాయ మొందు
స్థూలంబు నా భోగధుర్య మా, మఱియు, సూ
క్ష్మంబునా సంకల్పమయమనంబు,
ఆతివాహికమ నా నగు నది; మఱి యనా
ద్యంతచిన్మాత్రంబు నై వికల్ప

గీ. రహితమై యున్నయదియు పరస్వరూప;
మదియె మూఁడవరూ పగు; ననిన విభుఁడు
స్వప్నజాగ్రత్సుషుప్తినిష్ఠంబుగాని
తుర్యమెఱిఁగింపు మౌనిశార్దూల యనుడు. ౨౬౬

గీ. అహమికానహమికలు మాయఁగ నసత్తు
సత్తు నెడఁబాసి యెందు నసక్తుఁ డగుచు
సమలుఁడును సముఁ డై యుంట యదియ తుర్య
మండ్రు; వేదాంతవిదులు లోకాధినాథ. ౨౮౭.

వ. సంకల్పంబు లేమిచే నిది జాగ్రత్తయు స్వప్నంబునుం గాదు. జాడ్యస్థితి లేమిం జేసి సుషుప్తియుఁ గా. దహంకారనిరసనంబున సమతోదయంబునం జిత్తంబు వియదాకృతి యగుచుండఁ దుర్యావస్థ సంభవించు. నీవు ప్రబుద్ధుండవు గాన, భవత్ప్రబోధవృద్ధిం బొందెడు నిఁక వ్యాధవృత్తాంతం బెఱింగించెద నాకర్ణింపుము. ౨౮౮.

## వ్యాధోపాఖ్యానము.

సీ. ఒక కానలోపల నొక కిరాతుం డేటు
వడి పాఱుమృగము వెంబడిన బఱచి
కానక యచ్చోట మౌని నొక్కనిఁ గాంచి
యెటు వాఱె మృగ మని యిట్లొకింత
యద్భుతంబుగ వారి నడిగిన, నమ్మౌని—
సౌఖ్యమౌనుల, మేము సముల, మడవి
నుందుము, వ్యవహారయోగ్యమౌ నట్టి య
హంకార మెందు మాయాత్మ లేదు,—
గీ. అనెడు మునినాథు పలుకుల కర్థ మెఱుఁగ
కా కిరాతుఁడు దనయిచ్చ నవల నరిగె.
నిఖిలసంకల్పములఁ బాసి నీవు నట్లు
తుర్యపదమును బొందు సుస్థైర్యలీల. ౨౮౯.

వ. అట్లు గావునఁ బ్రశాంతి నభేదచిత్తు లైన మును లెచ్చోట నున్నను ముక్తులే యని వ్యాధోపాఖ్యానంబు చెప్పిన విని రామచంద్రుండు సంతుష్టాంతరంగుం డై యమ్మునివల్లభునకు నమస్కరించి—చిత్తవి

శ్రాంతిహేతువులైన యోగభూమ లేడని మున్నెఱింగించితిరి. వాని నభ్యసించువిధం బెట్లు ? వాని సాధించు యోగచిహ్నం బెట్టిది? సవిశేషంబుగా నానతిమ్మనిన, నమ్మహాముని యిట్లనియె. ౨౭౦.

యోగభూమికోపాఖ్యానము.

సీ. విను ప్రవృత్తుండు, నివృత్తుండు, నన నొప్పు
 స్వర్గాపవర్గ వాంఛల నరుండు;
ఆ యిరువురయందు నపవర్గ మెంత సం
 సారంబ మేలని సంస్మరించుఁ
గర్మప్రవృత్తుండు కడలొత్తునంబుధి
 నడిమికూర్మము మేడ దొరకినట్లు;
పెక్కుజన్మంబులపిదప వివేకంబు
 చేపట్టి, సంసృతిస్థితి యసార
గీ. మకట యిది సాలు, లాభలోభాతిశయవి
రహిత మగునట్టి పరమవిశ్రమము నాకు
నెట్లు సిద్ధించు? నని యాత్మ నెఱిఁగి దివురు
నట్టి పుణ్యాత్ముఁడు నివృత్తుఁ డంబుజాక్ష ౨౭౧.

మ. అకటా యెట్లు విరక్తుఁడై కడతు జన్మాంభోధి యే నస్విచా
రకళ న్వాసన లంత కీ లెడలి జీర్ణత్వంబు నొందంగఁ బా
య కుదారక్రియలం బ్రవృత్తుఁ డనుమోదాయత్తుఁడై గ్రామ్యమా
ర్గకుచేష్టల్ పరికించి సత్క్రియలు వేడ్కం జేయు నిర్లేపుఁడై.

ఉ. మర్మము లాడఁ డెందుఁ, బలుమాటలను నెచ్చట నైనఁ దెచ్చి తా
నర్మిలి శాస్త్రసంచయ ముదగ్రభవాంబుధి దాఁటఁ గోరు, స
ద్ధర్మవిచారుఁ డౌ నతఁడు దా నగు నాదిమయోగభూమికిన్
ధర్మము లెల్ల యోగ్యతనె తా నొనరించుఁ దదార్యుఁ డిమ్మహిన్.

వ. అది విచారణాభిధానం బగు ప్రథమయోగభూమిక. ౨౭౪

సీ. ఆభూమి కెక్కిన యతఁడు శ్రుతిస్మృతి
ధ్యానధారణయోగతత్త్వగోష్ఠి
వ్యాఖ్యానములు సేయు వైదుష్యవంతులఁ
గొలిచి శాస్త్రంబులు దెలిసికొనుచుఁ,
బహుపదార్థప్రతిభావజ్ఞుఁడై గృహ
చింత గృహస్థుఁడు సేయునట్లు
నెఱయఁ గార్యాకార్యనిశ్చయం బెఱుఁగుచు,
మదమానమోహాదుర్మత్సరములు
గీ. లోభలాభాతిశయములు లోనుగాఁగఁ
బాము కుబుసంబు నూడ్చినభంగి నూడ్చి,
శాస్త్ర గురుసేవ గని రహస్యముల బుద్ధి
నూను నట్టిద రెండవ యోగభూమి. ౨౭౫.

క. విను రఘునాథ యసంగమ
మను మూఁడవయోగభూమి నంతట నతఁడె
క్కును, క్రొన్నని పువ్వులపా
న్పునఁ జెంది సుఖించుచున్న పురుషుని మాడ్కిన్. ౨౭౬.

చ. ఉపనిషదర్థతత్త్వరస ముల్లమునం గడలొత్త నైహికా
విపులసుఖంబు గోరక వివేకకథాకథనక్రమంబులన్
విపులశిలాతలస్థలుల విశ్రమ మొంది యసంగచిత్తుఁడై
యపరిమితప్రమోదముల నందుచుఁ గాలముఁ బుచ్చు రాఘవా.

క. అమలిన బహుశాస్త్రాభ్యా
సములను శుభకర్మములను జంతువులకు ను
త్తమ వస్తువృష్టి వాదముం
గ్రమ మొప్పఁ దృతీయభూమి కాపరిణత యై ౨౭౭.

వ. విను మయ్యసంగమంబు సామాన్యంబు, విశేషంబు, నన రెండువిధం
బులై యుండు నందునఁ గర్మంబులయెడ కర్తయు, భోక్తయు, బాధ్యుం

షును, బాధకుండును, నేఁ గాన నియును ; సుఖదుఃఖంబు లీశ్వరాధీనంబు లనియును ; భోగరోగంబులును, సంయోగ వియోగంబులును, గాలవశంబనియును ; ననేకవస్తువులయందు నాసఁజేయక యునికి సామాన్యసంగం బగు. మఱియుఁ దత్క్రియవియోగంబున, దుర్జనవియోగంబున, నాత్మజ్ఞానప్రయోగంబునఁ, బౌరుషప్రయత్నంబున, సంతతాభ్యాసంబునం జేసి, పరమవస్తువు కరతలామలకంబై తోఁచుచుండు. సంసారసాగరంబునకుఁ బారంబును సారంబు నగు పరతత్త్వస్థితిం జెంది, సకలంబు నీశ్వరాధీనం బనుటయుఁ బూర్వకర్మం బనుటయుఁ దొలఁగి, మౌని యై పరమశాంతిం బొందుటయు నది విశేషాసంగమం బని మఱియును. ౨౭౯.

మ. వెలియున్ లోనును గ్రిందు మీఁదు దిశలున్ విస్ఫూర్తియున్ జేతనం
బు లజాండంబులు వస్తు వస్తుకలనంబుం బొందఁగా భాసమై
కలిమిన్ లేమిని డింది కాంతిమయమై కళ్యాణ మై నిత్య మై
యలరారున్ రఘునాథ యిట్టిది విశేషాసంగమం బెప్పుడున్. ౨౮౦.

ఉ. సమ్మదసౌరభంబును ససూనృతిపత్త్రచయం బచింతనా
శమ్ము నవిఘ్నకంటకతలంబును నై వెలయున్ వివేకప
ద్మ మ్మెదలోపల న్మొలచి తత్త్వవిచారవిప్రబుద్ధమై
యిమ్ముల ని య్యసంగులకు నిచ్చు ఫలంబు తృతీయభూమికన్. ౨౮౧.

సీ. సజ్జనసంగతి సత్కర్మ సంచయం
బునఁ గాకతాళీయముగ జనించు
నాదిభూమిక యనునమృతాంకురము వి
వేకాంబు సేచనఁ బెంచి యరయవలయు,
నది యుదకంబున సరళమై తలయెత్త
ఘనవిచారంబునఁ గర్షకుండు
సారంభ మరసిన ట్లరయంగవలయు; నీ
భూమిక తరువాతిభూమికలకు

గీ. మనికిప ట్టగు; నంతర్విమర్శ నొంది,
ధృతి నసంగత్వమను నీత్రుతీయభూమిఁ,
గన్న పురుషుండు, సంకల్పకలన లుడుగు,
ననిన విని రామచంద్రుఁ డిట్లనియె మునికి. ౨౮౨.

వ మహాత్మా! మూఢుండు, నసత్కులసంభవుండుఁ, బ్రమత్తుండు, నప్రాప్త
యోగసంగుండు, నగువారికి నెట్లు సంసారోత్తరణం బగు? నీభూమి
కలయందు నొక్కటిని బొంది మృతుం డగువాని కెట్టిగతి సంభవించు?
నెఱింగింపవే; యనిన మ్మునిపుంగవుం డి ట్లనియె ౨౮౩.

సీ. రూఢదోషుం డగుమూఢున కొకమాటు
జన్మశతంబులు చనినఁ, గాక
తాళీయమున నైనఁ దజ్జ్ఞసంగతి నైన
నలరు వైరాగ్య; మ ట్లంతదాఁక
సంసార మధికమై సాగు; నావైరాగ్య
మొంద వాలాయంబు నుదయ మొందు
నాదిభూమికయందు నణఁగు సంసారంబు,
సరి నొప్పు శాస్త్రార్థసంగమంబు ;

గీ. యోగభూమిక నొంది మే నురిలె నేని,
భూమి కాళానుసారతఁ బొదలిపోవు
నతఁడు సురమానమున దివ్యసతులఁ గూడి
యమరపదమున భోగంబు లందుచుండు. ౨౮౪.

ఉ అంతట పుణ్యపాపనిచయం బుడివోవఁగ శుద్ధులైన శ్రీ
మంతులయింటఁ బుట్టి మును మాయనివాసన భూమికాక్రమా
క్రాంతి వహించి మీఁద నధికం బగుభూమిక కెక్కి యోగి యై
యంతము లేనియట్టి పరమాత్మయ తా నగుచుండు రాఘవా ౨౮౫.

గీ. మొదలిభూమినుండి మూఁడుభూములు వ్యవ
హారమాత్రభేద మైన జగంబు
పుట్టు దోఁచు చునికిఁ బొల్చు జాగ్రత్సంజ్ఞ,
నందుఁ బొందుఁ గేవలార్యుఁ డెందు ౨౮౬.

క. కర్తవ్యము లొనరించి, య
కర్తవ్యము లుడిగి, ప్రకృతికరణభరణతన్
వర్తిల్లుచు శాస్త్రార్థప మ
నార్తస్థితి సలుపునతఁడ యాచార్యుఁ డగున్. ౨౮౭.

వ. అట్టి యాచార్యత్వంబు ప్రథమభూమినంకురితంబును, ద్వితీయభూమి వికసితంబును,తృతీయభూమి ఫలితంబును, నగు నందు నాచార్యుండై మృతుండైనయోగి శుభసంకల్ప సంచితంబు లగు దివ్యభోగంబులు చిరకాలం బనుభవించి క్రమ్మఱ భూలోకంబునం బుట్టి యోగియగు. నీతృతీయభూమి కాభ్యాసంబున నజ్ఞానపరిక్షయంబుఁ బొంది చిత్తంబు పూర్ణేందుమండలనిభంబై సంవిద్బోధంబు సంభవించు నంత ౨౮౮

సీ. ఎనయ నాలవభూమి కెక్కినయోగీంద్రు
లవిభాగమున ననాద్యంతపదము
సమముగాఁ జూతురు, సర్వంబు నిబ్భంగి
ద్వైతంబు లేక యద్వైత మొందు,
స్వప్నంబుగతిఁ దోఁచు జగము గానఁ జతుర్థ
భూమి స్వప్నాఖ్యమై పొలుచు; నంత
శరదంబుదాంశంబు సరి బుద్ధిపలచ నై
యణఁగి సత్తామాత్ర మగుచు నిలిచి

గీ సరి నశేషంబు నొక్కట శాంతిఁ బొంది,
నపగతద్వైతనిభాసుఁ డై సుషుప్తి
నెనయఁ బంచమభూమిక నెక్కఁ గాన
నొరిది నీభూమి కొప్పు సుషుప్తి సంజ్ఞ. ౨౮౯.

ఉ పంచమభూమి సుప్తి ఘనభావము నొంది సదాంతరస్థితిన్
మించి వెలుంగి యానిరతి మేకొనియున్ బరిశాంతవృత్తి ని
ద్రాంచితుఁ డొక్కనాఁడు వితతాభ్యసనం బొనరించి వాసనా
సంచయ మేది తుర్యయను షష్ఠకభూమిని బొందు నంతటన్. ౨౯౦.

గీ అందు సదసత్తు లహమికానహమికలును
మాని, క్షీణమనస్కుఁడై, మఱియు ద్వైత
మనుట నద్వైత మనుట లే కాత్మశాంతి
శమితహృద్గ్రంథియును వివాసనుఁడు నగుచు. ౨౯౧

వ. అనిర్వాణుఁడును, నిర్వాణుండు, నై నివాతదీపంబునుం బోలె, జీవన్ము
క్తుం డైయుండు. ౨౯౨.

క. అంబరమున మునిఁగిన కుం
భంబుగతిన్ లోన వెలిని పరిశూన్యుం డై,
యంబుధిలో మునిఁగినకుం
భంబుగతిన్ లోన వెలిని పరిపూర్ణుం డై. ౨౯౩.

వ ఇవ్విధంబున నుండియు నొక్కించుక విశేషమాత్రంబు పొందియుఁ
బొందనిదెస విదేహముక్తి యగు సప్తభూమిక యగు. నది యవాఙ్మా
నసగోచరంబును సకలభూమికలకు సీమాభూమికయు నగు నమ్మహా
పదంబు. ౨౯౪.

ఉ కొందఱు రుద్రుఁ డండ్రు, మఱి కొందఱు విష్ణుఁ డటండ్రు, ధాత్రిలోఁ
గొందఱు బ్రహ్మ యండ్రు, మఱికొందఱు శూన్యమ యండ్రు, వెండి
గొందఱు కాలమండ్రు, మఱికొందఱు వేఁడ్క బ్రధానపూరుషా[యున్
స్పందవిభాగ మండ్రు, బహుశాస్త్రవికల్పమతప్రవృత్తు లై. ౨౯౫.

వ అట్లుగావున నామరూపంబులు లేకుండియుఁ, కల్పితనామంబులు
సెప్పంబడు నాభూమిక, కని సెప్పి వసిష్ఠుండు. ౨౯౬.

క. ఈ సప్తభూమికల న
భ్యాసం బొనరించు నతని కఘభవభయముల్
వే సమయు, నీకుఁ జెప్పితి;
నీసరణి సుఖింపు నీవు నిల రఘురామా ౨౯౭.

వ. అని వసిష్ఠుండు సప్తమభూమికోపాఖ్యానంబు సవిస్తరంబుగా నెఱింగించిన సంతుష్టాంతరంగుం డై రఘుపతి మునిపతి కి ట్లనియె. ౨౯౮.

చ. పరమరహస్యరూప మయి పావన మై నిగమాంతసార మై
పరఁగిన బ్రహ్మవిద్య బహుళభంగులు మీ రటు చెప్పి చిత్తముల్
మెరమెర మాన్పి నార, లిఁక మీఁదిపదస్థితిఁ గంటి, మంటి, మ
ద్గురుఁడును దల్లిదండ్రులు సఖుండును దైవము మీర సంయమీ.

చ. అనిన వసిష్ఠుఁ డిట్లనియె నచ్యుత మాధవ పుండరీకలో
చనుఁడ వనాదివిష్ణుఁడవు శాశ్వతమూర్తివి కారణార్థ మై
జననము నొంది నాదెసఁ బ్రసన్నదయామృతదృష్టి నించి యీ
పనిగొని యెల్లలోకముల భవ్యునిఁ జేసితి నన్ను రాఘవా. ౩౦౦.

వ. అని వినయావనతవదనుం డై యనేకవిధంబులం బ్రశంసించి రామచంద్రుని వీడ్కొని వసిష్ఠుండు నిజాశ్రమంబునకుం జనియె. నక్కుమారచూడామణియును సర్వసముండును, శాంతుండును, జీవన్ముక్తుండు,నై రాజ్యసుఖంబు లనుభవించుచుండె. నీవును నీయర్థంబు నేమఱక చిత్తంబున నిల్పుకొని సుఖివి గ.మ్మని యుపదేశించిన విని, భరద్వాజుండు—వాల్మీకిమునికిం బ్రణమిల్లి వీడ్కొని పరమజ్ఞానసంపన్నుండును, జీవన్ముక్తుండు, నై నిజేచ్ఛ విహరించుచుండె. నని వాసిష్ఠరామాయణంబు పదార్థప్రమేయంబుల సరణిఁ దప్పక తెనుంగుభాష గద్యపద్యంబుల రచియించితి ; నవధరింపుము. ౩౦౧.

శా. శాంతస్వాంత నిరస్తదైత్యగణ భాస్వచ్ఛిన్మయాకార దు
ర్దాంతౌఘప్రతికూలనామచయ, వేదవ్యాసవాక్యార్థవి

శ్రాంతోదాత్త నిజప్రభావ, యఘపారావారసంశోషణా
చింతాతంతులతాలవిత్ర వరదా శ్రీసంశ్రితోరఃస్థలా. ౩౦౨

అంభోదనాదవిలస
ద్గంభీరమహాట్టహాస కనకకశిపుసం
రంభనిరాస రమాస్తన
కుంభద్వయకలితగేహ గురుభుజమధ్యా. ౩౦౩.

(మాలిని).

శుకవినుతకలాపా శుద్ధబుద్ధస్వరూపా
వికసితజలజాక్షా విశ్వగక్షైకదక్షా
సకలరిపునిరస్తా శంఖచక్రాబ్జహస్తా
ప్రకటితశుభగాత్రా పద్మగేహాకళత్రా

(గద్య).

ఇది శ్రీనృసింహావరప్రసాదలబ్ధకవితావిలాస భారద్వాజసగోత్ర
పవిత్రాయ్యలామాత్యపుత్త్ర సరసగుణధుర్య సింగనార్య
ప్రణీతంబైనవాసిష్ఠరామాయణంబునందు
నిర్వాణప్రకరణం బన్నది
పంచమాశ్వాసము.

---

UNIVERSITY OF HYDERABAD
LIBRARY.

సంపూర్ణము.

---

చంద్రికా ప్రెస్సు, చాకలపేట, మదరాసు.—1935

UNIVERSITY OF HYDERABAD LIBRARY

T Acc. No. 7503

Call No. 294.5922 S64S

Author సింగనార్య, మడికి.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A.P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean